కథలు - గాథలు

చిలకసముద్రం కలెక్టరు

[ఇది కల్పితకథ కాదు. నూరు సంవత్సరాలకు పూర్వం నిజంగా జరిగినకథ. గంజాంజిల్లాలో ఇప్పటికీ ముసలివాళ్లు ఈ కథ చెప్పుకుంటారు. చాలామంది పాశ్చాత్య గ్రంథకర్తలు దీనిని తమ పుస్తకాలలోకి ఎక్కించారు. సర్ చార్లెస్ లాసన్ గారు "మెమొరీస్ ఆఫ్ మద్రాస్" అనే పుస్తకంలో దీనినిగురించి ఒక ప్రకరణం వ్రాశారు. నేను వ్రాస్తూవున్న సంగతులలో చాలాభాగం వారి గ్రంథానికి అనువాదం]

గంజాంజిల్లాలో చిలకసముద్రం అనే మహాసరస్సు ఒకటి ఉన్నది. ఇది ౪౪ మైళ్ళు పొడుగున బంగాళాఖాతానికి ఆనుకుని ఉన్నది. సముద్రానికీ దీనికీ ౨౦౦ గజాలు వెడల్పుగల ఇసుకపర్రే మాత్రమే అడ్డం. ఇది సముద్రభాగమే అని చెప్పవచ్చును. డిశంబరునుంచి జూన్ వరకూ నీళ్ళు ఉప్పగా ఉంటాయి. వర్షాకాలంలో మాత్రం తియ్యగా ఉంటాయి. ఈ సరస్సుయొక్క లోతు మూడుమొదలు ఐదు అడుగులు ఉంటుంది. ఎక్కడా ఆఱడుగులు దాటదు. దీనికి దక్షిణాన, పడమర, చిన్న చిన్న ఱాతికొండలు నీటిలోకి చొచ్చుకొని లంకల్లాగు ఉంటాయి. అలాంటి ప్రదేశాలలో ఒకదానికి బ్రేక్‌ఫాస్టు ఐలెండు (Break-fast Island) అని పేరు. ఈ సరస్సు మధ్య కళ్ళికోట రాజాగారి భవనం ఒకటి ఉన్నది. ఇండియా దేశానికి వైస్రాయిగా వుండిన కర్జనుప్రభువు ఇక్కడికి వచ్చినప్పుడు "ఈ చోటునుంచి కనబడే దృశ్యం భారతదేశం లోని కల్లా సుందరమైనదిగా నాకు తోస్తూంది" అని అన్నాడట! మన కథ ఈ ప్రదేశానికి సంబంధించినదే!

మన కథానాయకుడి పేరు తామస్ స్నాడ్‌గ్రాస్. ఇతను గేబ్రిల్ స్నాడ్‌గ్రాసు కొడుకు. ఇతడు ౧౭౬౧ లో జన్మించాడు. తండ్రి ఇండియాలో కుంఫిణీవారి కొలువులో పనిచేశాడు. అతని ప్రాపకంవల్ల తామసుకుకూడా ౧౭౭౭ లో చెన్నపట్నం సెంట్‌జార్జికోట పరిపాలన క్రింద ఒక రైటరుగిరీ (Writership) యిచ్చారు. ౧౭౮౨లో ఈ కుర్ర

వాడికి ఫ్యాక్టరు (Factor) గా ప్రమోషను యిచ్చారు. ౧౭౯౦ లో ఇతడు సీనియరుమర్చెంటు హోదాను, గంజాం అసిస్టెంటు రెసిడెంటుపద విని పొందినాడు. భారతదేశంలో ఎక్కడ చూసినా వరహాలచెట్లువుండిన రోజులు - అవి. ఆచెట్లను ఆశ్రయించుకొని దులిపినకొద్దీ బంగారువర్షం కురిసేది. తక్కిన దొరల లాగునే ఈ స్నాడ్‌గ్రాసుకూడా ఉద్యోగరీత్యా తనకు లభ్బిన అవకాశాన్ని వృథాపోనివ్వకుండా ఆ వరహాలచెట్టును గట్టిగా పట్టుకొని దులపడం ప్రారంభించాడు. ఇతడు రెసిడెంటుగా వచ్చిన రెండుసంవత్సరాలలో గంజాంలో కఱవు వచ్చింది. ఈకఱ వులో ఇతడు తెలివిగా పనిచేశాడు. జమీందార్లను అదుపులో వుంచాడు. ఆ కాలంలో ఇతడు తిండిలేక మాడుతూన్న వాళ్లచేత పనులు చేయించి సర్కారు డబ్బులతో వారికి గంజికూడు పెట్టించాడు. ఇతడు వాళ్లచేత కట్టించిన బిల్డింగులలో గంజాం పట్టణానికి పదిమైళ్లలో వున్న రంభలో చిలకసముద్రంయొక్క ఒడ్డును ఆనుకొని ఇరవైవేల నవరసులుపెట్టి కట్టిన సుందరమైన భవంతి ఒకటి. ఇది అతనిసొంతం. ఈ భవనం అంటే అతనికి అతిప్రీతి. దానిలోనే ఇతడు కాపురం వుంటూ వుండేవాడు. అది ఇప్పటికీ వున్నది. అప్పుడు చెన్నపట్నం గవర్నరు సర్ చార్లెస్ ఓక్లే, కఱవుకోసం అని చెప్పి స్నాడ్‌గ్రాసు ఖర్చు పెట్టిన సొమ్ము చాలా ఎక్కువగా వున్నదని విమర్శించాడు. ఈ సంగతి ఏమిటో కనుక్కోవాలనిన్నీ, కుంపినీవారి రివిన్యూ ఉద్యోగు లందరూ చేయవలసినట్లు పార్లమెంటువారు నిర్ణయించిన ప్రమాణం ఇతనివల్ల తీసుకోగలందులకున్నూ ఇతన్ని చెన్నపట్నం రమ్మన్నారు.

ఇతడు గంజాంనుంచి అవతలికి అడుగు పెట్టడంతోటే అక్కడి జమీందార్లు చాలామంది ఇతని దువాషీ(ద్విభాషి)అయిన గోపాలకృష్ణ మ్మకు తాము దఫాలవారీగా చాలా మొత్తాలు చెల్లించినా మనిన్నీ, దానికి అతడు రశీదులు యివ్వలేదనిన్నీ ఫిర్యాదుచేశారు. ఇతని స్థానే వచ్చిన ఆక్టింగు రెసిడెంటు దీనినిగురించి దర్యాప్తు చేశాడు. దీనివల్ల స్నాడ్‌గ్రాసు తన 'ద్విభాషికి' తగని చనవూ అధికారమూ ఇచ్చాడనిన్నీ, అతడు అధికారం దుర్వినియోగం చేసి లాభం పొందినాడనిన్నీ, బయలు

పడింది. అంతట ఆదుబాషిమీద కేసుపెట్టి అతడు అపహరించిన సొమ్ము భర్తీ చేయవలసిందని నిరోధించాడు. అతడు మొదట తప్పించుకోచూచాడుగాని ఖయిదులో వుంచి కొంచెంబాధించే టప్పటికి మెత్తబడి, సొమ్ము కక్కివేశాడు. అతనిని వదిలివేయగా మళ్లీ ఎక్కడా కనబడాకుండా పోయాడు. ఈ తవాయివల్ల స్నాడ్‌గ్రాసుకు మళ్లీ పని యివ్వడానికి సందేహించారు. ౧౭౯౪లో రెసిడెంటుపదవికి బదులు కలెక్టరు పదవి యేర్పాటుచేసి వాల్టర్ బాల్ఫర్ అనే అతనిని ఆపనికి నియోగించారు. (ఇతడు ౧౮౦౫ లో చనిపోయే టప్పటికి ౧౦ లక్షల పౌనులు సంపాదించినట్లు తేలింది) అయితే కొద్దికాలంలోనే స్నాడ్ గ్రాస్‌యొక్క అకృత్యాలు మరచిపోయి ౧౭౯౭ లో బాల్ఫర్ స్థానంలో మళ్లీ ఇతనిని కలెక్టరుగా నియమించారు. పనిలేకుండా వుండిన ఈ నాలుగు సంవత్సరాలలో స్నాడ్‌గ్రాసు తన నడతను మార్చుకునే టందుకు బదులుగా ఇంకా కొన్ని దుర్వ్యసనాలు కూడా అలవర్చుకొని చెడినందువల్ల ఇతని హయాంలో- గంజాం జిల్లా మాన్యువలు వ్రాసిన మాల్టుబి (Maltby) చెప్పినట్లుగా- గంజాం జిల్లా పరిపాలనలోని అన్ని శాఖలూ పుచ్చిపోయాయి. పాతదుబాషి గోపాలకృష్ణమ్మ మాయమైనాడు. గాని అతనికి బదులు అలాంటివాడే జగన్నాధరావు అనే వాడు ఒకడు తయారైనాడు.

స్నాడ్‌గ్రాసు ఇతనిని దుబాషీగా నియమించి అతనికి సర్వాధికారాలు యిచ్చాడు. దానితో సర్కారు దస్తు తరుగులూ, మోసాలూ, ప్రజాపీడనము సర్వసామాన్యమై పోయినాయి. గంజాంపట్నంలో ఈ 'దుబాషీ' తన దివాణం (కోర్టు) ఒకటిపెట్టి సాగించాడు. ఇతనిని మంచి చేసుకోదలచిన జమీందారులు, ఇతరులు అక్కడకు వెళ్లి ఈయన దర్శనం చేయాలి. ఎవరూ వట్టిచేతులతో వెళ్లకూడదు. స్నాడ్‌గ్రాస్ దొరగారికి యిదేమీ పట్టలేదు. ఇతడు తన సిపాయిలతోటి, బంట్రోతులతోటి ఇతర పరివారంతోటి ఎప్పుడూ రంభలోనే దర్జాగా ఉండేవాడు. తన మనస్సుకు నచ్చిన అందమైన భోగముదాన్ని ఒకతెను వుంచుకున్నాడు. ఆమె చాలా తెలివైనది. అతన్ని తనవలలో వేసుకుని

అనేక తంత్రాలు, తమాషాలు చేస్తూ అమిత వ్యయం చేయించేది. తన యిష్టం వచ్చినట్లల్లా ఆడించేది.

ఇలాగు కలెక్టరు ఉపేక్షవల్లా, దుబాషీ దుర్మార్గంవల్లా జిల్లా వ్యవహారం దుఃస్థితిలోకి దిగిపోయింది. సర్కారు శిస్తు వసూలు మందగించింది. అప్పుడు చెన్నపట్నంరాజధాని గవర్నరు క్లైవుప్రభువు శిస్తులు ఎందువల్ల సరిగా వసూలు కావడం లేదని సంజాయిషీ అడిగాడు. వర్షాలు సకాలంలో కురవ లేదనిన్నీ, అందువల్ల పంటలు బాగా పండ లేదనిన్నీ, ప్రజలలో డబ్బు లేదనిన్నీ, జిల్లాలో జమీందార్లు చెప్పినమాట వినడం లేదనిన్నీ, ఖోండుజాతివాళ్లు అల్లరిచేస్తున్నారనినీ, శాంతిభద్రతలు నెలకొల్పడానికి శిస్తు వసూలుకు తగిన మిలిటరీ బందోబస్తు సిబ్బందీ తనకు లేదనిన్నీ స్నాడ్గ్రాస్ జవాబు చెప్పాడు. కాని చెన్నపట్నం రివిన్యూ బోర్డువారు మోసపోయేవారు కారు. సర్కారుదస్తు ఫాజల్లు (అపహారం) కేసు కప్పిపుచ్చడానికి ఇంత తెలివి తేటలైనజవాబు ఇదివరలో ఏ కలెక్టరూ చెప్పినది లేదని అన్నారు. గవర్నమెంటువారు కూడా ఇలాగే అభిప్రాయపడి స్నాడ్గ్రాసును కలెక్టరు పదవిలోనుండి తొలగించి బ్రౌను అనే అతనిని కలెక్టరుగా నియమించారు. ఈ బ్రౌను గంజాం వచ్చేటప్పటికి కొంతకాలం పట్టింది. వచ్చినతరువాత స్నాడ్గ్రాసును చార్జీ వప్పగించేటట్లు చేయగలిగేటప్పటికి ఇంకా కొంత కాలం పట్టింది. స్నాడ్గ్రాసును రంభదగ్గరనుంచి కదిలించేటప్పటికి గవర్నమెంటువారి తాతలు దిగి వచ్చారు.

స్నాడ్గ్రాసు స్థానే నియమింపబడిన కొత్తకలెక్టరు బ్రౌను గంజాంజిల్లా వ్యవహారాలన్నీ చక్కబెట్టడానికి ప్రయత్నించాడు. కాని అది సులభసాధ్యం కాలేదు. అవి అంత గందరగోళంలో వున్నాయి. మంచి అభివృద్ధిలో వుండినజిల్లా పాడైపోయిందనిన్నీ, జనసంఖ్య కూడా క్షీణించిందనిన్నీ ఇతడు పైకి వ్రాశాడు. దుబాషీని అరెస్టుచేశారు కాని అత డెంతసొమ్ము అపహరించిందీ సరిగ్గా తెలుసుకోవడానికి వీలు కాలేదు. బయటపడిన రెండుపద్దులే ఒకలక్ష అరవై యెనిమిదివేల రూపాయిలు దాకా తేలినాయి. ఈ ద్రవ్యాపహరణానికి అతనిమీద దస్తు

ఫౌజుల్ కేసు పెట్టాడు. కాని దేశం అల్లకల్లోల స్థితిలో నుండుటవల్లా, గుంసూరులో తిరుగుబాటు జరిగినందువల్లా, ఈ కేసు విచారణ జయప్రదంగా నడపడానికి బ్రౌనుదొరకు అవకాశం లేకపోయింది.

౧౭౯౩ కూ ౧౮౦౧ కీ మధ్య యీజిల్లా పరిపాలనను గురించిన తఫ్సీలు తెలుసుకోడానికి రికార్డులు ఏమీ లేవని జిల్లామాన్యువలు వ్రాసిన మాల్టుబీ వ్రాసినాడు. ఈ రికార్డు లేమైనవని విచారించగా బ్రౌను దొరగారే వానిని తగల వేశారని స్ప్రాటిస్‌వుడ్ అనే కలెక్టరు వ్రాశాడు. కాని ఇది విశ్వసించతగినట్లు లేదు. ఈ జిల్లాలో దీనిని గురించి ఒకకథ చెప్పుకుంటారు. తనపైని సాక్ష్యం దొరకకుండా రివిన్యూ లెక్కపుస్తకాలన్నీ స్నాడ్‌గ్రాసు చిలకసరస్సులో పార వేశాడట. "రంభదగ్గరకు వచ్చే టట్లయితే ప్రాణం తీస్తా" నని బ్రౌను దొరను బెదిరించాడట !

*

రంభలో కూర్చుని స్నాడ్‌గ్రాసు చేసిన విచిత్రాలను గురించీ, అతన్ని అక్కడనుండి కదిలించడం గవర్నమెంటుకు ఎంత కష్టసాధ్యమైనదో ఆ సంగతిని గురించీ ఇంకా కొన్ని కథలు ప్రచారంలో వున్నాయి. వాటిని ఆంగ్లేయగ్రంథకర్తలు తమ పుస్తకాలలోకి కూడా ఎక్కించారు.

కలకత్తాలో సండేస్టేట్సుమన్ అనే పత్రికలో ౧౯౩౮ సంవత్సరం అక్టోబరు, ౨౩-వ తేదీన సి. బి. సి అనే పొడి అక్షరాలతో ఈ స్నాడ్‌గ్రాసును గురించిన కథ వ్రాయబడినది. దానిలో పైని చెప్పిన సంగతులుగాక ఇంకా కొన్ని విశేషాలు వ్రాయబడినాయి.

స్నాడ్‌గ్రాసుకు ౧౭౯౧ లో గంజాం రెసిడెంటు ఉద్యోగం వచ్చిన తరువాత గోపాలకృష్ణమ్మను తనకు సహాయ దుబాషిగా ఏర్పరచుకొని అతని సహాయంతో రివిన్యూలో నూటికి ౯౦ వంతులు మాత్రం సర్కారుకు జమకట్టి తక్కినది స్వంతానికోసం అట్టేపెట్టు కోవడం ప్రారంభించాడు. రంభలో కట్టించిన ఇంటికి ౨౦ వేల పౌనులు ఖర్చుఅయినదట. జమీందారులు ఎందుకు బకాయి పెడుతున్నారో

తెలుసుకోవలసిందని ౧౭౯౮ లో చెన్నపట్నాన్నుంచి ఒక ఉద్యోగిని పంపగా వాళ్ళందరూ తమ పేష్కషు నదివరకే ఇచ్చివేశారని తేలింది. తప్పుడు లెక్కలు వ్రాయవలసిందని స్నాడుగ్రాసు తనను నిర్బంధించాడని గోపాలకృష్ణమ్మ ప్రమాణంచేశాడు. నేనలాంటిపని చేయమన లేదని స్నాడుగ్రాసు అన్నాడు. స్నాడుగ్రాసుకూడా దీనిలో భాగస్వామే అని, తేలినా సరియైనరుజువు దొరకనందువల్ల అతడు తాను చేయవలసినపని తిన్నగా నిర్వహింపక ఉపేక్ష చేసినాడని సస్పెండు చేశారు. గోపాలకృష్ణమ్మను జైలులో పడవేసి సొమ్ము కక్కేవరకు నిర్బంధించి వుంచారు. శిస్తురసీదు కవుంటరుఫాయిలు కాగితాలు లెక్కలతో సరిగా వున్నయా లేవా అని చూడడం మాత్రమే తన పని అనిన్నీ, అవి సరిగానే వున్నాయనిన్నీ, కవుంటరుఫాయిలులో వసూలు చేసిన దానికన్న గోపాలకృష్ణమ్మ తక్కువమొత్తాలు వేస్తే నట్లైతే తానేమిచేయగలననిన్నీ స్నాడ్‌గ్రాసు చెప్పి తాను నిర్దోషినని వాదించాడు. ౧౭౯౭ లో ఇతనికి మళ్ళీ పని యిచ్చారు.

రెండవమారు ౧౮౦౦ నాటికే మళ్లీ ఇతనిపైని ఫిర్యాదులు చెలరేగాయి. ఇతని సంజాయిషీకి రివిన్యూబోర్డువారూ గవర్నమెంటు హర్షించలేదు. ఇతనిని చార్జి వప్పగించ వలసిందని బ్రౌను అనేదొరను పంపించారు. ఈ బ్రౌను వచ్చేటప్పటికి తన ఆఫీసు దగ్గరకు తుపాకీబారు మేరదూరంలోకి వస్తే కాల్చివేస్తానని బెదిరించి అతని ఎదటనే లెక్కపుస్తకాలూ రికార్డులూ చిలకసరస్సులో పారవేశాడు. తన పీక మీదికి తేగలసాక్షి సాధనాలన్నింటినీ అలా మాపుచేసి జిల్లాలో తనకు గల వ్యవహారాలన్నీ మెల్లగా చక్కబెట్టుకొని ఆఖరుకు చెనపట్నం వెళ్లాడు.

*

'జాన్‌లా' అనే ఆయన ౧౯౦౮ లో "గ్లింప్సెస్ ఆఫ్ హిడెన్ ఇండియా" అనే పుస్తకంలో ఈ క్రింది విధంగా వ్రాశాడు.

"స్నాడ్‌గ్రాసు రంభలో కట్టించిన దివ్యభవనాన్ని ఎంతో చక్కగా అలంకరించాడు. తన సాలలలో మంచి గుఱ్ఱాలనూ, ఏనుగు

లన్నా, కట్టించి వుంచాడు. పెద్ద నవాబులాగు జీవించేవాడు. దంభ మారుమూలగా వున్నది. చెన్నపట్నంనుంచి కలకత్తా వెళ్లేవాళ్లు సముద్రం మీదనే సరాసరి వెడతారుకాని యీపక్కకిరారు. ఎవరైనా వస్తే మాత్రం ఇతడు వాళ్లను వదలి పెట్టేవాడుకాదు. వాళ్లకు విందులు చేసి వేటలు ఏర్పాటుచేసి, ఆదరించేవాడు. ఇతడు కాపురం ఉన్న ఇంటికి ఎదురుగా చిలక సముద్రంలో రెండుమైళ్లదూరంలో పదిహేను అడుగుల చతురంగల ఒక చిన్న లంకవున్నది. దానికి బ్రేక్‌ఫాస్టు ఐలెండు అనిపేరు. తనపనికి ఎవరూ అంతరాయం కలిగించకుండా ప్రశాంతంగా చేసుకోవడానికని ఆలంక మీద ఒక్కటేగది కట్టించి అది తన ఆఫీసు అన్నాడు. ఆగదిపైన స్తూపీబురుజులాగు గోపురం ఒకటి కట్టించాడు. ఆ బురుజులో ఒక దీపం వేళ్లాడ గట్టేవాడు. దీనిని దీపస్తంభం అనేవాడు. తన రివిన్యూ లెక్కలూ, రికార్డులూ అన్నీ ఈ గదిలో పెట్టించాడు.

ఈ జిల్లా పరిస్థితులు బాగాలేవని మద్రాసు గవర్నమెంటు పంపిన తాఖీదును ఇతడు చిత్తుకాగితాల బుట్టలో పడవేశాడు. లెక్క పుస్తకాలన్నీ చెన్నపట్నం పట్టుకురావలసిందని మళ్లీ తాఖీదువచ్చింది. దానికి సరియైన సమాధానం వ్రాయలేదు. వర్షాకాలంలో పూరీ రేవు లోకి ఓడలు సరిగా రాలేవని ఇతడు ఎరుగును. ఇలాగు రెండేళ్లు గడి చినతరువాత అధికారులు కలెక్టరేటును వశంచేసుకొని స్నాడ్‌గ్రాసును అతని పుస్తకాలను చెన్నపట్నం తీసుకొని రావడానికి కొంతమంది సోల్జర్లను పంపడానికి నిశ్చయించారని ఇతనికి తెలిసింది. వీళ్లు ఇక్కడికి రావడానికి ఆరునెలలు పడుతుందని ఇత డెరుగును. వాళ్లు వచ్చేజాడలు ముందుగా తనకు తెలియచేయడానికి వేగులవాళ్లను పెట్టి వాళ్లు వారం రోజుల దూరంలో ఉన్నారని తెలియగానే ఇతడు లెక్క పుస్తకాలన్నీ ఒక పడవలో పెట్టించి ఒడ్డుకు పట్టమన్నాడు. పడవ బ్రేక్‌ఫాస్టులంకకు తీరానికి మధ్యకు రాగానే పడవ చీల ఒకటి ఎలాగో వూడి వచ్చింది. ఆ పడవ, దానితో పాటు పుస్తకాలూ మునిగిపోయాయి. పడవవాళ్ళు మాత్రం ఈదుకుంటూ ఒడ్డుకు వచ్చారు. సోల్జర్లు వచ్చినాక స్నాడ్

గ్రాసు ఈ సంగతి ఆ చిన్న దళాధిపతికి చెప్పాడు. అతడు ఏంచేస్తాడు? స్నాడ్‌గ్రాసును చెన్నపట్నం తీసుకొని వెళ్లాడు.*

ఇక బ్రౌనుదొర ఏం చేస్తున్నాడో చూద్దాము. ఎలాగైతేనేమి బ్రౌను ఎంతో తంటాలుపడి చాలాసంగతులు బయటికి లాగాడు. వీటిని బట్టి స్నాడ్‌గ్రాసుపైని కేసు పెడదామని మద్రాసు గవర్నమెంటువారు ఆలోచించారు కాని ఇలాంటి కేసు విచారించడానికి చెన్నపట్టం సుప్రీము కోర్టువారికి అధికారం వున్నదో లేదో అని అనుమానం కలిగినందువల్ల ఇది మానుకున్నారు. ౧౮౦౦ సంవత్సరం మొదలు ౧౮౦౮ వరకూ ఏమీ పనిలేకుండా స్నాడ్‌గ్రాసును చెన్నపట్నంలోనే వుండనిచ్చారు. విలియం బెంటింక్ గవర్నరుగా ఉండగా ప్రభుత్వంవారు ౧౮౦౮ లో ఇతని పని తీసివేశారు. అంతట స్నాడ్‌గ్రాసు తన డబ్బాడవాలీసరుకుని సామానులు తీసికొని ఇంగ్లాండుకు ఓడ ఎక్కాడు. ఇతడు ౩౨ సంవత్సరాలు కంపెనీవారికొలువులో పనిచేసి జీతం కొద్దిపాటిదైనా పెద్దసంపద ఆర్జించాడు. ఇతడు తన సంపదతోపాటు ఇంగ్లాండుకు పరువు ప్రతిష్ఠలు కూడా తెచ్చుకోనందువల్ల తూర్పుఇండియా కంపెనీ డైరెక్టర్లు తమ ఉద్యోగుల కిచ్చే పింఛను ఇతనికి యివ్వడానికి నిరాకరించారు. దీనికి ఉపాయ మేమిటని ఇతడు ఆలోచించాడు. తనహక్కు నిలబెట్టుకోవాలనీ, కక్షసాధించాలనీ ఇతనికి బుద్ధి పుట్టింది. తనకు న్యాయం చేయకపోతే తమకూ కష్టం కలిగేటట్లు ప్రవర్తించవలసి వస్తుందని ముందుగా డైరెక్టర్లను ఇతడు హెచ్చరించాడు ఈ బెదిరింపులకు వారు ఏమీ జవాబు చెప్పక ఉపేక్షించారు. కొన్నాళ్లు గడవనిచ్చి ఇతడు కార్యాచరణకు పూనుకున్నాడు. చిరిగిపోయిన పాత దుస్తులూ పాకీవాళ్లు వీధు లూడిచే చీపురుకట్టా కొని, ఆ పాతదుస్తులు వేసుకొని చీపురుతో లీడన్‌హాలు వీథిలో తూర్పు ఇండియా కంపెనీవారి దివ్యభవనంఎదుట నిలిచి రోడ్డు ఊడ్చడం ప్రారంభించాడు. తాను ఎవరో ఇతరులకు తెలియకుండా ప్రచ్ఛన్నంగాగాక, బహిరంగంగా వచ్చి పోయేవారితో కుంపినీవారికి ఇండియాలో ఉన్న మంచి ధనవంతమైన రాష్ట్రింల్లో

* (Glimpses of Hidden India — John Law 1908, pp. 91–93)

తాను ఒక జిల్లాకు కలెక్టరుగా పనిచేసినాననిన్నీ వారికింద తాను ఇన్ని సంవత్సరాలు కష్టపడి నమ్మకంగా పనిచేసినప్పటికీ తన పెద్దతనంలో తనకు ఏమీ యివ్వకుండా తినడానికి కూడు, కట్టుకోవడానికి బట్టకూడా లేకుండా వీధులలో ముష్టియెత్తుకొని బ్రతకమని వదిలివేశారనిన్నీ తన కథ చిత్రవిచిత్రముగా వర్ణిస్తూ అతి దీనంగా చెప్పుకోసాగినాడు.

ఇప్పటివలెనే ఆ రోజులలోకూడా లీడెన్‌హాలు వీధి లండనులో వచ్చిపోయేవారితో నిండి కిటకిటలాడే రాజవీధి. తూర్పుదేశపు సంపదలకును ఇంగ్లాండుకును గల పరస్పరసంబంధానికి బాహ్యచిహ్నంగా ఆ వీధిలో కంపెనీవారి దివ్యభవనం అందరికీ కనబడుతూ వుండేది. ఇండియాదేశంలో సంపదలార్జించి వచ్చిన దొరలను 'నవాబు'లని చెప్పుకునేవారు. వీళ్లు లెక్కలేనంత ధనమార్జించి ఆ ధన కనక వస్తు వాహనాలలో దొర్లుతూ ఒళ్ళుపైని తెలియక సౌఖ్యాలు అనుభవిస్తూ నీతినియమాలు లేక కళ్లు నెత్తినిపెట్టుకొని ప్రవర్తించడాన్ని గురించి ప్రజలు ప్రత్యక్షంగా చూస్తూ కథలలో వింటూ నాటకాలలో దర్శిస్తూవుండేవారు. ఇట్టి స్థితిలో ఆ ఇండియాలోనే పనిచేసివచ్చిన నిర్భాగ్యుడైన ఈ ఉద్యోగి ఈ వీధిలోనే ఇలాగ పాకీపనిచేస్తూవుండడం చూసి అనేకమంది ఇది ఏమిటని ఆలోచించడం ప్రారంభించారు. లండన్ నగరంలో గొప్పవారు నివసించే పడమటిభాగంలో దీనిని గురించిన గుసగుసలు బయలుదేరినవి. స్నాడ్‌గ్రాసుకూడా తాను వేసిన వేషానికి అనుగుణ్యంగానే ప్రవర్తించేవాడు. పాపం, అన్యాయం జరిగిన కంపెనీ ఉద్యోగి అనిచెప్పి ఎవరైనా పెన్నీలు (సీమదేశపు నాణెం - నాలుగుడబ్బులు) యిస్తే కృతజ్ఞతతో పుచ్చుకొని జేబులో వేసుకొనేవాడు.

ఇతడీ కంపెనీ భవనం ఎదుట ఇలా వుండడం చూసేటప్పటికి కంపెనీ డైరెక్టర్లకు తలవంపుగా తోచింది. అందులో ముఖ్యంగా ఇతడు చీపురు పెట్టి వూడ్చే పెద్దమెట్లపైని వున్న పెద్ద సింహద్వారం దగ్గరనే ఈ డైరెక్టర్లు తమ గుఱ్ఱపు సార్టు బండ్లలో దిగి లోపలికి వెళ్లవలసి వచ్చేది. ఈ దివ్య భవనానికి వెనక ఒక చిన్న సందులోనుంచి

లోపలికి పోవడానికి ఇంకోదారి వున్నమాట నిజమేకాని అది నౌకర్ల కోసం ఏర్పడినదారి. ఈ పాపిష్టి ముండాకొడుకు మొఖం కనపడ కుండానూ అక్కడ ఈ చిత్రం చూస్తూ నిలబడిన వాళ్ల లేవిడీలు తప్పించుకోవడానికిన్నీ అలాగ సందులోనుంచి లోపలికి దూరడం వారికి చాలా పరువు తక్కువగా తోచింది. పోనీ ఒక పోలీసువాడిని పిలిచి ఈ "న్యూసెన్సు" మాన్పిద్దా మనుకుంటే ఇతడేమి నేరం చేశా డని పిర్యాదు చేయగలరు? స్నాడ్‌గ్రాసు తన చర్యలవల్ల ఎలాంటి నేరమూ చేయడం లేదు. మునిసిపాలిటీ నిబంధనలలో దేనినీ మీరడం లేదు. పైగా అతడు చేసేపని పరోపకారంగా కూడావున్నది. ముఖ్యంగా వర్షంకురిసి బురదగా వున్నరోజున మహోపకారంగానూ వున్నది. అదిగాక అతనిపట్ల ప్రజలందరికీ అమితమైన జాలి కలుగుతూ వున్నది.

ఈ కంపెనీ డైరక్టర్ల కోర్టువారికి హిందూదేశంపైన అమిత మైన అధికారా లున్నాయి. అక్కడ తమ నిరంకుశాధి కారాలను చలాయించడంలో వీరు ఏమాత్రమూ వెనుదీయరు; ఎంత క్రూరంగా నైనా ప్రవర్తిస్తారు; కాని తమ కార్యాలయం గుమ్మం ఎదుటనే తమ కింద పూర్వం పనిచేసిన తాబేదారు డొకడు తమ అధికారాన్ని ధిక్క రించి నవ్వులాటు చేస్తువుంటే వీరు దీని కే ప్రతిక్రియనూ చేయలేక పోతున్నారు. ఇదిచూచి ఇతరులుకూడా ఇలాంటి పెంకితనాలు మొదలు పెడతారేమో! అందువల్ల డైరెక్టర్ల కోర్టువారు మొదట కోపంతో మండిపడినా వీధిలో ఈ అప్రతిష్ఠ మాన్పుకోడానికి ఏదో ఒకమార్గం యోచించక తప్పినదికాదు. స్నాడ్‌గ్రాసుతో రాజీ చేసుకోవడమే ఉత్తమ మార్గంగా కనబడింది. ముందుగా అతడు చేస్తూవున్న చర్య మానివేస్తే అతని వ్యవహారం మళ్లీ ఆలోచిస్తామని కబురంపారు. తనతోపాటు ఉద్యోగం చేసినవారికి న్యాయంగా వచ్చే పింఛనుమొత్త మునే తన పని తొలిగించిన తేదీ లగాయతూ తనకు కూడా మంజూరు చేసేవరకు తన చర్యను విరమించనని ఆతడు చాల మర్యాదగా మళ్ళీ కబురంపాడు. డైరెక్టర్లున్నూ వారి చైర్మెనుగారున్నూ బింకాలు మానివేసి స్నాడ్‌గ్రాసు కోరికలను చెల్లిస్తూ తీర్మానాలు చేశారు.

అంతట ఆ మర్నాడు స్నాడ్‌గ్రాసు మంచి కొత్త సూటు దొరటోపీ వేసుకొని జోడుగుర్రాల బండి యెక్కి *డైరెక్టర్ల కోర్టువారికి వందనాలర్పించడానికి వచ్చి 'అయ్యా ఇప్పుడు మీరు నా ఆదాయం సాలుకు ౫ వేల పౌనులు అయ్యేటట్టు చేసినా' రని అన్నాడట! ఈ మాట వినేటప్పటికి వాళ్ళందరూ తెల్లపోయ్యారు. ఈ దృశ్యం సరిగా వర్ణించడానికి ఎవరితరము?

స్నాడ్‌గ్రాసు చిలకసరస్సు దగ్గర రుచి మరగిన సౌఖ్యాలనన్నింటినీ మళ్ళీ స్వేచ్ఛగా అనుభవించడానికి మళ్లీ అతనికి అవకాశం కలిగింది. అతడు మళ్లీ తలయెత్తాడు. ఇప్పటిలాగే ఆ రోజులలో షోకీళ్ళాలందరూ నివసించే మేఫెయిరులో చెస్టరుఫీల్డు వీధిలో ఒక దివ్యభవనాన్ని ఇతడు తీసుకున్నాడు. దానిని చక్కగా అలంకరించాడు. కొన్నాళ్లు అయ్యేటప్పటికి ఉద్యోగరీత్యా అతనికి తటస్థించిన లోటుపాటులు అందరూ మరిచిపోయారో, లేకపోతే ఇలాంటి లోపాలు అందరికీ వుంటాయని సరిపెట్టుకున్నారో, కాని అందరూ అతనిని మర్యాద చేసేవారు. ఇతడు తన కాలంలో ఇండియానుండి వచ్చిన ప్రముఖులైన వారిలో ఒకడైనాడు. ఇలాగ అతడు నలుగురిలో గౌరవంగా వుంటూ ౧౮౨౪లో ఓరియంటల్ క్లబ్బు స్థాపించడానికి కారకుడైనాడు. దానిలో ఇండియాలో గవర్నర్లుగానూ సేనానులుగాను పనిచేసిన డ్యూక్ ఆఫ్ వెల్లింగ్టన్, విలియం బెంటింకు, సర్ జాన్ మాల్కులం, సర్ థామస్ హిస్లప్, మొదలైనవారు ఇతనితోపాటు సభికులైనారు. ఇతడు మెరైన్ సొసైటీలో ౧౫ సంవత్సరాలు సభికుడుగావుండినాడు. స్త్రీల ఆసుపత్రికి కూడా ఇతడు పోషకుడుగా వుండినాడు. ఇలాగ లండనులో పేరెన్నిక పొందిన వారిలో ఒకడుగానుంటూ ఇతడు ౧౮౩౮-వ సంవత్సరం ఆగస్టు నెల ౨౯-వ తేదిన దివంగతుడైనాడు.

---

* ఈకథ కొన్ని సంవత్సరాలక్రిందట పయొనీరు పత్రిక వ్రాసింది. వేయిలీ గారు కూడా మళ్ళీ వ్రాశారు. అతడు నాలుగు గుర్రాల బండిలో వెళ్ళాడని పాఠాంతరము.

స్నాడ్‌గ్రాసు చనిపోవడానికి మూడేండ్ల క్రిందట ఒక విల్లు వ్రాశాడు. ఇతడు రసెల్ అనే వితంతువుయొక్క పెళ్ళిగాని పెద్ద కుమార్తెయైన ఎలిజాకు ఒకలక్ష 23 వేలపౌనులు చెందచేసినాడనిన్నీ, దీనికి కారణం ఆమె తండ్రి తనపట్ల దయగా వుండడమే ననిన్నీ జంటిల్మెన్సు మాగజీనులో ప్రకటించారు. కాని ఇది సరికాదనిన్నీ, ఆవిల్లు తాను చూచినాననిన్నీ ఇండియాలో చిలకసరస్సుతీరం దగ్గర తనకు వున్న ఇంటినీ, భూమినీ తన స్నేహితుడైనట్టిన్నీ ఫౌండ్లింగు ఆసుపత్రిలోవున్నట్టిన్నీ గేబ్రేల్ గిల్బర్టుకు చెందచేసినాడనిన్నీ, తన స్నేహితులకూ, స్నేహితురాండ్రకూ యీ క్రిందివిధంగా చాలా మొత్తాలు చెంద చేసినాడనిన్నీ ఛార్లెస్ లాసన్ గారు మెమొరీస్ ఆఫ్ మద్రాస్ (Memories of Madras) అని తాను రచించిన పుస్తకంలో వ్రాశారు. స్నాడ్‌గ్రాసు వ్రాసిన మరణశాసనము ప్రకారము అతడు చెందచేసిన ఆస్తి చాలా వున్నది.

అప్పర్ గిల్డు స్ట్రీటు ఫౌండ్లింగ్ ఆస్పిటలులో నున్న గేబ్రేల్ గిల్బర్టుకు, రంభలో చిలక సరస్సుఒడ్డున వున్న ఇల్లు, భూమి, (గడచిన 30 సంIIలనుంచి ఖాళీగావుండి కంపెనీవారి తాల్లూకు ౨౫౦౦ పౌనుల బాండుక్రింద వుంటూవున్న ఆస్తిని ఇచ్చినాడు.

౪౦౦౦ పౌన్లు ఎలిజారస్సెల్‌ను, కిల్లెటును, హ్యూ ఎడ్వర్డ్సును, మేజర్ జాన్‌స్మిత్తును ఎగ్జిక్యూటర్లుగా నియమించి వారికి చెరివక వేయిపౌనులు మొత్తం పౌ. ౪౦౦౦-౦-౦ లు యిచ్చాడు.

౧౦౦౦-౦-౦ పౌనులు ఎలిజబెత్తు గిల్లెటుకూ, మిసెస్ కవర్డుకూ వానిపైని అయివేజు యివ్వగలందులకు.

౧౦౦౦-౦-౦	పౌనులు	(నవరసులు)	ఆనీ జెఫ్రీకి
౧౦౦౦-౦-౦	,,	,,	చార్లటీ హాంప్‌స్టెడ్‌కు
౪౦౦-౦-౦	,,	,,	తామస్ ఫ్లక్‌కు
౨౦౯-౦-౦	,,	,,	హెన్రీ బొసన్‌కు
౨౦౦-౦-౦	,,	,,	రెబెకా పాట్రిడ్జికి

౧౦౦౦-౦-౦ పౌనులు (నవరసులు) సారా స్లిన్ సన్ కు
౧౦౦౦-౦-౦ ,, ,, మెక్రైనుసొసైటీ ట్రిస్టీలకు
౧౦౦౦-౦-౦ ,, ,, సీమెన్సు ఆసుపత్రికి.

౫౦౦౦ పౌనులు తనసోదరికి దానిపైన అయివజును యిచ్చుటకు, ఇదిగాక తనకు సాలుకు ౧౨౦౦ పౌనులు ఆదాయము వచ్చేరొఖ్ఖం ౪౦ వేలపౌనుల విలువగల పదిలక్షలఫ్రాంకులు ప్యారిసులో పత్రములు వున్నవనిన్నీ, ఈ పత్రములున్నూ ఛస్టరుఫీల్డు వీధిలోవున్న ౧౦వ నెంబరు యిల్లున్నూ అందులోవుండే సామానులున్నూ గుఱ్ఱపుబండి ఇతర చరాస్తిన్ని మరణశాసనంలో చెప్పకుండా విడిచిన ఆస్తియావత్తున్నూ ఎలిజారస్సెల్ కన్యకు చెందచేస్తున్నాననిన్నీ, మరణశాసనం ప్రకారం మిగిలినఆస్తి తన ఎగ్జిక్యూటర్లకు చెందవలెననిన్నీ శాసించాడు. రంభలో వున్న స్నాడ్ గ్రాసు తాలూకు భవనం యిప్పుడు కళ్ళికోటరాజాగారి ఆధీనంలో వున్నది.

---

౨. జిల్లా శిరస్తాదారు

ఇంగ్లీషువర్తక కంపెనీవారీ దేశాన్ని పరిపాలించడం ప్రారంభించిన తరువాత చాలాకాలంవరకూ ప్రభుత్వశాఖలలో పెద్ద వుద్యోగాలేవీ దేశీయుల కిచ్చేవారు కారు. ఉద్యోగాలివ్వడంలో జాతి మత వర్ణవివక్షత చూపబడ దని పార్లమెంటువారు ౧౮౩౩ లో శాసించినప్పటికీకూడా తెల్లవారు చెయ్యడానికి అంగీకరించని చిన్న జీతాల వుద్యోగాలను మాత్రమే మనవాళ్ల కిచ్చేవారు.

తాశిల్దారులు

అప్పట్లో రివిన్యూశాఖలో మనవాళ్లు చేసే పెద్ద ఉద్యోగం తాశిల్దారీ. అప్పటికి చదువుకున్నవాళ్లు బ్రాహ్మలే గనక చాలామంది తాశిల్దారులు బ్రాహ్మణులే. ఈ తాశిల్దారులకు ఆకాలంలో రివిన్యూ వసూలుతోపాటు నేరాలు విచారించే పోలీసు అధికారం కూడా

వుండేది. అయితే వీళ్ల జీతం చాలా స్వల్పంగా వుండేది. ఇంగ్లాండులో ఒక బిళ్లబంటోతుకిచ్చే జీతమైనా లేదు. కలెక్టరుకు వీళ్లపైన సర్వాధికారాలు వుండేవి. చీటికీ మాటికీ వీళ్లని బదిలీ చెయ్యడమూ, జుల్మానా వెయ్యడమూ, పనిలోనుండి తగ్గించడమూ, తీసివేయడమూ జరుగుతూ వుండేది. తెల్లవారిలో చాలా మందికి నల్లవాళ్లని చూస్తేనే అసహ్యం. తాశిల్దారులను ఇలాగ అగౌరవంగా చూస్తూ వున్నందువల్ల ప్రజలకు వాళ్లమీద గౌరవం పోయి కొండెములు చెప్పడం ఎక్కువ అయింది. కలెక్టరులు ఆమాటలు విని తాశిల్దారులను కఠినంగా శిక్షిస్తూ వుండేవారు. తమ ఉద్యోగం ఎప్పుడు పోతుందో అనే భయములో వుంటూ జీతాలు చాలక, ఉద్యోగం వున్న నాలుగురోజులలో నాల్గుడబ్బులు సంపాదించుకుందామని కొందరు తాశిల్దారులు లంచాలు పుచ్చుకొనేవారు. తాశిల్దారు లందరూ లంచగొండులే ననే అభిప్రాయంతో కలెక్టర్లు అందరినీ కఠినంగా చూడడము ప్రారంభించారు.

ప్రతి తాశిల్దారు సత్ప్రవర్తనకు పూచీగా రెండువేల రూపాయలకు హామీ యివ్వాలని నిర్ణయించారు. తాశిల్దారులు తమకు ఆస్తి వున్న వూళ్ళలో వుద్యోగాలు చెయ్యకూడదన్నారు. అంతేగాని వాళ్ళ జీతాలను వృద్ధిపరచలేదు. వాళ్ళగౌరవాన్ని కాపాడేటట్లు ప్రవర్తించనూలేదు. ఈ స్థితిని కొంత చక్కపరచదలచి చెన్నపట్నం ప్రభుత్వం వారు ౧౮౩౪ లో తాశిల్దారులను చీటికీ మాటికీ శిక్షించి ప్రజల దృష్టిలో వాళ్ళ గౌరవానికి భంగం కలిగించవద్దనిన్నీ, వాళ్ళకు వుద్యోగాలు స్థిరములనే నమ్మకం కలిగించాలనిన్నీ కలెక్టర్లకు తాకీదులు జారీ చేశారు. ఈ సలహాలిచ్చి పాతికేళ్లు దాటినా కలెక్టర్లు పూర్వంలాగానే నిరంకుశంగా ప్రవర్తిస్తూవచ్చారు. తాశిల్దారుల జీతాలు వృద్ధికాలేదు. విశాఖపట్నంలో ౧౮౫౬ ఆప్రాంతములల్లో ఇద్దరు తాశిల్దారులు తమకు నెల ౧కి ౧౦ నవరసులు జీతం యివ్వవలసిందని అర్జీపెట్టుకుంటే అప్పుడు జిల్లాకలెక్టరులపైన అధికారిగా వుండే ఉత్తర సర్కారుల కమిషనరు వాళ్ళకు నెల ౧కి ౮ నవరసులు చాలునని వుత్తర్వుచేశాడు.

శిరస్తాదారులు

కలెక్టరుకచేరీలలో శిరస్తాదారులుగాను, శిరస్తా మదద్గారు, లేక డిప్యూటీశిరస్తాదార్లుగాను పనిచేసే దేశీయుల స్థితికూడా ఇలాగే వుండేది. నిజానికి ఈ శిరస్తాదారువుద్యోగం దేశీయులు పొందే హోదాలలోకల్లా గౌరవకరమైనదీ, కొంచెం ఎక్కువజీతం కలట్టిదీ. అయినా ౧౮౫౮ కి పూర్వం పదేళ్ళలో ఉత్తరసర్కారులలో ప్రతిజిల్లాలోనూ కూడా శిరస్తాదారు లందరినీ ఏదో కారణంమీాద పనిలోనుంచి తొలగించారు.

౧౮౪౨ లో విశాఖపట్నం జిల్లాకలెక్టరుగానూ, చెన్నపట్నం గవర్నరు ఏజంటుగానూ వుండిన పి. బి. స్మాలెట్టుగారు (P B. Smollet) ౧౮౫౮ లో 'Madras and its civil administration' అనే పుస్తకంలో యీా పరిస్థితుల నన్నింటినీ వర్ణిస్తూ ఆ జిల్లాలో తనకు పూర్వం పనిచేసిన కలెక్టరు పోయి తాను వచ్చేలోపుగా తాత్కాలికంగా పనిచేసిన కలెక్టరుకింది సీనియరు అసిస్టెంటుదొర అక్కడి శిరస్తాదార్ణీ, సగంమంది దేశీయోద్యోగులనూ పనిలోనుంచి తీసివేసిన సంగతిని వ్రాశారు.

కంభం నరసింగరావుగారు

ఈయన ౧౮౪౪-౫౨ మధ్య రాజమహేంద్రవరంజిల్లా కలెక్టరు కచేరీలో శిరస్తాదారుగా వుండేవాడు. అప్పట్లో గోదావరిజిల్లాను రాజమహేంద్రవరంజిల్లా అనేవారు. ఆ కాలంలో చెన్నరాజధానిలో పెద్దశిరస్తాదారు అంటే కలెక్టరు దొరగారి దివాను అన్నమాట. రివిన్యూశిస్తువసూాలు విషయాలలో అతడే కలెక్టరుకు ముఖ్యసలహాదారు. కలెక్టరు కచేరీలోనుంచి జారీఅయ్యే తాఖీదు లన్నింటిపైనా ఆయన చేవ్రాలు వుండాలి. అతణ్ణి 'నేటివుకలెక్టరు' అనేవారు.

నరసింగరావుగారు ఇంగ్లీషువర్తక కంపెనీ సర్కారు కొలువులో ౨౭ సంవత్సరాలు పనిచేసి రివిన్యూశాఖలో పెద్ద ఉద్యోగాలు చేసిన అనుభవజ్ఞుడు రాజమహేంద్రవరం జిల్లాపరిపాలన బాగా లేకపోవడం

వల్ల అక్కడ పని చెయ్యడానికి ప్రత్యేకంగా ఇతణ్ని ఏరి కోరి నియమించారు. ఈయనపై యధికారి రాజమహేంద్రవరం కలెక్టరు, మొదటి ఏడేళ్లవరకూ ఇతనిని ప్రశంసిస్తూ పై వారికి వ్రాసేవాడు. ఇదివరకు వ్యవహారాలు సరిగా జరగనందువల్ల అధోగతిలో వున్న ఈ జిల్లా రివిన్యూ వసూలు నరసింగరావుగారు అమలులో పెట్టిన మంచి పద్ధతులవల్లను, ఆయన అజమాయిషీ క్రిందను చాలా అభివృద్ధి జెందింది. వెట్టిచాకిరీతో గోదావరికి ఆనకట్ట ఒకటి కట్టడం ౧౮౪౬ లో ప్రారంభించినందువల్ల ఈ జిల్లా ఆదాయం అభివృద్ధి జెందిం దని (డి. పి. డబ్లియు) ఇంజనీరింగుశాఖవారు అంటూరుగాని ఈ జిల్లాను గురించి స్వయంగా ఎరిగున్నవా రీమాటను నమ్మరనిన్ని అక్కడ స్థానికులుగా వున్న ఇంజనీర్లుకూడా ఇప్పుడు ఈ చిలక పలుకులు పలకడానికి సాహసింపరనిన్ని స్మాలెట్టుగారు వ్రాశారు.

పిఠాపురం జమీందారీ

పిఠాపురం జమీందారు శ్రీరాజా రావు వేంకట [illegible] మహీపతి గంగాధరరామారావు బహద్దరుగారి తండ్రిగారైన శ్రీరాజా రావు సూర్యారావుగారు సాధారణ నామసంవత్సర కార్తిక బ [illegible] (౨౭-౧౧-౧౮౫౦) తేదీన చనిపోయారు. ఆయన కొమాళ్లు చిన్నవాళ్లైనందువల్ల వాళ్లను దొరతనమువారి సంరక్షణక్రింద 'వార్డులు'గా వుంచారు. సూర్యారావుగారు చనిపోయిన సంగతి తెలియగానే అప్పటి రాజమహేంద్రవర కలెక్టరున్నూ, ఆయన హెడ్డు శిరస్తాదారున్నూ జమీందారుగారి ఆ స్తిని వశపరుచుకోడానికి తక్షణమూ పిఠాపురం వెళ్లారు. జమీందారుగారి ముఖ్యబంధువు లెవ్వరూ దీనికి యిష్టపడక కొంత సాత్వికనిరోధం చేశారు.

ఈ పిఠాపురం జమీందారీ చాలా ముఖ్యమైన జమీందారీ. చనిపోయిన రాజాగారి చిన్నతనంలో ౧౨, లేక ౧౪ సంవత్సరాలు కంపెనీ సర్కారు వారి సంరక్షణలో 'వార్డు'గా వున్నారు. జమీందారీని సర్కారువారు చక్కగా వ్యవహరించి నిల్వతో ఆయనకప్ప

వప్పచెప్పడానికిబదులుగా జమీని దుఃస్థితిలోకి తెచ్చి అప్పుతో వప్ప గించి నందువల్ల జమీందారుగారు తమ జమీందారీని నిలబెట్టు కొనడానికి సగంజమీందారీని గవర్నమెంటుకు యిచ్చివేయవలసివచ్చింది. ౧౮౪౪ మొదలు ౧౮౫౦ వరకూ సూర్యారావుగారి పరిపాలనలో జమీందారీ మళ్లీ బాగుపడి కొంత నిల్వలోవుంది. మళ్లీ సర్కారు వారి అజమాయిషీ రాగానే వ్యవహారాలు పాడవడం ప్రారంభమైంది. ౧౮౫౩ లో ప్రకటించిన లెక్కలను బట్టి నిలవ లేకపోగా ఆ సాలు తాలూకు శిస్తులో ౬౫౦౦౦ రూపాయలు బకాయి కనబడింది. దానికి కలెక్టరు జమాఖర్చు చెప్పలేదు. కలెక్టరుగారి అజమాయిషీని గవర్నమెంటువారు పరిశీలించడంలో దీనిని గురించి ఏమీ సెలవివ్వలేదు.

దిగవల్లి తిమ్మరాజుగారు

పైన చెప్పినట్లు జమీందారుగారి ఆస్తిని స్వాధీనపరుచుకోవడానికి వెళ్లినప్పుడు జమీందారుగారి తాలూకు విలువగల చరాస్తిలో చాలా కొద్దిభాగం మాత్రమే ఆయన రాజబంధువులు కలెక్టరుగారికి వశపరచగా కోటను సోదా చెయ్యడానికి వారంటు జారీ చెయ్యవలసినదని హెడ్డుశిరస్తాదారుగారు సలహాయిచ్చారు. కాని కలెక్టరు ఆ సలహా ప్రకారం జరుపలేదు. ఆఖరికి ఒక నెల జరిగిన తరువాత యాభై వేల రూపాయల విలువగల చరాస్తి కలెక్టరుగారికి వశమైంది. అప్పుడు ఈ జమీందారీ వ్యవహారాలను చక్కబెట్టడానికి నెలకు ౨౫౦ రూపాయల జీతంపైన శ్రీ దిగవల్లి తిమ్మరాజు పంతులుగారిని (కోర్టు ఆఫ్ వార్డ్సు) మేనేజరుగా నియమించారు. పిఠాపురం జమీందారీ శిస్తులు వసూలు చెయ్యడానికి - కచేరీలో పనికోసం నిరీక్షిస్తూ వాలంటీరుగా వుమ్మేదువారు చేసే ఆయనను ఒకనిని తాశ్శిల్దారుగా నియమించారు.

ఈ తిమ్మరాజుగారు చాలా అనుభవజ్ఞుడైన వుద్యోగి. ఆయన కృష్ణాజిల్లాలో కొయ్యూరునుంచి ౧౮౦౭ లో ఏలూరు వచ్చి ఇంగ్లీషు చదువుకొని ౧౮౧౧లో రాజమహేంద్రవరంవచ్చి అక్కడజిల్లాకోర్టులో పీటర్ రీడ్ కాజులెట్ గారి కాలంలో రికార్డుకీపరు మదద్గారీ, శిరస్తామదద్గారీ, శిరస్తా హెడ్ మదద్గారీ పనిన్నిచేసి, ౧౮౨౪లో జిల్లాజడ్జి చేసిన

హెన్రీ వైబార్టు దొరగారి శిఫారసువల్ల కలెక్టరు ఆఫీసులో ఇంగ్లీషు రికార్డుకీపరుపని, సాల్టురెటరీ, అమల్ దారి, నాయబు శిరస్తాదారి, ఆక్టింగు హెడ్ శిరస్తాదారి మొదలైన వుద్యోగాలు చేశారు. తరువాత సదరామీన్ పనికూడా చేసి పింఛనుపుచ్చుకుని ౧౮౭౬ సం. ఫిబ్రవరి ౬-వ తేదీన స్వర్గస్థులైనారు. వీరు కాకినాడలో శ్రీభీమేశ్వరస్వామిని ప్రతిష్ఠించి ౧౮౩౮లో ఒకగొప్ప దేవాలయాన్ని కట్టించారు. ౧౮౬౩లో శ్రీగంగాధర రామారావుగారికి మైనారిటీ తీరి పిఠాపురం జమీందారు అయిన తరవాత తిమ్మరాజుగారి పెద్దకుమారుడైన వెంకట శివరావు గారిని మొదట శిరస్తాదారుగానూ, తరవాత ౧౮౭౩లో మేనేజరుగానూ, పిమ్మట దివానుగానూ నియమించారు. రాజాగారు ౧౮౯౦లోనూ శివరావుగారు ౧౮౯౩లోను చనిపోయారు. వీరిని గురించి ఇప్పటికీ చాలాకథలు చెప్పుకుంటారు.

నరసింగరావుగారిమీద కేసు

పైన చెప్పినట్లు తిమ్మరాజుగారు మేనేజరుగా ప్రవేశించిన కొద్ది రోజులలో జమీందారీ వ్యవహారాలు తనిఖీ చేయగా ఎస్టేటు తాలూకు లెక్కపుస్తకాలలో చాలా పుస్తకాలు కనబడలేదు. దర్యాప్తును బట్టిన్నీ, సంగతి సందర్భాలనుబట్టిన్నీ ఆలోచించగా ఆ లెక్కలవల్ల జమీందారీ తాలూకు యావత్తునగలూ, రొక్కమూ, చరాస్తిన్నీ కలెక్టరుగారికి స్వాధీనం కాకుండా ఇంకా చాలా మిగిలిపోయినవన్నే సంగతి బయట పడుతుందనే భయంతో కొందరు కుట్రచేసి ఆస్తిని మార్చి పుస్తకాలను గైరువిలియా చేయించారని తోచింది. ఈ కుట్రలో నరసింగరావుగారుకూడా భాగస్వాములై వున్నట్లు అనుమానం కలిగింది. ఈ సంగతిని మేనేజరుగారు కలెక్టరు గారికి తెలియజేశారు. అప్పటికి కొంతకాలంనుంచి కలెక్టరుగారికి నరసింగరావుగారి మీద మంచి అభిప్రాయం లేనందువల్ల ఈసంగతిని విన్నతక్షణమే కలెక్టరు గారు ఆయనను పనిలోనుంచి తగ్గించి సస్పెండు చేసి ఖైదులో పెట్టి ఆయనను గురించి స్వయంగా విచారణ చేయడం ప్రారంభించారు. రాజ్యం తలుచుకుంటే దెబ్బలకేమి కొదవ? నరసింగరావుగా రంటే

గిట్టనివాళ్ళందరూ ఉన్నవీ లేనివీ కల్పించి చెప్పారు. కొత్తగా పిఠాపురం తాశిల్దారుగా ప్రవేశించిన ఆయన ఈ వ్యవహారంలో నరసింగరావుగారికి వ్యతిరేకంగా పనిచేశాడు. నరసింగరావుగారు పిఠాపురం జమీందారీని దగాచేసి అక్రమలాభం పొందే దురుద్దేశంతో కాగితాలు ఫోర్జరీ చేసినట్లున్నూ, లెక్కలను మాపుచేసినట్లున్నూ, కలెక్టరుగారు నేరాలు మోపి సెషన్సు జడ్జీకోర్టులో విచారణ చేయడానికి ఇతనిని కమిటుచేశాడు. కలెక్టరే మేజస్ట్రేటు అయివున్నందువల్ల తానే ఫిర్యాదీయున్నూ, నేరారోపకుడున్నూ, (ప్రాసిక్యూటరున్నూ, కమిటింగు మేజస్ట్రేటున్నూ) అయి నేరమునుగురించి చిన్న అక్షరాలతో కొన్ని తావుల వివరణపత్రికను వ్రాశాడు. జామీనుమీద విడుదల చెయ్యవలసిన దని ముద్దాయి కోరిననూ వదలక చెరసాలలోనే వుంచాడు. అవమానం కంటె చావు మేలని ఆయన అన్నాడని, వదలిపెడితే ఆత్మహత్యచేసుకుంటాడనే నెపంతో జిల్లాలోకల్లా గొప్ప దేశీయోద్యోగిని ఇలాగ ఖైదులో పడవేసి వుంచారు.

కలెక్టరు రికార్డుల సోదా

ఈ ముద్దాయిపైన మోపిన నేరాలలో శిరస్తాదారుగారిదగ్గర వున్న లెక్కలనుబట్టి కనబడే పిఠాపురం జమీందారుగారి చరాస్తి నగలు యావత్తూ స్వాధీనం కాలేదనే సంగతిని యీ శిరస్తాదారు కలెక్టరుగారికి తెలియపరచలే దనేది ఒకటి. తాను మరుగు పరిచినట్లు చెప్పే సంగతులన్నీ మూజువానీగానూ, లిఖితమూలంగానూకూడా కలెక్టరుగారికి తెలియచేశానని శిరస్తాదారుగారు జిల్లాకోర్టువారికి మనవి చేశారు. లిఖితమైన జాబితా యేదీ లేదని జిల్లాకలెక్టరుగారు మొదట అన్నారు. జిల్లాకోర్టువారి వుత్తర్వుప్రకారము కలెక్టరుగారి రికార్డులను సోదాచూడగా అలాంటి కాగితం ఒకటి దొరికింది. అంతట శిరస్తాదారు దానిని తనకు ఇచ్చివుండవచ్చునని కలెక్టరుగారు ఒప్పుకొన్నారు. ఈ కాగితాన్ని కోర్టువారికి పంపుతూ జమీందారుగారి ఆభరణాలను గురించి శిరస్తాదారుగారు తనకు తెలిపినా, లెక్కలన్నీ ఆయనదగ్గిర వున్నందువల్ల ప్రత్యక్షంగా కనబడుతూవున్న ౬౭౨౦౦౦ రూపాయల

లోటుసంగతిని తనకు చెప్పలేదనిన్నీ, శిరస్తాదారుగారి దుర్మార్గం వల్లనే ఈ సొమ్ము (ఫాజలు) అపహరించ బడిన దనిన్ని కలెక్టరుగారు వ్రాశారు.

ముద్దాయి విడుదల

కలెక్టరుగారు నరసింగరావుగారిని పనిలోనుంచి తీసివేసిన తరువాత ఆయనస్థానంలో తాత్కాలికంగా తిమ్మరాజుగారినే శిరస్తాదారుగా నియమించారు. పైన చెప్పినట్లు జిల్లాకోర్టువారు కలెక్టరు కచ్చేరీరికార్డును సోదాచూసి లెక్కజాబితాను పట్టుకువెళ్లిన తరువాత పిఠాపురం ఎస్టేటుకు కలిగిన నష్టాన్ని గురించి కలెక్టరుగారు ఒక స్టేటుమెంటు (తబ్సీళ్లవారీ వివరణము)ను తయారుచేయించి ఈ స్టేటుమెంటు ముద్దాయి (నరసింగరావుగారి) నేరాన్ని స్పష్టముగా ఋజువు చేస్తుందని వ్రాస్తూ దానిని జిల్లాజడ్జిగారికి పంపించారు. నరసింగరావుగారి కేసు జిల్లాకోర్టులో పదహారునెలలు వాయిదాలు పడిపడి చివరకు విచారణ అయింది. కలెక్టరుగారు పంపించిన స్టేటుమెంటు అనేది మొదటినుంచి చివరదాకా అభూతకల్పనమని కోర్టువారికి నచ్చేటట్లు ముద్దాయి ఋజువు చెయ్యగలిగాడు. విచారణసందర్భంలో ఈకేసు దాఖలవడానికి మూలకారకుడైన పిఠాపురం అమలుదారు ఫిర్యాదును సమర్థించడంకోసం అబద్ధపుసాక్ష్యం యిచ్చినట్లు జడ్జీగారికి తోచి అతనిని ఖైదులో పెట్టారు. అతని పనినికూడా తీసివేశారు. ముద్దాయి నరసింగరావుగారిని నిర్దోషి అని విడుదల చేశారు. పదహారు నెలలు ఖైదులో మగ్గి మనోవ్యధ అనుభవించి ఆయన బయటికి వచ్చాడు.

కలెక్టరుగారి పగ

ఒకమూల యీకేసు జరుగుతూవుండగానే కలెక్టరుగారు నరసింగరావుగారిని గురించి తనపై యధికారియైన ఉత్తర సర్కారుల కమిషనరుగారితో ఉత్తర ప్రత్యుత్తరాలు జరపడం ప్రారంభించాడు. ఈశిరస్తాదారుయొక్క దుష్ప్రవర్తనవల్ల సర్కారు సంరక్షణలో వున్న మైనరు జమీందారుకు కొన్ని వేలనవరసుల నష్టం కలిగిందనిన్నీ, ఘోరమైన ఈ అన్యాయపుమోసమును గురించీ, అపహరణమును

గురించీ తనకచ్చేరీ వుద్యోగులు తనకు తెలియనియ్యకుండా కుట్రి చేశారనిన్నీ, తన ఒక్కడికీ తప్ప రాజమహేంద్రవరం జిల్లాలో అందరికీ తెలుసుననిన్నీ, కొత్తగా తనకు అనుచరులైన తిమ్మరాజుగారున్నూ, అమల్దారున్నూ తన నీచిక్కులోనుంచి బయటికి తీశారనిన్నీ కమీషనరుగారికి తెలుపుతూ, ఈ క్రిమినలు కేసులో ఆముద్దాయికి శిక్షపడుతుందనే దృఢనమ్మకంతోనూ తాను వ్రాసిన సందర్భాలలోనూ ఆముద్దాయి ఇదివరకు చేస్తూవుండిన నౌకరీలోనుంచి అతనిని తొలగించడానికి తనకు అధికారం యివ్వవలసిందనిన్నీ, ఒకవేళ కమిషనరుగారు ఇందుకు ఇష్టపడనిచో, ఒకవేళ ఆముద్దాయిని కోర్టువారు నిర్దోషి అని వదిలివేసినా, తనకూ ఆ శిరస్తాదారుకూ యిక సహకారంగాని, సామరస్యంగాని వుండడం దుస్తరమనిన్నీ, అందువల్లనైనా అతనిని పనిలోనుండి తొలగించడానికి అంగీకరించవలసినదనిన్నీ, ఈ కలెక్టరుగారు గట్టిగా వ్రాసినందువల్ల అతనిని పనిలోనుండి తీసివేయడానికి కమిషనరుగారు అధికారం యిచ్చారు.

నరసింగరావుగారికి ఉద్వాసన

అంతట కలెక్టరుగారు యీవిధంగా ఒక తాఖీదు జారీచేశారు:

"కంభం నరసింగరావుకు—

నీప్రవర్తనను గురించిన విచారణ పూర్తిఅయ్యేవరకూ నిన్ను పనిలోనుండి సస్పెండుచేసినట్లు ఇదివరకే నీకు తెలుపబడివున్నది. పిఠాపురం ఎస్టేటు ఆస్తిని కోర్టుఆఫ్‌వార్డ్సువారికి వశపరచగలందులకు నిన్ను నియమించి పంపినంతలో నీప్రోత్సాహంవల్లను, దుష్ప్రవర్తనవల్లను ఆజమీందారీతాలూకు చాలా వస్తువులున్నూ సొమ్మున్నూ అపహరించబడినట్లు దరిమిలాను చేయబడిన దర్యాప్తువల్ల రుజువు అయినది. నీవు ఇతరమైన అక్రమచర్యలుకూడా చేసినావు. నీవు విశ్వాసపాత్రుడవు కానందువల్ల నీవిషయమై ఉత్తరసర్కారుల కమిషనరుగారికి తెలియపరచగా నిన్ను తొలగించుటకు ఆయన అధికారం యిచ్చినారు. నీవు సర్కారునవుకరీకి తగవుగనుక నిన్ను సస్పెండు చేసిన తేదీలగాయతూ నీకు జీతము ఏమీ యివ్వబడదు."

ఈ హెడ్డుశిరస్తాదారు యొక్క నేరాలతో సంబంధం లేక పోయినా ఆయన జరిగించిన మోసకృత్యాలను బయటికి తియ్యడంలో కలెక్టరుగారికి సహాయం చేయలేదనే నెపంమీద అతని క్రింది యుద్యోగియైన డిప్యూటీ శిరస్తాదారునుకూడా పనిలోనుండి తీసి వేశారు.

కలెక్టరు సంజాయిషీ

జిల్లాకోర్టువారు అతనిని నిర్దోషి అని వదలగానే కంభం నరసింగరావుగారు తనపైన వచ్చిన దస్తుఫాజలు నేరమనేది అభూతకల్పన మనిన్నీ, తనను పనిలోనుండి తీసివేయడము అక్రమమనిన్నీ, పిఠాపురం జమీందారీతాలూకు ఆస్తి యేదిన్నీ బీరుపోలేదనిన్నీ, అలా పోయినట్లు చూపడానికి తయారుచేయబడిన లెక్కలు అబద్ధములనిన్నీ ఉత్తర సర్కారుల కమిషనరుగారికి అర్జీద్వారా తెలియపరిచారు. ఇతడు వ్రాసిన సంగతులను కమిషనరుగారు కలెక్టరుకు పంపించి దానిని గురించి సంజాయిషీ యివ్వమని కోరారు. దానికి జవాబుగా ౧౮౫౩ సం. నవంబరు ౨-వ తేదీన కలెక్టరుగారు ఒక ఉత్తరం వ్రాశారు. తిమ్మరాజుగారిని పిఠాపురం మేనేజరుగానూ, కలెక్టరు కచ్చేరి శిరస్తాదారుగానూ నియమించిన సందర్భాలను గురించి ఆజవాబులో మొట్టమొదట వివరించారు. ఈజిల్లాలో ఏర్పడిన క్లిష్టపరిస్థితిలో విశ్వాస పాత్రుడైన ఉద్యోగి ఒకడు తన ఖుద్దున వుండడం అవసరం గనుక ఈ తిమ్మరాజుగారిని ప్రత్యేకంగా వీరి శిరస్తాదారుగా నియమించా నని వ్రాశారు. నరసింగరావుగారిమీద మోపిన దస్తుఫాజలు నేరాలన్నీ నిరాధారా లనే సంగతిని కలెక్టరుగారు ఒప్పుకొన్నారు. నరసింగరావు గారి లెక్కలనుబట్టి పిఠాపురం జమీందారీతాలూకు ౬౭౦౦౦ రూపాయలకు లెక్క తేల లేదనే విషయాన్ని గురించి అతికష్టంమీంద తిమ్మరాజుగారివల్ల సంజాయిషీ పుచ్చుకోగలిగినాననిన్నీ, అయితే ఆ సంజాయిషీ చాలా అసంతృప్తికరంగా వున్నదనిన్నీ, అందువల్ల నిజంగా ఆసొమ్ము లోటుపడ లేదని అంగీకరించినట్లే ఎంచవలసివుంటుం దనిన్నీ వ్రాశారు. ఆలెక్కను తాను చూడనే లేదనిన్నీ, దానిని తయారుచేయడంలో తన కేమీ ప్రసక్తి లేదనిన్నీ, దానిని తయారు

చేసినవారు కలెక్టరుగా ఎన్నడూ విశ్వాసముంచని చిన్నవయస్సుగల ఇద్దరు గుమాస్తాలని తిమ్మరాజుగారు చెప్పినాడని కలెక్టరుగారు తమ వుత్తరంలో వ్రాస్తూ ఇంకా యీ కింది సంగతులు కూడా వ్రాశారు.

"ఆలెక్క నాదగ్గరికి తెచ్చినప్పుడు మేజస్ట్రేటు కేసులో ఏదైనా పొరబాట్లు వస్తే చాలా చిక్కులు కలుగుతాయి గనుక నేను క్షమించనుసుమా అని చెపుతూ ఆకాగితాన్ని నేను శిరస్తాదారు శాఖలోకి పంపించాను. అందులో ఏదో అనుమానం తోచి దానిని మళ్లీ ఇంకోసారికూడా సరిచూడడానికి నేను పంపించినట్లుకూడా నాకు జ్ఞాపకం. అయితే ఆ సంగతిని నేను గట్టిగా చెప్పలేను.

"ఆ లెక్కను జాగ్రత్తగా సరిచూసే విషయంలో నేను చేయ గలిగినదంతా చేశానని అనుకున్నాను.

"తిమ్మరాజుగారే జవాబుదారు"

"దస్తులో ౬౭౦౦౦ రూపాయల లోటు కనబడుతూవుందని నేను సెషన్సుకోర్టుకు వ్రాసినప్పుడు పైన చెప్పిన విధంగా హెచ్చరించిన తరువాతకూడా పైయిద్దరు గుమాస్తాలున్నూ నన్ను మోసంచేయడానికి సాహసిస్తారని నేను అనుకోలేదు. తిమ్మరాజుగారు తన ఉద్యోగాన్నిబట్టి చేయవలసినపని చేయకుండా ఇంత అజాగ్రత్త వహిస్తాడనిన్ని నేను అనుకోలేదు. ఈ తప్పిదాన్ని మన్నించే విషయంలో నేనేమి చెప్పడానికీ నాకు తోచడంలేదు. నేను ఎంతో విశ్వాసముంచిన మనిషి, పాతశిరస్తాదారును నష్టపరచడానికి ఒక దొంగ లెక్క తయారుచేసినాడనిగాని, తాను స్వయంగా పరిశీలించకుండానూ, లేదా తనక్రింది వుద్యోగులచేత జాగ్రత్తగా సరిచూపించకుండానూ ఆకాగితాన్ని తన కచ్చేరీలోనుంచి జారీచేశాడనిగాని ఇటువంటి అపవాదుకు గురి అయ్యేటందుకు అవకాశం యివ్వడం నామనస్సుకు చాలాకష్టం కలిగిస్తూవుంది."

"ఇది చాలా విపరీతమైన సంగతిగా వుంది. ఇదివరకెన్నడూ యిటువంటి అజాగ్రత్తను, బుద్ధిమాంద్యమును తిమ్మరాజు ప్రదర్శించి

యెరగడు. ఈమారు అతడు ఇలాగు ఎందుకు చేశాడో తెలియడంలేదు. ముద్దాయి (శిరస్తాదారు)పైన పన్నబడిన ఒక కుట్రలో ఇత డొక భాగస్వామి అనడానికి ఎంతమాత్రమూ వీలులేదు. వివేకంగలవాడెవ్వడూ అలాంటి దుర్మార్గంలో చేరడు. ఎంత స్వల్పమైన లోపమునుగాని పట్టుకోకుండా వదలని తెలివితేటలు గల అతిసమర్థుడైన అకవుంటెంటు (తిమ్మరాజుగారు) వున్నాడు కదా అనే నమ్మకంతో నేను స్వయంగా సరిచూడకుండా ఆలెక్కమీద సంతకం పెట్టాను. ఈవిధంగా ఆలోచిస్తే ఇది అంత పెద్ద పొరపాటు కాకపోయినా దాన్నిగురించి నేను సమర్థించుకోవడానికి ప్రయత్నించను. కలెక్టరుసంతకంతో జారీఅయ్యే లెక్కలయొక్క నిర్దుష్టతకు కలెక్టరే బాధ్యుడని (రూల్సులో) ఇప్పుడు నిర్ణయించబడినట్లు అప్పటికి విధించబడియుండనందువల్ల ఈతప్పుడు లెక్కకు తిమ్మరాజుగారే జవాబుదారు అయివున్నాడు'' అని కలెక్టరుగారు కమిషనరుగారికి వ్రాసి తన బాధ్యతను తప్పించుకోవడానికి తిమ్మరాజుగారి మీదికి తోసివేసి వూరుకున్నాడు.

"ముద్దాయి నేరాన్ని స్థాపించే లెక్క'' అని తాను తయారుచేయించి జిల్లాకోర్టువారికి పంపించిన లెక్క తప్పుడులెక్క అని తేలింది. ముద్దాయి నిర్దోషి అని రుజువు అయింది. ఇలాగ నిష్కారణంగా ఒక నల్లవాడిని సామాన్యఖైదీలనుంచే బందిఖానాలో పడవేసివుంచడము, పదహారునెలలు విచారణలో నిర్బంధించి వుంచడమూ అంతగా విచారించతగిన అంశము కాదని ఈదొరగారు అనుకొని వుంటారు.

ఇంకో కేసు

ఒకప్రక్క ఈశిరస్తాదారుగారి కేసు జరుగుతూ వుండగా ఈ కలెక్టరుగారు పిఠాపురం మైనరుజమీందారు సంరక్షకుడైన రాజబంధువు(Uncle) మీదకూడా ఒక నేరాన్ని మోపి ఆయనను ఖైదులో వుంచారు. పైన చెప్పిన ౬౭ వేల రూపాయలతో సహా ఇంకాకొంత ఎస్టేటు ఆస్తిని హరించి నేరం చేశాడని ఆయనమీద ఒక కేసు దాఖలు చేశారు. ఆకేసును సర్కారుతరఫున నడపడానికి నాలుగువందల మైళ్ల దూరాన్నుంచి ఇంగ్లీషుబారిస్టర్లను తెచ్చి దీనికోసం అయిన

సొమ్మును పిఠాపురం జమీందారీ ఖజానాలో నుంచి ఖర్చుపెట్టారు ఆ కేసులోకూడా ముద్దాయిని నిర్దోషి అని వదలివేశారు. "సర్కారు సంరక్షణకింద వుండే మైనరు జమీందారుల సొమ్మును ఎలాగ వృథాగా ఖర్చుపెడతారో దీనివల్ల తెలుస్తుంది. ౧౮౫౮ నాటికి పిఠాపురం లెక్కలలో నిల్వ యేమీ లేకుండా పోవడానికి ఇది ఒక కారణమని చెప్పవచ్చును" అని స్మాలెట్టుగారు వ్రాశారు.

నరసింగరావుగారి అర్జీలు

పైన చెప్పిన కలెక్టరుగారి సంజాయిషీ వుత్తరం ఉత్తరసర్కారుల కమిషనరుగారికి చేరినమీదట ఆయన తా నీవిషయంలో జోక్యం కలిగించుకోవడానికి నిరాకరించి పనిలోనుంచి తీసివేసిన శిరస్తాదారును కావలిస్తే గవర్నమెంటుకు చెప్పుకోమని అన్నాడు. చెన్నపట్నం గవర్నమెంటువారు కిందివారి వుత్తరువును ఖాయపరిచారు. జిల్లాజడ్జి తన్ను నిర్దోషి అని నిర్ణయించి ఆకోర్టులోనే ఒక వుద్యోగం తన కిస్తానని అన్నా రనిన్నీ, సర్కారు నౌకరీని మళ్లీ చేసుకోవడానికి అనుజ్ఞ యిప్పించవలసిం దనిన్నీ, మళ్లీ రాజమహేంద్రవరం కలెక్టరుకిందనే పని చెయ్యాలని తనఉద్దేశ్యం కాదనిన్నీ నరసింగరావుగారు మళ్లీ అర్జీ దాఖలు చేసుకోగా ఈ అర్జీదారు ఏశాఖలోనూ సర్కారు నౌకరీ చేయడానికి వీలులేదని సభాయుతులైన గవర్నరుగారు నిష్కర్షగా శాసించారు! పది రూపాయలకు పైబడిన జీతం గల ఏ దేశీయోద్యోగినీ కూడా అతడు చేసిన నేరం నకలును అతనికిచ్చి అతడు చెప్పే సంజాయిషీని, తెచ్చుకునే సాక్ష్యాన్ని వినిగాని అతనిని పనిలోనుండి తీసివెయ్యకూడదని, అంతకుపూర్వం కొంతకాలం కిందటనే దొరతనమువారొక తీర్మానం చేసివున్నా ఇప్పుడు ఈ నరసింగరావుగారి విషయంలో అందుకు విరుద్ధంగా ప్రవర్తించారు.

పిఠాపురం ఎస్టేటు తాలూకు చాలా సొమ్ము అపహరించడానికి ఇతను మద్దత్తు చేశాడనే నేరంమీద ఇతనిని పనిలోనుండి తీసివేశారు. అయితే ఇతడు నిర్దోషి అని కోర్టువారు తీర్మానించారు. అంతట ఇతడు ఎంతమాత్రమూ విశ్వాసపాత్రుడు కాడనే నెపంమీద ఎంతోకాలం

నమ్మకంగా పనిచేసి సమర్థుడనీ; నమ్మకమైనవాడనీ కలెక్టరువల్లనే అనేక యోగ్యతా పత్రాలు పొందిన ఈ దేశీయోద్యోగి పనిని తీసి వెయ్యడాన్ని సమర్థించారు!

చెన్నపట్నం దొరతనమువారివల్ల న్యాయం కలగకపోగా నరసింగరావుగారు ఈ సంగతులన్నీ తెలుపుతూ ఇంగ్లాండులోవున్న కంపెనీ డైరెక్టర్ల సభ వారికి ౧౮౫౫ లో ఒక విన్నపము పంపించారు. అంతట సర్కారుకొలువులో ఏ ఉద్యోగమూ ఇవ్వకూడదనే నిషేధాన్ని తొలగిస్తూ ౧౮౫౬ లో వుత్తర్వులు వచ్చాయి. అయితే ఈలోపుగా నరసింగరావుగారు విజయనగరం ఎస్టేటుదివాను అయి ఆజమీందారీ రివిన్యూ పరిపాలన చక్కగా నిర్వహిస్తూవున్నందువల్ల మళ్లీ సర్కారు నౌకరీలో చేరడం అసంభవము అయింది.

గం జాం శి ర స్తా దా రు క థ

ఈ దేశీయుణ్ణి ఇలాగ బాధించి వుద్యోగంలోనుంచి తొలగించి దీనికంతా కారకుడైన రాజమహేంద్రవరం కలెక్టరు ప్రెండరుగాస్టు గారికి గంజాంజిల్లాలో గవర్నరుగారి ఏజెంటుహోదాతో పెద్ద గౌరవ వుద్యోగం యిచ్చారు. ఈ దొరగారు అక్కడికి వస్తున్నాడనేటప్పటికి అక్కడివారిలో చాలామందికి భయం కలిగింది. ఈ కొత్తఏజంటుగారు ఆపనిలో ప్రవేశించిన కొన్ని వారాలలోనే, గంజాముజిల్లాలో పెద్ద ఉద్యోగాలు చేస్తూవున్న దేశీయులను చాలామందిని పనిలోనుంచి తొలగించాడు. సర్కారుకింద నలభై సంవత్సరాలు నమ్మకంగా పనిచేసి అతడు చేసిన రాజకీయసేవకు ఒక బిరుదును పొందడానికీ, పింఛను పుచ్చుకోవడానికి సిద్ధంగా వున్న హెడ్డుశిరస్తాదారు పైన ఈ దొరగారు ఏదో నేరం మోపి పట్టుకొని శ్రీకాకుళం సెషన్సుకోర్టుకు పంపారు. ఆ కోర్టుజడ్జీగారు ఈఫిర్యాదులోని సంగతులు చాలా హాస్యాస్పదమైన స్వల్పవిషయాలై వుండడం చూసి ఆయనమీద నేరం మోపి కేసు విచారించడానికి యిష్టపడక ఆఖరికి దానిని కొట్టివేశారు. ఇది జరిగి పదిహేను నెలలు అయినా ఉద్యోగరీత్యా ఆ శిరస్తాదారుగారి వ్యవహారం పరిష్కారం కాకుండా ఇంకా విచారణలోనే వుంది. దానికి

సంబంధించిన కాగితాలు పైఅధికారులదగ్గర చాలా నెలలనుంచి పడి వున్నాయి. ఆ వుద్యోగి ముసలివాడు. ఆయన జబ్బుమనిషి. బహుశా ఈయన వ్యవహారం ఫైసలు అయ్యేలోపుగానే స్వర్గస్థుడయి విముక్తి పొందుతాడేమో అని స్మాలెట్టుగారు వ్రాశారు.

ఈగంజాం హెడ్డు శిరస్తాదారుమీద మోపిన నేరాలలో చెన్నపట్నం రాజధానిలో శిరస్తాదారు ఉద్యోగం చేసేవారు వహించేదానికన్న యెక్కువ దర్జాగల గౌరవవాచకాన్ని తన పేరుతో కలిపి వాడుతున్నాడనే నేరం ఒకటి! ఇంకా ఇలాంటి పనికిమాలిన నేరాలు కొన్నింటిని మోపారుగాని ఆపాదించిన దోషాలలో ఒక్కటైనా సరియైన సాక్ష్యంతో రుజువుపరచడానికి ప్రయత్నించలేదు. ఈ అక్రమాన్ని గురించి ఈగంజాంజిల్లా శిరస్తాదారుగారు ఇంగ్లాండులో కంపెనీ డైరెక్టర్ల కోర్టువారికి అర్జీ యిచ్చుకోగా ఆయనకు పూర్తిపింఛను ఇచ్చేటట్టు వారు వుత్తరువు చేశారు.

3. చక్రవర్తికి శిక్షవిధించిన దివానులు

ఈ దేశానికి వర్తకం చేసుకోవడానికి వచ్చిన ఇంగ్లీషువారు 1765 లో అప్పటి మొగలాయి చక్రవర్తియైన షా అలం పాదుషాను ఆశ్రయించి వంగరాష్ట్రంలోను బీహారు ఒరిస్సాపరగణాలలోను చక్రవర్తి ప్రతినిధులుగా శిస్తులు వసూలు చేసి సివిలు పరిపాలన జరిపే 'దివానిగిరీ' అధికారాన్ని సంపాదించడంతో రహస్యంగా ప్రారంభమైన బ్రిటిషు రాజ్యతంత్రము 1858 లో జరిగిన సిపాయిల విప్లవమనే స్వాతంత్ర్య యుద్ధంలో పాల్గొని ఐరోపావారి వధలకు మద్దతుచేసినాడనే నేరంమోపి అప్పటి మొగలాయి చక్రవర్తియైన బహదూరుషా పాదుషాను పట్టుకుని యావజ్జీవ కారాగార శిక్షవిధించి రంగూనులో నిర్బంధించి ఇండియాలో కంపెనీపరిపాలనను రద్దుచేసి ఇంగ్లీషు రాణీ ప్రభుత్వము ప్రకటించడంతో స్థిరరూపం దాల్చింది.

ఇంగ్లీషు వర్తక కంపెనీకి దివానిగిరీని ప్రసాదించిన షా అలం చక్రవర్తి అసలుపేరు అలీగొహర్. ఆయన అలంగీరు చక్రవర్తి కొమారుడు. అతడు 1728 లో జన్మించాడు. తండ్రికి ఆయనమీద దయ దప్పగా అప్పట్లో అయోధ్యలో రాజప్రతినిధిగా వున్న 'నవాబు వజీరు' షుజాఉద్దౌలాను ఆశ్రయించి అక్కడ తలదాచుకున్నాడు. షుజా ఉద్దౌలా బలవంతుడై చక్రవర్తినికూడా లోబరచుకొన్నాడు. అలంగీరు చక్రవర్తి 1759 లో దుర్మరణము పొందగా షాఅలం చక్రవర్తి యైనాడు. ఈయనకూడా షుజా ఉద్దౌలా చెప్పుచేతలలోనే వున్నాడు.

మూర్షిదాబాదును రాజధానిగా చేసుకొని వంగరాష్ట్రాన్ని పరిపాలిస్తూవున్న రాజప్రతినిధియైన అలావర్దీఖాను చనిపోగా ఆయన మనుమడు దత్తపుత్రుడునైన సురాజుద్దౌలా 1756 లో నవాబు అయినాడు. కొత్తనవాబు చాలా చిన్నవాడు. అప్పట్లో కలకత్తాలో వర్తకం చేసుకుంటూవున్న ఇంగ్లీషువారి అక్రమ చర్యలను హర్షించక వారిని దండించాడు. అంతట వారు ఆయన మంత్రులను తిరుగదీసి ఆయన బంధువుడున్నూ మంత్రిన్నీ అయిన మీర్జాఫరుచేత స్వామి ద్రోహము చేయించి 1757లో ప్లాసీయుద్ధంలో నవాబును ఓడించారు. ఈ యుద్ధంలో విజయం పొందిన క్లైవుయొక్క ధైర్యసాహసాలకు అయోధ్యనవాబున్నూ చక్రవర్తిన్నీకూడా సంతోషించారు. సురాజుద్దౌలా దుర్మరణం పొందగా మీర్జాఫరును నవాబుగా అంగీకరింపజేయడానికి క్లైవున్నూ ఇతర ఇంగ్లీషు ఉద్యోగులున్నూ చాలా సొమ్ము లంచము పుచ్చుకొని చక్రవర్తికి శిఫారసుచేసి మీర్జాఫరును నవాబుగా చేసి కృతకృత్యులైనారు.

వంగరాష్ట్ర వ్యవహారాలలో క్లైవు చూపిన చాకచక్యానికి చక్రవర్తి అతనిని ఆరువేల గుర్రపుదళానికి అధికారి యనే గౌరవ బిరుదు నిచ్చాడు. ఆయుద్యోగమునకు న్యాయంగా సాలుకు ముప్పైవేల నవరసుల జీతము తనకు రావలెనని క్లైవు మీర్జాఫరును నిర్బంధించి అందు క్రింద 24 పరగణాలను జాగీరుగా పుచ్చుకున్నాడు. ఈమీర్జాఫరు కేవలము ఇంగ్లీషు కంపెనీ యుద్యోగుల చేతులలో కీలుబొమ్మగా

వుండినందువల్ల వారికి అమితలాభం కలిగింది. త్వరలోనే మీర్జా ఫరును అతని కౌమారుణ్ణికూడా త్రోసిరాజని అతని అల్లుడైన మీర్ఖాసీమును నవాబుగా చేశారు. ఇతడు మీర్జాఫరులాగ ఇంగ్లీషు వర్తకులుచేసే అన్యాయాలన్నింటినీ సహించలేక వారికి గల ప్రత్యేక హక్కులను తీసివేసేటప్పటికి ఇంగ్లీషువా రాయనను పదభ్రష్టుణ్ణి చేసి మళ్లీ మీర్జాఫరును తక్తుమీదికి యెక్కించారు.

1760-1764 మధ్య వంగరాష్ట్రంలో అరాజకం ప్రబలింది. ఇంగ్లీషు వర్తకులు చేసే అన్యాయాలకు మితిలేకుండా పోయింది. వారి దుర్మార్గాలు సీమలో అధికారులకు కూడా తెలిసి ఇక్కడి పరిస్థితులను చక్క బెట్టవలసిన దని క్లైవును మళ్లీ గవర్నరుగా నియమించి పంపించారు. అతడు 1765 మే నెలలో ఇక్కడికి వచ్చాడు.

ఈలోపుగా వంగరాష్ట్ర రాజకీయ పరిస్థితులలో కొన్ని మార్పులు వచ్చినవి. పదచ్యుతుడైన మీర్ఖాసీము అయోధ్య నవాబును ఆశ్రయించాడు. అంతట అయోధ్య నవాబున్నూ, షా ఆలం చక్రవర్తిన్నీ అతనికి సహాయులైనారు. 1764 లో బక్సారువద్ద జరిగిన యుద్ధములో వారికి అపజయం కలిగినందువల్ల కంపెనీవారి సైన్యాలు అయోధ్యమీదికి చెలరేగి దండయాత్రలు చేయడం ప్రారంభించినవి. క్లైవు వచ్చేటప్పటికి అయోధ్యతో యుద్ధం పూర్తి అయింది. మీర్జాఫరు 1765 జనేవరు లోనే మరణించాడు. ఇక్కడి కంపెనీ యుద్యోగులు అతడి రెండవకొడుకుదగ్గర లంచములు పుచ్చుకొని అతణ్ని నవాబును చేశారు.

వంగరాష్ట్ర సింహాసనం మీద ఒక బలహీనుడైన నవాబును నిమిత్తమాత్రంగా వుంచి కీలుబొమ్మలాగు ఆడించినందువల్ల ఇంగ్లీషు కంపెనీ వుద్యోగులందరికీ వారు ఆడింది ఆటగానూ, పాడిందిపాటగానూ, సాగింది. వారు పుచ్చుకునే లంచాలకు జరిగించే అక్రమాలకు హద్దు పద్దు లేకుండా పోయింది.

"దివానిగిరీ"

వంగరాష్ట్రంలో ప్రభుత్వాధికారాలను కంపెనీవారికి చేజిక్కించాలనే వుద్దేశ్యం కంపెనీయుద్యోగులు చాలామందికి కొంతకాలం నుంచి కలిగింది. ఆఘనకార్యం సాధించిన గౌరవం క్లైవుకే దక్కింది.

ఆకాలంలో దేశంలో ప్రతినవాబున్నూ చక్రవర్తి పేరిటనే ప్రభుత్వం జరుపుతూ వుండేవాడు. ఏరాజ్యతంత్రం ప్రయోగించాలన్నా చక్రవర్తి పేరుతో ఒక ఫర్మానాపుట్టుతూ వుండేది. చక్రవర్తిని చేజిక్కించుకొన్నవాడిదే రాజ్యంగా సాగేది. అందువల్లనే అయోధ్య నవాబు వజీరు చాలా బలవంతుడైనాడు. 1765 లో క్లైవు రాగానే చేసిన పని అయోధ్య నవాబుతోనూ చక్రవర్తితోనూ రాయబారాలు సాగించి కంపెనీవారికి లాభకరమైన సంధియేర్పాటులు చేయడమే.

షా అలం చక్రవర్తి అలహాబాదు మకాములో వుండగా క్లైవు స్వయముగా ఆయనను దర్శించి ఆయనవల్ల కంపెనీ వారికి వంగరాష్ట్రానికీ బీహారు ఒరిస్సా పరగణాలకూ దివానిగిరి అధికారాలను సంపాదించాడు. చక్రవర్తి సంరక్షణకోసము అలహాబాదులో ఇంగ్లీషు సైనికదళము నుంచేటట్లున్నూ కంపెనీవారు వంగరాష్ట్రం బీహారు ఒరిస్సా పరగణాలలో దివానుగా వుండి శిస్తులను వసూలు చేసి పరిపాలన జరిగించుటకున్నూ కంపెనీవారు చక్రవర్తికి సాలుకు 20 లక్షల రూపాయలు చెల్లిస్తూ ఉండేటట్లున్నూ ఏర్పాటు జరిగింది. ఈదివానిగిరీతోపాటు దక్షిణదేశంలో ఉత్తరసర్కారు జిల్లాలనుకూడా కంపెనీ వారికి దయచేస్తూ షాఆలం చక్రవర్తి ఫర్మానా జారీచేసినాడు.

చక్రవర్తియిచ్చిన దివానిగిరీని బట్టి కంపెనీవారు (సివిలు) ప్రభుత్వాధికారాలన్నీ చలాయించడానికి వీలున్నప్పటికీ వెంటనే ఆలాగ జరిగించక పన్నులు వసూలు మాత్రం తాము చేస్తూ మిగతా ప్రభుత్వాధికారాలన్నీ నవాబుక్రింది వుద్యోగుల ద్వారానే జరగనిచ్చారు. దీనికి కారణం వెంటనే తామీప్రభుత్వాధికారాలన్నీ చలాయించేటట్లైతే చాలా పెద్దసిబ్బందిని నియోగించి చాలాసొమ్ము ఖర్చుపెట్టవలసివస్తుం

దనిన్నీ పైగా తమతోడి పాశ్చాత్యవర్తక కంపెనీలకు కన్నుగుట్టి తమ ఆదాయానికి భంగంరావచ్చుననిన్నీ దూరాలోచనతోనే ఇంగ్లీషు వర్తకకంపెనీవారు ఈవిధంగా ప్రవర్తించారు. దీనివల్ల ప్రభుత్వం యొక్క బాధ్యతలన్నీ నవాబుమీదనే యుంటూవున్నా దానివలని లాభాలన్నీ కంపెనీవారికే కలుగుతూవుండేవి. నవాబుసర్కారు వుద్యోగుల నందరినీ కంపెనీవారు తమ శిస్తువసూలు వ్యవహారాలలో బాగా వుపయోగించుకునేవారు. ఇలాగ వంగరాష్ట్రంలో కొంతకాలము ద్వంద్వ ప్రభుత్వం నడిచింది. ప్రభుత్వ వ్యవహారాలు జరపడానికని కంపెనీవారిచ్చే సొమ్ము చాలక నవాబు చాలా చిక్కులు పడేవాడు.

ఈవిధానంవల్ల ప్రభుత్వ బాధ్యతలు లేకుండా అధికారాలన్నీ కంపెనీవారు చలాయించడానికి వీలుకలుగుతుం దనిన్నీ, తక్కిన పాశ్చాత్యులకు కన్నుకుట్టకుండా వుంటుందనిన్నీ కంపెనీవారికి సాలుకు 122 లక్షల రూపాయల నికరాదాయం వస్తుందనిన్నీ 1765 వ సంవత్సరం సెప్టెంబరు 30 వ తేదీన క్లైవు సీమకు వ్రాశాడు. ఈదివానిగిరీ వల్ల ఇంగ్లీషు వర్తకకంపెనీవారు మొగలాయి చక్రవర్తికింద దివానుగా రాజప్రతినిధి హోదాను కలిగి వంగరాష్ట్రానికి నిజమైన పరిపాలకులైనారు. క్రమక్రమంగా అధికారాలన్నీ కంపెనీవారే చలాయించడానికి అవకాశం కలిగింది. పేరునకు నవాబు రాజ్యం చేస్తున్నాడుగాని సాక్షాత్తుగా పరిపాలించేది కంపెనీవారే. 1772 లో వారన్ హేస్టింగ్సు గవర్నరైన తరువాత ఈద్వంద్వ ప్రభుత్వ నాటకాన్ని రద్దుచేసి నవాబుకి 16 లక్షల మనువర్తినిచ్చి కంపెనీవారే ప్రభుత్వం చేసేపద్ధతిని స్థాపించాడు. వంగరాష్ట్రంలో నవాబు స్థానే కంపెనీవారే రాజప్రతినిధులై పరిపాలన చేయసాగినారు.

హిందూదేశంలో మహారాష్ట్రులు బలవంతులై దేశాక్రమణ చేస్తూ దేశాలను కొల్లగొట్టుకుంటూ వున్న కాలంలో వారు మొగలాయి చక్రవర్తిని పట్టుకుని తమ వశంలో వుంచుకున్నారు. 1771లో మొగలాయి చక్రవర్తిని ఢిల్లీసింహాసనముమీద నిలిపి ఆ మొగలాయిచక్రవర్తి పేరున తాము దేశపరిపాలన ప్రారంభించారు. ఆ

కాలంలో ఇంగ్లీషువారు షా అలం చక్రవర్తికి తామివ్వ వలసిన సొమ్మును ఇవ్వకుండా బిగబట్టారు. 1788 లో రోహిల్లాల నాయకుడైన గులాంఖాదిర్ ఢిల్లీని పట్టుకుని షాఅలం చక్రవర్తి గ్రుడ్లు పీకివేసినాడు. తరువాత మహారాష్ట్రరాజ్యసమ్మేళనములో నొక రాజైన సింధియా యీ అంధచక్రవర్తిని మళ్ళీ ఢిల్లీ సింహాసనము మీాద కూర్చుండబెట్టి కీలుబొమ్మలాగ ఆడించడం ప్రారంభించాడు. ఇంగ్లీషు వర్తకకంపెనీవారు మహారాష్ట్రులతో యుద్ధము చేసిన సందర్భములో 'లేకు' సేనాని ఢిల్లీ నగరాన్ని పట్టుకుని 1803లో షా అలం చక్రవర్తిని మళ్లీ ఇంగ్లీషు కంపెనీవారి సంరక్షణలో ఉంచ గలిగాడు. ఐతే అంధుడైన ఈ ముసలి పాదుషా 1806 వ సంవత్సరం నవంబరు 10 వ తేదీన చనిపోవడంతో ఆయన బాధలు తీరినవి.

పూర్వపు మర్యాదలు

ఆంగ్లేయ వర్తకకంపెనీ యుద్యోగులును వారి అధికారులును గవర్నరులును కూడా మొదటి రోజులలో మొగలాయిచక్రవర్తికిని నవాబులకును దాసానదాసులై ఎంతో భయభక్తులతో ప్రవర్తించే వారు. వారికి జోహారులుచేయడము నజరులు సమర్పించడము వారి యెదుట నిలిచియుండడము మొదలైన పూర్వపు మర్యాదలనన్నింటినీ చాలాకాలంవరకూ పాటించేవారు. వాస్కో-డాగామా కళ్లికోటరాజైన జామొరిన్ పాదముల దగ్గర మోకరించియుండిన చిత్రము, జహంగీరు చక్రవర్తి దర్బారులో ఇంగిలీషురాజు రాయబారియైన సర్ తామస్ రో నిలిచియుండడము, షాఅలంచక్రవర్తి అలహాబాదులో కొలువు దీర్చి యుండగా క్లైవు నిలిచియుండడము మొదలైన పటములు ఆకాలము నాటి మర్యాదలను ప్రదర్శిస్తున్నవి. కంపెనీ యుద్యోగులు మొదలు గవర్నరు జనరలువరకును తుదకు సీమలోని డైరెక్టర్లవరకును గల వారందరూ మొగలుచక్రవర్తిగారికిని నవాబులకును వ్రాసే ఉత్తరాలలో వారి వారి బిరుదావళిని యుదాహరించి యెంతో వినయముతోను నమ్రతతోనూ చేసిన విన్నపము లిప్పటికిని కంపెనీవారి కవిలెలలో నున్నవి.

1711 లో కలకత్తా విలియంకోట ప్రెసిడెంటు (గవర్నరు)గా నుండిన ఇంగ్లీషువర్తకకంపెనీ యుద్యోగి వంగరాష్ట్ర నవాబుగారికి అతివినయముగా దాసోహముచేసి, "ఏలినవారి సేవకే అంకితముచేయ బడిన నాప్రాణములను తమ పాదముల సన్నిధిని ఉంచుచున్నాను" అని వ్రాశాడు. ఇతడే రెండేళ్ల తరువాత ఫరుక్‌సయ్యరుచక్రవర్తిగారికి వ్రాయుచు "ఏలినవారి సేవకుడును, అత్యల్పమైన ఇసుకరేణువును అగు తూర్పు ఇండియావర్తకకంపెనీ ప్రెసిడెంటు జాన్‌రస్సెల్ తన నుదుటిని నేలపైన మోపి చేయుమనవి" అని తాను సాష్టాంగప్రణామము చేయుటను ఆ ఉత్తరములో సూచించినాడు.

ఆరోజులలో ఇంగ్లీషు వర్తక కంపెనీవారును వారి తాబేదారులును మొగలాయిచక్రవర్తులకును వారి రాజప్రతినిధులకును అడుగులకు మడుగులొత్తి అతివినయముగా ప్రవర్తించుచు వారి కనేకవిధములైన వస్తువులను బహుమతిగా సమర్పించేవారు. వారిని దర్శించి నప్పుడు రొక్కపునజరులను సమర్పించి వారిని తృప్తిపరచి ఫర్మానాలను సంపాదించేవారు.

చాలా కాలంవరకూ గవర్నరులు, గవర్నరుజనరలులు కూడా మొగలాయి చక్రవర్తుల ఎదుట నిలచి యుండవలసినదేగాని కూర్చుండుటకు వీలులేదు. వారన్ హేస్టింగ్సు గవర్నరుజనరలుగా నున్నప్పుడు (1774-85) ఢిల్లీ చక్రవర్తి ఏనుగుపైన హౌదాలో కూర్చుండగా తాను ఆయన వెనుకగా కూర్చుండ వలసి వచ్చినది.

1813 లో హేస్టింగ్సు గవర్నరు జనరలు అగునప్పటికి ఆంగ్లేయుల పలుకుబడిన్నీ బలమున్నూ హెచ్చినందువల్లను మొగలు చక్రవర్తి చాలా బలహీనుడై మహారాష్ట్రుల చెప్పుచేతలలో నున్నందువల్లను చక్రవర్తి హేస్టింగ్సు నొకమారు రమ్మని కోరినప్పుడు అతడు వెళ్లడాని కెంతో జాగుచేసి తుదకు చక్రవర్తితో సమానముగా కుర్చీలో కూర్చుండే గౌరవమును పొందగలిగాడు.

గవర్నరు జనరలైన డల్‌హౌసీ ప్రభువు 1843 లో ఢిల్లీకి వెళ్లినపుడు చక్రవర్తిని దర్శించడమే తనకు పరువు తక్కువగా యెంచి వెళ్లడము మానివేశాడు. డల్‌హౌసీ మెల్లిగా చక్రవర్తికిని నవాబులకును చూపవలసిన మర్యాదల నన్నింటినీ పూర్తిగా తీసివేశాడు.

1765లో దివానిగిరీని సంపాదించినది మొదలు 1858లో కంపెనీవారి పరిపాలన రద్దు చేయబడి ఇంగ్లీషు రాణీ ప్రభుత్వము స్థాపించబడు వరకూకూడా ఇంగ్లీషు వర్తక కంపెనీవారు జారీచేసే ఉత్తర్వులలోనూ, ప్రకటనలలోనూ మొగలాయి చక్రవర్తి సార్వభౌమత్వమునకు లోబడి తాము పరిపాలిస్తూవున్న సంగతిని తెలిపే ("Under the king's realm and the Company's rule") అనే ఇంగ్లీషు మాటలను వాడుతూ వచ్చారు.

ఇంగ్లీషు వర్తకకంపెనీవారు చివర వరకూ మొగలాయి చక్రవర్తిగారి సార్వభౌమత్వాధికారానికి లోబడియే హిందూదేశాన్ని పరిపాలించారు గాని క్రమక్రమంగా ఆయన రాజచిహ్నాలను దర్జాలను తొలగించారు.

1803 లో లేక్ సేనాని ఢిల్లీనగరాన్ని ముట్టడించి షాఅలం చక్రవర్తిని మహారాష్ట్రుల స్వాధీనం తప్పించి ఇంగ్లీషు కంపెనీవారి స్వాధీనంలోకి తెచ్చినప్పుడు అదివరకు సింధియా చేసినట్లే ఢిల్లీ నగరాన్ని చక్రవర్తి పేరిటనే పరిపాలించ సాగినాడు. చక్రవర్తిన్ని అంతకు ముందు సింధియాకు గొప్ప బిరుదును ప్రసాదించినట్లే దాని తరువాత గొప్ప బిరుదైన సంసామ్ ఉద్దౌలా అష్ఘార్ ఉల్ ముల్కు ఖాన్ దౌరాన్ ఖాన్ ఫత్తేజంగ్ అనే గొప్ప బిరుదును ఇప్పుడు లేక్ సేనానికి ప్రసాదించాడు. ప్రపంచంలోకల్లా ప్రఖ్యాతి జెందిన మొగలాయి చక్రవర్తుల వంశీకుడైన పాదుషావల్ల ఇలాంటి బిరుదులను పొందడము తనకు చాలా గౌరవమని లేకు సేనాని యెంచి దానిని సంతోషముతో శిరసావహించాడు.

చక్రవర్తికి ఇంగ్లీషువర్తక కంపెనీవారు సాలియానా ఫింఛనుగా కొంతసొమ్ము ఇస్తూవున్న మాటవాస్తవమే గాని ఇది కప్పము

అనికూడా చెప్పతగివున్నది. పైగా మొగలు చక్రవర్తి ఇంగ్లీషు వర్తకకంపెనీవారి న్యాయస్థానాల అధికారానికి లోబడిన సామాన్య వ్యక్తివంటివాడుకాడు. ఇంతేగాక సాక్షాత్తుగా సామ్రాజ్యం ఏలక పోయినా చక్రవర్తి ఢిల్లీలో తన రాజభవనములో ఒకవిధమైన దర్బారులో కొలువుతీరుస్తూ, తన దర్జాను నిలబెట్టుకుంటున్నాడు.

కంపెనీవారు మొగలు చక్రవర్తికి చేయవలసిన మర్యాదలను గౌరవాలను క్రమక్రమంగా తగ్గించడం ప్రారంభించారు. ఇంగ్లీషు ఉత్తర ప్రత్యుత్తరాలలో ఆయనను 'చక్రవర్తి' యని పేర్కొనడం మానివేసి 'ఢిల్లీరాజు' అని వ్యవహరించడం ప్రారంభించారు. అయితే షాఅలం చక్రవర్తిగాని ఆయన తరువాత 1806 మొదలు 1837 వరకు రాజ్యంచేసిన అక్బరుషా చక్రవర్తిగాని 1837 మొదలు 1857 వరకు చక్రవర్తిగా నున్న రెండవ బహదూర్ షా గాని తమకు జరుగవలసిన మర్యాదలలో లోపము జరగడానికి అంగీకరించినవారుకారు. అందువల్ల పారశీక భాషలో జరిగే ఉత్తరప్రత్యుత్తరా లన్నింటిలోనూ పూర్వము లాగనే చక్రవర్తి అని అర్థమిచ్చే 'పాదుషా' అనే బిరుదు వుపయోగింపబడుతూ వుండేది.

1828 వరకూకూడా మొగలాయి చక్రవర్తులు ఇతరులకు బిరుదులు ప్రసాదించేవారు. వాటిని కంపెనీవారు హర్షిస్తూ వచ్చారు. చక్రవర్తిగారిమీద ఆధారపడే సన్నిహితులైన వారి విషయంలో తప్ప ఇతరుల కిచ్చే బిరుదులను అంగీకరించ మని కంపెనీవారు 1828 లో నిరాకరించారు.

1835 వరకున్నూ దేశంలో చలామణి అయ్యే నాణెములను తూర్పు ఇండియా కంపెనీవారు మొగలాయి చక్రవర్తిపేరుతోనే ముద్రించేవారు. కంపెనీ రూపాయలమీద చక్రవర్తిగారిపేరే వుండేది. ఆసంవత్సరంలో మొదటిసారి ఇంగ్లీషురాజైన నాలుగవ విలియంగారి పేరుతో నాణెములను ముద్రించి హిందూదేశంలో కంపెనీ పరిపాలనలోవున్న రాజ్యభాగాలలో ప్రవేశపెట్టారు.

1835 వరకూ హిందూదేశంలో వున్న వివిధరాజ్యాలవారు మొగలాయిచక్రవర్తి దర్బారులో తమతమ ప్రతినిధులను రాయబారులుగా నుంచేవారు. ఆపద్ధతిని కంపెనీవారు 1835 లో రద్దు పరిచారు.

గవర్నరుజనరలైన హేస్టింగ్సుప్రభువు కాలంనాటివరకూ గవర్నరుజనరలు సహా ఇంగ్లీషు అధికారులందరూ ఢిల్లీచక్రవర్తికి నజరులు సమర్పించేవారు. హేస్టింగ్సు ఈమర్యాదను పాటించకపోగా 1823-26 మధ్య కలకత్తాలో క్రైస్తవమతాధికారిగా వుండిన బిషప్ హెబరుగారు హేస్టింగ్సు చర్యను విమర్శించాడు. తరువాత కంపెనీ కింది అధికారులుమాత్రం 1843 వరకూ చక్రవర్తికి నజరులు చెల్లించేవారు. గవర్నరుజనరలైన ఎల్లెన్‌బరో ఈ ఆచారాన్నికూడా 1843 లో మాన్పించాడు.

ఢిల్లీచక్రవర్తిగారి రాయబారిని తన దర్బారులో నుంచుకోవడానికి గవర్నరుజనరలైన డల్‌హౌసీప్రభువు 1853లో నిరాకరించి చక్రవర్తిని ఒక సామాన్యవ్యక్తిస్థితిలోకి దింపినాడు. ఢిల్లీచక్రవర్తిని ఆయన వారసులను ఢిల్లీకోటలోనుంచి సాగనంపాలని కూడా ఆ కాలంలో ప్రయత్నించారు గాని అది సాగలేదు. ఇదంతా దేశీయుల మనస్సులకు కష్టం కలిగించింది.

చక్రవర్తికి ఖైదు

1837 మొదలు బహదూరుషా మొగలాయి చక్రవర్తిగా వుంటూవున్నాడు. 1857లో ఇంగ్లీషు వర్తక కంపెనీవారి దొరతనాన్ని సిపాయిలు ధిక్కరించగా దేశంలో జరిగిన మహాయుద్ధంలో కంపెనీ వారిమీద కత్తికట్టిన వారిలో బహదూరుషా ఒకడనిన్నీ, తెల్ల దొరల వధలకు ఆయన మద్దతు చేశాడనిన్నీ, ఇంగ్లీషు కంపెనీ ప్రభుత్వం వారు ఆయనమీద నేరంమోపి 1858 జనేవరిలో ఆయనను తమ న్యాయస్థానం ఎదుట విచారణకు పెట్టారు. ఇంగిలీషు న్యాయస్థానం వారు బహుదూరుషా చక్రవర్తి నేరస్థుడని నిర్ణయించి 1858వ

సం॥ మార్చి 29 వ తేదీన ఆయనకు యావజ్జీవఖైదు విధించారు. ఆ తీర్పునుబట్టి కంపెనీవారాయనను రంగూనులో నిర్బంధించి యుంచగా ఆయన 1862 వ సంవత్సరం నవంబరు 7 వ తేదీన దివంగతుడైనాడు.

1765 లో మొగలు చక్రవర్తివల్ల దివానుగిరీని పొందినది మొదలు 1857 వరకూ ఇంగ్లీషు కంపెనీ వారు దేశపరిపాలనమంతా చక్రవర్తిపేరుకిందనే జరిగిస్తూ వచ్చారుగాని తాము స్వతంత్రప్రభువుల మని ఎన్నడూ ప్రకటించలేదు. క్రమక్రమంగా చక్రవర్తికి చేయవలసిన మర్యాదలను తగ్గించినా వారు బహిరంగముగా చక్రవర్తిని పదచ్యుతుని చేయలేదు బహదూరుషా చక్రవర్తి రాజ్యపరిత్యాగమున్నూ చేయ లేదు. అందువలన ఆయనను తమ న్యాయస్థానం యెదుట పెట్టి శిక్షించే టప్పటికి కూడా ఇంగ్లీషు ప్రభుత్వము చక్రవర్తికి ప్రతినిధులుగా వ్యవహారిస్తూ వున్న తాబేదారీ వ్యవస్థగానే ఉన్నది. కంపెనీవారు చక్రవర్తికి ప్రతిసాలునా చెల్లిస్తూ ఉన్న సొమ్ము (పింఛను) ఉపకార వేతనమని వారు చెపుతూవున్నా ఆదిలో అది కప్పంగా వుండినందు వల్లదానిస్వభావం మారలేదు. ఇంగ్లీషు కంపెనీవారు చక్రవర్తిని త్రోసిరా జన్నంతమాత్రంచేత దేశానికి స్వతంత్రప్రభువులు కారు. అందువల్ల దివానులుగా పనిచేస్తూ వున్న సేవకులే చక్రవర్తికి శిక్షవేసి నట్లైనదని కొందరు విమర్శించారు. పైగా ఎంత చెడ్డా మొగలురాజు స్వతంత్రరాజు. అంతర్జాతీయ న్యాయశాస్త్రధర్మము ప్రకారము ఆయన సామాన్యన్యాయస్థానముల అధికారమునకు లోబడిన సామాన్య వ్యక్తి కాడు. అందువల్ల ఇంగ్లీషు న్యాయస్థానము వారాయనకు విధించిన శిక్ష న్యాయమైనదిన్నీ చెల్లతగినదిన్నీ కాదని కొందరు ధర్మశాస్త్రజ్ఞులు విమర్శించారు. ఏమైతే నేమి? బలవంతులైన ఇంగ్లీషువారి చర్యను ఎవరు కాదనగలరు? అందువల్ల చెల్లిపోయింది. మొగలాయి చక్రవర్తి నిర్బంధములో వుంటూనే 1862 లో చనిపోయినాడు

౪. తురకల దశావతారములు

మహమ్మదీయులలో షియాలు, సున్నీలు, అనే రెండు తెగలున్నవి. మహమ్మదు ప్రవక్తను గౌరవిస్తూ ఖొరానును పవిత్రంగా ఎంచే రెండువిషయాలలో తప్ప మరే విషయాలలోనూ సున్నీలకూ షియాలకూ సామరస్యం లేదు. ఒకరిని చూస్తే ఒకరికి పరమద్వేషం.

మహమ్మదుగారి కొమార్తె అయిన ఫాతిమాకు, ఆయనచిన్న భార్యఅయిన అయేషాకునుగల క్రోధజ్వాలలు ప్రజ్వలించిమహమ్మదీయ ప్రపంచాన్ని షియా సున్నీలనే రెండు కులాలుగా చీల్చినవి. ఈ రెండు తెగలమధ్యా వచ్చే తగాదాలలో రక్తపాతం కూడా కలుగుతూవుంటుంది. చిన్న చిన్న మహమ్మదీయ తెగలవారు వీరిమధ్య నలిగిపోతూవుంటారు. మన దేశంలో సున్నీ లే అధికసంఖ్యాకులు గనుక వారిమధ్య జీవించే స్వల్పసంఖ్యాకులుగా వుండే మహమ్మదీయ తెగలవారు తమ కేమి కీడు మూడుతుందో అనేభయంతో వుంటారు.

భగవంతుని దూతయైన మహమ్మదు ప్రవక్త తన తరువాత ఎవరు మతగురువుగా వుండవలసినదీ నిర్ణయించకుండా క్రీ. శ. 632 లో చనిపోయాడు. ఆయన కొమార్తె ఫాతిమాయొక్క భర్తయున్నూ, ఆయన ప్రథమశిష్యుడున్నూ అయిన ఆలీ ఆయన తరువాత కాలిఫు అవుతాడని అందరూ అనుకున్నారు గాని. మహమ్మదుగారి చిన్న భార్యా అయేషా ఫాతిమాపట్ల విరోధం వహించి ఒకకక్ష లేవదీసి తనతండ్రి అబుబేకరును కాలీఫుగా ఎన్నుకొనేటట్లు చేసింది. ఆయన తరవాత ఓమరు, ఓస్మాను, కాలిఫు లయ్యారు. క్రి. శ. 655 లో ఓస్మాను చనిపోయిన తరువాత ఆఖరికి ఆలీ కాలీఫు అయినాడు గాని 661 లో అతనిని ఒకమహమ్మదీయుడు వధించాడు. అతనికి హాస్సను, హుస్సేను లని ఇద్దరు కొమాళ్లు. హాస్సనుకు విషం పెట్టించి చంపారు.

ఇరాకు అరబ్బీ దేశముల (మెసపొటేమియా) రాజు ఆహ్వానం మీద హుస్సేనుగారు మెదీనానుంచి కూఫాకు వెడుతూ వుండగా దారిలో 'కెర్బాలా'దగ్గర ఆయనను ఆయనకుమారుని ఆరాజు సైనికులే

అన్యాయంగా చంపారు. ఇంకొక కొడుకును భార్యను సోదరిని ఎత్తు కొనిపోయారు. హుస్సేను తలను క్ర్యాఫాలో ఊరేగించారు.

షియాలు - సున్నీలు

అబుబేకరు ఓమరు ఓస్మానులను అంగీకరించక అలీని ఈశ్వరుని అవతారమని నమ్మి ఆయన వంశీయులను ఇమామూలుగా గౌరవించే వారేషియాలు. ఆయనను ఒక కాలీఫుగా మాత్రమే పరిగణించేవారే సున్నీలు. క్రమక్రమంగా ఈ రెండు తెగల ఆచారవ్యవహారాలు, భేదించి విరోధాలు ఏర్పడ్డాయి. అవి కులకక్షలుగా పరిణమించాయి.

సున్నీలు ఖొరానులోని ధర్మాలనేగాక సున్నత్ అనే మహమ్మదుగారి జీవిత విధానాన్ని కూడా ప్రమాణంగా అంగీకరిస్తారు. సున్నీలు రోజుకు అయిదుసార్లు ప్రార్థన చేస్తారు. షియాలు రోజుకు మూడుసార్లే ప్రార్థన చేస్తారు. సున్నీలు ప్రార్థించేటప్పుడు చేతులు ముడుచుకొని రొమ్ముమీద వుంచుకొంటారు. షియాలు చేతులు ప్రక్కకు వాల్చుకొనే వుంటారు. షియాలు మహమ్మదుగారి అల్లుడైన అలీగారినీ, కొమార్తె అయిన ఫాతిమాను ఈశ్వరాంశ సంభూతులుగా పరిగణిస్తారు. మహమ్మదుగారి చిన్నభార్య అయేషా బంధువులైన అబుబేకరు . ఓమరు ఓస్మానులు అక్రమంగా కాలీఫులైనారని అసహ్యించుకుంటారు. ఈ ముగ్గురు కాలీఫులను సున్నీలు శుక్రవారపు ప్రార్థనలలో భక్తితో స్మరిస్తారు. వారి పేర్లు పవిత్రంగా ఎంచి మశీదు గోడలమీద చెక్కిస్తారు.

అలీగారి కొమారుడైన హుస్సేనుగారు మెదినానుంచి క్ర్యాఫాకు పోతూ వుండగా హుస్సేనుగారిని కెర్బాలాపట్నంలో వధించిన ఘోర కృత్యాన్ని స్మరిస్తూ షియాలందరూ మొహరం నెలలో దుఃఖపడుతూ ప్రార్థనలు చేస్తూవుంటే సున్నీలు దీనిని వెక్కిరిస్తూ అతతాయులచేత పులులు మొదలైన మృగాల వేషాలు వేయించి మొహరంలో అల్లరి చేస్తూ దానిని ఒక పండగలాగ చేస్తారు ఇదేమన దేశాలలో పులివేషాల చరిత్ర.

కెర్బలాను పవిత్ర ప్రదేశంగా ఎంచి అక్కడి మట్టియుండల తావళాలతో షియాలు జపంచేస్తారు. ఆ మట్టిని నీళ్ళలో కలిపి తాగు తారు. సున్నీలు ఇదిచూసి అసహ్యించుకుంటారు.

ఆ గా ఖా ను

అలీ దగ్గరనుంచి ఏడవతరమువాడైన ఇస్మేల్ అనే మతగురువు భగవదవతారమని షియా ఇస్మేలీ తెగవారి విశ్వాసం.

హస్సన్‌బిన్ సబా అనే అతడు అరబ్బీ దేశీయుడు. అతడు షియామతంవాడు. ఈజిప్టుదేశం ముఖ్యపట్టణమైన కైరోలో ఇస్మేలీ మత సిద్ధాంతాలను బాగా అభ్యసించాడు. అప్పుడు పారశీక దేశంలో సున్నీమతం ప్రబలంగావుండేది. ఇతడు ఒక కొండమీద స్థావరం ఏర్పరచుకొని క్రీ. శ. 1090 ఆ ప్రాంతంలో హింసాపద్ధ తులతో బలవంతంగా మతప్రచారం చెయ్యడం పారంభించాడు. మతవిరోధులను చంపే విధానాలను ప్రారంభించాడు. అతని తరువాత నాలుగవ ('ఇమాం') మతగురువు 'జాకరేసలాం' అనే ఆయన కూడా ఆపద్ధతులతోనే మతప్రచారం చేశాడు. తాను ఇస్మేలీ మత గురువుయొక్క వంశంలో ఏడవ తరంవాడనని దైవాంశ సంభూతుడనని ప్రచురించుకుని ఇతడు ప్రఖ్యాతిచెందాడు. ఒక సందర్భంలో ఇతని చర్యలు తక్కిన మహమ్మదీయులకు చాలా హేయకరంగా తోచాయి. ఇతడు రంజాను 17 వ రోజున అల మత్తుకోటలో ఒకవేదికమీద ఎక్కి, తాను భగవంతుని ప్రతినిధి నని ప్రచురించి సామాన్యమహమ్మదీయ మతసిద్ధాంతాలను రద్దుచేసి ఆ పవిత్రదినాన్ని 'ఇమాం'గారికి దివ్యత్వం సిద్ధించినదినంగా పరిగణించా లన్నాడు. యథేచ్ఛగా పందిమాంసం కూడా తినవచ్చుననిన్ని తప్ప తాగవచ్చుననిన్ని ప్రకటించాడు. తరువాత నాలుగేళ్లలో ఇతనిని ఎవరో వధించారు.

1866 వ సంవత్సరంలో బొంబాయి సుప్రీంకోర్టులో వచ్చిన వ్యాజ్యంలో 1 వ ప్రతివాది అయిన మహమ్మదు హుస్సేన్ హుస్సేనీ అనే పేరు గల ఆగాఖానుగారు ఆ యిమాముల వంశీయు లేనని

ఆ కేసులో రుజువుచేశారు. ఈ ఆగాఖానుగారు ఇస్మేలీ షియా మహమ్మదీయుల ఆనువంశిక మతగురువు. ఏ తెగవారినైనా మహమ్మదీయుల నందరినీ 'తురక'లని వ్యవహరించడం పరిపాటి అయింది.

క్రీ. శ. 16 వ శతాబ్దంలో పారశీకదేశం షియా మతాన్ని స్వీకరించినది మొదలు ఇస్మేలీల బాధలు తగ్గినాయి. ఈమహమ్మదు హుస్సేన్ హుస్సేనీగారి తాత, పారశీక దేశంలో కెర్మను నగర పరిపాలకుడుగా ఉండేవాడు. ఆ వుద్యోగం అయిపోయిన తరువాత మెహెంతీ జిల్లాలో ఉండేవాడు. ఆయన కొమారుడు హుస్సేనీగారి తండ్రి, యెజ్ద నగరంలో వుండగా ఆయనను 1817లో హత్య చేశారు. 1838లో ఆగాఖాను పితూరీ చేసి కెర్మనునగరం పట్టుకున్నాడు. ఆ సమయంలో ఆగాఖానుదగ్గర నౌకరుగా వుండినవాడు పారశీక రాజుదగ్గర పలుకుబడి సంపాదించి ఆగాఖాను కొమార్తెను తనకు పెళ్ళి చెయ్యమని అడిగాడు. ఇది సహించలేక ఆగాఖాను 1840 లో హిందూదేశానికి వచ్చాడు. సింధులో వుండే మూడువేల కుటుంబాల వారు ఆగాఖానుకు సాలియానాకప్పం చెల్లించడంవల్ల సొమ్ముకు ఇబ్బంది లేదు. ఆగాఖాను 1841-42 మధ్య ఆఫ్గను యుద్ధంలో ఇంగ్లీషు వారికి సహాయంచేశారు. ఇంగ్లీషువారు 1843-44 లో సింధు అమీరుల రాజ్యాన్ని ఆక్రమించినప్పుడుకూడా ఆగాఖాను వారికి సహాయం చేసినందువల్ల ఆయనకు ఇంగ్లీషువారు పింఛను యిచ్చారు.

1845 లో ఆగాఖాను బొంబయిలో స్థావరంగా వుండడం ప్రారంభించాడు. 'ఆయన బొంబయిలో జమాత్ ఖానాలో అధ్యక్షత వహించి మొహరంలోనూ పండుగరోజులలోనూ బహిరంగంగా జరిగే నమాజులో పాల్గొంటాడు. అప్పుడు ఆలీకుమారుడు హుస్సేను చచ్చిపోయిన కెర్బాలా పట్నం మట్టిని కలిపిన నీటిని అందరికీ తాగడానికి ఇస్తాడు. ఖోజా తెగవారు ఆయనకు పాదపూజలు సమర్పించి భక్తితో చేతిని ముద్దు పెట్టుకుంటారు. కాఠియవాడు కచ్ఛి బొంబాయి జాంజిబారు మొదలైన ప్రాంతాలలో వుండే శిష్యులిచ్చే పాదపూజ సొమ్మువల్ల ఆయనకు సాలియానా ఒకలక్ష యేబదివేల రూపాయిల

ఆదాయం వస్తుంది. ఆ సొమ్ములో చాలాభాగం గుఱ్ఱపు పందెముల క్రింద ఆయన ఖర్చు పెడుతాడు' అని 1866 లో బొంబయి సుప్రీము కోర్టు న్యాయమూర్తి ఆర్నాల్డుగారు తమ తీర్పులో అప్పటి ఆగాఖాను చరిత్రను వ్రాశారు.

ఇప్పటి ఆగాఖానుగారుకూడా చాలా ధనవంతుడనిన్ని, గుఱ్ఱపు పందెములలో అందెవేసిన చెయ్యి అనిన్ని, చాలా భోగి అనిన్ని ఎప్పుడూ ఐరోపాలోనే వుంటాడనిన్నీ, అందరికీ తెలిసిన విషయమే.

ఖోజాలు

ఖోజాలనే తెగవారు వేషభాషలలో ఆచారవ్యవహారాలలో హిందువులు, మతంలో మహమ్మదీయులు. వీరిని గురించి వచ్చిన వ్యాజ్యాలను పరిష్కరిస్తూ బొంబయి సుప్రీముకోర్టు న్యాయాధిపతియైన సర్ ఎర్ స్కిన్ పెర్రీగారు 1847 లో యిచ్చిన తీర్పులోను బొంబయి హైకోర్టులో అడ్వకేటు జనరలుగారికీ, ఆగాఖానుగారికీ జరిగిన వ్యాజ్యాన్ని పరిష్కరిస్తూ 1866 లో ఆర్నాల్డు అనే న్యాయాధిపతి ఇచ్చిన తీర్పులోనూ 1875 లో వచ్చిన వ్యాజ్యంలో సర్ చార్లెస్ సార్జెంటుగారనే న్యాయాధిపతి యిచ్చిన తీర్పులోనూ వీరిచరిత్ర చాలా విపులంగా చర్చింపబడింది. వీరికి వారసత్వ విషయములో హిందూ ధర్మశాస్త్రమున్నూ తక్కిన విషయాలలో మహమ్మదీయ ధర్మశాస్త్రమున్నూ వర్తిస్తాయని నిర్ణయించబడింది.*

"ఖోజాలు హిందూదేశంలో పడమటి భాగంలో నివసించే ఒక చిన్న తెగవారు. వీరు మొదట సింధు, కచ్ఛి రాష్ట్రములనుండి వచ్చినట్లు కనపడుతూవుంది. సుమారు అయిదువందల సంవత్సరాలక్రిందట సదర్ దీన్ అనే మహమ్మదీయ పీరు (మహాత్ముడు) వీరిని హిందూమతంలోనుంచి తురకలలో కలిపినట్లు చెప్పుకుంటారు.

---

* (1) Cases Illustrative of Oriental Life decided in the Supreme Court of Bombay. (1853) Sir Erskine Perry pp. 110-129

(2) The Advocate general and others vs. Muhammed Hussain Husseni (Aga Khan) and others.

12 Bombay High Court Reports pp. 294 and 323.

వీరు మాట్లాడేది కచ్చిభాష. వీరిమతం తురకమతం. వీరు ధరించే దుస్తులు, అవలంబించే ఆచార వ్యవహారాలు, చాలామట్టుకు హిందువులవి. వీరు మొదట నిజంగా హిందువు లనే సంగతి సుప్రసిద్ధంగా వుండడాన్నిబట్టి ఆసంగతిని నేను అంగీకరిస్తున్నాను గాని కేవలము వీరి వేషభాషలు ఆచారవ్యవహారాలు హిందువులవిగా వున్నంతమాత్రం చేతనే నేను అలాగ నిర్ణయించేవాడినికాను. దీనికికారణం ఈహిందూ ప్రజలప్రభావం ఎంత చిత్రమైనదంటే ఏ జాతివారైనా ఏ వర్ణము వారైనా వారిమధ్య కొంతకాలం వున్నారంటే వారికి హిందువుల మర్యాదలూ భావాలు అలవడిపోతాయి. ఈదేశంలో స్థిరనివాసం ఏర్పరచుకొన్న పారశీకులు, మొగలులు, పఠానులు, ఇస్రైలైట్లనే యూదులు క్రైస్తవులు తమ పూర్వాచారాలను వదిలి, హిందువుల సభ్యతనే అవలంబించారు. దక్షిణాపథంలో నల్లరేగటినేలలో ఏవస్తువు పడినా దానిని తనలో లీనంజేసుకునేశక్తి ఆమట్టికి వున్నదని భూగర్భ తత్వజ్ఞులు చెప్పేమాట. ఈ సందర్భంలో నాకు స్ఫురిస్తూవుంది" అని సర్ ఎర్స్కిన్ పెర్రీగారు వ్రాశారు. "ఏది ఎలావుంటేనేమి ఈ ఖోజాలలో చాలామంది యిప్పుడు కచ్చి, కాఠియవాడు, బొంబయి ప్రాంతాలలో హిందూప్రజలమధ్యనే స్థిరనివాసం ఏర్పరచుకొని జీవిస్తున్నారు. 1847 నాటికే బొంబాయిలో రెండువేల ఖోజాజనం వున్నారు."

1866 నాటికి సింధురాష్ట్రంలో 2800 ఖోజాకుటుంబాలుండేవి. కాఠియవాడులో 500 కుటుంబాలు, ఆఫ్రికాతీరాన్ని జాంజిబారులో 450 కుటుంబాలు, మస్కటులో 400 కుటుంబాలు వుండేవి. కచ్చి గుజరాతురాష్ట్రాలు ఖోజాల అసలు నివాసస్థానాలే. ఆ ప్రాంతాలలో ఎన్నికుటుంబాలుండేదీ లెక్కలేదుగాని చాలాకుటుంబాలుండేవి. "వీరిలో చాలమందికి చదువురాదు. తమ మతం సంగతి తెలియదు. వీరు తురకలలో కలిసినప్పటినుంచి ఇప్పటివరకూ వీరిస్థితిలో ఎక్కువ మార్పులు కలగలేదని చెప్పవచ్చు.

తాము మహమ్మదీయులమని వీరు చెప్పుకున్నా, మహమ్మదు వారిని గురించిగాని ఖురాను గ్రంథాన్ని గురించిగాని వీరికేమీ తెలి

యదు. వీరికి తెలిసినదల్లా ఆగాఖాన్ అనే ఒక పారశీకప్రభువు తమ మత గురువుగా గౌరవించడం మాత్రమే'' నని పెర్రీగారు వ్రాశారు.

ఈ ఆగాఖాను పారశీకదేశంలో ఇస్మైలీలనే మహమ్మదీయ తెగవారి మతగురువు. తురకలలో వీరు షియామతస్థులు. మహమ్మదు పవిత్ర అల్లుడైన అలీగారిని భగవంతుడి అవతారంగా నమ్ముతారు. ఆ అలీగారి దగ్గరనుంచి ఇస్మాయిల్ అనే ఇమాముగారి వరకూ ఈశ్వరాంశ వున్నదనిన్నీ అది ఆగాఖానుగారి వంశంలోని పురుషులలో పారంపర్యంగా వస్తూవున్నదనిన్నీ నమ్మి ఇస్మైలీ మతమువా రందరూ ఆగాఖానుగారిని భగవంతునిగానే ఆరాధిస్తారు. ఈ ఆగాఖానుగారికి తమ శక్త్యానుసారంగా ప్రతియేటా కొంతముడుపు చెల్లిస్తారు. ఆ బాపతు ఆయనకు సాలుకు ఒకలక్ష యేబదివేల రూపాయల శిష్యార్జన వుంది.

అందువల్ల ఈ ఖోజాలుకూడా షియా ఇస్మైలీమత శాఖలో చేరినవారని యేర్పడుతూ వున్నది. అసలు షియా ఇస్మైలీ మతంలోనే ఇతరుల మనస్సులకు నొప్పి కలిగించకుండా తన మతవిశ్వాసాన్ని క్షోల్పోకుండా వుండాలనే సిద్ధాంతం ఒకటి వుంది. ఇతర మతాలవారిని తురకలలో కలుపుకునే సందర్భంలో ఇతరమతాలవారి ఆచార వ్యవహారాలను నిరాకరించక క్రూరమైన పద్ధతులతో గాక వారి మతాచారాలను చాలావరకూ అంగీకరించి వాటికి మహమ్మదీయుల మతానికి అనుగుణ్యముగా అర్థంచెప్పి మతప్రచారం చెయ్యాలనే నియమం కూడా ఒకటి వున్నది. పై రెండు కారణాలవల్లనూ హిందూమతంలో నుంచి తురకలలో కలిసిన ఖోజాలు చాలావరకు హిందూఆచార వ్యవహారాలనే అవలంబించి వుండడానికి వీలైనది.

హిందూదేశంలో షియా మతస్థులకన్న సున్నీ మతస్థులే అధిక సంఖ్యాకులుగా వున్నారు. సున్నీ మతస్థులకూ షియామతస్థుల ఆచారాలకూ వీరి యాచారాలకూ, చాలా తేడా లున్నాయి. తమదే శిష్టాచారమని సున్నీలఊహ. ఈదేశాన్ని ఏలిన మహమ్మదీయ రాజులలో చాలామంది సున్నీమతంవారే. అందువల్ల ఈ సున్నీల మధ్య జీవించే

షియాలకు చాలబాధలు కలుగుతూ వచ్చాయి. అందువల్ల ఖోజాలు ఏ యెండకు ఆ గొడుగు పట్టడం నేర్చుకున్నారు.

'దశావతార్' అనే మతగ్రంథం

ఈ ఖోజాలు షియామతస్థులతో తాము షియాల మంటారు. సున్నీ మతస్థులతో తాము సున్నీల మంటారు. అయితే వారికి ఈ షియామత మంటేనూ తెలియదు. సున్నీమతమంటేనూ తెలియదు వారికి స్వభాష అయిన కచ్చిభాషలోగాని, వ్యాపారం కోసం నేర్చు కునే గుజరాతీ భాషలోగాని, ఖొరాను తర్జుమా లేదు. ఈ ఖోజాలుండే గుజరాతు దేశాన్ని చాలాకాలం తురకరాజులు పరిపాలించినా ఖొరాను దేశభాషలోకి పరివర్తనం కాకపోవడం ఆశ్చర్యమే. ఈ ఖోజాలలో అరబ్బీ పారశీభాషలు వచ్చినవారెవ్వరూ లేరు. మహమ్మ దీయ మతాన్ని గురించి చెప్పగల విద్వాంసులున్నూ లేరు. వారికి తెలిసిన మతగ్రంథం ఒకటే. అది కచ్చిభాషలో సింధీలిపిలో వ్రాయ బడిన "దశావతార" మనే పుస్తకం. ఇదే వారి మతగ్రంథం.

ఖోజాలందరూ దీనిని పూజిస్తారు. అవసానకాలంలో చదివి వినిపించుకుంటారు. హిందూ దేశంలోనూ ఖోజాలు వ్యాపారం చేసు కొని జీవించే ఆఫ్రికాతీరమున జాంజిబారులోను మస్కటు మొదలైన ప్రాంతాలలోనూ బొంబయిలోనూ జమాత్ ఖానా అనే ఖోజా మత సభలోనూ ఈ దశావతారమనే గ్రంథాన్ని పురాణంలాగ చదివిస్తా రని 1850 లోనే ఒక వ్యాజ్యంలో స్థాపించబడింది.

ఈదశావతారం అనే గ్రంథంలో ఏముందో తెలుసునా?

దాని పేరునుబట్టి అందులోని విషయం స్ఫురిస్తూనేవుంది. అది పది ప్రకరణాల గ్రంథం. ప్రతి ప్రకరణంలోనూ ఒక అవతారాన్ని గురించి యుంటుంది. మొదటి తొమ్మిది ప్రకరణాలలోనూ హిందువుల త్రిమూర్తులలో ఒకడైన విష్ణుమూర్తియొక్క తొమ్మిది అవతారా లను గురించీ వర్ణించబడింది. పదియవ ప్రకరణములో పరమపూజ్యు డైన ఆలీయొక్క అవతారాన్ని గురించి వ్రాయబడింది.

ఖోజాజమాత్ ఖానాలలో ఈ గ్రంథాన్ని చదివేటప్పుడు ఖోజాలందరూ ఈ పవియవ ప్రకరణాన్ని అతి భక్తితో వింటారు. ఈ ప్రకరణం మొదలుపెట్టగానే సభవారంతా లేచి అది పూర్తి అయ్యే వరకూ అలాగే నుంచుంటారు. పరమపూజ్యుడైన మౌలాఆలీ నామం ఉచ్చరించినప్పుడల్లా అతి భక్తితో ప్రణమిల్లుతూ వుంటారు.

ఇలాగ మౌలా ఆలీ దశావతారాలలో ఒక అవతారమైనాడు!

---

౫. జగద్గురు తత్త్వబోధకస్వామి

[రాబర్టో డీ నోబిలీ అనే క్రైస్తవ ఫాదరీ చరిత్ర]

దక్షిణ దేశాన్నంతా ఏకచ్ఛత్రంగా పరిపాలించిన విద్యానగర చక్రవర్తులలో కడపటివాడు. ౧౫౮౫ - ౧౬౧౪ మధ్య రాజ్యంచేసిన వెంకటపతి దేవరాయ మహారాయలు. ఆయన కొన్నాళ్లు పెనుగొండను, తరువాత చంద్రగిరిని రాజధానిగా చేసుకుని దేశపరిపాలన చేశాడు. ఆయన రాజ్యం కృష్ణానదికి దక్షిణాన కన్యాకుమారివరకు వ్యాపించి యుండేది. శ్రీరంగపట్నంలో ఆయన తమ్ముడి కొమారుడే రాజప్రతినిధిగా వుండి మైసూరు కర్నాటక రాజ్యాలను పరిపాలించేవాడు. ౧౬౧౦ లో రాజఒడయరు మైసూరుకుపరిపాలకుడైనాడు. బేదనూరు, లేక ఇక్కేరిలో ఒక సామంత మండలేశ్వరు డుండేవాడు. ఇలాగే దక్షిణదేశంలో తుండీరానికి జింజిలోను, పాండ్యానికి మధురలోను, చోళదేశానికి తంజావూరులోను, సామంత మండలేశ్వరులు ఉండి పరిపాలించేవారు.

విజయనగర సామ్రాజ్యము నేలిన చక్రవర్తులు తెలుగువారే అయినందువల్లను, వారి కాలంలో వివిధ ప్రాంతాలను పరిపాలించిన రాజప్రతినిధులు, సామంత మండలేశ్వరులు రాజబంధువులుగానో, తెలుగునాయకులుగానో, ఉంటూవున్నందువల్లను దేశప్రభుత్వమంతా

తెలుగువారి చేతులలోనే ఉండి కన్యాకుమారివరకూ గల దక్షిణదేశమంతా తెలుగుమయంగా ఉండేది. ఆ కాలంలో ఈ దేశంలో ఉండిన పాశ్చాత్యులు చాలామంది ఈ సంగతిని గురించి వ్రాసియున్నారు.

విజయనగర సామ్రాజ్యం బలహీనమైనకొద్దీ సామంత మండలేశ్వరులు బలవంతులై కొంతకాలమునకు సామంతరాజులై తరువాత స్వతంత్రులైనారు. తంజావూరు, మధురలనేలిన నాయకరాజులు చోళ పాండ్యరాజు లని ప్రసిద్ధి చెందారు. వీరుకూడా విద్యానగర ప్రభువుల లాగనే తెలుగు కవులను, గాయకులను, పండితులను పోషించి ప్రజానురంజకంగా దేశాన్ని పరిపాలించారు. వీరి కాలంలో సంగీత సాహిత్యాలు, కళలు సర్వతోముఖంగా అభివృద్ధిచెంది ఇప్పటికీ వారి కీర్తిని వేనోళ్ల చాటుతున్నవి.

వెంకటపతి దేవరాయల కాలంనాటికి కుమార కృష్ణప్పనాయకుడనే లింగయనాయకుడు మధురకు సామంత మండలేశ్వరుడుగా ఉండేవాడు. అతడు ౧౬౦౨ లో చనిపోగా ఆయనకుమారుడు ముద్దుకృష్ణప్ప నాయకుడు ౧౬౦౯ వరకూ పరిపాలించాడు. తరువాత ముద్దు వీరప్ప నాయకుడు ౧౬౨౩ వరకూ పరిపాలించాడు. వీరప్పనాయకుడి కాలంలో వెంకటపతిదేవరాయలు చనిపోగా వీరప్పనాయకుడు మధురకు స్వతంత్రరాజైనాడు. ఆయన తరువాత తిరుమలనాయకు డని ప్రసిద్ధి చెందిన 'మహారాజమాన్య రాజశ్రీ తిరుమలశౌరి అయ్యలుగారు' ౧౬౨౩ లో మధురరాజ్యానికి పట్టాభిషిక్తుడై ౧౬౫౯ వరకూ పరిపాలించారు.

పోర్చుగీసువారు - క్రైస్తవ మత ప్రచారము

మన దేశానికి వర్తకం చెయ్యడానికి మొట్టమొదట వచ్చిన ఐరోపాజాతివారు పోర్చుగీసువారు. వీరు మన దేశరాజులను, వారి సామంతులను ఆశ్రయించి పశ్చిమ సముద్రతీరంలో అక్కడక్కడ కొన్ని వర్తక స్థానాలను ఏర్పరచుకున్నారు. వర్తకులతోపాటు రోమను క్యాతలిక్కు శాఖకు చెందిన జెస్యూటులనే పోర్చుగీసు క్రైస్తవ మిష

నరీలు కూడా ఇక్కడికి వచ్చి మతప్రచారం చెయ్యడం ప్రారంభించారు.* వింత దుస్తులు ధరించి గొడ్డుమాంసం తింటూ మద్యపానం చేస్తూ కులభేదాలు పాటింపక మాల మాదిగలతో కలిసిమెలిసి తిరిగే ఈ విజాతీయులనూ, వీరిలాగ ఉండేవారినీ మనవాళ్లు 'పరంగీ' లని అనేవారు. పోర్చుగీసువారు ఎక్కువగా ఈ దేశంలో సముద్రతీరాన్ని ఉండే పరవరులనే పల్లెకారులలో క్రైస్తవ మత ప్రచారం చేశారు. ఈ పరంగీలకూ, దేశీయ స్త్రీలకూ పుట్టిన సంకరజాతి ఒకటి త్వరలోనే బయలు దేరింది.

వెంకటపతి దేవరాయ మహారాయల కాలంనాటికి విజయనగర సామ్రాజ్యములో చాలాచోట్ల పోర్చుగీసువారు స్థిరపడ్డారు. మన దేశ రాజులు మొదటినుంచి సర్వమతాలవారిని సమానంగా చూసే సహన బుద్ధి కలవారుగనుక రాయలవారు పోర్చుగీసువారి క్రైస్తవ మత ప్రచారానికి ఆటంకాలు కలిగించకపోవడమేగాక వారి క్రైస్తవమత

---

* జెస్యూటుమిషనరీలు - సొసైటీ ఆఫ్ జీసస్ అనే రోమను క్యాథలిక్కు క్రైస్తవమత ప్రచారక సంఘానికి చెందిన సన్యాసులు. వీరిని మన దేశీయులు "ఫాదరీ"లనేవారు. ఈ సంఘము 1539 లో స్థాపించబడి పోర్చుగల్లు స్పెయిను రాజ్యముల అధ్వర్యంకింద దేశదేశాలలో క్రైస్తవ సన్యాసుల మఠాలను స్థాపించి అతి తీవ్రమైన మతప్రచారం సాగించింది. ఈ సంఘంలో చేరిన జెస్యూటు మిషనరీలు కొంత కాలం నియమంగా మతవిద్య నభ్యసించి, కాంతాకనకములను వర్జించి బ్రహ్మచర్య వ్రతమవలంబించి క్రైస్తవమత ధర్మాలను త్రికరణశుద్ధిగా నాచరించే దీక్షను వహించి సన్యాసాశ్రమం స్వీకరించేవారు. ఇటలీదేశంలో రోమునగరంలోనున్న క్రైస్తవమత జగద్గురువైన 'పోప్' గారి అధికారానికి లోబడి ఈ జెస్యూటుల మఠాలు పనిచేసేవి. క్రైస్తవసంఘంలోని ప్రొటెస్టెంటులు పోపుగారి అధికారాన్ని ధిక్కరించినప్పుడీ జెస్యూటులు పోపుగారికి కుడిభుజంగా నిలిచి పనిచేశారు. ఈ సంఘమువారు బలవంతులై క్రమక్రమంగా లౌకికవ్యవహారాలలోనూ రాజకీయాలలోనూ పాల్గొంటూ ధనసంపాదనకోసం వర్తకవ్యాపారాలలో ప్రవేశించినందువల్ల ఈ సంఘములో కొన్ని దురాచారాలు ప్రబలినవి. మతప్రచారంలో వీరు కొన్ని అన్యాయ పద్ధతులు కూడా అవలంబించారు.

మన దక్షిణహిందూదేశంలో పడమటి సముద్రతీరాన్ని పోర్చుగీసు వర్తకుల రేవుపట్టణమైన గోవానగరంలో జెస్యూటుమఠం ఒకటి 1542 లో స్థాపించబడగా ఇక్కడ మతప్రచారం ప్రారంభమైంది.

ప్రచారకులైన జెస్యూటుమిషనరీ ఫాదరీలను ఆదరించి గౌరవించేవారు. క్రైస్తవ దేవాలయాలు కట్టుకోవడానికి, పాఠశాలలు స్థాపించడానికి మత ప్రచారం చెయ్యడానికి అనుజ్ఞ నిచ్చేవారు.

చోళమండలంలో సముద్రతీరాన్ని ఉండే పరవరులనే పల్లె కారిజనంలో చాలామందిని పోర్చుగీసు క్రైస్తవమత ప్రచారకులు రోమను క్యాతలిక్కు మతంలో కలిపినందువల్ల వాళ్ళ క్షేమంకోసం పోర్చుగీసు క్రైస్తవ మతాధికారు లొక మిషనరీ ఫాదరీని నియమించారు. ఇందుకోసం నియమింపబడిన జెస్యూటు క్రైస్తవమిషనరీ అయిన 'గొంజాలో ఫెర్నాండెజ్' అనే ఫాదరీ ౧౫౯౫ లో మధురానగరానికి వచ్చి అక్కడ తన నివాసం ఏర్పరచుకున్నాడు. అప్పుడు మధుర రాజ్యాన్ని పరిపాలించే సామంతమండలేశ్వరుడైన కుమార కృష్ణప్ప నాయకుడు ఆఫాదరీని ఆదరించి మధురలో ఒక క్రైస్తవ దేవాలయం కట్టుకోవడానికి అనుజ్ఞ నిచ్చాడు ఇలాగ పాండ్యరాజధానిలో క్రైస్తవమత ప్రచారం చెయ్యడానికి అవకాశం ఒకటి ఏర్పడింది. ఫెర్నాండెజ్ ప్రజలతో కలిసిమెలిసి తిరిగేవాడు. ఏదో ఒకసందర్భంలో ఏసుక్రీస్తును గురించి చెప్పుతూఉండేవాడు. ఆయన మంచితనమూ, సద్గుణములూ. బ్రహ్మచర్యవ్రతమూ చాలామందిని ఆకర్షించినవి. చాలామందికి ఆయనపైన సదభిప్రాయం కలిగింది. అంతట ఆయన సంగతి తెలుసుకుందామనీ, ఆయన క్రొత్తమతం సంగతి తెలుసుకుందామనీ కుతూహలంతో కొందఱు బ్రాహ్మణులుకూడా ఆయన దగ్గరకు వచ్చి మాట్లాడుతూ ఉండేవారు. ఆయన యింటి దగ్గర మతధర్మాలను గురించిన శాస్త్రచర్చలు తరుచుగా జరుగుతూఉండేవి. ఈ జెస్యూటు మతప్రచారకుడు త్వరలోనే ఒక ఆసుపత్రిని స్థాపించి అక్కడ క్రైస్తవులకేగాక ఇతరులకు కూడా మంచి మందులిచ్చి చికిత్సలు చేసేవాడు.

ఉత్తరాది తెలుగు జనము

అప్పట్లో మధురరాజ్యములో అన్నివర్ణాలలోను తెలుగువారు చాలామంది ఉండేవారు. అక్కడ స్థిరనివాసం ఏర్పరచుకున్న తెలుగు

వారిలో వివిధకులాల శూద్రజనాన్ని అరవవారు 'వడుకరు'లు అనగా 'ఉత్తరాదివా'ళ్ళని వ్యవహరించేవారు. ఇందులో రెడ్లు, కమ్మవారు, గొల్లలు మొదలైన కులాలవా రుండేవారు. ఆకాలంలో మన తెలుగు వారు ప్రతివిషయంలోనూ అరవలకన్న చొరవకలవారుగా వుండే వారు. వీరు ఈఫాదరీతో ఎక్కువ స్నేహంగావుండి ఆయనను గౌర వించేవారు.

ఈ ఉత్తరాదిజనాన్ని క్రైస్తవమతంలో కలపాలని ఫెర్నాండెజ్ గారు విశ్వప్రయత్నాలు చేశారు. ఏసుక్రీస్తును గురించీ, క్రైస్తవ మతధర్మాలనుగురించీ అతడు ఎన్నివిధాలుగానో వారికి బోధచేస్తూ వుండేవాడు. కాని ప్రయోజనం లేకపోయింది. ఈ ఫాదరీగారు ఎంత మంచివాడైనా గోడ్డుమాంసం తిని, మద్యపానంచేస్తూ మాలమాదిగ లతో కలిసిమెలిసి తిరిగే పరంగీజాతివాడననీన్నీ, అందువల్ల మతంలో కలిస్తే కులభ్రష్టులమైపోతామనిన్నీ భయపడి ఎవరూ క్రైస్తవ మతంలో కలవలేదు.

కుమారకృష్ణప్పనాయకుడి తరువాత మధుర రాజ్యాన్ని పరిపాలించిన ముద్దుకృష్ణప్ప నాయకుడుకూడా క్రైస్తవ మత ప్రచా రకులతో స్నేహంగానే వుండేవాడు. ఇది విని పోర్చుగల్లుదేశపు రాజు కూడా సంతోషించినట్లు ఉత్తర ప్రత్యుత్తరాలవల్ల కనబడుతూవుంది. ఇలాగ ౧౨ సంవత్సరాలు ఫెర్నాండెజ్ ఎంతకష్టపడినా క్రైస్తవ మతం వ్యాప్తిచెందలేదు.

రాబర్టో డీ నోబిలీ

ఈ పరిస్థితులలో రాబర్టో డీ నోబిలీ అనే క్రైస్తవ మత ప్రచా రకుడు ౧౬౦౬ లో మధురానగరికి వచ్చాడు. నోబిలీ ఇటలీదేశంలో మాంటీ పుల్చియానో అనే గ్రామంలో క్రైస్తవ మత గురువైన పోపులకు బంధువులైన ఒక గొప్ప కుటుంబంలో ౧౫౭౭ లో జన్మిం చాడు. అతడు చిన్నప్పటినుంచీ తెలివైనవాడు. తన పదవయేటనే ఐరోపా దేశపు సంస్కృతభాష లనదగిన గ్రీకు లాటినులను ధారాళంగా మాట్లాడేవాడు. నోబిలీ ఇక్కడికి రాగానే క్రైస్తవ మత ప్రచారం

ఎందుకు బాగా జరగడంలేదని పరిశోధనచేశాడు. హిందూదేశసముద్ర తీరాన్ని ఉన్న కొన్ని రేవు పట్నాలు పోర్చుగీసువారి స్వాధీనంలో ఉన్నా, పోర్చుగీసు క్రైస్తవమత ప్రచారకులు హిందూదేశంలోని లోపలి భాగాలలోకి పోయి ప్రజలతో కలిసిమెలిసి వుండనందువల్ల మత ప్రచారం సాగడంలేదని నోబిలీ గ్రహించాడు. ౧౬౦౭ డిశంబరు 3-వ తేదీన నోబిలీ తన దేశానికి వ్రాసిన ఈ వుత్తరంవల్ల ఆయన అభిప్రాయాలు తెలుస్తున్నవి:—

"మధుర ఈ రాజ్యానికి రాజధానినగరము. ధనవంతులూ, యుద్ధములందు ధైర్యవంతులూ, అయిన ప్రజలతో క్రిక్కిరిసివున్నది. కాని ఈ ప్రజలకు అసలు ఈశ్వరునిసంగతి తెలియదు. వారు కేవలము విగ్రహారాధకులు. మన క్రైస్తవమతప్రచారకులు ౧౨ సంవత్సరాల నుంచి ఇక్కడవుండి పనిచేస్తూవున్నా దేశీయులలో తమ అవసాన కాలానికిముందు క్రైస్తవులైన ముగ్గురు నలుగురు తప్ప ఒక్కడైనా మన మతం స్వీకరించలేదు. ఇల్లాగని మన మత ప్రచారకులు అసమర్థులుకారు. వారు చాలా సమర్థులు, సద్ధర్ములు."

పూర్వకాలమునాటి రోమునగరములోని విగ్రహారాధనమువంటి విగ్రహారాధనమే ఈ మధురలో ఇప్పు డున్నదని నోబిలీ ఇంకొక వుత్తరంలో వ్రాశాడు.

క్రైస్తవమతం ఎందుకు వ్యాపించటంలేదు ?

ఫెర్నాండెజ్ కృతకృత్యుడు కాకపోవడానికి గల కారణాలను నోబిలీ కనిపెట్టాడు. "రోము నగరంలో వున్నప్పుడు ఆ నగరవాసుల లాగనే ప్రవర్తించాలి" అనే సామెత ప్రకారం క్రైస్తవమత ప్రచారకుడు తాను నివసిస్తూవున్న దేశాచార వ్యవహారాలను గమనించి ఆ ప్రకారమే తానుకూడా ప్రవర్తిస్తేనేతప్ప లాభం లే దనిన్నీ, అలా ప్రవర్తించకపోవడమేగాక హిందూ దేశాచారాలయందు అగౌరవము కలిగించేటట్లు ప్రవర్తించడంవల్ల ప్రజలకు అనుమానము, అవిశ్వాసము కలిగి, వారు క్రైస్తవమతం దరికి చేరకున్నారనిన్నీ నోబిలీ కనిపెట్టాడు.

అప్పటి విజయనగర చక్రవర్తి యైన రెండవ వెంకటపతి దేవరాయ మహారాయల ఆస్థానంలో వుంటూవున్న అంటోనియో రూబినో అనే ఒక క్రైస్తవ పాదరీకూడా ఇలాగే అభిప్రాయపడ్డాడు. ఈ రూబినో ఒక ఉత్తరంలో ఇలాగ వ్రాశాడు:—

"మనము గొడ్డుమాంసము తిని మద్యపానముచేసే పోర్చుగీసు జాతివార మనే కారణంవల్ల ప్రజలకు మనయందు అసహ్యాభావం కలిగియున్నది. అందువల్లనే మన మతానికి వారిని చేర్చే ద్వారములు మూయబడియున్నవి. మన మీ రాజ్యములో మద్య మాంసములను విసర్జించినా మనపట్ల వారికి విరోధము, అసహ్యము కలగడానికి మన నల్లని దుస్తులే చాలు. అందువల్ల మనలను వారొక మహమ్మారిని చూసినట్లు చూస్తారు. మనము పోర్చుగీసు దేశంనుంచి వచ్చిన క్రైస్తవ మత ప్రచారకులమనే సంగతి వాళ్ళమనసులో బాగానాటుకొనివున్నది. అందువల్ల మన కృషిలో ఫలితం కలగాలంటే ముందుగా మనంధరించే దుస్తులను మార్చుకోవాలి. తినే తిండిని మార్చుకోవాలి. వీలైనంత వరకూ వారు అవలంబించే ఆచారాలను మనంకూడా అవలంబించాలి. రాష్ట్రీయ క్రైస్తవ మతాధికారి (Father Provincial) కి ఈ సంగతిని గురించి నేను చాలాసార్లు వ్రాశాను. హిందువులు వేసుకునే దుస్తులు ధరింపజేసి, నన్ను ఎవ్వరూ ఎరగని వూరికి పంపించాలని ఆయన అనుకుంటున్నాడు."

'పరంగీలు'

క్రైస్తవమత ప్రచారం బాగా జరగక పోవడానికి ఇంకొక కారణంకూడా యున్నది. క్రైస్తవులైన దేశీయ పరవరులను, వారి మతప్రచారకులను, పరంగీలని దేశీయులనేవారు. దీని నిజమైన అర్థం ఎరగకపోవడంవల్ల క్రైస్తవ మిషనరీలు ఆపేరును స్వీకరించేవారు. ఈ 'పరంగీ' అనే పదాన్ని ప్రజలందరూ చాలా నీచమైన అర్థంలో ఉపయోగిస్తూ పరంగీల మతాన్ని కూడా నీచంగా చూసేవారు. నోబిలీ జాగ్రత్తగా విచారించగా దీని కారణం తెలిసింది. "పరంగీ అనే మాటను పోర్చుగీసువారనిగాని, ఐరోపా దేశీయులనిగాని, క్రైస్తవు

లనిగాని అనే అర్థంలో ప్రజలు వాడడంలేదు. ప్రజలకు వీరి సంగతి తెలియనే తెలియదు. 'పరంగీ' అంటే నీతిధర్మాలుగాని, మానమర్యాదలుగాని లేక తాగుబోతులుగావుండి అసహ్యాకరమైన జంతువుల మాంసాలనూ, తుదకు మనుష్యమాంసాన్నికూడా పీక్కుతింటూ శాస్త్రమతధర్మాలు లేని పశుప్రాయులైన నీచమానవు లని ఆమాటకు అర్థం."

"ప్రతిభాశాలురైన పోర్చుగీసుజాతివారి నెవ్వరినీ హిందువులు చూచివుండలేదు. ఇక్కడనుండేవారు రెండురకాలవారుగా వుంటారు. కొందరు, ఇక్కడనే పుట్టిపెరిగి పోర్చుగీసు రక్తస్పర్శ ఆవంతయైనా లేకపోయినప్పటికీ నాలుగు పోర్చుగీసు ముక్కలు నోటికి రాగానే తమ అసలు జాతిలోనుంచి బైటపడి పోర్చుగీసువారి మైత్రి మనుకునేవారు. వీరిని పోర్చుగీసువారు 'టోపాజు' సంకరజాతివాళ్లని అంటారు. హిందూదేశీయులు వీరిని పరంగీలంటారు. తెల్లవాడైనా నల్లవాడైనా పోర్చుగీసువాళ్ల లాగ దుస్తులు ధరించే నల్లవాళ్ల నందరినీ పరంగీలనడం అలవాటయింది. ఇంక ఇక్కడకు వచ్చే ఇంకొకరకం మనుష్యులు పుట్టుకవల్ల యూదులై వుండిన్నీ పోర్చుగీసువారితో ఏర్పాటుచేసుకొని వర్తక వ్యవహారాలమీద యిక్కడికి వచ్చేవారు. వీరినికూడా మధురాపట్టణవాసులు పరంగీలంటారు. ఈ రెండురకాల వారితో ఏమాత్రం సంపర్కం గలవారికైనా వీరి కులము, శీలము, విశ్వాసపాత్రత, శుభ్రత ఎలాంటివో బాగా తెలిసిన విషయమే లేకదా! అందువల్ల 'పరంగీ' అనే మాట నీచంగా వాడబడడంలో ఆశ్చర్యమేముంది?" అని నోబిలీ వ్రాశాడు.

'పద్ధతి మార్చాలి'

పైన చెప్పిన సంగతి సందర్భాలన్నీ యోజించిన మీదట హిందువులను క్రీస్తుమత ధర్మాలవైపునకు ఆకర్షించాలంటే ముందుగా మిషనరీలు తమ జీవిత విధానాన్నీ, ఆచారాలనూ, పద్ధతినీ మార్చుకోవలసివున్నదనే సంగతి స్థిరపడివుంది.

రాబర్టోడీ నోబిలీ తన ఉద్దేశ్యాలను ఆచరణలో పెట్టేటందుకు ముందు పైవారితో ఆలోచించాడు. రాష్ట్రీయ మతాధికారియైన లెయిర్జియో, నోబిలీ వేసిన పథకాన్ని మనస్ఫూర్తిగా అంగీకరించాడు. ఆయనపై యధికారియైన క్రాంగనూరు ఆర్చిబిషప్పు ఫ్రాన్సిస్కో-రోజ్ గారితో కూడా నోబిలీగారు ఆలోచించి వారి అంగీకారాన్ని పొంది నాడు. ఇద్దరూ కలసి ఒక కార్యాచరణ పద్ధతిని నిర్ణయించారు. ఆర్చి బిషప్పుగారు కూడా హిందువుల విగ్రహారాధనను గురించీ, మతధర్మా లనుగురించీ, వ్రాయబడిన పుస్తకాలను కొన్నిటిని ముందుగా చదివారు. తరువాత మలబారు తీరాన్ని ఉన్న రోమను క్యాథలిక్కు క్రైస్తవమత ప్రచారకులలో ప్రజ్ఞావంతులైన విద్వాంసులతోను, పోర్చుగల్లు దేశంలోవున్న మతాచార్యులతోనూకూడా ఆలోచించారు. అందరూకూడా వీరి అభిప్రాయాలతో నేకీభవించారు. అందువల్ల ఈ ఆర్చిబిషప్పుగారు కూడా నోబిలీగారికి ఈ విషయంలో తమ అంగీకారమును తెలిపారు.

బ్రాహ్మణులు ధరించే శిఖాయజ్ఞోపవీతములు, అనగా జుట్టు ముడిన్నీ, జందెములున్నూ, వారు పెట్టుకునే గంధాక్షతల, బొట్టున్నూ, వారు అవలంబించే ఇతరాచారాలున్నూ వారి మతసంప్రదాయాలకు సంబంధించిన చిహ్నాలుకావనిన్నీ, అవి కేవలము వారు ఉత్తమవంశజు లనిన్నీ, ఉన్నతకులం వారనిన్నీ చూపడానికి యేర్పడిన బాహ్యచిహ్నలనిన్నీ, అందువల్ల క్రైస్తవమతంలో కలిసిన హిందువులు తమతమ కులాచారాలకు సంబంధించిన జుట్టు, కట్టు, బొట్టు మొదలైన బాహ్యచిహ్నలను యేలాంటి అభ్యంతరమూ లేకుండా వుంచుకోవచ్చుననిన్నీ ఈ క్రైస్తవమతాచార్యులు ఆఖరికి ఒక నిశ్చయానికి వచ్చారు. ఈ సంగతులన్నీ ౧౬౦౯ లోను, ౧౬౧౩ లోను రాష్ట్రీయక్రైస్తవ మతాధికారికిన్నీ, క్రాంగనూరు ఆర్చిబిషప్పుగారికిన్నీ జరిగిన ప్రత్యుత్తరాలవల్ల కనబడు తున్నవి.

జగద్గురు 'తత్వబోధకస్వామి'

నోబిలీ మధురానగరానికి వచ్చిన ఒకసంవత్సరానికి ౧౬౦౭లో

తన సోదర క్రైస్తవమిషనరీఫాదరీ అయిన ఫెర్నాండెజ్‌తో సంబంధం లేకుండా తానొక కొత్తపంథాతొక్కి ఒక నూతన జీవితవిధానాన్ని ప్రారంభించాడు. ఇతడు మధురానగరంలోని బ్రాహ్మణుల దగ్గిరికివెళ్ళి తాను పరంగీని కాననిన్నీ, పోర్చుగీసుజాతివాడనుకూడా కాననిన్నీ ఇటలీదేశానికి మకుటాయమానంగా వుండి ఒక పురాతన నాగరక సామ్రాజ్యానికి రాజధానియైన రోమునగరంలో ఒక ఉత్తమ రాజ వంశానికి చెందిన రాజకుమారుడ ననిన్నీ, తనకీ ప్రపంచముమీద రోత పుట్టి వైరాగ్యంకలిగి సన్యసించితిననిన్నీ చెప్పి ఒక సన్యాసిలాగనే జీవించడం ప్రారంభించాడు. ఆ క్షణంనుంచి శూద్రసేవకుల నెవ్వరినీ తన దగ్గిరికి రానివ్వక తన పరిచర్యల నిమిత్తం బ్రాహ్మణులనే నియోగించాడు. ఒక్కపూటమాత్రం ఇంత అన్నమూ, పాలూ, కూరగాయలూ పుచ్చుకుని నియమంగావుండేవాడు. బ్రాహ్మణ అగ్రహారంలో ఒక సంపన్నుని ఆశ్రయించి, కొంత స్థలం పుచ్చుకుని తన తోటి క్రైస్తవ మత ప్రచారకుడితో సంబంధంలేకుండా అక్కడ ఒక పూరి యిల్లు వేసుకుని అందులో నివసించడం ప్రారంభించాడు. ఈ యింటిని మధురానగరాధికారే యిచ్చాడని ఫాదర్ గుర్రెయిరో వ్రాశాడు.

“నోబిలీ బ్రాహ్మణ ఆచారాలన్నీ అవలంబించాడు. తన పరిచర్యల నిమిత్తం బ్రాహ్మణులనే నియోగించాడు. తాను రోమునగరాన్నుంచివచ్చిన ఒక ద్విజుడనని సన్యాసినని చెపుతూ అందుకనుగుణ్యంగా ఈ దేశపు బ్రాహ్మణ సన్యాసుల లాగనే ఐరోపాజాతివారితోగాని, అస్పృశ్యులతోగాని సంపర్కం లేకుండా ఏకాంతవాసం చెయ్యడం ప్రారంభించాడు.” అని జాన్ డి బ్రిటో అనే క్రైస్తవ మతాచార్యుడు వ్రాసియున్నాడు. త్వరలోనే ఈ నోబిలీ కేవలమూ ఒక బ్రాహ్మణ వేదాంతిగా మారిపోయినాడని రాష్ట్రీయ క్రైస్తవ మతాధికారియైన ఫ్రాన్సిస్కో రోస్‌గారు అన్నారు. క్రైస్తవమత ప్రచారకుడైన ఫాదరు రాబర్టో డీ నోబిలీ అచిరకాలములోనే ‘జగద్గురు తత్త్వబోధకస్వామి’ అనే నూతన నామకరణంతో ప్రసిద్ధికెక్కాడు.

౧౬౦౭ డిశంబరు ౧-వ తేదీన కార్డినల్ బెల్లార్మినోగార్కి నోబిలీ వ్రాసిన రహస్యలేఖలో అతడు ఇలాగ అన్నాడు: "ఇప్పుడు నేను చుట్టూ మట్టిగోడలుగల పూరిపాకలో వాసంచేస్తున్నాను. దివ్య సౌధంకంటె నాకిదే ఆనందకరంగావుంది. ఈశ్వరసేవకోసం ఈవిధంగా దేశాంతరంలో ఏకాంతవాసం చెయ్యడంలోవుండే మానసికశాంతి ఇంకొకదానిలోలేదు. అయినా నేను పూనిన ఈ దీక్షలోవుండే శ్రమ ఒక్కొక్కప్పుడు చాలా బాధాకరంగావుంటున్నది. నా యావజ్జీవమూ ఇలాగ శ్రమపడాలేమోననే ఆలోచనవల్ల, చివరదాకా నిగ్రహించ లేనేమోనని ఒక్కొక్కప్పుడు అధైర్యం కలుగుతూవుంటుంది. నానిత్య జీవితం ఇలాగ జరుగుతూవుంది:— ప్రొద్దున్ననుంచి సాయంత్రం దాకా ఎక్కడికీ కదలకుండా నేను నా యింట్లోనే కాలక్షేపం చేస్తూ వుంటాను. నాతో ఎవరైనా మాట్లాడడానికిగానీ, చర్చించడానికిగాని వస్తే నేను ఈశ్వరప్రార్థనము చేసినతరువాత వాళ్లకు దర్శనమిస్తాను. దేశీయులలో ప్రబలియున్న పొరబాటు మతసిద్ధాంతాలను ఖండిస్తూ దేశభాషలో వ్రాసేటందుకు మిగతా కొద్దికాలాన్ని వినియోగిస్తూ వుంటాను. నేను ఎల్లప్పుడూ నాయింటిలోని చిన్న గదిలోనే కాలక్షేపం చేస్తూవున్నందువల్లనూ, మాంసముగాని కోడిగ్రుడ్లుగాని నా గడప లోకి రావడానికి వీలులేదని నేను నిషేధించినందువల్లను, నేనుతినేఆహా రము నాకు తగిన బలము నివ్వనందువల్లనూ, నాకు ఎప్పుడూ ఏదో జబ్బుగానే వుంటూవున్నది. నా కడుపులోనో, తలలోనో నొప్పి లేకుండా వున్నరోజులు బహుతక్కువ. నేను తినే ఆహారము వరిఅన్నమూ, కూరగాయలూ, పళ్ళూను. నేను ఇవితప్ప ఇంకొకటి తినకూడదు. ఈ దేశంలో తత్వబోధ చేసే మతాచార్యులూ, సన్యాసులూ ఇంకా కఠినమైన యమ నియమాలతో జీవిస్తారు. ఒక్కమెతుకు అన్నమైనా తిననివాళ్లుకూడా వున్నారు. ఈ దేశంప్రజలు నానురొట్టె తినడం ఎరగనే ఎరగరు. ఇక మద్యం, అనగా సారాయమును 'మాస్' అనే క్రైస్తవప్రార్థన నిమిత్తంమాత్రమే నేను వుపయోగిస్తున్నాను. అన్నంకూడా వర్జిస్తే ఒక మనిషి తినే ఆహారం ఎంత స్వల్పంగా

వుంటుందో ఊహించండి. అన్నం వర్జించడానికి నేను సాహసించలేదు. ఇప్పుడు నేను పెట్టుకున్న నియమాలే, అనగా మాంసము, చేపలు, గుడ్లు వర్జించడమే నేను నిజమైన మతాచార్యుడనని ప్రజలు అనుకునేటందుకు చాలును. ఈ వుత్తరం వ్రాస్తూవున్న సమయంలో నేను ఉబ్బసం దగ్గువల్ల వూపిరి ఆడక బాధపడుతున్నాను. అందువల్ల దీనిని మెల్లమెల్లగా వ్రాస్తున్నాను.''

నోబిలీ ఒక బ్రాహ్మణవంటవాడిని పెట్టుకున్నాడు. శూద్రుడి చేతి అన్నం తినడానికి సాహసించేవాడుకాదు. సన్యాసులందరిలాగనే అతడు మధ్యాహ్నం నాలుగు గంటలవేళ ఒంటిపూట భోజనం చేసేవాడు. దినమంతా అతడు దేశభాషలను చదవను వ్రాయను నేర్చుకునేవాడు. అతడు ఈ దేశానికి రాగానే కొచ్చినులోనే అరవం నేర్చుకోవడం ఆరంభించాడు. ఆరునెలలలో ఇతరులతో మాట్లాడేశక్తి సంపాదించాడు. రెండేళ్లల్లో (౧౬౦౯లో) అతడు మళ్లీ తన దేశానికి వ్రాస్తూ అరవంలో మాట్లాడడంకంటె ఇటాలియను పోర్చుగీసు భాషలలో మాట్లాడడమే ఇప్పుడు తనకు కష్టముగా వున్నదని వ్రాశాడు. ఈ అరవభాష చాలా గొప్పదనిన్నీ, అందమైనదనిన్నీ కూడా వ్రాశాడు. అతడు తమిళ గ్రంథకర్తలలోనుంచి పద్యాలు చదువుతూ కథలు వుదాహరిస్తూ గ్రాంథికమైన అరవాన్ని చక్కగా మాట్లాడేవాడని ౧౬౦౮ లో ఆయన తోడి మతాచార్యుడొకడు వ్రాశాడు.

అరవం బాగా వచ్చిన తరువాత నోబిలీ తెలుగును, సంస్కృతమును నేర్చుకోవడం ప్రారంభించాడు. ఇంతవరకూ తెల్లవారెవ్వరూ తెలుగు బాగానేర్చుకోలేదు. మధురవాస్తవ్యుడైన ఒక బ్రాహ్మణపండితుడు నోబిలీకి ఈ భాషలు నేర్పడానికి కుదిరాడు. ౧౬౦౯ ఏప్రిలు ౨౨వ తేదీన రాష్ట్రీయాధికారికి నోబిలీ వ్రాసిన ఉత్తరంలో తన పంతులవారిని గురించి ఇలాగ వ్రాశాడు: "ఈ సద్బ్రాహ్మణుడు నాకు చేసే ఉపకారానికి తగినట్లుగా నా కృతజ్ఞతను తెల్పజాలను. ఆయనవల్ల నేను సంస్కృతము, తెలుగు నేర్చుకోవడమే గాక అంతకన్న అమూల్యమైన విషయాలను ఆయనవల్ల తెలుసుకో గలిగాను. వేదాల

రహస్యాలను ఆయన నాకు చెప్పాడు. వేదాలను వ్రాయడం మహా పాతక మని బ్రాహ్మణుల వూహ. దానిని ఎంతో కష్టపడి పదిపన్నెండేండ్లు పాఠము చెప్పించుకుని కంఠస్థము చేస్తారు. ఈ విషయంలో నా గురువు తన శంకలను మాని ఆ సూత్రాల నన్నింటినీ నాకోసం వ్రాసిపెట్టాడు. అయితే ఇది చాలా రహస్యంగా చెయ్యాలి. ఈసంగతి ఇతర బ్రాహ్మణులకు తెలిస్తే వాళ్లు ఆయన గుడ్లు పీకుతారు. ఇది నేర్చేటందుకు ప్రాణభయానికి కూడా తెగించాలి ఎందువల్లనంటే హిందువులను క్రైస్తవమతంలో కలపాలంటే ఈ రహస్యాలు తెలియడం చాలా అవసరం.'' ఈ విద్యను అభ్యసించడంలో నోబిలీ అమితమైన పట్టుదలతో పనిచేశాడు. ఆఖరుకు క్షవరం చేయించుకుంటూ వున్నప్పుడుకూడా పాఠాలు చదువుతూనే వుండేవాడు.

౧౬౦౮ లో నోబిలీని గురించి ఒకడు వ్రాసిన దానిలో ఇలా వుంది: "అతడు సంస్కృతం నేర్చుకోవడం మొదలుపెట్టాడు. అప్పుడే అతడు ఆభాషను చదవడమూ, మాట్లాడడమూ కొంతవరకు నేర్చుకొన్నాడు.'' రెండేళ్ల తరువాత ౧౬౧౦ డిశంబరు ౮ వ తేదీన ఆ భాషను నోబిలీ బాగా అర్థం చేసుకోగలుగుతున్నా డనిన్ని, ధారాళంగా మాట్లాడుతున్నా డనీన్నీ లెయిర్జియో వ్రాశాడు. నోబిలీ మూడు భాషలను బాగా నేర్చుకున్నా డనీన్నీ, వాటిలోని గుంటచిక్కు లన్నీ కూడా నేర్చుకున్నాడనీన్నీ, మతాంతరులైన హిందూదేశీయుల మత రహస్యాల నన్నిటినీ బాగా గ్రహించాడనీన్నీ, రాష్ట్రీయాధికారియైన రోన్‌గారు ౧౬౧౩ లో వ్రాశారు. ఈ భాషలను కొంతవరకు అభ్యసించిన ఆర్చిబిషప్పుగారు కూడా నోబిలీయొక్క శక్తిసామర్థ్యాలనూ, పాండిత్యాన్నీ చూచి ఆశ్చర్యపడ్డారు.

భేషజము - పటాటోపము

ఈ తత్వవేత్తచుట్టూ ప్రజలు గుమిగూడడం ప్రారంభమైనది. కొందరీయనను గొప్పవాడని పొగడడం ప్రారంభించారు. ఈయనను చూడాలనీ, ఈయన చెప్పే సంగతులు వినాలనీ కొందరు ఈయన

యింటికి పోవడం ప్రారంభించారు. "ఈ కొత్తస్వాములవారు ఎక్కడ నుంచి వచ్చారు? ఇతనిది యేకులం? ఈయన సిద్ధాంతా లేమిటి? జీవితవిధానం ఎలాంటిది?" అనే సంగతులన్నీ తెలుసుకోవాలని మధురాపుర జనులలో చాలామందికి కుతూహలం కలిగింది. హిందూ దేశపు స్వాములవార్ల పద్ధతులను నోబిలీ బాగా ఎరిగిన వాడైనందువల్ల మొదట తన యింటినుంచి బయటికి పోలేదు. చూడవచ్చినవారితో చాలా మితభాషణం జరిపేవాడు. నోబిలీని చూడడానికి ఎవరైనా వచ్చినప్పుడు "ఇప్పుడు సమయంకాదు. స్వాములవారు సమాధిలో ఉన్నా"రనిగాని, "నిద్రలో ఉన్నా"రనిగాని ఆయన శిష్యుడు చెప్పే వాడు. ప్రజలలో కుతూహలం అమితమై పోయినతరవాత - చూడ వచ్చినవారు ఒకటిరెండుసార్లు దర్శనంకోసంవచ్చి తిరిగిపోయిన తరవాత- నోబిలీ దర్శనం ఇచ్చేవాడు. "'అయ్యరు' గారితో మాట్లాడడానికి వచ్చాము. చూడడానికి వీలౌతుందా" అని వచ్చినవారు అడిగితే చాలాసేపటికిగాని దర్శనం ఇచ్చేవాడు కాడు. ఆఖరుకు వారిని లోపలికి రానిచ్చినప్పుడు జేగురురంగుగుడ్డ కప్పివున్న ఎత్తైన ఒక వేదికమీద ఆయన పద్మాసనం వేసుకొని కూర్చుండి వుండేవాడు. ఆయనముందు అలాంటి కాషాయరంగుబట్ట యింకొకటి పరచివుండేది. దానికిదగ్గరగా ఒక చాప వుండేది. ఆయనను చూడడానికి వచ్చినవా రందరూ చేతులెత్తి ఆయనకు నమస్కరించాలని అక్కడివారు చెప్పే వారు. ఎంత గొప్పవారైనా, రాజోద్యోగులైనాకూడా ఆయనకు అలాగ నమస్కరించేవారు. ఆయనకు శిష్యులు కాదలచినవారు ఇలాగ మూడుసార్లు భక్తితో నమస్కరించి సాష్టాంగపడి మొక్కేవారు. ఈ సంగతులను ఫిగోరా (Figuorca) వ్రాశాడు.

ఈ ఐరోపా దేశపు స్వాములవారివల్ల కొన్ని సంగతులు వినాలని మధురరాజైన ముద్దు వీరప్పనాయకునికికూడా కుతూహలం కలిగి తన దర్బారులో చాలాసార్లు అన్నాడట. అంతట నోబిలీని బాగా ఎరిగినవా రొకరు ఈ సన్యాసి తనకు స్త్రీల ముఖం కనబడుతుందేమో నని తన యిల్లు వదలి బయటకే రాడని అన్నారట! ఒక్కమారైనా వీధిలో

నడవకుండా ఇలాగ ఒక సంవత్సరంపాటు నోబిలీ కాలక్షేపం చేసే టప్పటికి ఆయననుగురించి ప్రజలకు గౌరవం కలిగింది. తరవాత ఎప్పుడైనా ఒకమాటు ఊరిబయట దూరంగా ఉన్న తన పెద్దయింటికి ఒక పల్లకీలో నెక్కిపోయేవాడు. అప్పుడు ఆయన పల్లకీముందు ప్రజలను తొలగమని కేకలు వేస్తూ దోపుదార్లు పరిగెత్తేవారు. కొన్నాళ్ల తరవాత నోబిలీ ఈ భేషజమంతా కట్టిపెట్టి సామాన్య స్వాములవారి లాగనే ఒక కాషాయాంబరం ధరించి ఒక పెద్ద పొడుగుపాటి దండము చేతపుచ్చుకొని ఇద్దరు బ్రాహ్మణ శిష్యులు వెంటరాగా కాలినడకనే బయలుదేరాడు.

మొట్టమొదట ఇలాంటి భేషజము చూపించాలని నోబిలీ అనుకోలేదటగాని మాటలసందర్భంలో ఒక శైవ 'పండారము' ఆయనకు ఇలాగ సలహా యిచ్చాడట: "కేవలమూ మీమట్టుకు మీరు తరించాలంటే మీరే మారుమూలప్రదేశానికో పోయి దిగంబరిగా వుండవచ్చును. కాని ఇతరులను తరింపజెయ్యాలని మీ వుద్దేశ్యమని మీ రంటున్నారు. గనుక మీరు పటాటోపం కనబరిచితీరాలి. నిజమైన విరాగి పట్టు పీతాంబరాలనూ, గుడ్డపీలికలనూ, భాగ్యభోగ్యాలనూ, దారిద్ర్యమునూ, మానావమానాలనూ, ఒక శవము వహించేటట్లుగా నిర్లిప్తతతో భరించాలి" అని అన్నాడట.

ఆ పండారము ఈ సలహా నిచ్చినది ౧౬౦౮-వ సంవత్సరం మధ్యలో నట. అంతకుపూర్వము నోబిలీ యింకా పోర్చుగీసు మతాచార్యుల నల్లదుస్తులనే ధరించేవాడట. 'బడగ' లనే తెలుగువారి కిది చాలా అసహ్యకరంగా వున్నదనిన్నీ, దీనిని తీసివేసి ఈ దేశంలో మత గురువులు, స్వాములు ధరించే దుస్తులనే మీరుకూడా ధరించవలసిన దనిన్నీ ఆ తమిళశైవుడు ఆయనకు గట్టిగా చెప్పాడట. మీరుమాత్రం తరించాలంటే మీయిష్టంవచ్చిన దుస్తులు వేసుకోనవచ్చునుగాని మీరు ఇతరులకు ముక్తిమార్గాన్ని బోధించదలచుకుని శిష్యులను ఆకర్షించ దలచుకుంటే మీరు సాధ్యమైనంతవరకు ఈ దేశాచారాలను అవలం

బించాలనికూడా అతడు అన్నాడట. అంతట నోబిలీ ఒక స్వాముల వారిలాగ తయారైనాడు.

లెయిర్జియోగారి వృత్తాంతంలో నోబిలీ దుస్తుల వర్ణన కనబడుతూ వుంది. ఈయన ఒక పొడుగైన కాషాయపుటంగీని ధరించి ఒక కాషాయపు ఉత్తరీయాన్ని కప్పుకునేవాడు. ఆ రంగు గుడ్డతోనే తల కొక తలపాగాను చుట్టుకునేవాడు. కాళ్లకు పావకోళ్లు తొడుగుకునేవాడు. ఇంతేకాదు. ఈ దేశంలో బ్రాహ్మణులూ, క్షత్రియులూ ఉపనయనంలో ధరించే ఉత్తరజందెముల వంటివి మూడు బంగారుపోగులూ, రెండు వెండిపోగులూ గల ఉత్తరజందెములను వేసుకొని వాటిమధ్య మెడలో ఒక శిలువనుకూడా ధరించేవాడు. దీనికి క్రైస్తవమతానికి సంబంధించిన ఒక అంతరార్థం వున్నదని అనేవాడు. కొన్నాళ్లైనతరవాత జగద్గురువు ఇలాంటి జందెము వేసుకో నక్కరలేదని నోబిలీ దానిని విసర్జించాడు.

విచిత్ర వేదాంతము

నోబిలీ చేసే మతబోధ, ప్రచారము, చాలా చిత్రంగావుండేవి. హిందువుల మతగ్రంథాలలోని కథలలోను సిద్ధాంతాలలోను తన కుపయోగించే సంగతులు తీసికొని వాటినిబట్టి మతబోధ చేసేవాడు, ఈ హిందూదేశీయులకు నాలుగు వేదము లున్న వనిన్ని, అందులో ఒకటి పోయినదనిన్ని నోబిలీ విన్నాడు. ఇప్పుడున్న వేదాలలో బ్రహ్మ విష్ణు మహేశ్వరులనుగూర్చి చెప్పబడిన దనిన్ని, నాల్గవదానిలో కేవలమూ మోక్షమార్గమే వివరింపబడినదనిన్ని, కేవలము ఇప్పుడున్న వేదాలవల్ల తరించలేరనిన్ని, ఆ నాలుగవ వేదమును ఉద్ధరించగల బుద్ధిమంతు డెవ్వడూ లేడని కొందరు అనుకుంటున్నా రనిన్ని విన్నాడు. ఈ ప్రజలు మోక్షమార్గమును వాంఛిస్తారు. అపచారాలకు ప్రాయశ్చిత్తాలను చేసుకుంటారు. దానధర్మాలు చేస్తారు. తమ విగ్రహాలకు అతిభక్తి విశ్వాసాలతో మొక్కుతారు. అందువల్ల వీరినమ్మకాలను పురస్కరించుకొని నోబిలీ పనిచేయుదలచాడు. తాను మోక్షమార్గమును బోధించడానికి వచ్చాననిన్నీ, తమ బ్రాహ్మణులు పోయినదని

చెప్పే నాల్గవ వేదంలోని మతధర్మాలను గురించి వారికి బోధించ డానికే తాను దేశంగాని దేశాన్నుంచి ఇంతదూరం వచ్చాననిన్ని చెపుతూ నోబిలీ ప్రజలకు బోధించడం ప్రారంభించాడు.

ఈ కొత్తపద్ధతి క్రైస్తవమతప్రచారము అతి చమత్కారంగా వున్నదనిన్ని, తాను క్రైస్తవులుగా చేయదలచిన ఈ హిందువుల మత విశ్వాసాలలోనూ, సిద్ధాంతాలలోనూ గల గట్టి ఘట్టాలనూ, లోపా లనూకూడా ఈ నోబిలీ ఎంతబాగా గ్రహించాడో దీనివల్ల బాగా తెలుస్తూవున్నదనీ మాక్సుమూలరుగారు వ్రాశారు.

'ఎక్సోడస్' అనే పుస్తకంలో తన ప్రచార పద్ధతినిగురించి నోబిలీగారే ఇట్లు వ్రాశారు. "హిందువుల దేవుళ్ళు పనికిమాలినవారైనా వారిని దూషించకూడదు. ఆ దేవుళ్ళను దూషిస్తే దానివల్ల మనకు లాభం కలిగేటందుకుబదులు నష్టం కలుగుతుంది. ఒక గదిలోనుంచి చీకటిని తొలగించాలంటే చీపుళ్లు పుచ్చుకొని దులిపి కాలం వ్యర్థపరు స్తామా? ఒకదీపం వెలిగిస్తాము. చీకటి దానంతట అదే మాయమవు తుంది. స్నేహంచేత క్రైస్తవేతరుడి హృదయాన్ని ఆకర్షించాలి. అతనికి మనయందు భక్తివిశ్వాసాలు కలుగచెయ్యాలి. తరువాత అత నికి సత్యమనే దివ్వెను ఇవ్వాలి. అంతట విగ్రహారాధనమనే అంధ కారము చిక్కులు లేకుండా మాయమవుతుంది.''

ఇంకొక ఉత్తరంలో తాను చేసే బోధను నోబిలీ వర్ణించాడు. "నా దగ్గరకు వచ్చినవాళ్లకందరికీ భగవంతు డొక్కడేననిన్నీ, ఆయన క్రైస్తవుల్లనమ్మే మూడుమూర్తులలో సాక్షాత్కారంఅవుతున్నాడనిన్నీ, ఆయనఅనంతుడనిన్నీ, భూమండలమును మనుష్యులను సర్వ జంతువు లను సృష్టించిన వాడనిన్నీ, మానవులను రక్షించేటందుకు మానవ శరీ రాత్మలతో ఒక దివ్య కన్యాకుమారి కడుపున పుట్టినాడనిన్నీ, ఇలాగ పుట్టిన అవతారమూర్తి ఏసుక్రీస్తు అనిన్నీ, ఇతడునిర్వికారుడనిన్ని, మానవులపాపముల నన్నింటినీ తాను భరించిన రక్షకుడనిన్ని చెప్పి ఆ మత ధర్మాలను బోధించేవాడు.

"ఈ మతధర్మాన్ని స్వీకరించే వారెవ్వరూ తమ కులాచారాలను వదలుకోనక్కరలేదు. ఇంకొక కులంలో చేరనక్కరలేదు. తన కులాచారాలకు విరుద్ధమైన ఏపనినీ చేయనక్కరలేదు. భగవంతుని సాక్షిగా ఈ పవిత్ర మతధర్మము అన్నివర్ణాలకూ అర్హమైనది. బ్రాహ్మణులు క్షత్రియులు మొదలైన ప్రజలందరు లౌకిక వ్యవహారాలలో ఈదేశపు రాజైన మహానాయకుడి శాసనానికి ఎలా లోబడివుంటారో ఆధ్యాత్మిక విషయాలలో మానవులందరికి ప్రభువైన భగవంతుని ధర్మశాసనానికి అన్ని కులాలవారూ, అన్ని తరగతులవారూ లోబడివుండాలి. ఈ దేశంలో పూర్వపు ఋషులు, సన్యాసులు చెప్పే ధర్మాలనే నేను కూడా చెప్తున్నాను. ఈ ధర్మాలు కేవలమూ అస్పృశ్యులకూ, పరంగీలకూ అర్హమైనవని ఎవరయినా అంటే వారు మహాపాతకం చేస్తున్నారన్నమాట. అన్నికులాల మనుష్యులకూ భగవంతుడు ప్రభువుగనుక ఆయన ధర్మాన్ని అందరూ శిరసావహించాలి. ఈధర్మానికి లోబడినందువల్ల ఇంకను ఉన్నతమైన స్థితిని చెందని ఉన్నత కులము లేదు. తన పవిత్రతను ఆవంతయైనా తగ్గకుండా ప్రపంచంలోని అన్ని కులాలమీాదను, వస్తువులమీాదను, సూర్యరశ్మి యెలా ప్రసరిస్తున్నదో, అది బ్రాహ్మణులను అపవిత్ర పరచకుండా ఎలాగ తేజస్సు నిస్తున్నదో ఈ ఆధ్యాత్మిక సూర్యరశ్మి కూడా మనుష్యులందరికీ తన పవిత్ర ధర్మాన్ని, పవిత్ర తేజాన్ని ప్రసాదిస్తుంది." అని నోబిలీ ఉద్బోధించేవాడు.

ఉపన్యాస ధోరణి

నోబిలీ చేసే ఉపన్యాస పద్ధతికూడా చాలా చిత్రంగానూ, దేశీయంగానూ వుండి శ్రోతల మనస్సులకూ, హృదయాలకూ బాగా నాటేట్లు వుండేది. నోబిలీ తాను స్వయంగా చక్కని పద్యాల నెన్నో రచించి వాటిని శ్రావ్యంగా చదివేవాడు. ఈ దేశంలో మతధర్మాలను, పురాణాలను చెప్పేవారి పద్ధతిలో ముందుగా తాను చెప్పదలచిన మతధర్మాన్ని గురించి భావగర్భితమైన ఒక సూత్రాన్ని చెప్పి దానికి వ్యాఖ్యానం చెప్పడంలో అనేక గ్రంథాలలో నుంచి, తన

స్వాంతకవిత్వంలోనుంచీ శ్లోకాలూ, పద్యాలూ, కథలూ, గాథలూ వివరిస్తూ దీర్ఘమైన ఉపన్యాసం చేసేవాడు. మంచి విచక్షణ జ్ఞానంతో తప్పులు వెదకడానికి నడుముకట్టుకుని కూర్చున్న వారున్న సభలలో ఈవిదేశీయుడొక సంవత్సరంలోనే దేశభాష నభ్యసించి తనపాండిత్యానికీ, భాషాజ్ఞానానికీ సభవారు ఆశ్చర్యపడే టట్లుగా ఇంత జయప్రదంగానూ, అనర్గళంగానూ ఉపన్యసించ గలిగాడంటే అతడు గొప్ప ప్రతిభాశాలి అనకతీరదని ఒక గ్రంథకర్త వ్రాశాడు.

భూ త వై ద్యం

నోబిలీగారున్నూ, ఆయన శిష్యులున్నూ ఏసుక్రీస్తు శిలువను రక్షరేకుగాను, క్రైస్తవపూజలోని పవిత్రోదకాన్ని మంత్రతీర్థంగానూ వుపయోగించి జబ్బుపడినవారికి భూతవైద్యం చేసి కుదిర్చే తంత్రం ఒకటి ప్రారంభించారు. ౧౬౦౭ లో ఒక ఆడమనిషికిన్ని, ౧౬౦౮ లో ఒక మహమ్మదీయునికిన్ని ఇలాగ దయ్యం వదలిపోయిందనిన్ని, పోతూవున్న భూతము నోబిలీగారి ప్రభావాన్ని ఉగ్గడించిం దనిన్ని పాదరీల ఉత్తర ప్రత్యుత్తరాలలో వ్రాయబడియున్నది. ఒక మాటు ఈ నోబిలీ యేలాటి వాడని ఒక దయ్యాన్ని ఆయన శిష్యుడు అడుగగా అతడు చాలా శక్తులు గలవాడనిన్ని, ఆయన బోధించే ధర్మాలన్నీ నిజమైన వనిన్ని దయ్యం చెప్పినదట. ఈయన తలపెట్టిన కార్యానికి మొదట విఘ్నాలు కలుగుతా యనిన్ని, మూడేళ్లలో జయం కలుగుతుం దనిన్నీకూడా చెప్పిందట. ఇలాగ భూతవైద్య తంత్రాలు జరపడంవల్ల మధురానగరంలో ప్రజలలో నమ్మకం కుదిరి నోబిలీగారి ప్రభావాన్ని గురించి విపరీతంగా చెప్పుకోవడం ప్రారంభించారు. మధుర రాజసభలోకికూడా ఆయన ఖ్యాతి పాకింది. అనేకులైన ప్రభువులు ఆయనతో స్నేహం చెయ్యడం ప్రారంభించారు.

ఫ లి తా లు

ఇలాగ వేషధారణ చేసి కపట నాటకమార్గం ద్వారా ఏసుక్రీస్తుసేవ చేసే పద్ధతి త్వరలోనే ఫలప్రదమైనది. ఈనోబిలీ తన జీవిత

విధానం వల్ల గర్విష్ఠులైన బ్రాహ్మణుల హృదయాలలో సంచలనం పుట్టించి వారిని ఆకర్షించాడు. అందువల్ల వారీయనను చూడడానికి రావడం మాత్రమేగాక భగవంతుణ్ని గురించి ఆయన చెప్పే సంగతులను శ్రద్ధతో వినడము కూడా ప్రారంభమైంది. అంతేకాదు. అందులో కొందరు భూమిమీద ప్రణమిల్లి ఆయన పాదధూళిని శిరస్సున ధరించేవారు. ఇంత బాగా తత్త్వబోధ చెయ్యగలవాడింకొకడు లేడని వేనోళ్ల పొగిడేవారు! * (The Aravidu Dynasty- The Rev, H, Heras Chap. XVIII pp. 362-396)

నోబిలీ వేసిన పథకం పారడానికి దారి ఏర్పడింది. అంతట అతడు హిందువులను బహిరంగంగా క్రైస్తవమతంలో కలపడానికి ప్రయత్నించాడు. ఒక హిందూమతగురువుతో నోబిలీ ఇరవై రోజులు-రోజు కైదారు గంటలచొప్పున శాస్త్రచర్చ చేసి వాదించి ఆఖరుకు తన సిద్ధాంతాలను స్థాపించినట్లు జయభేరీ వేయించి ఆ గురువును క్రైస్తవ మతంలో కలిపాడట. తనకు తెనుగుసంస్కృతములు నేర్పిన బ్రాహ్మణ గురువునుకూడా మతంలో కలిపాడు. అంతట ఒకరితరవాత ఒకరిని చాలామందిని మతంలో కలపగలిగాడు. బ్రాహ్మణులు, రాజులు, రాజోద్యోగులు, శాస్త్రజ్ఞులు, నాయకులు, గొప్పకులాలవారు, సంపన్నులు అతని దగ్గరకివచ్చి తరణోపాయం చెప్పమని వేడుకొనేవారు. దేశంలో చాలా గొప్పవాడని ప్రఖ్యాతిజెంది విజయనగర చక్రవర్తుల వుద్యోగులలో పెద్దయైన దుంబిచ్చినాయకుడుకూడా ఈయనకు శిష్యుడు కావాలని కుతూహలపడ్డాడుగాని రాజుగారికి కోపంవస్తుందని వూరుకున్నాడు.

క్రైస్తవమతం అతిత్వరగా వ్యాపించింది. హిందూమతం కొద్ది రోజులలో నశిస్తుందా అని చాలామందికి తోచింది. దేశమంతా గగ్గోలుపుట్టింది. నోబిలీచేసిన ప్రచారంవల్ల బ్రాహ్మణ పురోహితుల ఆదాయం పూర్తిగా తగ్గిపోయింది. వ్రతాలు, పూజలు చేసే వారిచ్చే దక్షిణలు తగ్గిపోయినవి. హిందూస్వాములవారికి ముడుపులుకూడా తగ్గిపోయినవి. అందువల్ల సనాతన ధర్మపరులందరూ కళ్లు తెరిచారు.

నోబిలీ కట్టిన క్రైస్తవదేవాలయంస్థలం తనదని మధుర దేవాలయం ప్రధాన అర్చకుడు తగాదా పెట్టినాడు. అంతట ఈనోబిలీగారి క్రైస్తవ ప్రచారానికి వ్యతిరేకప్రచారం ప్రారంభమైనది. హెర్మ్కేక్ త్రియనే శ్రీమంతు డొకడు నోబిలీగారికి సహాయపడినందువల్ల అప్పటికి నోబిలీ గారి క్రైస్తవదేవాలయానికి ఆపద తప్పింది. ఈ హెర్మ్కేక్ త్రి క్రైస్తవ మతంలో కలియకపోయినా నోబిలీగారికి పోషకుడుగా వుండేవాడు. ఇంతలో నోబిలీగారికి ఇంకొక తవాయి వచ్చింది. దానివల్ల ఆయన మతప్రచారం కట్టిపెట్టవలసివచ్చింది.

ఆ శ్వా సాం త ం

ఇదివరలో మధురానగరంలో క్రైస్తవమత ప్రచారకుడుగా ఉన్న ఫెర్నాండెజ్ గారికి ఈనోబిలీగారు అవలంబించే ప్రచారపద్ధతులు, చర్యలు క్రైస్తవధర్మాలకు విరుద్ధంగా వున్నట్లు తోచింది. నోబిలీగారి కొన్ని చర్యలు చాలా అసహ్యాకరంగా తోచి మందలించాడుగాని లాభం లేకపోయింది. అంతట ఆతడు పైయధికారులకు ఈ చర్యలన్నీ వివరించి చెప్పడంవల్ల నోబిలీగారి ప్రవర్తన బాగా లేదని పైయధికారు లన్నారు. గోవానగరంలో ఉన్న పోర్చుగీసు క్రైస్తవ మతాకాధిరులకు నోబిలీమీద ఈర్ష్యాభావముకూడా కలిగింది. క్రైస్తవమతంలో కలిసిన హిందువులు తమ పూర్వపు మతాచారాలన్నీ అవలంబించవచ్చు నని నోబిలీగారు అనుజ్ఞ యిచ్చినందువల్ల క్రైస్తవమతం దురాచారాలకు పుట్టినిల్లుగా మారినదనిన్ని, ఈ మతాన్ని గురించి ప్రపంచంలో చాలా అపఖ్యాతి కలిగినదనిన్ని వారన్నారు. (౧) ముఖ్యంగా నోబిలీగారు హిందూస్వాములవారిలాగ 'జగద్గురువు' అనే బిరుదును తాల్చడము; (౨) తాను పరంగిని కానని చెప్పి నటించడము; (౩) హిందువుల మూఢవిశ్వాసములను సూచించే పరిభాషను వేదాంతసూత్రము లను, మాటలను వుపయోగించడము; (౪) తనమాటలు విశ్వసించి క్రైస్తవమతంలోకలిసిన హిందులవును వారు పూర్వాచారం ప్రకారం వుంచుకునే జుట్టుపిలకలను వుంచుకొననివ్వడము, జందెములు వుంచుకో నివ్వడమ్ము, ముఖముమీద గంధాక్షతలు మొదలైన బొట్లు పెట్టుకో

నివ్వడము, అనేక సందర్భాలలో స్నానాలు చెయ్యనివ్వడము, ఇంకా హిందూవర్ణాశ్రమధర్మాలయందు అనాదినుంచీ జరుగుతూ వస్తూవున్న ఆచారాలను అవలంబించ నివ్వడము.—ఇవి క్రైస్తవమత ధర్మాలకు విరుద్ధమని నిందించారు.

పైన చెప్పిన విధంగా నోబిలీగారు ౫ సంవత్సరాలు ప్రచారం చేసి క్రైస్తవమతం వ్యాపిస్తూవున్న స్థితిలో పైయధికారులు ఆయన చేసే ప్రచార విధానాన్ని నిషేధించారు. ఆతణ్ణి కొన్నాళ్ళు పని మాన్పించి తరువాత తక్కిన పాదరీలలాగనే ప్రచారం చెయ్యమన్నారు. నోబిలీ పడిన కష్టమంతా వృథాఅయింది. క్రైస్తవమతప్రచారకులు ఈ కొత్త భేషజాలు మాని పూర్వపద్ధతుల తోనే ప్రవర్తించడం ప్రారంభించారు. మళ్ళీ వీరిని పరంగీలని నీచంగా చూడడం ప్రారంభమైనది. ముద్దువీరప్ప నాయకుని రాజ్యకాలంలో పరిపాలన నిరంకుశంగా జరిగిందని జెస్యూట్లు వ్రాశారు.

ఉ ప సం హా రం

ముద్దువీరప్ప తరువాత మహా రాజమాన్య రాజశ్రీ తిరుమలశౌరి నాయన అయ్యలుగారు మధుర రాజ్యానికి రాజైనాడు. ఆయన పట్టాభి షేకము ౧౬౨౮ లో జరిగినట్లు కనబడుతూవుంది. ఈ తిరుమలనాయ కుడు విజయనగర సామ్రాజ్యంలోనుంచి విడిపోయి స్వతంత్రుడై పరి పాలింప సాగినాడు. దేశం శాంతంగానూ, సుభిక్షంగానూ వున్నది. ఈ సరికి రోమునగర క్రైస్తవాధికారులు తనపట్ల కొంత శాంతించియుంటా రని రాబర్టో డీ నోబిలీగారు ఊహించి ౧౬౨౩ లో తన పాతపద్ధతిలో మళ్ళీ క్రైస్తవమతప్రచారం చెయ్యడానికి పూనుకొని మధురనుండి బైలుదేరాడు. ఇతడు మొదట తిరుచునాపల్లి, శండమంగలము, సేలము మొదలైన ప్రాంతాలకుపోయి కొందరిని మతంలో కలిపాడు.

మధురలో క్రైస్తవమతాన్ని వ్యాపింపచెయ్యడానికి బ్రాహ్మ ణులు ఆటంకాలు కలిగించడం ప్రారంభించారు. మధుర సనాతన ధర్మానికి దుర్గంగావున్నందువల్ల అతడు మెల్లిగా తిరుచునాపల్లి మొదలైన

ప్రాంతాలలోనే గట్టి ప్రచారం చేశాడు. అక్కడకూడా సనాతనులు వీరిని బాధించారు. అంతట మిషనరీలు అడవులలో కల్లరులనే అనాగరికుల గ్రామాలకుపోయి ప్రచారం సాగించారు.

నోబిలీ ఇలాగ మొత్తంమీద నలభై రెండేండ్లు ఈ మధుర జిల్లాలో క్రైస్తవమతప్రచారం చేశాడు. అతని ఆరోగ్యం పూర్తిగా చెడిపోయింది. అతనిదృష్టితగ్గిపోయి గుడ్డివాడై పోతున్నాడు. ఈస్థితిలో కొంచెం చల్లని ప్రదేశానికి పంపితే అతనికి ఆరోగ్యంకలుగుతుందేమోనని ౧౬౪౫ ఆ ప్రాంతంలో మిషనరీ అధికారు లతనిని సింహళానికి పంపించారు. కాని అతడు అక్కడ విశ్రాంతి తీసుకునే దానికి బదులుగా తన మామూలు పద్ధతి ప్రకారమే కఠిన నియమాలతో జీవిస్తూ మత ప్రచారం చేస్తూనే వచ్చినందువల్ల ఆరోగ్యం కలగలేదు. అక్కడ కూడా కొందరను అతడు మతంలోకలిపాడు. అందువల్ల అతడు మొదటి నుంచీ పనిచేస్తూవున్న ప్రదేశాలన్నిటికీ దూరంగావుండేటట్లు చెన్నపట్నంలో మైలాపూరికి విశ్రాంతికోసం పంపించారు. అక్కడ ఇతడు తన శిష్యులుగావున్న నలుగురు బ్రాహ్మణులతో ఒక చిన్న మట్టి యింట్లో కొన్నాళ్ళు కాలక్షేపంచేశాడు. ఇంతలో గోలకొండనవాబుల సేనాధిపతుల దండయాత్రలవల్ల చెన్నపట్నంలో రాజకీయ పరిస్థితులు అల్లకల్లోలంగా వున్నందువల్ల అధికారులు మళ్లీ అతనిని ఇంకొకచోటికి మార్చారు. ఇట్టి స్థితిలో ౧౬౫౬ లో ఈ క్రైస్తవమతాచార్యుడు స్వర్గస్థుడైనాడు.

నోబిలీ అరవంలో వ్రాసిన తొమ్మిది గొప్ప గ్రంథాల తాళపత్రసంపుటాలు ౧౬౬౦ లో కనబడ్డవి. (Madura District Manual (1868—J. H. Nelson, Part II pp 116—120, 127, 160—161 180—181.)

౬. సీతారాముల శాపము

"దేవాలయాలలోని విగ్రహాల నగలను ముట్టుకుంటే ఘోరమైన శాపం తగులుతుంది. ఆపాపఫలాన్ని వంశపారంపర్యా అనుభవించవలసివస్తుంది." అని భారతదేశాన్నిఏలే మొగలుచక్రవర్తి టెవర్నియరు అనే ఫ్రెంచి దేశీయుడితో అన్నాడట. ఈ మాట టెవర్నియరు విషయంలోనే రుజువుఅయింది.

టెవర్నియరు 1638-68 మధ్య అయిదుసార్లు హిందూదేశానికి వచ్చి దేశమంతా తిరిగిచూశాడు. టెవర్నియరు వజ్రాల వ్యాపారం చేసి చాలాసొమ్ము ఆర్జించాడు. ఎక్కడనైనా అపూర్వమైన వజ్రం వున్నదంటే యెలాగైనా దాన్ని సంపాదించాలని ప్రయత్నించేవాడు. ఇతడు మొగలుచక్రవర్తి దయ సంపాదించి ఆయనతోవెళ్ళి హిమాలయ పర్వతాలలోవుండే వజ్రపుగనులుచూశాడు. అప్పుడు చక్రవర్తి టెవర్నియరుకొక మహావజ్రాన్ని బహుమానంగా ఇచ్చాడు. ఆ సమయంలోనే చక్రవర్తి టెవర్నియరుకు బర్మా వజ్రంసంగతి ఇలాగని చెప్పాడు. "ఐరావతీ నదీతీరాన్నివున్న పగను అనే నగరంలో ఒక పురాతన దేవాలయంలో ఒక గొప్ప స్ఫటికంలో చెక్కిన సీతారాముల విగ్రహాలు వున్నాయి. ఆ విగ్రహాల మెడలలోను వక్షస్థలాల మీదను భక్తులు సమర్పించిన అనేక అమూల్య రత్నాల ఆభరణాలు వున్నాయి. వాటిలోకల్లా అందమైనదీ, అపూర్వమైనదీ ఒక వజ్రం వున్నది. అది రెండువేల సంవత్సరాలనుంచి ఆ విగ్రహాలకు అలంకారంగావున్నది. దానిని పూర్వం బర్మారాజు కొమరితయైన బ్రిస్బన్ ధరించేది. ఆ పిల్ల ఆతతాయిలవల్ల బలవన్మరణము నందినది. దీనిపూర్వచరిత్రనుగురించి యింక ఏమీ తెలియదు." అని చక్రవర్తి చెప్పాడు.

వ జ్రా ప హ ర ణ ం

ఈ మాట వినేటప్పటికి ఎలాగైనా ఆవజ్రాన్ని అపహరించాలని టెవర్నియరుకు కోరికకలిగింది. అతడు ముందుగా మండలేపట్నం వెళ్ళాడు. పగను చాలా దుర్గమమైన ప్రదేశంలోవుంది. అక్కడికి

వెళ్లడం చాలా కష్టం. అయితే పెవర్నియరు ఫ్రెంచి దేశాన్నుంచి వచ్చిన ఒక గొప్పదొర అనిన్నీ, హిందూదేశాన్ని ఏలే చక్రవర్తికి స్నేహితుడనిన్నీ. అతని ప్రఖ్యాతి అతనికంటె ముందుగానే పాకినందు వల్ల అది సాధ్యం అయింది. అతడు గమ్యస్థానానికి దగ్గరికి వచ్చినకొద్దీ చాలా దాతృత్వం కనబరుస్తూ దానధర్మాలు చెయ్యడం ప్రారంభించాడు. తనను ఒక మహారాజు అని అందరూ అనుకోవడం మొదలు పెట్టారని పెవర్నియరే అన్నాడు.

విదేశీయుడిని - అందులో తెల్లవాడిని - దేవాలయంలోనికి సులభంగా రానివ్వరుగాని పెవర్నియరుకు ఇది సులభంగా సాధ్యమైంది. దేవాలయంలో కాలుపెట్టగానే పెవర్నియరు ఎంతో భక్తి పరుడిలాగ సాష్టాంగపడి దేవుడికి నమస్కరించాడు. ఈ సీతారాములను చూడలేక కళ్ళు మిరుమిట్లు క్రమ్మినాయేమో అనేటట్లుగా తన అరచేతి వేళ్లను కళ్ళకు అడ్డముపెట్టికొని ఆ వేళ్ళసందులనుంచి తాను అపహరించదలచిన అపూర్వ వజ్రం ఎక్కడవుందో కనిపెట్టాడు.

తన రాకయొక్క వింత కాస్తతగ్గి పాతబడేవరకూ ఐదురోజులు పగనులోనుండి ప్రతిరోజు ఉదయమూ, మధ్యాహ్నమూ, రాత్రికూడా దేవాలయంలోకివెళ్ళి సీతారాములను అర్చిస్తూవుండేవాడు. వెళ్ళినప్పుడల్లా ఒక రత్నాన్ని బహుమానం యిచ్చేవాడు. ఆ రాళ్లు ఎక్కువ విలువైనవి కాకపోయినా అర్చకులకుమాత్రం అతనిపైన చాలా గౌరవం కలిగింది.

ఐదోనాటిరాత్రి వెన్నెలలేదు. అందువల్ల పెవర్నియరూ అతని అనుచరులూ ప్రయాణానికి సిద్ధపరచిన ఏనుగులను ఎవరూ గమనించలేదు. మొదట పగనుకు వచ్చేటప్పుడు వేసుకొన్న తెల్లని దుస్తులను తీసివేసి వీళ్ళు నల్లటి దుస్తులు ధరించారు. అందువల్ల నక్షత్రాలవెలుగు వీళ్ళపైన పడి గుర్తు తెలుస్తుందనే భయంలేదు... హఠాత్తుగా ఆ రాత్రివేళ ఇంత పొద్దుపొయ్యేవరకూ ఇంకా ఆ దేవాలయంలో దిగబడిన ఏ అర్చకునిదో, సేవకునిదో ఒక్క కేక వినబడి మళ్లీ గొంతుక నొక్కినట్లు ఆగిపోయింది. ఆ గుడిలో రాతి చపటామీంద సాధార

ణంగా పడుకునే బిచ్చగాళ్ళకు నిద్రాభంగమై ఒకమాటు ఇటూ అటూ కదిలారు. ఇంతలో వాళ్ల కాళ్లుచేతులు బంధింపబడి నోటిలో గుడలు కుక్కినందువల్ల ఏమీ చెయ్యలేకపొయ్యారు. సీతారాముల విగ్రహాల దగ్గిరికి గబగబపోతూవున్న పాదాలచప్పుడు, బంగారు గొలుసులు కదల్చినచప్పుడు, దానితరువాత వీథిలో ఏనుగుల పాదాలచప్పుడు వినబడినవి. ఇంతే-అంతా సద్దు అణిగింది.

ఆ మర్నాడు పొద్దున్న దివ్యవజ్రం పోయిన సంగతి తెలియగానే లబొయిలూ దిబొయిలూ! ఎవరు ఎత్తుకుపోయివుంటారు ? అని అర్చకులు ఒకరినొకరు ప్రశ్నించుకున్నారు. బిచ్చగాళ్ళనుకట్టినతాళ్ళను విప్పుతూవుండగా కొత్తగావచ్చినవారు ఆ రాత్రి వెళ్ళిపోయారనే కేకలు వినబడ్డాయి.

శాపంయొక్క పీడ ప్రారంభం

టెవర్నియరు కోరిక సఫలమైంది. వజ్రం పోయినసంగతి అర్చకులకు తెలిసేటప్పటికి అతడూ అతనిఅనుచరులూ తప్పించుకొని చాలా దూరంపోయారు.

ఈ వజ్రంతో టెవర్నియరు ఫ్రెంచిదేశానికి వెళ్లగానే ఫ్రెంచి రాజైన 14 వ "లూయీ" వజ్రంమీద కన్నువేశాడు. టెవర్నియరుకు అమ్మడం యిష్టంలేదు. ఇతనికి ఒక లక్ష నవరసులూ ఒక ప్రభు బిరుదూ ఇస్తానని రాజు అనడంవల్లనూ ఆ సమయంలోనే టెవర్నియరు కొడుకు ఋణబాధలవల్ల ఆ స్తినంతా తాకట్టుపెట్టినట్లు తెలిసినందువల్లనూ టెవర్నియరు ఒప్పుకున్నాడు. టెవర్నియరు మళ్ళీ తూర్పు దేశానికి వెడుతూ దారిలో తీవ్రమైనజ్వరంతో బాధపడి చనిపోయాడు. దారిలో అడవికుక్కలు పీక్కుతిన్నాయని కొందరన్నారు. ఏమైతేనేమి టెవర్నియరు దుర్మరణం పొందాడు. ఇది సీతారాముల శాప ఫలితమే నని కొంద రన్నారు.

వ జ్రం లో పి శా చం

ఫ్రెంచిరాజు ఈవజ్రాన్ని చెక్కించినందువల్ల అది 67 క్యారెట్ల

లైంది. దాన్ని రాజు ధరించేటప్పటికి దాని నీలవర్ణకాంతులు చూసి అందరూ ఆశ్చర్యపడ్డారు. ఈ వజ్రం ధరించినందువల్ల రాజుగారికేమీ కీడు రాలేదు. కాని దాన్ని ధరించిన ఆయన ప్రియురాండ్రకు ఆయన స్నేహితులకు మాత్రం రాజాదరణము పోవడమో, గౌరవము పోవడమో, చెరలో దుర్మరణము చెందడమో, జరిగేది. అందువల్ల ఈ వజ్రంలో ఏదో పిశాచ మున్నదనిన్ని పెట్టుకున్నవాళ్ళను నాశనం చేస్తుందనిన్ని పుకారులు బైలుదేరినాయి.

ఫ్రెంచిరాజు 16 వ "లూయీ" భార్య మేరీ అంటాయినెట్టు దీనిని ధరించింది. ఆవిడకు చాలా చిక్కులు వచ్చినవి. ఫ్రెంచు ప్రజా విప్లవంలో ఆ రాజు పదభ్రష్టుడైనాడు. ఆ రాణి ప్రాణాలను గోల్పోయింది. విప్లవం జరిగిన తరువాత 1792 లో తక్కిన జవాహిరితోపాటు ఈ వజ్రాన్ని ఎవరో అపహరించారు.

దుర్మరణాలు - దురదృష్టాలు

తరవాత కొంతకాలానికి వజ్రాల మచ్చులచావడి అనతగిన "ఆంస్టర్‌డాం" లో "ఫాల్స్" అనే వజ్రాల వర్తకుడి దగ్గిరికి ఈవజ్రం ఎలాగోవచ్చింది. అతనికిచ్చిన వాడు దానిని కోయ్యమన్నాడు. అతడు కొన్ని నెలలు కష్టపడి పని పూర్తిచేసేటప్పటికి అతని కొడుకు దానిని హరించి అమ్మివేసి ఆ సొమ్ముతో వ్యభిచారాలలోనూ, దుర్మార్గాలలోనూ పడి పాడై ఆత్మహత్య చేసుకొన్నాడు.

ఈ కుర్రవాడిదగ్గర ఆ వజ్రాన్ని దాని నిజమైన విలువలో 10వ వంతుకు ఫ్రాన్సిస్ బొయిలూ అనే ఫ్రెంచివాడుకొన్నాడు. అతడు దానిని ఫ్రాన్సులో అమ్మలేక, లండనుకుపోయి అమ్మదలచి అందుకు సొమ్ములేక రహస్యంగా ఆ వజ్రంలో ఒక చిన్నముక్క కోయించి అమ్మి, కోసినందుకు కొంత సొమ్మిచ్చి మిగతాసొమ్ముతో లండను వెళ్ళి ఆ వజ్రాన్ని తన జోడు మడమలో దాచుకొని తిరిగేవాడు. దానిని అమ్మడానికి భయపడి వీథులు ఊడ్చే పాకీపనిచేస్తూ జీవించేవాడు తిండిలేక మలమల మాడి ఆకలిబాధ భరించలేక ఆఖరికి ఎలియాసన్

అనే యూధుజాతి వజ్రాల వర్తకుడిని పిలిచి తన వజ్రాన్ని 5 వేల సవరనుల కిచ్చివేస్తా నన్నాడు. ఎలియాసన్ ఆలోచించి చెబుతానని తరువాత మళ్ళీ వెళ్ళేటప్పటికి ఆ యువకుడు శోషిల్లి చచ్చిపడివున్నాడు.

ఎలియాసన్ ఆ వజ్రాన్ని సంగ్రహించాడు. అతని దగ్గర ఆ వజ్రం 1830 వరకూ ఉంది. తరువాత అతడు దానిని తామస్ హెన్రీ హోపు అనే ఆయనకు 18 వేల సవరనులకు అమ్మాడు. ఆ వజ్రం నిజానికి 30 వేలు చేస్తుంది. హోపుగారి తదనంతరం ఈ వజ్రం ఆయన వారసుడైన లార్డుఫ్రాన్సిస్ హోపు ప్రభువునకు సంక్రమించినది. దీనికి అప్పటినుంచీ "హోపు వజ్రం" అని పేరు వచ్చింది.

హోపు ప్రభువు

ఈ వజ్రం వచ్చిన ముహూర్తాన హోపుప్రభువుకి అన్నీ కష్టాలే కలిగినవి. అతడు చాలా ఆస్తి నష్టపడి కాపురం చెడి మనోవ్యాధితో బాధపడ్డాడు. హోపుగారు 1894 లో మే యోహే అనే నటకురాలిని పెళ్లాడి ఆ వజ్రాన్ని ఆమెకు యిచ్చాడు. ఆ వజ్రంయొక్క పీడవల్లనే తనకు మనశ్శాంతి లేకుండా పోయినదనిన్నీ, తాను ఇంకొకనితో లేచి పోయినా నినిన్నీ ఆవిడ తరువాత చెప్పింది. హోపు ప్రభువు 1902లో ఆమెతో విడాకులు పొందాడు. ఈ లోపుగా అతనికి సొమ్ము అవసరమై ఆ వజ్రాన్ని విక్రయించాడు. తరువాత కొంతకాలందాకా ఆ వజ్రం ఏమైనదో తెలియదు.

ఇంకా కొన్ని దుర్మరణాలు

1908 లో ఈ వజ్రాన్ని రష్యాదేశపు కోటీశ్వరుడైన కనిటోవిస్కీ అనే ప్రభువు కొన్నాడు. అతడు ప్యారిసు నగరములోని ఒక నర్తకిని ప్రేమించి ఈ వజ్రాన్ని ఒకరాత్రి ధరించేటందుకు దాని నావిడకు ఇచ్చాడు. ఆ వజ్రాన్నిధరించి ఆమె రంగస్థలంమీదికి రాగానే కనిటోవిస్కీకి నేమి తోచిందోగాని ఆమెను తన తుపాకితో కాల్చివేశాడు. తరువాత యింకో రెండురోజులలో ఈ కనిటోవిస్కీని ఎవరో పొడిచి చంపివేశారు. ఆ వజ్రాన్ని ఈ ప్రభువుకు అమ్మిన వర్తకుడు

కొలట్ అనేవాడు తన వజ్రం ఖరీదు తాలూకు సొమ్ము తనకురాదనే అధైర్యంతో ఆత్మహత్య చేసుకొన్నాడు.

ఆ వజ్రం మళ్ళీ ఒక గ్రీకువర్తకుడి చేతిలోపడింది. అతడు దానిని తురుష్క-సుల్తాను అబ్దుల్ హామీదుకు అమ్మాడు. అమ్మినరోజురాత్రే ఆ గ్రీకువర్తకుడు, అతని భార్యా, పిల్లలూ ఒక పర్వతంప్రక్క ప్రయాణంచేస్తూ అగాధమైన లోయలోబడి మరణించారు.

తురుష్క-సుల్తాను పదచ్యుతి

తురుష్క-సుల్తాను దగ్గర ఆ వజ్రానికి కాపలాకాసే సేవకుడిపైన ఆ సుల్తానుకు ఆగ్రహం వచ్చి అతనిని బంధిఖానాలో పెట్టి చావగొట్టినందువల్ల వాడికి పిచ్చియెత్తింది. తరువాత ఆ సుల్తానుకు విశ్వాసపాత్రుడుగా వుండే ఖొజ్జావాడిని ఎవరో గొంతుక పిసికి చంపారు. తరువాత తురుష్క యువజనపక్షంవారు ఆ సుల్తానుగారిని తోసిరాజన్నారు.

ఆఖరికి అమెరికా

మళ్ళీ కొన్నాళ్ళదాకా ఆవజ్రం ఏమైనదో తెలియదు. 1911 లో అమెరికాలోని ఒక వజ్రాల కంపెనీలో మెక్లీన్ సతి అనే ఆమె దానిని కొన్నది. అప్పటినుంచీ ఆవిడ ఆ కంపెనీతో ఒక వ్యాజ్యం తగాదాలో చిక్కుకుంది.

ఈ వజ్రంమీాదనున్న అపఖ్యాతివల్ల దానిని కొనేటప్పుడు ఒక గమ్మత్తుషరతు నిర్ణయించుకున్నారు. కొన్నవాళ్లకు ఏదైనా ఆపదవచ్చే సందర్భంలో వజ్రం వాపసుచేసేపద్ధతిని దానిని 60 వేల నవరసులఖరీదు అని మొదట అన్నారుగాని తుదకు 52 వేల నవరసు లే నిశ్చయించుకొన్నారు.

1919 మే నెలలో మెక్లీను సతియొక్క ఏకైకపుత్రుడు కోటీశ్వరుడి కులదీపము- పసిపాపడు తన దాయి దగ్గరనుంచి హఠాత్తుగా అవతలికి వెళ్ళి ఒక మోటారు బండిచక్రం కిందపడి చనిపోయాడు.* తరువాత ఏమి జరిగిందో ఇంకా తెలియలేదు.

---

* The Curse of the Hope Diamond — By Richard D. S. McMillan; (*Great Stories of real life - George Newes Ltd.*)

౭. మన ముసల్మానులు భారతీయులు కారా?

మన తెలుగుదేశంలో మహమ్మదీయులను 'తురక' లని వ్యవహరించడం అలవాటు అయింది. ఎవరు మీరని వారిని అడిగితే మేము 'తురక'లమంటారు గాని నిజంగా వీరు తురుష్క దేశాన్నుంచి వచ్చిన విజాతీయులు కారు. ఒక్క ఆంధ్రదేశంలోనే కాదు; యావద్భారత దేశంలో ఉన్న ముసల్మానులలో నూటికి తొంభై మంది పూర్వము హిందువులలోనుంచి మహమ్మదీయ మతంలో కలిసినవారి సంతతి వారే. నూటికి పదిమంది మాత్రమే అరబ్బీ తురుష్క దేశాలనుంచీ, పారశీక ఆఫ్ఘనిస్థానాలనుంచీ వచ్చి ఇక్కడ స్థిరనివాసం ఏర్పరుచుకొని 'షేకు' లనే ఈ దేశపు మహమ్మదీయులతో సంబంధబాంధవ్యాలు చేసినవారి సంతతివాళ్లు.

ఈ ముసల్మానులు హిందూప్రజల లాగనే గ్రామాలలో వ్యవసాయము, ఇతరవృత్తులు చేసుకుంటూ జీవనంచేస్తూ వున్నందువల్ల అరబ్బీ తురుష్క పారశీక మతాచారాలు క్రమక్రమంగా సడలిపోయి హిందూదేశప్రజల ఆచారాలే వారికికూడా అలవడినవి. ఇస్లాము మతంలో కులభేదాలకు తావులేక పోయినా మనదేశంలో వున్న మహమ్మదీయులలో వడ్లగింజలలో వున్నన్ని భేదాలు ఏర్పడినవి. హిందువులలోనుంచి మహమ్మదీయమతం అవలంబించిన వారు వేరు వేరు కులాచారాలు అవలంబించి వేరువేరు తెగలుగా ఏర్పడ్డారు. ఇస్లాము ధర్మాన్నిబట్టి మహమ్మదీయు లందరూ ఏకపంక్తిని భోజనము చేయవలసి యున్నా మన ముసాల్మానులలో భోజన ప్రతిభోజనాల విషయంలోనూ, వివాహాల విషయంలోనూ నిషిద్ధాలు ఏర్పడినవి.

వంగరాష్ట్రం జనసంఖ్యలో నూటికి యాభై మంది మహమ్మదీయులే. వీరిలో నూటికి 3½ మంది వ్యవసాయికులు. వీరందరూ హిందువులలోనుంచి మహమ్మదీయు లైనవారే. ఘూర్జరరాష్ట్రంలోని ఖోజాలు, మెమనులు, బోరాలు హిందువుల సంతతివారే. వీరిప్పటికీ

మన ఆచార వ్యవహారాలనే అవలంబించి యున్నారు. వేషభాషలలో ఘూర్జర దేశంలో నున్న హిందువులకూ వీరికీ తేడా లేదు. రాజపుత్ర స్థానంలోని ముసల్మాను లందరూ మొగలాయి చక్రవర్తుల కాలంలో మహమ్మదీయులైన రాజపుత్రుల సంతతివారే. తక్కినవారిలో చాలా మంది మియోలు. వీరుకూడా హిందువులలోనుంచి ముసల్మానులైన వారే. పశ్చిమోత్తర పరగణాలలో నున్న ముసల్మానులలో కూడా విజాతీయరక్తము బహుస్వల్పముగా నున్నది. దక్షిణ హిందూస్థానంలో మలబారులోని మాపలాలు క్రీస్తుశకము ఎనిమిదవశతాబ్దములో అరబ్బీదేశాన్నుంచి మనదేశంతో వర్తకవ్యాపారం చేస్తూవచ్చిన అరబ్బీదేశీయులకును, మలబారు హిందువులలోని కిందితరగతుల స్త్రీలకును పుట్టినవారేగాని విజాతీయులు గారు.

మహమ్మదీయులు ప్రబలముగా నున్న పంజాబురాష్ట్రంలో కూడా నూటికి ౧౬ వంతులు మాత్రమే పఠాను బెలూచీ మొగలు వగైరా విజాతీయుల సంతతివారనిన్నీ, మిగతా ౮౪ వంతులూ హిందువులలోనుంచి మహమ్మదీయులైనవారి సంతతి వారే ననిన్నీ ౧౯౦౧-వ సంవత్సరపు జనాభాలెక్క వల్ల తేలినది. ౧౯౦౧ లో పంజాబులోనున్న మహమ్మదీయులు ౧, ౮౯,౬౧, ౧౨౨ మందిలో జాటులనే తెగవారు ౨౦ లక్షలు; రాజపుత్రులు అరెయినులు ౧౦ లక్షలు, జోలా, అవాను, గుజారు, ముచీ, కుంహారు తర్ఖాను, తేలీలు ఒక్కొక తెగవారు ఏడులక్షల యాభైవేల మందిమొదలు ౧౦ లక్షల దాకా వున్నారు. వీరందరు హిందువుల సంతతివారే.

మనదేశపు ముసల్మానులలో హిందువుల లాగనే ఒకరితో ఒకరికి సంబంధబాంధవ్యములు లేని షియాలు, సున్నీలు అనే రెండు పెద్దతెగలు నున్నవి. వీరుగాక ప్రత్యేక తెగలుగా నున్న సయ్యదులు, షేకులు, పఠానులు, మొగలులు, మొహమ్మదీయులు, రాజపుత్రులు, జాటులు, గుజారులు, మియోలు, డిష్కానీలు, మోపలాలు మొదలైన వారున్నారు. ఈ ముసల్మానులలో మెమను, బోరా, ఖోజా, బూలా, ధానియా, ఘోసీ, కుంజెరు, మనిహారు, కసాయీలు మొద

లైనవారు హిందువులలాగనే ప్రత్యేక కులాచారాలనే అవలంబించి యున్నారు.

హిందూముసల్మానుల 'భారతీయ' సభ్యత

భారతదేశంలో హిందూముసల్మానుల చిరకాల సాహచర్యం వల్ల ఈ యుభయుల వేషభాషలూ, ఆచారాలూ విడదీయ లేనంతటి విధంగా కలిసిపోయి కేవలమూ మహమ్మదీయుల దనిగాని, హిందువుల దనిగాని చెప్పడానికి వీలులేని విధమైన 'భారతీయ' సభ్యత యొకటి యేర్పడి యున్నది. ఈ చిరకాల సాహచర్యమువల్ల ఉభయుల వేష భాషలలో, మతాచార వ్యవహారాలలో, సంగీతసాహిత్యములలో, శిల్పములలో, రుచులలో, తుదకు స్వభావములలో కూడా మార్పులు కలిగినవి. దీనిని గురించి హిందువులు, మహమ్మదీయులు, విదేశీయులు పాశ్చాత్యులు కూడా అనేక గ్రంథాలలో వ్రాసియున్నారు. ఇలాంటి రచన లన్నింటినీ సేకరించి శ్రీ రవీంద్రనారాయణ ఘోష్‌గారు ౧౯౧౧-వ సంవత్సరంలో కలకత్తానుంచి ప్రకటింపబడే 'డాన్ సొసైటీ'వారి మాసపత్రికలో అయిదు గొప్ప వ్యాసాలను వ్రాశారు.

'హిందీ' అనే ముసల్మానులు

అనేకభాషలయం దపారమైన పాండిత్యము సంపాదించి అరబ్బీ నాగరికతను గురించి ఫ్రెంచిభాషలో లెబాన్‌గారు వ్రాసిన గ్రంథాన్ని ఉర్దూభాష లోనికి అనువదించి, చెన్నపురి విశ్వవిద్యాలయంలో సంస్కృతపరీక్షకుడుగా కూడా పనిచేసి, ౧౯౧౦ లో దివంగతులైన సయ్యద్ అలీ బిల్‌గ్రామీగారు శికందరాబాదులో ఉపన్యసిస్తూ ఇలాగ చెప్పారు:—

"హిందూదేశపు ముసల్మానులమైన మనము తురుష్క దేశ మందున్నూ, ఇతరమహమ్మదీయ రాజ్యాలయందున్నూ గల ముసల్మాను లందరూ మనలను ముసల్మాను లనక 'హిందీ' లని వ్యవహరించేటంతగా భారతీయ సభ్యతలో లీనమైనాము. ఈ 'హిందీ' అనే శబ్దము వినడానికి 'హిందూ' అనే శబ్దానికి భిన్నంగా కనబడుతూ వున్నా దీని అర్థం

హిందువు లనియే సుమండీ! ఇంతేకాదు. భారతదేశపు ముసల్మానుల మగుటవల్ల మనము మధ్యఆశియా దేశము లందలి ఆనాగరకమూకల కన్ననూ, తురుష్క పారశీక దేశములందలి ముసల్మానులకన్ననూ, మనను 'హిందువు'లని పిలిచే జాతులవా రందరికన్ననూకూడా, సాంఘికంగానూ బుద్ధిబలంలోనూ శ్రేష్ఠులముగా నున్నాము. పారశీక దేశములోని పూర్వనాగరికతమైన 'సస్సానియనుల' సభ్యతయున్నూ, సాహిత్యమున్నూ అక్కడికి వచ్చిన ఇస్లాములో గొప్పమార్పును కలిగించి జలాలుద్దీన్ రూమీ, ఉమర్ ఖయ్యాముల వంటి మహాకవులను సృష్టించినట్లే మనదేశంలో హిందువుల పూర్వనాగరికత తత్వవేదాంతములు భారతీయముసల్మానులను సృష్టించినవి. వివిధదేశములందలి పూర్వనాగరికతలు ఇస్లాములో కలిగించిన మార్పులు పరిశోధింపతగిన విషయము.''

దుస్తులు

ఉత్తర హిందూస్థానంలో హిందువులు, మహమ్మదీయులూ, ధరించే దుస్తులూ, నివసించే ఇళ్లూ ఒకే మాదిరిగా నుంటవి. బయటకు పోయేటప్పుడు హిందువులైనా మహమ్మదీయులైనా పాయిజామాలూ, పగ్రీలూ వేసుకుంటారు. ఇళ్లలో - ముఖ్యంగా గ్రామాలలో - ధోవతీ, ఉత్తరీయమూ ధరిస్తారు. అనేక ప్రాంతాలలో అంగీయూయున్నూ, ఘోషాకోసం మేలిముసుగుగా వేసుకొనేజలతారుఓణీ, కుచ్చెళ్లుపోసికట్టిన పమిటి పావడాను, రవికనూ ఈ వుభయమతములవారి స్త్రీలూ భేదమేమీ లేకుండా ధరిస్తారు.

శిల్పము

ఉత్తరహిందూస్థానములో మతాలకు సంబంధించిన మసీదులూ, దేవాలయాలూ గాక లౌకికజీవితానికి సంబంధించిన రాజనగరులు, బాటసారుల కోసం కట్టిన సరాయిలు, వీథిల్లోకి కట్టిన ఇళ్ళు వాకిళ్ళు, స్నానఘట్టాలూ, రాజపుత్రస్థానంలోను మధ్యరాష్ట్రంలోను అయోధ్య ఆగ్రా రాష్ట్రాలలోనూ పంజాబులోను గల గొప్ప నగరా లన్నింటిలోనూ, హిందూమహమ్మదీయుల రుచులు రెండూ కనపడే శిల్పాన్ని

ప్రదర్శిస్తున్నవి గాని కేవలము ఒక్కరికే చెందినట్టి శిల్పమని చెప్ప డానికి వీలైనవి కావు. హిందువుల కట్టడాలపైన గల గాలిగుమ్మట ములు, వికసించినపుష్పముల వంటి స్వరూపములు, అష్టభుజముల కట్టడములు, స్తూపీలు, బురుజులు, గోడలపైన కిటికీలపైన చెక్కిన శిల్పమూ మహమ్మదీయుల శిల్పమే! మహమ్మదీయుల కట్టడములలో అందంగా చెక్కిన రాతిపోటీపలకలు, ముందుకు చొచ్చుకుని వచ్చే మంటపములు, నలుపలకల స్తంభములు, అడ్డముగా వేసే తనాబీలు, బల్లపరుపు కప్పులు, అతిసున్నితంగానూ, చిత్రవిచిత్రంగానూ చెక్కిన నగిషీలూ కేవలమూ హిందువుల శిల్పమే! ! ఇలాగ ఈ దేశంలో ఈ హిందూమహమ్మదీయుల శిల్పాలు రెండూ లీన మైనట్లు మహానగరా లన్నింటిలోనూ నిదర్శనాలు కనబడుతున్నవి.

చిత్రలేఖనము

శిల్పములోలాగనే చిత్రలేఖనంలోకూడా హిందూమహమ్మ దీయ నైపుణ్యములు మేళవించిన లక్షణాలు కనబడుతున్నవి. చక్ర వర్తులు, నవాబులు ఈ కళను పోషించడం పోయి, ఇవి క్షీణించి నప్పటికీ దీని యందలి సామాన్యలక్షణాలు మాత్రం పోలేదు. పారశీకసాహిత్యములోని శృంగారకావ్యముల కథలును భారతదేశ జన సామాన్యానికి అనుకూలతంగా సంక్రమించివచ్చిన కథలును భారతదేశ హిందూమహమ్మదీయ ప్రజాజీవనమును మన దేశపుచిత్తరువులలో చిత్రింపబడి యున్నవి.

మనుష్యులనూ, మృగాలనూ చిత్రించకూడ దని ఖురాను నిషే ధించినందువల్ల మతావేశం గల ముసల్మానులు కొందరు ఈ కళన్ను పోషించక పోయినప్పటికీ, మొగలాయి చక్రవర్తులున్నూ, వారిఆశ్రితు లైన నవాబులున్నూ దీనిని ప్రోత్సహిస్తూనే వుండేవారు.

మహమ్మదీయుల కాలంనాటి నుంచీకూడా చక్కని చిన్న చిత్రాలను చిత్రించే ఒక క్రొత్తపద్ధతి హిందూమహమ్మదీయ చిత్ర కారులలో వ్యాపించింది. ఈ యుభయమతముల కళోపాసకులూ

ఒండొరులను గురుశిష్యులుగా స్వీకరించడానికి ఏలాంటి అభ్యంత రమూ వుండేది కాదు.

సంగీతము

భారతదేశంలో సజీవమైయున్న లలితకళలలో సంగీత మొకటి. దీని చరిత్రను చూస్తే హిందూ మహమ్మదీయ సభ్యతలు ఏరీతిగా మేళవించినదీ తెలుస్తుంది. ఉత్తర హిందూస్థానంలో జంత్రగాత్రముల సంగీతవిద్య వంశపారంపర్యముగా గాయకులుగా నున్న హిందూ మహమ్మదీయ కుటుంబములలో స్థిరంగా నెలకొని యున్నది. ఈ ఉభయ మతముల గాయకులూ ఒకే విధమైన సంగీతవిద్యను అభ్యసిస్తు న్నారు. ఒకే పాటలను పాడతారు. ఒకేవిధమైన జంత్రములను వాయి స్తారు. ఒకేవిధమైన రాగములను ఆలాపన చేస్తారు. ఈ సంగీతవిద్య పూర్వకాలంనాటి హైందవ సంగీతశాస్త్ర విధానమును పారశీక ఫణితు లతో మేళవించి నిర్మించిన ఒక అపూర్వమైన సంగీతసంప్రదాయ మ.గా నున్నది.

ఢిల్లీలో ఖిల్జీతోగ్లకు చక్రవర్తుల ఆస్థానవిద్వాంసుడుగా నుండిన అమీర్ ఖుస్రూ ఈ యపూర్వమైన సంగీతసంప్రదాయానికి మూలపురుషుడని అంటారు. ఇప్పుడు వాడుకలో నున్న కొన్ని రాగ ముల పేర్లూ, రాగిణుల పేర్లూ కూడా హిందూమహమ్మదీయ సమ్మేళ నానికి నిదర్శనములుగా నున్నవి. 'ఇమాన్ కల్యాణి' అనే రాగంలో 'ఇమాన్' అనే పారశీక పదమున్నూ, 'కల్యాణి' అనే సంస్కృత పదమున్నూ కలిసి ఏకసమాసమైనవి.

హిందూమహమ్మదీయ గాయకులు ఒండొరులకు గురుశిష్యు లుగా వుండేవారు. ఇలాగే హిందూ మహమ్మదీయరాజులు ఉభయ మతముల గాయకులనూ పోషించేవారు. ఇప్పటికీకూడా ఉత్తరహిందూ స్థానములో ఒకే తివాచీపైన హిందూమహమ్మదీయ గాయకులు తమ వీణలను, తంబురాలను వుంచుకుని సంగీతము పాడతారు. హిందూ మహమ్మదీయులు ఒండొరుల కచ్చేరీలలో మృదంగములను తబలాలను వాయిస్తారు. అన్నింటికంటే అపూర్వమైన సంగతి యేమిటంటే, ఈ

హిందూ మహమ్మదీయ గాయకులు పాడే పాటలలో రాధాకృష్ణ శృంగార గీతములు, రామభజన కీర్తనలు, శివతత్త్వములు, మహమ్మదీయ సూఫీగీతములు, అల్లా నుద్బోధించే తరంగాలూ ఎట్టి మతభేదమూ లేకుండా పాడతారు.

పాటలు, పదాలు

సంగీత విద్యలోలాగనే ప్రజలు పాడుకునే సామాన్యమైన గాలిపాటలలోనూ, పదాలలోనూ హిందూమహమ్మదీయ జనసామాన్యము ఇప్పటికీ ఒకే విధమైన పాటలూ, పదాలూ పాడతారు. ఉత్తర హిందూస్థానంలో హిందూ మహమ్మదీయుల ఇళ్లల్లో జరిగే శుభ కార్యాలలోనూ, హిందూమహమ్మదీయుల పండుగులలోనూ, బాల బాలికల పుట్టినరోజుపండుగులలోనూ, పెళ్లిళ్లలోనూ స్త్రీలు ఒకేవిధమైనపాటలు పాడతారు. పిండి విసిరేటప్పుడు, బరువులు మోసే ప్పుడు, పడవలు లాగేటప్పుడు, ఇళ్ళ డాబాలమీద సున్నమునకు గి రావడానికి కొట్టేటప్పుడు, ఇంకా నలుగురు కలిసి కాయకష్టం చేసే న్ని సందర్భాలలోనూ కూడా మన దంపుళ్లపాటలు, రోకంటిపాటలు, డవపాటల లాంటి పాటలనే అక్కడ కూడా పాడుతూ వుంటారు. ందులో హిందూ మహమ్మదీయ భేదము లేనేలేదు.

బీహారు పరగణాలోనూ, ఉత్తర హిందూస్థానములో అనేక ాంతాలలోనూ ముసల్మానుల ఇళ్లల్లో పాడే జోలపాటలు 'నంద్ ాల్' అని శ్రీకృష్ణుణ్ణి ఉద్దేశించి వ్రాయబడిన హిందువుల పాటలే! ృష్ణుని శ్యామలవర్ణమునే 'శాన్‌వాల్యా' అనే పదముగా మార్చి ాడుతూవున్నట్లు పరిశోధకులు కనిపెట్టినారు. *ఇలాగే బీహారులోనూ త్తరదేశ పరగణాలలోనూ మహమ్మదీయ స్త్రీలు పాడే పెళ్ళిపాటలు ాడా హిందువులవే. ఉదాహరణానికి ఈ క్రిందిపాట చూడండి.

అల్బేలీ జచ్చా మన్ కరే నంద్‌లాల్‌సే
సోహాగన్ జచ్చా మన్ కరా నంద్‌లాల్‌సే
అల్బేలీ నే ముఝే దర్‌ద్ దియా
శాఁవాల్యానే ముఝే దర్‌ద్ దియా.

—అనగా, "నందలాలే తన కడుపున పుట్టాలని తల్లి మనసారా కోరింది. ఆనంద భరితురాలైన ఆ తల్లి నందలాలే తన కడుపున పుట్టాలని కోరింది. మా అబ్బాయి నన్ను బాధలు పెట్టాడు; నీల(మేఘ) శ్యాముడు నన్ను బాధలు పెట్టాడు" అని యీపాట తాత్పర్యము. ఈ పాటలో "నంద్‌లాల్, శాన్‌వాల్యా" అనే మాటలు శ్రీకృష్ణుని ఉద్దేశించినవే నని ఒక మహమ్మదీయ గ్రంథకర్త వ్రాసియున్నాడు. (౧౯౧౦-వ సం॥ 'మోడరన్‌బిహార్' ౮-వ పుటలో బ్యారిష్టర్ మజ్రుల్ హక్కుగారి వ్యాసం చూడండి)

ఉత్తర హిందూస్థానంలో పంజాబురాష్ట్రంలో వివిధగ్రామాలలో హిందూమహమ్మదీయ ప్రజలు పాడేపాటలలోని కథలలో కూడా తేడాలు లేవు. ఇలాగ హిందువులు మహమ్మదీయ కథలనూ, మహమ్మదీయులు హిందువుల కథలనూ, పాటలుగానూ, కలాపములుగానూ, వీథినాటకములుగానూ, పాడుకొంటున్నారు.

భాష - సాహిత్యము

వంగరాష్ట్రంలో మహమ్మదీయు లందరూ బంగాళీభాషనే మాట్లాడు తారు. ఇలాగే పంజాబులో పంజాబీనీ, సింధులో సింధీ భాషనూ, ఇతర ప్రాంతాలలో ఆయారాష్ట్ర భాషలనూ, మాట్లాడ తారు. ఉత్తర హిందూస్థానంలో విద్యావంతులైన హిందువులూ, మహమ్మదీయులూ కూడా మాట్లాడేటప్పుడుగాని, పద్యగద్య రూపంగా గ్రంథాలు వ్రాసేటప్పుడుగాని, ఉర్దూభాషనే వాడతారు. ఈ ఉర్దూ భాష వ్యాకరణము మన దేశభాషల సంప్రదాయానికి చెందినదే. అందులోని శబ్దాలు మాత్రం ఎక్కువగా ఫారసీ భాషలోనివి. ఈ ఉర్దూభాషలో ఉత్తమ గ్రంథాలు రచించిన వారిలో హిందువులూ, మహమ్మదీయులూ కూడా సమానంగా వున్నారు. హిందువులలో ఉర్దూభాషలో సుప్రసిద్ధుడైన కవి దయాశంకర్ నశీం. వచనంలో పేరుపొందిన గ్రంథకర్త పండిత రతన్‌నాథ్.

ఇంతేకాదు. పారశీకభాషలో నుంచి మన దేశభాషలలోకికూడా చక్కని పదాలు చాలా వచ్చి కలిసినవి. మన దేశభాషలలో పాండి

త్వము సంపాదించిన మహమ్మదీయులు కూడా చాలామంది వున్నారు. తరువాత కొంతకాలానికి తులసీదాసు సుప్రసిద్ధమైన తన రామాయణాన్ని రచించిన అవధి-హిందీభాషలో-క్రీ. శ. ౧౫౪౦ లోనే మలీకు మహమ్మదు అనే ముసల్మానుకవి 'పద్మావతి' అనే చక్కని కావ్యాన్ని రచించాడు. ఇందులో భూలోకసుందరియైన పద్మావతి, ఆమె భర్త రతన్‌సింగుల ప్రణయగాథ, అల్లావుద్దీన్‌చక్రవర్తి చిత్తూరు దుర్గాన్ని ముట్టడించగా పురుషులు వీరస్వర్గాన్ని అలంకరించడము, రాజపుత్ర స్త్రీలు జోహారుచేయడము మొదలైన అంశాలను ఎంతో రసవంతంగా ఈ ముసల్మానుకవి వర్ణించాడు.

జీవాత్మ, పరమాత్మకోసం వెదుక్కునే అంతరార్థాన్ని కూడా ఆ కావ్యంలో స్ఫురింపజేయడంవల్ల ఈ కవికి హిందువుల సంగతి ఎంత బాగా తెలుసునో, వారియం దెంత స్నేహభావ మున్నదో-కనబడుతూ వుంది.

హిందీభాషలో ఉత్తమగ్రంథాలను రచించిన ముసల్మానులలో అక్బరుచక్రవర్తిసభలోని నవరత్నాలలో ఒకడైన అబ్దుల్ రహీము ఖాన్‌ఖానన్, తాను హిందీలో కవిత్వంచెప్పడమే గాక, హిందీ సాహిత్యానికి పోషకుడుగా కూడా ప్రసిద్ధికెక్కినాడు. అతడు రాధాకృష్ణ శృంగార గీతముల నెన్నో రచించాడు.

బంగాళీభాషలో కవిత్వం చెప్పిన మహమ్మదీయులు చాలా మంది వున్నారు. మలీకుమహమ్మదుగారి 'పద్మావతి'ని అల్వాల్ అనే కవి బంగాళీభాషలోకి చక్కగా అనువదించాడు. వంగరాష్ట్రాన్ని పరిపాలించిన మహమ్మదీయనవాబులు చాలామంది బంగాళీ సాహిత్యాన్ని బాగా ఆదరించారు. చైతన్యస్వామి ప్రచారంచేసిన వైష్ణవమతము కొంతమంది మహమ్మదీయులను ఆకర్షించినది. ఆకాలంలో వైష్ణవ మతంలో కలిసిన ముసల్మానులలో హరిదాసు ఒకడు. అలాంటివారిలో కొంతమంది రాధాకృష్ణులను గురించీ, చైతన్యస్వామినిగురించీ పదాలూ, పాటలూ రచించారు. దినేశచంద్రసేను, అబ్దుల్‌కరీము, వ్రజసుందర సన్యాల్‌గార్లు చేసిన కృషివల్ల బంగాళీభాషలో ఈ విధంగా వైష్ణవ

గ్రంథాలను రచించిన ముసల్మాను వైష్ణవకవుల పేర్లు ౨౮ దాకా బయటపడినవి. ఈ కవులలో సయ్యద్ మర్తుజాగారి వైష్ణవగీతము లతిరమణీయంగా నున్నవని తెలిసినవారంటున్నారు.

ఇలాగ ఈ ప్రాంతాలలో హిందువులకూ మహమ్మదీయులకూ కూడా బంగాళీభాషే మాతృభాషగా నుండడమేగాక ఉభయులకూ భారతీయ సాహిత్య సంప్రదాయములే ప్రీతికరంగా నుంటున్నవని స్పష్టంగా కనబడుతూవుంది.

పంజాబులోను, అయోధ్య ఆగ్రారాష్ట్రాలలోనూ చాలాకాలం నుంచి ఉర్దూభాషా, పారశీభాషా విద్యాధికుల యాదరణకు పాత్ర ములై ఉంటున్నవి. వీరికి భారతీయసాహిత్య సంప్రదాయాల కంటే పారశీకసాహిత్య సంప్రదాయాలే ఎక్కువ ఆదరణ పాత్రంగా నుంటూ వున్నవి. అందువల్ల యీ ప్రాంతాలలో సామాన్యజనులలో మహమ్మ దీయులలాగనే హిందువులలో కూడా హైందవపురాణ కథలకన్నా, భారతీయసాహిత్య విషయాలకన్నా "యూసుఫ్ - జులేఖా", "షిరీన్-ఫరీద్", "గులేబకావలి", "లైలామజ్నూన్" మొదలైన పారశీక కావ్యకథలే ఎక్కువ బాగా తెలుసును. ఇటీవల కొంతకాలం క్రిందట ఆప్రాంతాల హిందువులు తమ మతానికీ, పూర్వ నాగరికతకూ, విజ్ఞానానికీ సంబంధించిన సాహిత్యంకూడా బాగా తెలుసుకోవడం అవసర మనే ప్రచారంకూడా చేయవలసి వచ్చింది.

వాణిజ్యము - పరిశ్రమలు

ప్రజల వేషభాషలలో లాగనే వాణిజ్యవ్యాపారములలోను, పరిశ్రమలలోను, వృత్తులలోనూ కూడా హిందూమహమ్మదీయ సమ్మేళనము కనపడుతూ వుంది. హిందువులు అతిపవిత్రంగా నెంచి అన్ని శుభకార్యాలలోనూ మడిబట్టగా ధరించే కాశీపట్టు తాపితాలు నేసేవాళ్లు మహమ్మదీయ నేతగాళ్లే! ఈ తాపితాల్లోను అంచులలోను నేతలోనే కనబడే పట్టుజలతారు డోరియాలు, పువ్వులు, చిత్రములు కేవలమూ హిందువుల యాచారమునకు సంబంధించిన నమోనాలే. దీనిని మహమ్మదీయులు నేయడమూ, హిందువులు ధరించడమూ

చూడగా నొకరి ఆచారవ్యవహారాల నొక రెంతచక్కగా గ్రహించి అందు కనుగుణ్యముగా కావలసిన వస్తుసామగ్రి నెంత శ్రద్ధతో తయారు చేయగలరో తెలుస్తుంది.

ఇలాగే పూజలలో ఉపయోగించే శ్రీ యంత్రమును స్ఫటికము పయిన చెక్కే శిల్పులు మహమ్మదీయ పనివాళ్లే. మంత్రశాస్త్రము నకు సంబంధించిన యంత్రతంత్రములలో ఒక్క బీజాక్షరము గాని, భుజముగాని తప్పరాకుండా చెక్కవలెనంటే ఎంత శ్రద్ధాభక్తులతో ఆపని చెయ్యాలో ఊహించవచ్చును.

హిందూ మహమ్మదీయులు ఇళ్లలో నుపయోగించే హుక్కాలు, పాన్ దానులు, అత్తరుదానులు, తివాచీలు, ఇంకను గొప్పవాళ్లు వుప యోగించే వివిధములైన వస్తువులూ, హిందూ మహమ్మదీయ పారి శ్రామికులు ఎలాటి మతభేదమూ లేకుండా తయారు చేస్తారు. ఇత్తడి సామానుల మీదా, రాగిసామానుల మీదా, లక్కతో నగిషీపనిచేసే కులవృత్తి మహమ్మదీయులది. అయితే జయపురంలో హిందూ పారి శ్రామకులీపని నేర్చుకొని ఈ వస్తువులను తయారుచేయడం ప్రారంభించి ఈ సామానుల మీద హిందువుల పురాణకథలను గూర్చిన చిత్రములూ, మత సంబంధమైన ఇతర నమోనాలు, బొమ్మలు చెక్కే వారు. ఇది చూసి ఈ జయపురపు హిందూ పారిశ్రామికుల లాగనే మహమ్మదీయ పారిశ్రామికులు కూడా ఈ బొమ్మలను, నమోనాలను వెయ్యడం ప్రారంభించారు. లుంగీలూ, పగ్రిలనే తలపాగాలూ చేసే వృత్తిలో హిందువులూ, మహమ్మదీయులూ కూడా నున్నారు. అనేక గృహపరిశ్రమలలో ఒక వస్తువును కొంతవరకూ ఒకజాతి పనివాడూ, తక్కిన భాగమును రెండవజాతి పనివాడూ చేయడము కూడా కద్దు. కీన్కాబు, జరీ, పట్టు, బుటేదారీ పరిశ్రమలో మతలబును తయారుచేసే పనివాళ్లందరూ హిందువులే. కీన్కాబు కార్ఖానాలన్నీ హిందువులవే. కాశీలో కీన్కాబు నమోనాలు తయారు చేసేవారందరూ మహమ్మదీయులు. నేతగాళ్లలో హిందువులూ, మహమ్మదీయులు కూడా వున్నారు. వీటిని విక్రయించే వర్తకులందరూ హిందువులే. హిందూ

రాజ్యాలైన రాజపుత్రస్థానంలోని సంస్థానాలలో రాళ్లను చెక్కే శిల్పు లందరూ మహమ్మదీయులే.

మ త ము

మతవిషయంలో కూడా హిందూమహమ్మదీయ సమ్మేళనకు నిదర్శనాలు కనబడుతున్నవి. హిందూ దేశంలో జన్మించిన వాళ్లందరికీ సాకా రేశ్వరా రాధనమున్నూ, కర్మకాండయున్నూ సామాన్యధర్మములుగా నుంటున్నవి. హిందూ దేశంలోని మహమ్మదీయులలో చాలామంది హిందువులుగా నుండినవాళ్లే. ఇంతేగాక ఈ దేశంలోకి మహమ్మదీయమతం సూటిగా అరబ్బీదేశంలోనుంచిగాక మధ్యమజిలీయైన పారశీక దేశంలోనుంచి వచ్చినందువల్ల పారశీక దేశంలోనే కొంత మార్పుచెంది యిక్కడికి వచ్చినది. ఇలాగ కొంత మార్పుచెందివచ్చిన యీ మహమ్మదీయమతము ఈ దేశంలోని హిందువుల వైదికమత ధర్మాలతో ఏడుశతాబ్దాలు సహవాసం చేసింది. అందువల్ల యీ మహమ్మదీయమతము ఆచారాలలోను, కర్మకాండలోను ఇక్కడ చిత్రవిచిత్రాలైన మార్పులను జెంది ఇతర దేశాలలో నున్న ఇస్లాము మతధర్మాలకు చాలా విషయాలలో భిన్నంగా పరిణమించియున్నది. ఈపరివర్తన మెంతవరకూ జరిగిన దనగా ఉత్తర హిందూస్థానములోని జనసామాన్యము ఈ ప్రకారంగా మార్పుచెందిన ఇస్లాము మతము యొక్క అరాధనలందున్నూ, ఉత్సవములందున్నూ, పండుగులలోనూ పాల్గొనడానికి గాని, మహమ్మదీయుల పవిత్రస్థలాలకు తీర్థయాత్రలకు పోవడానికిగాని హిందువులకు ఎలాంటిసంకోచమూ లేకుండాహిందువులు అలా చేస్తున్నారు. హిందువుల లాగానే మహమ్మదీయులలో సామాన్య జనులుకూడా హిందువుల ఆరాధనలలోనూ, ఉత్సవాలలోనూ, ప్రదర్శనాలలోనూ పాల్గొంటూ వారి యాత్రాస్థలాలకు పోతున్నారు.

పీ ర్లు - మొ క్కు బ డు లు

హిందూ మతధర్మాల సాహచర్యంవల్ల మార్పుచెందిన ఇస్లామును గురించి ప్రాచ్య పాశ్చాత్య గ్రంథకర్త లనేకులు పరిశోధనలు చేసి వ్రాసియున్నారు. ఈమార్పు ముఖ్యంగా పీరు లనబడు మహమ్మ

దీయ మహాత్ముల పవిత్రస్థలములలో జరిగే మొక్కుబడులలోనూ, పూజలలోనూ, ఉత్సవాలలోనూ, సంతలలోనూ, బాగా కనబడుతూ ఉంది. ఈ పీరుల యారాధనము హిందూదేశపు సరిహద్దులు దాటిన తరువాత యింక యే మహమ్మదీయ రాజ్యంలోనూ లేదు. ఇది హిందువులలో పూర్వం బౌద్ధ బోధిసత్వులకూ, జైనతీర్థంకరులకూ, వైష్ణవఆళ్వారులకూ, శైవభక్తులకూ జరిగే ఆరాధనలు, అర్చనలు, మహోత్సవములు వంటివే.

హిందువులు ముప్పైమూడుకోట్ల దేవతలను ఆరాధిస్తూ వారికి మొక్కుకుంటూ ఉన్నట్లే మహమ్మదీయులైన హిందువులకు కూడా ఒక విధమైన ఆరాధనలు, అర్చనలు, మొక్కుబళ్లు, ఉత్సవాలూ అవసరమై ఈ పీరుల ఆరాధన బయలు దేరింది. ఈ ప్రజలకు ఆపద వచ్చినప్పుడు పీరులకు మొక్కుకోవడమూ, సామాన్యజనులు తమ యిష్టసిద్ధులు చేయవలసిందని పీరులకు మొక్కుకోవడమూకూడా ప్రబలింది. హిందువుల దేవతలలాగనే మహమ్మదీయుల పీరులుకూడా మంచి చెడుగులకు కారణభూతము లైనట్లే ప్రజలు విశ్వసించి అందు కనుగుణముగా వారి నర్చించడం ప్రారంభమైనది. దీనితోపాటు వ్యాజ్యములు గెల్పించ మని మొక్కులు, ప్రయాణంలో కార్యసాఫల్యం చేయుమని మొక్కులు, తాయత్తులు, శకునములు, దీవనలు మొదలైన హిందూఆచారా లన్నీ మహమ్మదీయులలోకూడా ప్రబలమైనవి. ఇలాంటి పీరులను కొలిచే మహమ్మదీయజనసామాన్యము, తోడి హిందువులను చూసి గ్రామదేవతలకు మొక్కుకోవడమూ, గొట్టాలమ్మా, మహామ్మారీ మొదలైన క్షుద్రదేవతలను కొలిచే బీద హిందువులు మహమ్మదీయ సోదరుల పీరులకు మొక్కుకోవడమూ, ఫకీరుల దీవనలూ, పైగంబరుల ఆశీర్వాదములూ పొందడమూ ఒక వింత సంగతి కాదు.

పండుగలు - పర్వములు

● భారత దేశమున మహమ్మదీయులు తమ మతానికి సంబంధించిన ఉత్సవాలు జరపడంలోకూడా అనేక హిందూసంప్రదాయాలను అవ

లంబించారు. అరబ్బీ దేశంలోని ఇస్లాములో ఎట్టి సాకార దేవతార్చనముగాని, మేళతాళములు నృత్యగీత వాద్యములుగాని లేక ఆనంద రహితమైన మానసికారాధన ప్రార్థనలు మాత్రమే వుండేవి. మన దేశానికి వచ్చిన మహమ్మదీయులు చిరకాలంనుంచి హిందూసంప్రదాయాలకు అలవాటుపడి తాము జీవించే దేశంలోని ప్రకృతిదృశ్యాలకూ, జంతువులకూ, భూసారముపైన ఆధారపడే పాడిపంటలకూ సంబంధించి, ఇంద్రియములకూ మనోభావములకూ రుచించే ఆచార వ్యవహారములు, కర్మకాండలకు అలవాటుపడిన ప్రజలకు ఈ ఆనంద రహితమైన వీరమహమ్మదీయ మతాచార ధర్మములు రుచించలేదు. అందువల్ల మన ముసల్మానులు తమ మనోభావాలకు, వాంఛలకు అనుగుణములైన పండుగలు పర్వములు, ఉత్సవములు ఊరేగింపులు, అర్చనలు, ఆరాధనలూ కల్పించుకొన్నారు. హిందువుల గంగాపూజలకు బదులుగా మహమ్మదీయులు భాద్ నే (భాద్రపద) మాసమున 'క్వాజాఖిజిర్' పండుగను చేయడం ప్రారంభించారు. పూర్వకాలం నాటి మహమ్మదీయ మతయుద్ధానికి సంబంధించిన మొహారంపర్వదినములందు మహమ్మదీయులు చేయు ప్రార్థనాదికములూ, ఉత్సవములూ భారత దేశమందు నూతనరూపం దాల్చినవి. దానిని హిందువుల పండుగలాగ మార్చి, హిందువులు అవలంబించే అనేక ఆచారాలూ, కర్మకాండలూ మన ముసల్మానులు ఈ మొహారంలో అవలంబిస్తున్నారు.

ప్రాచ్య పాశ్చాత్య గ్రంథకర్తల సాక్ష్యము

ప్యారిస్‌లో ప్రాచ్యదేశ భాషల పండితుడుగా నుండిన మా. గార్సిన్ డీ టాసీ (M. Garcin de Tassy) గారు భారతదేశమునందలి హిందూస్థానీ పారశీ సాహిత్యమును తరచి హిందూదేశములో మహమ్మదీయ మతము పొందిన మార్పులను గురించి ౧౮౩౧ లో ఒక గొప్పవ్యాసాన్ని వ్రాసి ప్రకటించారు. కాజీం ఆలీ జవాన్ సాహేబు గారు హిందూస్థానీలో "బారామాష్" (పన్నెండు నెలలు) అనే గ్రంథంలోనుంచీ షెర్ ఆలీ ఆఫ్గన్ సాహేబుగారు రచించిన హింగూ

స్థానచరిత్రలోనుంచీ, ఇంకనూ ఇతర ముసల్మానుగ్రంథకర్తల ఉద్గ్రంథాలలోనుంచీ ఈ టాసీగారు తాను వ్రాసిన సంగతులన్నీ గ్రహించినందువల్ల ఈ విషయంలో ఇది చాలా ప్రమాణగ్రంథంగా వుంది. ఇలాగే మా. గస్టవ్ లీ బాన్ అనే ఇంకొక ఫ్రెంచిగ్రంథకర్త కూడా 'భారతదేశమునందలి నాగరికతలు' అనే గ్రంథంలో హిందూదేశంలో మహమ్మదీయ మతాచారాలు పొందిన మార్పులను గురించి చక్కగా వివరించి యున్నాడు.

విదేశీయులే గాక భారతీయులు కూడా - అందులో సుప్రసిద్ధ విద్వాంసులైన మహమ్మదీయ ప్రముఖులు కూడా ఈ విషయాన్ని గురించివ్రాసియున్నారు. యూసుఫ్ అలీ; ఎం.ఏ., ఎల్ ఎల్. బి., ఐ.సి. ఎస్. గారు 'భారత దేశ ప్రజల జీవనము, వృత్తులు' అనే గ్రంథంలో ఈ విషయాన్ని బాగా చర్చించి హిందువులు తమ పితృదేవతలకు పిండములు పెట్టుతూవుంటే హిందూదేశంలోని మహమ్మదీయులు 'షిర్నీ' యనే ఆచారాన్ని అవలంబించి యున్నారననీన్నీ, గ్రామాలలోని జులహా తేలీ మహమ్మదీయులు హిందువులలాగనే మశూచికాలు రాకుండా గ్రామదేవతలకు మొక్కుతున్నా రనిన్నీ, హిందువులు కాశీ రామేశ్వరాలకు పోయినట్లే మహ్మదీయులు ఘాజీమియాన్ గోరీ దగ్గరికి యాత్రకు పోతున్నారనన్నీ, పాంచ్ పీరులనుగురించి పాటలు పాడతారనిన్నీ, ౧౯౧౦ లో వ్రాసియున్నారు.

డబ్లియు. క్రూక్ (Crooke) అనే ఐ. సి. యస్. ఉద్యోగి The North Western Provinces of India అనే తన గ్రంథములో ఇలాగ వ్రాశాడు.

"ఎట్టి కళంకముగాని, కల్మషముగాని, అనాచారములు గాని, మూఢవిశ్వాసములుగాని లేక ఖురాను షరీఫులో సూత్రప్రాయంగా నిర్వచింపబడిన ఇస్లాము సిద్ధాంతాలను అవలంబించే మహమ్మదీయులు ఈ భారత దేశంలో బహు కొద్దిమంది మాత్రమే వున్నారు. ఇలాంటి కఠిననియమాల మతాన్ని అనుష్ఠించే వారిలో వాహాబీలు, లేక అహాల్-ల్-హాదీ లనువారు మాత్రమేయున్నారు. విగ్రహారాధనకు

దగ్గిర సంబంధంగల ఆచారాలనూ, ఉత్సవాలనూ, పీరుల గోరీలదగ్గిర మొక్కులనూ వీరు అంగీకరింపక అట్టి ఆచారాలను అవలంబించే ముసల్మానులను "ముష్రికులు" - అనగా భగవంతునితో ఇంకొక వ్యక్తిని కలిపేవారని వ్యవహరిస్తున్నారు. పొగచుట్ట తాగడమును, తావళము తిప్పడమును కూడా వీరుసహించరు."

పూర్వకాలము కంటె తరవాత కాలంనాటి మహమ్మదీయ మతము హిందూమతా చారాలపట్ల చాలా సహనం చూపిస్తూవచ్చిందని పైన చెప్పిన డబ్లియు. క్రూకుగారు, పశ్చిమోత్తర పరగణాలను గూర్చి ౧౮౯౬లో ప్రకటించిన గ్రంథంలోనే వ్రాసినారు.

ముసల్మానులూ, హిందువులూ కలిసి పీరులను ఆరాధించే పద్ధతులూ, వారి గౌరవార్థము చేసే ఉత్సవాలూ, పీరుల గోరీలదగ్గిరకి తీర్థయాత్రలు చేసేటప్పుడు అవలంబించే పద్ధతులూ, వర్ణించాలంటే ఒక పెద్దగ్రంథం అవుతుంది.

ఆంధ్ర ముసల్మానులు

మన తెలుగు దేశంలో మహమ్మదీయుల ఇళ్ళలో చేసే జాతకర్మలు, వివాహాదిశుభకార్యాలలోను, పండుగలు పబ్బాలలోను అవలంబించే ఆచారాలు మన ఆచారాలకు చాలా సన్నిహితంగా వుండడం అందరికీ తెలుసును. పెళ్ళిళ్ళలో పెళ్ళికూతురుకు పసుపు నలుగు పెట్టడం దగ్గిర నుంచీ పెళ్ళికుమారుడిని మల్లెపువ్వుల జాలరుతో గుర్రం మీద కత్తితో ఊరేగించడంవరకూ మన క్షత్రియకులాచారాలే ముసల్మానులలోకూడా కనబడుతున్నవి. మహమ్మదీయులలో చచ్చిపోయినప్పుడు చేసే అపరకర్మలు కూడా చాలావరకూ హిందువులు చేసేటటువంటివే వున్నవి. వారి "ఫాతెహా" మన స్వర్గపాథేయమునకు చాలా సన్నిహితంగా వుంది. ఆఖరికి ఒకవిధమైన తద్దినాలుకూడా వాళ్ళు పెడుతున్నారు. ఇంక మంచిరోజులనీ, వర్జమనీ, వారమనీ వాళ్ళలోకూడా చాలా పట్టింపులు వున్నవి. ఎన్నికబుర్లు చెప్పినా పక్క ఇంటి హిందువు పాటించే శకునాలను ఇరుగుపొరుగుక్కే మహమ్మదీయుడు

పాటించకుండా వుండలేక పోతున్నాడు. ఇప్పటి గ్రామాదులలో హిందువులూ, మహమ్మదీయులూ అన్యోన్యంగా వుంటూ వరసపెట్టి పిలుచుకుంటూ భారతభూమి కడుపున పుట్టిన అన్నదమ్ముల లాగనూ, అక్కచెల్లెళ్ళ లాగనూ జీవిస్తూన్నారు. ఇదంతా మనకు అనుభవైక్య వేద్యమే కదా!

---

౮. చెన్నపట్నం గవర్నరు దుర్గతి

ఇంగ్లీషువారీ దేశానికి వర్తకం చేసుకోవడానికి వచ్చేటప్పటికి విజయనగర సామ్రాజ్యం విచ్ఛిన్నం అయినా చెన్నపట్నం సముద్ర తీర ప్రాంతాలన్నీ ఆచక్రవర్తుల వంశీకులైన చంద్రగిరిరాజుల పరిపాలనలోనే వుండేవి. ఆరాజుగారి కిందిఅధికారిని ఆశ్రయించి ఇంగ్లీషు వారు 1639 లో పట్టాపొంది చెన్నపట్టణం దగ్గిర ఒక కోట కట్టుకుని అక్కడ వర్తకం చేసుకుంటూవుండగా దేశమంతా గోలకొండ నవాబుల వశమైంది. తరువాత 1687 లో మొగలాయి చక్రవర్తియైన ఔరంగజేబు గోలకొండను జయించగా యీ ప్రాంతాలన్నీ ఆయన తాబేదారుడైన కర్నాటకనవాబు పరిపాలనకిందికి వచ్చినవి. ఇంగ్లీషు వారు ఏయెండకు ఆగొడుగుపట్టుతూ మొదట చంద్రగిరి రాజులను, తరువాత గోలకొండ నవాబులనూ అటుతరువాత కర్నాటక నవాబునూ ఆశ్రయిస్తూ కాలక్షేపం చేసేవారు.

ఆ ర్కా టు న వా బు

ఇలాగ ఉండగా దేశంలో అంతఃకలహాలు కలిగి ఇంగ్లీషువారు బలవంతులై మనరాజులను, నవాబులను బంతులనాడించినట్లు ఆడించి రాజ్యాధికారాలను చేజిక్కించుకోవడానికి అవకాశాలు కలిగినవి. కర్నాటక నవాబు అన్వరుద్దీను 1749 లో చనిపోగా అతని కుమారుడైన మహమ్మదాలీ నవాబు అయినాడు. పూర్వపు నవాబుగారి అన్న కుమారుడి అల్లుడైన చందాసాహేబు ఈకర్నాటక రాజ్యసింహాసనాన్ని

ఆక్రమించాలని సంకల్పించి ఈవిషయంలో తనకు సహాయం చేయవలసినదని అప్పట్లో పుదుచేరీ ప్రాంతాలలో బలవంతులుగానున్న ఫ్రెంచి వర్తక కంపెనీవారిని ఆశ్రయించాడు. అప్పుడు మహమ్మదాలీ సహజంగా, ఫ్రెంచివారికి పోటీగానున్న ఇంగ్లీషు వర్తక కంపెనీవారిని ఆశ్రయించాడు. అంతట ఈ కర్నాటక రాజ్యసింహాసనంకోసం యుద్ధాలు ప్రారంభమైనవి. ఆయుద్ధాలలో ఇంగ్లీషువారు జయించడంలో మహమ్మదాలీ రాజ్యాధికారం స్థిరపడింది. అతడు ఇంగ్లీషువారికి వశుడై వారిచేతులలో కీలుబొమ్మయై వారెలాగ చెపితే అలాగ వినవలసి వచ్చినది. కర్నాటక రాజ్యానికి మహమ్మదాలీ పేరునకు నవాబుగానున్నాడుగాని నిజమైన ప్రభుత్వాధికారా లన్నీ ఇంగ్లీషువారే చలాయించడం ప్రారంభించారు. యుద్ధాలలో సహాయం చేసినందుకు సాలుకు ఏడులక్షల వరహాలు నవాబు కంపెనీవారి కివ్వాలి. అది చెల్లించడానికి సొమ్ము లేక నవాబు ఋణాలు చేయవలసివచ్చింది.

కర్నాటక నవాబు మొదట ఆర్కాటును రాజధానిగా చేసుకొని యున్నందువల్ల ఆయనను ఆర్కాటు నవాబుఅనికూడా అనేవారు. తరువాత అతడు చెన్నపట్నంచేరి ఒకదివ్యభవనంలో కాపురంవుంటూ వచ్చాడు. అతడు తనభోగవిలాసాలకోసమూ, ఇంగ్లీషు అధికారులను మెప్పించడముకోసమూ దుర్వ్యయంచెయ్యడం ప్రారంభించాడు. కంపెనీ ఉద్యోగులకు బహుమతులూ, లంచాలూ విరివిగా నిచ్చేవాడు. చాలా మంది దొరలకు ఉద్యోగా లిచ్చి తనవద్ద వుంచుకొనేవాడు. 1758 - 1780 మధ్య అతని ఆతిథ్యమునుభొందిన దొరలూ, దొరసానులూ అతని దర్బారువైభవమును, భోగవిలాసాలను, దుబారాఖర్చును చిత్రచిత్రాలుగా వర్ణించియున్నారు. ఆర్కాటునవాబు యొక్క రాజ్యాధికారము కేవలమూ ఇంగ్లీషువారి దయాధర్మాలపైననే ఆధారపడి వున్నందువల్ల ఏదో నెపంమీద చీటికీ మాటికీ కంపెనీ అధికారులు అతనిని సొమ్ము ఇవ్వవలసిన దని పీడించేవారు. కొందరు ఉద్యోగులు అతనిని నయానా భయానా సొమ్ము తెమ్మని బలవంత పెట్టేవారు. కొందరు అతనికి సహాయం చేసామని

విధాలుగా సొమ్ము పిండుతూవుంటే నవాబుకి ఏంతసొమ్మైతే చాలుతుంది గనక? అందుకోసం అతడు అప్పులపాలు కావలసివచ్చింది.

నవాబు తనఅవసరంకొద్దీ ఎక్కువ వడ్డీలకు ఋణపత్రాలు వ్రాసిఇచ్చేవాడు. కొందఱు ప్రబుద్ధులు అతనిని మోసగించి, బలవంతపెట్టి నూటికి 24 మొదలు 48 వంతులచొప్పున అత్యధికమైన వడ్డీలువేసి ప్రతిఫల శూన్యంగాకూడా కొన్ని ఋణపత్రాలు వ్రాయించుకున్నారు. ఇలాగ వ్రాయించుకొన్న ఋణపత్రాలతాలూకు సొమ్ము వెంటనే ఇవ్వవలసిందని బలవంతపెట్టి యివ్వకపోతే కంపెనీ అధికారులకుచెప్పి తగిన శాస్తి చేయిస్తామని బెదరించి అందుకింద అతని రాజ్యభాగాలను స్వాధీనతాకట్లు వ్రాయించుకొనిన్నీ, సిస్తులవసూళ్ళ యిజారా హక్కులను పొందినీ్న, అతనిరాజ్యంలో ప్రవేశించి, శిస్తులవసూళ్లలో రైతులను బాధించడం ప్రారంభించారు. ఈపత్రాలను దొరలు బాహాటంగా బజారులోపెట్టి క్రియవిక్రయాలు చెయ్యడం ప్రారంభించారు. ఆకాలంలో చెన్నపట్నంలో ఇంగ్లీషు వర్తకకంపెనీవారి కొలువులో పనిచేసే గొప్ప అధికారులైన దొరలలో చాలమంది ఇలాంటిపత్రాలు వ్రాయించుకొని యీ యన్యాయాలలో భాగస్వాములై ఉన్నందువల్ల కర్ణాటునవాబు ఋణపత్రాల మార్పిడి ఒకపెద్దవ్యాపారంగా సాగింది.

చెన్నపట్నం గవర్నరు కార్యాలోచనసభలో వ్యవహారాలన్నీ అధికసంఖ్యాక సభ్యుల అభిప్రాయాన్ని బట్టి జరగాలనే నియమం ఒకటి యున్నందువల్ల ఈ నవాబుగారి బాకీదారులు కార్యాలోచన సభ్యులకు లంచాలిచ్చీ, భాగాలిచ్చీ వారిని లోబర్చుకొని తమకు కావలసిన అధికారాలను, ఉత్తర్వులనూ సంపాదించేవారు. అందువల్ల కంపెనీ ఉద్యోగులలో ఎవరైనా ఈ అన్యాయానికి అంగీకరించక వాటిని ప్రతిఘటిస్తే ...క్కినవా రందఱూ వేటకుక్కలలాగ అతని మీదపడి బాధించేవారు. అందువల్ల ఎవ్వరూ ఈ యన్యాయాన్ని అరికట్టలేకపోయేవారు. కొంతమంది గవర్నర్లు కూడా ఈ యన్యాయపువ్యవహారాలలో భాగస్వాములైనట్లు కంపెనీరికార్డులవల్ల కనబడుతూ వున్నది.

కంపెనీవారికి సైనికవ్యయంకిరింద సాలుకి ఏడులక్షల వరహాలు చొప్పున చెల్లించవలసిన సొమ్మును నవాబు చెల్లించలేక బకాయి పెట్టి అందుకింద 1763లో జాగీరుజిల్లా అని ప్రసిద్ధి చెందిన చెంగల్పట్టు జిల్లాను కంపెనీ వారికి సమర్పించాడు. అయితే మళ్లీ సాలుకి 3½ లక్షలవరహాలను చెల్లించే పద్ధతిని ఆజిల్లాను వారివల్ల 1768 మొదలు 1780 వరకూ అతడు కవుల్కు పుచ్చుకొంటూ ఆసొమ్ముకూడా చెల్లించలేక బాకీ పడినాడు. అంతట 1780 లో కంపెనీవారే ఆజిల్లాలో శిస్తులువసూలు చేయడానికి యిజారాలు పాడించి బాకీకిరింద వసూలు వేసుకొనేవారు. ఆబాకీ తీరడం అంటూ లేదు.

ఇలాగ నవాబుగారు లోకుల కివ్వవలసిన మొత్తం పాపం పెరిగినట్లు పెరిగి, కొన్నికోట్ల వరహాలు తేలింది. బాకీదారులు తమబాకీలను గుఱించి గోలచెయ్యడం ప్రారంభించారు. ఈ బాకీలను తీర్చానించే విషయంలో నవాబు ఉపేక్ష వహిస్తూన్నాడనీ, చెన్నపట్నం కంపెనీ అధికారులు కొందరిపట్ల పక్షపాతబుద్ధి చూపిస్తూన్నారనీ తగాదాలు బైలుదేరినవి. చెన్నపట్నందొరలలోనే ఈ విషయంలో రెండు పార్టీలు బయలుదేరినవి. ఈ తగాదాలు, కుటిలు, అకిరమాలూ ఎక్కువయి ఆఖరికి సీమలో కంపెనీ డైరెక్టర్లకు ఫిర్యాదులు పోగా వారు దీనిని గుఱించి కొంతవిచారణ చేశారు. వారిలోకూడా కొందఱు ఒకపక్షమూ మఱికొందఱు ఇంకొక పక్షమూ అవలంబించి అభిపారియభేదాలు కనబర్చగా ఈవిషయ్యం పార్లమెంటులో చర్చకు వచ్చింది. కాని అక్కడ కూడా అభిపారియభేదాలు వచ్చినవి. దీనికంతా కారణం నవాబుగారిజుట్టు చేతచిక్కించుకున్న దొరలే. ఈవిషయంలో సీమలో కూడ కొంతసొమ్ము ఖర్చుపెట్టి అక్కడివారి నోళ్లు కట్టకపోతే నవాబుగారి రాజ్యం ఆయనకు దక్కడం దుర్లభమని చెప్పి ఆయనను భయపెట్టి అతని దగ్గరనుంచి వారు మళ్లీ కొంతసొమ్మును గుంజి, కొందఱు డైరెక్టర్లకూ, పార్లమెంటు సభ్యులకూ లంచా లిచ్చిన్నీ ఈ ఋణపతారిలలో భాగాలిచ్చిన్నీ నవాబుగారి ఋణాలను సమర్థించేపక్షాన్ని అక్కడ లేవ

చేశారు. నవాబుగారి బాకీల విషయమై చర్చ వచ్చినప్పుడల్లా ఈపక్షం వారు రేచులలాగ లేచి ఆ వ్యవహారాలను సమర్థించేవారు.

ఈవిషయాలలో ప్రవేశించి చాలా దుర్మార్గాలుచేసి సొమ్ము గాజేశాడనే కారణంవల్ల చెన్నపట్నంలో కంపెనీవారి క్రింద ఇంజనీరింగు కట్టడముల శాఖలో పనిచేసే పాల్ బెన్‌ఫీల్డు అనే ఒక చిన్న కంపెనీ ఉద్యోగిని ఇక్కడ అధికారులు 1770 లోనూ 1778 లోనూ రెండుసార్లు పనిలోనుంచి తొలగిస్తే అతడు సీమకు వెళ్లి అక్కడ తన పలుకుబడిని నుపయోగించి మళ్ళీ తన వుద్యోగం తాను తెచ్చు కున్నాడు. తరువాత అతడు పార్లమెంటు సభలో ప్రవేశించి ఈ అన్యాయాలను నిలబెట్టడానికి పాటుపడి కృతకృత్యుడైనాడు.

ఆర్కాటు నవాబుగారి బాకీల వ్యవహారాలవల్ల చెన్నపట్నంలో కంపెనీ ప్రభుత్వం పుచ్చి పోయింది. ఆర్కాటు నవాబుబాకీల విష యంలో జరిగిన అన్యాయాలను గురించి పార్లమెంటుకు తెలియగా ఆబాకీల నిజానిజములను గురించి విచారించ వలసినదని పార్లమెంటు వారు 1774లో తీర్మానించారు. ఈ ఋణమును పరిశీలించగా అది మూడు భాగాలుగా కనబడింది. అందులో రెండు భాగాలలో కొంత నిజం వున్నట్టు కనబడినా పెద్దభాగం మాత్రం అంగీకరించడానికి వీలు లేని దొంగబాకీలతో నిండివున్నట్లు కనబడింది. కంపెనీడైరెక్టర్లు దీనిని గురించి విచారించడానికి ప్రయత్నిస్తే బోర్డు ఆఫ్ కంట్రోల్ అనే పై తనిఖీ సంఘంవారు దానిని అలాగ విడదీయడానికి వీలులేదని బాకీల మొత్తాన్ని అంగీకరించడమో, నిరాకరించడమో జరగాలన్నారు. దీనికి కారణంసీమలోని అధికారులలోకూడా చాలామంది కిందులో భాగాలు వుండడమే !

ఇంగ్లాండు పార్లమెంటుసభలో సభ్యుడుగా నున్న ఎడ్మండ్ బర్కు అనే ధర్మాత్ము డొకడు ఈ యన్యాయాలను చూచి సహించ లేక దీనిని గురించి అతితీవ్రంగా విమర్శించి, ఈ బాకీలకు సంబంధిం చిన కాగితముల నన్నింటినీ పార్లమెంటువారి ఎదుట పెట్టవలసినదని, ఒక తీర్మానాన్ని ప్రతిపాదించాడు. అయితే పైనచెప్పిన పాల్ బెన్

ఫీల్డునూ్న అతనిలాగనే భారతదేశంలో చాలా అన్యాయాలు చేసి అమితధన మార్జించి పార్లమెంటు సభ్యుడైన అట్కిన్‌సన్ అనే దొరయునూ్న మరికొందఱునూ్న ఏకమై బర్కుమహాశయుని తీర్మానాన్ని ఓడించివేశారు. అంతట ఆర్కాటునవాబుగారి ఋణదాతల అక్రమచర్యలకు హద్దుపద్దు లేకుండా పోయింది. ఈబాకీని 1784 మొదలు 1804 వరకూ సాలు ఒకటింటికి 480000 నవరసుల చొప్పున కిస్తీలుగా చెల్లించేటట్లు ఏర్పాటుచేశారు. ఇంత సొమ్ము చెల్లించిన తరువాత 1805 లో ఈ బాకీలను విమర్శించడాని కని ఒక విచారణ సంఘాన్ని ఏర్పర్చగా వారు 1814 వరకూ విచారించి రెండుకోట్ల నవరసుల బాకీ మొత్తంలో ఒకకోటి తొంభైలక్షల నవరసుల బాకీ కేవలమూ అబద్ధమని నిర్ణయించారు! మిగిలిన బాకీలో ప్రతి మూడుకోట్ల బాకీలోనూ ముప్పైలక్షల బాకీమొత్తం మాత్రం నిజమని 1830 లో నిర్ణయించారు!! ఇలాగ తేల్చిన మొత్తాన్ని బట్టి చూస్తే లోగడ కంపెనీ వుద్యోగులకు చెల్లించి' వేయబడిన బాకీయావత్తు అబద్ధమే ననిన్నీ నిష్కారణంగా ఆ మొత్తము చెల్లించబడిన దనిన్నీ కనబడుతూ వుంది.

ఈ ఋణభారంయొక్క వడ్డీమాత్రమే సాలుకు 623000 నవరసులుగావుండేది. ఇది తూర్పుఇండియా వర్తకసంఘంవారికి భారతదేశంవల్ల వచ్చేలాభాల మొత్తానికి రెట్టింపు మొత్తంగా వుండడం చూసి చాలా మంది తమగుండెలు బాదుకొన్నారు. దొంగపత్రాలను సృష్టించి నందుకు కొందరిమీద ఫోర్జరీకేసులు దాఖలుకాగా వాటి విచారణ సందర్భంలో ఆకాలంలో చెన్నపట్నంలో కంపెనీ అధికారులుగాను, స్వతంత్రవర్తకులుగాను, ఉండిన దొరలు చేసిన అనేక అక్రమాలూ, అన్యాయాలూ బయలుపడినవి. ఆంధ్రపత్రిక వృషసంవత్సరాది సంచికలో 'మన చెన్నపట్నము - దీని పూర్వచరిత్ర' అనే వ్యాసంలో దీని వివరము లున్నవి. (Rise and fulfilment of British Rule in India. Thompson, and Garratt pp 187—190.)

తంజావూరు రాజ్యాపహరణం

అప్పులు తీర్చలేక ఖర్చులకు సొమ్ము చాలక బాధ పడుతూ

వున్న ఆర్కాటునవాబు చుట్టుప్రక్కల నున్న రాజ్యాలలో దేని నైనా చేజిక్కించుకొని తనకు కావలసినసొమ్ము సంపాదించు కోవాలని ఆలోచిస్తున్నాడు. ఈవిషయంలో తన ఋణదాతలైన కంపెనీఅధికారులూ, దొరలూకూడా తనకు సహాయము చేస్తారని అతని ఆశ. త్వరలోనే నవాబుకి ఆలాంటి అవకాశాలు లభించాయి.

ఆర్కాటునవాబు బాకీల వ్యవహారంలోనుంచి ఒక అధర్మదేవత తలయెత్తి తంజావూరురాజ్యాన్ని పట్టుకొని పీడించసాగింది. తంజావూరు సకల సంపదలకూ నిలయమైన స్వతంత్రరాజ్యం. అది పూర్వము చోళరాజుల క్రిందనుండి 14 వ శతాబ్దములో విజయనగర సామ్రాజ్యానికి సామంతరాజ్యమై తరువాత రాజప్రతినిధులైన తెలుగు నాయకుల పరిపాలనమున నుంటూ వచ్చింది. మఱికొంతకాలానికి తెలుగునాయకులు స్వతంత్రరాజులై ఆదేశాన్ని పరిపాలించారు. తంజావూరు, మధురనాయకులమధ్య 1673 లో జరిగిన యుద్ధంలో మధురనాయకులు తంజావూరును జయించగా ఆంధ్రనాయక రాజ వంశం అంతరించింది. ఛత్రపతి శివాజీమహారాజు సవతి తమ్ముడైన ఏకోజీ అనే 'వెంకోజీ' బిజాపూరు సుల్తానుగారి సేనాధిపతిగా వచ్చి రాజ్యాక్రమణచేసి 1675 లో తంజావూరుకు రాజైనాడు. తరువాత మహారాష్ట్రులైన ఆయనవంశీకులే ఆరాజ్యాన్ని పరిపాలించారు. ఇలాగ ఇక్కడ రాజులు మారినా దేశపరిస్థితులు మాత్రం మారలేదు. తంజావూరు ఎప్పటిలాగనే పాడిపంటలతో తులతూగుతూ సుభిక్షంగానుండి సంగీత సాహిత్యాలకు, లలితకళలకు ప్రసిద్ధిజెంది స్వతంత్రమైన దక్షిణాంధ్ర రాజ్యంగా ఉంటూవచ్చింది. ఈ తంజావూరు రాజ్య వైభవం చూస్తే చుట్టుపక్కల వారందఱికీ కళ్లు కుట్టినవి.

1742లో తంజావూరునేలే సాహుజీని ప్రతాపసింహుడు త్రోసి రాజన్నాడు. అప్పట్లో చెన్నపట్నం సముద్రతీరంలో ఒకకోట కట్టుకొని వర్తకంచేసుకొంటూవున్న ఇంగ్లీషువారు ప్రతాపసింహ మహారాజుతో స్నేహంచేసి ఏడు సంవత్సరాలు ఆయనతో సఖ్యతగా నున్నారు. ఆకాలంలో ఇంగ్లీషువారికీ, ఫ్రెంచి వారికీ జరిగిన యుద్ధాలలో ప్రతాప

సింహుడు ఇంగ్లీషువారి పక్షాన్నే వున్నాడు. ఇలాంటి స్థితిలో పదభ్రష్టుడైన సాహుజీ మహారాజు తాను మళ్ళీ తంజావూరు సింహాసనం ఎక్కడానికి గనక తనకు సహాయంచేస్తే తంజావూరు రాజ్యంలోనున్న దేవికోట జాగీరునున్నూ, కోటనున్నూ ఇస్తాననిన్నీ, యుద్ధపు ఖర్చులన్నీ తానే భరించు కుంటాననిన్నీ, ఇంగ్లీషువారితో బేరం పెట్టాడు. అంతట ఇంగ్లీషు వారికి నోరూరింది. ఇంతవఱకూ తమకు స్నేహితుడుగా నున్న ప్రతాపసింహమహారాజుపట్ల మిత్రద్రోహం చెయ్యడానికి పూనుకొని వారు అతని మీాదికి దండుపంపించారు. అయితే ఆయుద్ధంలో వారి సైన్యమే ఓడిపోయింది. అంతటితో సాహుజీకి సహాయంచేసే ప్రయత్నం మానుకొని ఏవిధంగానైనా దేవికోటనుమాత్రం ప్రతాపసింహుని దగ్గర నుంచిలాక్కోవాలనే సంకల్పంతో ఇంగ్లీషువారు దేవికోటను ముట్టడించి అది స్వాధీనంకాగానే దేవికోటను తమకు ఉండనిస్తే ఇకముందు సాహు రాజుకు సహాయం చేయకుండా వుంటామని ప్రతాపసింహునితోనే బేరంపెట్టారు! ఈ నాటకంయొక్క మొదటి అంకం ఇలాగ పూర్తి అయింది. తరువాతకొంతకాలం జరిగింది.

ప్రతాపసింహుడి కింత అన్యాయం జరిగినప్పటికీ కర్నాటకనవాబుల తగాదాల సందర్భములో ఇంగ్లీషువారికీ, ఫ్రెంచివారికీ జరిగిన యుద్ధాలలో ప్రతాపసింహుడు పాపము ఇంగ్లీషువారి పక్షాన్నే అవలంబించి నమ్మకంగా నున్నాడు. ఆయుద్ధాలలో ఇంగ్లీషువారు జయించినందువల్ల వారి నాశ్రయించిన మహమ్మదాలీ కర్నాటకనవాబుగా స్థిరపడి వారి చేతులలో కీలుబొమ్మ అయిపోయినాడు. ఒకమూలనుంచి తన రాజ్యాధికారాలూ, రాజ్యమూ కూడా తన చేతులలోనుంచి జారి ఇంగ్లీషువారి చేతులలోనికి పోతూ వుండగా ఈ నవాబు తనకు పచ్చ పచ్చగా కనబడుతూ వున్న తంజావూరు రాజ్యంమీాద కన్నువేసి దానిని ఎలాగైనా కబళించాలని విశ్వప్రయత్నాలు చెయ్యడం ప్రారంభించాడు. అతడు ఏదో సాకు కల్పించి తనసైన్యాలను తంజావూరు మీాదికి దండుపంపాడు. అంతట తంజావూరురాజు ఈయన్యాయాన్ని గుఱించి తనస్నేహితులైన ఇంగ్లీషు వర్తకకంపెనీవారితో

ురపెట్టుకొన్నాడు. ఇంగ్లీషుకంపెనీవారు వీరద్దరి మధ్యను రాజీ
దర్చడంలో తమకు కొంత లాభం వున్నదని గ్రహించి అందుకు
న ఏర్పాటులను చేశారు. తంజావూరు రాజు ఆర్కాటు నవాబుకు
మంతుడుగానుండి ఆయనకు నాలుగులక్షలవరహాలు కప్పం చెల్లించే
ట్లున్నూ, నవాబు తంజావూరు రాజ్యాన్ని ఆక్రమించడానికి ప్రయ
ంచకుండా వుండేటట్లున్నూ 1762 లో ఒక రాజీ కుదిర్చారు. ఈ
ర్పాటు ప్రకారం కొంతకాలం జరిగింది. ఇంతలో ప్రతాపసింహ
హారాజు చనిపోయాడు. అంతట కర్నాటక నవాబు తన బాకీదారు
న ఇంగ్లీషుఅధికారుల కుట్రలో మళ్లీ ఎప్పటి ఆటనే సాగించాడు.
్రతాపసింహుడి కొమారుడైన తులజాజీమహారాజు మీదికి నవాబు
71 లో తనసైన్యాలను పంపించి రాజ్యాన్ని కొల్లగొట్టించాడు. తుల
జీమహారాజు ఏమీ చెయ్యలేక నవాబుకి చాలా సొమ్ము నిచ్చి
కనితో రాజీపడ్డాడు. ఇంగ్లీషువారు చూస్తూ వూరుకున్నారు.

కర్నాటకనవాబు ఆశకిమితి లేదు. తంజావూరు రాజ్యాన్నెలాగు
నా కాజెయ్యాలని సంకల్పించాడు. ఇందులో తనకు సహాయంచేస్తే
ుతమైన ధన మిస్తానని ఇంగ్లీషుదొరలందఱికీ ఆశపెట్టాడు. చాలా
ంది అధికారులను లోబర్చుకొన్నాడు. 1773 లో మళ్ళీ తంజావూరు
ుదికి దండెత్తి దేశాన్ని కొల్లగొట్టి రాజును చెరబట్టి రాజ్యాన్ని
వశంచేసుకొన్నాడు. అంతట నవాబుచుట్టూ చేరిన ఇంగ్లీషు దళారీల
టపండింది. ఋణాలతీర్మానం పేరున తంజావూరు రాజ్యభాగాలను
ాబువల్ల తాకట్టుపెట్టించుకొని శిస్తులు వసూలుచేసుకొనే హక్కును
ంది అక్కడ రైతుల పొలాలలో నున్న పంటయావత్తు జప్తుచేసి
నా భీభత్సమూ చెయ్యడం ప్రారంభించారు. ఇలాగ నవాబు తన
కీదారులను తంజావూరుమీదికి ఉసికొల్పడం చూస్తే నిజంగా
ందఱికీ బాకీలు లేవనిన్ని, తంజావూరును దోచుకొని ప్రజలను పీల్చి
్చేసి సొమ్ము పిండి ఉభయులూ కలిసి పంచుకోవడానికి నవా
న్నూ, ఈ దొరలున్నూ కలిసి కుట్రచేశారనిన్ని చాలమందికి
చింది. ఋణదాతలలో చాలామంది కంపెనీ అధికారులుగానే

ఉన్నందువల్ల తంజావూరు రైతుల మొరలను ఆలకించి అక్కడ జరుగుతూవున్న అక్రమాలను విచారించి న్యాయం జరిగించేవారే లేకపోయారు.

గవర్నరు పిగట్టుగారు

తంజావూరు రాజుకుజరిగిన అన్యాయం సంగతి మెల్లిమెల్లిగా ఇంగ్లాండులోనున్న తూర్పు ఇండియా వర్తకసంఘంవారి అధికారులకు తెలిసింది, అంతట కంపెనీ డైరెక్టర్లు నవాబుచేసిన అక్రమానికి చెన్నపట్నంలో కంపెనీ అధికారులు మద్దతుచేయడం బాగాలేదని వారిని కఠినంగా మందలించి అప్పట్లో చెన్నపట్నం గవర్నరుగానుండిన వించ్ (Wynch) దొరను ఆపదవిలోనుంచి తొలగించి అతని స్థానే పూర్వం 1755 మొదలుకొని 1763 వరకూ చెన్నపట్నం గవర్నరుగా నుండి ఫ్రెంచివారితో జరిగిన యుద్ధాలలో ధైర్యంగా పనిచేసిన 'జార్జి పిగట్టు' అనే ఆయనను మళ్ళీ చెన్నపట్నానికి గవర్నరుగా నియమించి తంజావూరు రాజ్యాన్ని మళ్ళీ పూర్వపురాజుగారివశం చెయ్యవలసిందని అతనికిచెప్పి 1775 లో పంపించారు.

ఇది కర్నాటకనవాబుగారికి చాలా కష్టంగాతోచింది. తాను ఇంగ్లీషువారికి నమ్మినస్నేహితుడననిన్నీ తంజావూరు రాజు వట్టి పనికిమాలిన వాడననిన్నీ తంజావూరు తన అధీనం తప్పితే తాను దొరలకివ్వవలసిన ఋణాలను తీర్చలేననిన్నీ ఎన్నోవిధాలుగా మొరపెట్టుకున్నాడు గాని పిగట్టుగారు వినిపించుకోలేదు. చెన్నపట్నంలోనున్న గొప్పగొప్ప ఉద్యోగులచేత చెప్పించి చూశాడుగాని లాభం లేకపోయింది. ఆఖరికి తానుమళ్ళీ ఇంగ్లాండులో కంపెనీ డైరెక్టర్లసభవారికి చెప్పుకుంటాననిన్నీ అందాకా తంజావూరు విషయంలో చర్య తీసుకోవద్దనిన్నీ పిగట్టుగారిని వేడుకున్నాడుగాని అందుకు కూడా ఆయన అంగీకరించలేదు. తనకీ వ్యవహారంలో సహాయంచేస్తే అమితమైన ధనం లంచమిస్తానని కూడా నవాబు కబురంపినా పిగట్టుగారు చలించలేదు. నవాబుకి అమితమైన కోపంవచ్చింది. ఈ పిగట్టుగారిని ఎలాగైనా సాధించాలని ఉపాయాలు ఆలోచించడం ప్రారంభించాడు.

ఆయన మనస్సును మార్చాలని జపతపాలు హోమాలు చేయించాడు. అతనిని తుదముట్టించాలని మారణహోమంకూడా చేయించాడు.

పిగట్టుగారు తన కర్తవ్యాన్ని నెరవేర్చడానికి స్వయంగా తంజావూరికి వెళ్ళి అక్కడ ఆర్కాటునవాబుగారి పరిపాలన రద్దుచేయబడి మళ్ళీ తంజావూరు రాజుగారిపరిపాలన స్థాపించబడిందని ప్రకటన చేయించాడు.

బెన్ ఫీల్డు కథ

ఆసమయంలో ఒకచిత్రం జరిగింది. 1763 వ సంవత్సరం నుంచి చెన్నపట్నంలో కంపెనీవారి ఇంజనీరింగు కట్టడముల శాఖలో ఒకచిన్న వుద్యోగిగా నుంటూ చెన్నపట్నం కోట గోడల నిర్మాణం వగైరా పనులు చేయించిన 'పాల్ బెన్ఫీల్డు' అనే దొర ఒకడు గవర్నరుగారి దగ్గిరికివచ్చి ఆర్కాటు నవాబుగారు తనకు 230000 నవరసులు బాకీ వున్నాడనిన్నీ అందుకింద తంజావూరు రాజ్యంలో కొన్ని. భాగాలను తనకు తాకట్టుపెట్టినాడనిన్నీ తంజావూరు రాజ్యంలో శిస్తులు వసూలుచేసుకునే హక్కు తనకు వున్నదనిన్నీ తంజావూరులో కొందరు ఆసామీలుకూడా తనకు బాకీవుండి భూములమీద పైరును తనకుహామీ వుంచినారనిన్నీ తనబాకీ తీరకుండా తంజావూరును రాజుగారికివ్వడానికి వీలులేదనిన్నీ అభ్యంతరం చెప్పాడు. గవర్నరుగారు అతని మాట వినిపించుకోకుండా తంజావూరును రాజుగారికి స్వాధీనపరిచారు. అంతట, బెన్ఫీల్డు చెన్నపట్నంలో గవర్నరు గారి కార్యాలోచన సభ వారికి పై సంగతులతో అర్జీయిచ్చినాడు. బెన్ఫీల్డు మాటలు చాలా ఆశ్చర్యకరంగానూ అనుమానాస్పదంగానూ కనబడినవి. ఇతరులకు అంత అప్పులిచ్చే తాహతు అతనికిలేదు. ఇతడు స్వతహాగా ధనవంతుడు కాడు. ఇంగ్లాండు నుంచి వచ్చినప్పుడు ఇతడు తెచ్చిన సొమ్ము ఏమీలేమి. పోనీ, ఉద్యోగంలో ఎక్కువగా సొమ్ము ఆర్జించినాడేమో ననుకుందా మంటే అతడు చేసిన వుద్యోగం చాలా చిన్నది. అందులో ఎక్కువగా సొమ్ము ఆర్జించే అవకాశాలు లేవు. ఇతడు తాను సంపాదించిన దానినే పొదుపు చేసుకుని కూడబెట్టుకున్నాడేమో నను

కుందామంటే అతడు చాలా దుబారా మనిషి. సొమ్ము నిలువచేసే స్వభావం కల వాడు కాడు. నవాబుగారుగాని ఇతరులుగాని నీకు బాకీ వున్నట్లు నీదగ్గర దాఖలా లేమైనా వుంటే చూపించ వలసిందని గవర్నరుగారు అడిగితే అతడేమీ చూపలేక పోయాడు. గవర్నరు గారి కార్యాలోచన సభ్యులలో బహుసంఖ్యాకులు కూడా మొదట బెన్‌ఫీల్డు చెప్పిన మాటలను నమ్మలేదు. తరువాత మళ్లీ అతడేమి మాయోపాయాలు చేశాడోగాని త్వరలోనే కార్యాలోచన సభ్యుల మనస్సులు మారి బహుసంఖ్యాకులు మళ్ళీ తమ అభిప్రాయాన్ని మార్చుకొని యీవ్యవహారాన్ని తిరుగదోడి తంజావూరు కర్నాటక నవాబు స్వాధీనంలో వుండగా ఆరాజ్యాంలో భూములమీద పండిన పంట యావత్తూ బెన్‌ఫీల్డుకే హక్కుగల ఆస్తి అని తీర్మానించారు! పైగా బెన్‌ఫీల్డు బాకీలనేవి తంజావూరు రాజ్యాదాయంపైన బద్ధత చేయబడవలసిన పబ్లికు ఋణమనే అభిప్రాయాన్ని కూడా వెలిబుచ్చి ఆ రాజ్యములోని భూములమీద నున్న పంటను అతని వశంచెయ్యడానికి చెన్నపట్నంప్రభుత్వం వారు తగు సహాయం చెయ్యాలని కూడా నిశ్చయించారు.

గవర్నరుగారికీ కార్యాలోచన సభ్యులకూ తగాదా

గవర్నరు గారికిది చాలా అన్యాయమని తోచింది. అంతట పిగట్టుగారు తన కార్యాలోచన సభ్యుల యభిప్రాయాన్ని ప్రతి ఘటించాడు. గవర్నరుగారికీ కార్యాలోచన సభ్యులకూ ఘర్షణ జరిగింది. అంతట గవర్నరుగారి కార్యాలోచన సభలో బెన్‌ఫీల్డు పక్షం వహించిన సభ్యులు గవర్నరుమీద నీర్ష్యవహించి ఇతర విషయా లలో అతని అధికారాన్ని తృణీకరించడం ప్రారంభించారు.

ఇంతలో తంజావూరు రాజు దర్బారులో ఒక ఇంగ్లీషు ప్రతినిధిని నియమించ వలసి వచ్చింది. ఆ సందర్భంలో కూడా గవర్నరుగారికీ కార్యాలోచన సభలోని అధిక సంఖ్యాక సభ్యులకూ అభిప్రాయ భేదం వచ్చింది. గవర్నరుగారీ పదవికి రస్సెల్ అనే అతణ్ని నియమిం చాలని అంటే సభ్యులు బెన్‌ఫీల్డుకి అనుకూలంగా ఉండే సూవారు అనే

అతనిని నియమించాలని అన్నారు. దీనిని గురించి కార్యాలోచన సభ యొక్క సమావేశాలలో అతి తీవ్రమైన చర్చలు జరిగినవి. చివరకు అధిక సంఖ్యాక సభ్యులు గవర్నరుగారి అభిప్రాయాన్ని త్రోసి పుచ్చారు. అంతట వారు పేర్కొన్న అభ్యర్థిని ఆపదవికి నియమించి నట్లు జారీ చేయనలసిన అధికార పత్రముమీద గవర్నరు సంతకం చెయ్యడానికి నిరాకరించాడు. ఈతగాదా చాలా త్రీవరూపం దాల్చింది. గవర్నరును సభలో ప్రతిఘటిస్తూవున్న సభ్యులలో బ్రూకు, స్ట్రాటన్ అనే ఇద్దరు సభ్యులు చాలా దురుసుగా ప్రవర్తించినందువల్ల గవర్నరు వారిపైన కోపించి వారు ప్రభుత్వ ద్రోహము తలపెట్టినారనే నేరమును మోపినాడు. అలాంటి నేరము మోపబడిన సభ్యులు సభలో పాల్గొన డానికి వీలులేదని శాస్త్రవిధి యున్నందువల్ల వారిని సభలోకి రాకుండా చేసి తక్కిన సభ్యుల సహాయంతో వాళ్ల సభ్యత్వం బర్తరఫు చేసినట్లు గవర్నరు తీర్మానింప జేశాడు. అంతట కార్యాలోచన సభలో పూర్వం అధిక సంఖ్యాకులుగా నుండిన సభ్యులందరూ ఏకమై గవర్నరుకు వ్యతిరేక పక్షంగా ఏర్పడి అతనిని గురించి పైయధికారులకు ఒకపితూరీ వ్రాసి గవర్నరుకు కార్యాలోచన సభలో పలుకుబడి లేనందువల్ల అధిక సంఖ్యాకులైన తామే ప్రభుత్వాధికారాలను చలాయించుటకు అర్హులమని ప్రకటించారు. అప్పుడు గవర్నరున్నూ అతని స్నేహితు లున్నూ పితూరీదారులైన కార్యాలోచన సభ్యులందరినీ సభ్యత్వంలో నుంచి తొలగించినట్లు ప్రకటించి వారిని పట్టుకుని అరెస్టు చేసి సైనిక శాసనంకింద శిక్షించవలసినదని చెన్నపట్నంలో సర్వసేనానిగా వున్న సర్ రాబర్టు ఫ్లెచర్ గారిని కోరారు. అయితే ఈ సర్వసేనాని కూడా గవర్నరుకు వ్యతిరేక పక్షంలో చేరి వున్నందువల్ల అతడలాగ చేయక ఉపేక్షించాడు.

గవర్నరుగారిని ఖైదుచెయ్యడం

గవర్నరుకు వ్యతిరేక పక్షంగా నున్న సభ్యులకు గవర్నరు అలుసైపోయినాడు. అతడు తమర్ని అరెస్టు చేయించదలచి నందుకు శాస్తిగా తామే అతనిని పట్టుకుని నిర్బంధించడానికి వారునిశ్చయించారు

ఆప్రికారం వారు 1776 వ సంవత్సరం ఆగస్టు 24 వ తేదీన పిగట్టు గారిని, పట్టుకొని ఖైదుచేయించారు.

అప్పుడు గవర్నరుగారి కొక ఉపాయం తట్టింది. చెన్నపట్నం రేవులోను కోటలోను కంపెనీ ప్రభుత్వంవారు అధికారం చలాయిస్తూ వున్నా సముద్రంమీద వారికలాంటి అధికారాలు లేవు. సముద్రము మీద నున్న ఇంగ్లీషు యుద్ధనౌకలపైన అధికారియైన అడ్మిరల్ ఇంగ్లీషురాజుగారి ప్రభుత్వోద్యోగి. అతనికి సర్వాధికారాలుంటాయి. అందువల్ల చెన్నపట్నం దగ్గర సముద్రంలో నున్న నౌకల అధికారి యైన అడ్మిరల్ సర్ ఎడ్వర్డు హ్యూస్‌గారి నాశ్రయించి తన నొక నౌకమీదికి తీసుకునివెళ్లి కాపాడవలసినదని పిగట్టు ప్రార్థించాడు. అంతట పిగట్టుగారిని తనకు వప్పగించవలసినదని అడ్మిరల్‌గారు కార్యాలోచన సభవారిని కోరారు. నౌకలమీద ప్రభుత్వాధికారాలన్నీ అడ్మిరల్ గారివే యైనా రేవులో కంపెనీ ప్రభుత్వంవారి వశంలో నున్న కంపెనీ యుద్యోగులను తన నౌకమీదికి తీసుకుని వెళ్లడానికి ఆయనకు అధికారం వున్నట్లు తగిన శాస్త్ర దృష్టాంతరం తమకు కనబడనందువల్ల పిగట్టుగారిని ఆయనకు వప్పగించడానికి వీలులేదని వారు నిరాకరించారు. ఇంగ్లీషురాజుగారి ప్రభుత్వాధికారిగా తనకర్తవ్యాన్ని నిర్వర్తించగలందులకు తాను చెప్పవలసిన మాట చెప్పినాననిన్నీ వారు తనమాట విననందువల్ల కలిగేఫలితాలకు తాను ఉత్తరవాదినికానననిన్నీ చెప్పి అతడు వూరుకున్నాడు.

చెన్నపట్నం గవర్నరు కార్యాలోచన సభవారు పిగట్టుగారి నొకచోట ఖైదుచేసి వుంచారు.

గవర్నరుజనరల్ ఉపేక్ష

అప్పట్లోకంపెనీవారి రాజ్యానికంతా గవర్నరు జనరలుగా కలకత్తాలోనున్న వారన్ హేస్టింగ్సుగారికి చెన్నపట్నంలో జరిగిన సంగతులు మెల్లిగా తెలిసినవి. అయితే కార్యాలోచన సభలో అధిక సంఖ్యాకుల అభిప్రాయానికి వ్యతిరేకంగా తానేమీ చేయదలచ లేదని

చెప్పి దీనిని గురించి ఎలాంటి చర్యయున్నూ తీసుకోకుండా వుపేక్షించాడు. ఇలాంటి విషయంలోనే-బొంబాయి గవర్నరు కార్యాలోచన సభలో అభిప్రాయభేదం వచ్చినప్పుడు అతడు చర్యతీసికొనిన్నీ ఇక్కడి వ్యవహారాలలో ఇలాగ వుపేక్షించడం చాలా ఆశ్చర్యకరమైన సంగతి యని చరిత్రకారుల యభిప్రాయం. తాను ఇలాగ వూరుకున్నందువల్ల చెన్నపట్నంలో అధికారాన్ని చేజిక్కించుకున్న కార్యాలోచన సభ్యులు ఇంకా అక్రమాలు చేస్తారనిన్నీ కర్ణాటక నవాబు గారి బాకీదార్లు హాయిగా కాలక్షేపం చేస్తారనిన్నీ కూడా అతడు ఎరిగి వుండిన్నీ అతడు అందుకుకూడా హర్షించినట్లు వారన్ హేస్టింగ్సు 26-9-1776 వ తేదీన తన స్నేహితుడికి వ్రాసిన ఒక వుత్తరం వల్లనే కనబడుతూవుంది.*

అక్కడ చెన్నపట్నంలో పిగట్టుగారు ఖైదులో పడి మగ్గిపోతున్నాడు. అతడు మనోవ్యాధితో బాధ పడుతూవున్నందువల్ల అతని ఆరోగ్యం పూర్తిగా చెడిపోయింది.

సీమలో కంపెనీ డైరెక్టర్ల చర్యలు

చెన్నపట్నంలో జరిగిన సంగతులను గురించి ఇంగ్లాండులో కంపెనీ డైరెక్టర్లకు తెలియగా వారికి విషాదాశ్చర్యాలు కలిగినవి కాని డైరెక్టర్ల కోర్టు అనే కార్యనిర్వాహకసంఘసభలో అభిప్రాయభేదాలు కలిగినందువల్ల దీనిని గురించి వెంటనే తగినచర్య జరపలేదు. 1777 వ సంవత్సరం మార్చి 26 వ తేదీన డైరెక్టర్ల సాధారణ సంఘసభలో ఈ విషయాన్ని గురించి చర్చ జరిగింది. పిగట్టుగారు మళ్ళీ గవర్నరు పదవిలో నుండే ఏర్పాటును త్వరలో చెయ్యవలసినదనిన్నీ ఆయనను ఖైదుచేసిన కార్యాలోచన సభ్యుల చర్యనుగురించి విచారణ జరిగించవలసినదనిన్నీ ఆ సభవారు డైరెక్టర్ల కోర్టువారికి శిఫారసు చేశారు. డైరెక్టర్ల కోర్టువారు మాత్రం పిగట్టుగారిమీాద అంతగా అభిమానం చూపలేదు. పిగట్టుగారు మళ్ళీ గవర్నరుపదవిలో నుండేటట్లున్నూ ఆయనను ఖైదులోనుంచిన సభ్యుల చర్యలను గర్హిస్తూను కొన్ని తీర్మా

* (Memoirs of Warren Hastings-Gleig-Vol. 11. pp 106, 113)

నాలున్నూ, కార్యాలోచనసభలో అతనిపక్షముననున్న సభ్యులను విమ ర్శిస్తూ కొన్ని తీర్మానాలున్నూ డైరెక్టర్లకోర్టువారు చేశారు. అయితే పిగట్టుగారి వ్యవహారాన్ని గురించి వారేమీ పర్యవసానం తేల్చ లేదు.

ఈ డైరెక్టర్లకోర్టులో సభ్యులు ప్రతియేటా మారుతూవుంటారు. అందువల్ల ఒకమాటు పిగట్టుగారిని అనుకూలముగానూ, ఇంకొకమాటు ఆయనకు వ్యతిరేకముగానూ వుండే తీర్మానాలు చేయడం కూడా జరి గింది. అంతేగాని ఆ వ్యవహారాన్ని గురించి ఇదమిత్థమని నిర్ణయించి తీర్మానించలేదు. కార్యాలోచన సభలో అధికసంఖ్యాకుల అభి ప్రాయానికి వ్యతిరేకంగా గవర్నరు ప్రవర్తించడం అక్రమమనిన్నీ తంజావూరు దర్బారులో ఇంగ్లీషు కంపెనీ ప్రభుత్వంవారి ప్రతినిధిగా రస్సెలును నియమించడం అసమంజసమనిన్నీ, 21-4-1777 వ తేదీన తీర్మానించారు. గవర్నరుగారు తన కార్యాలోచనసభలోనుంచి బ్రూక్సుస్ట్రాటనుగార్లను బర్తరఫుచెయ్యడాన్ని గురించి ఖండిస్తూ తీర్మా నించాలని కూడా ప్రయత్నించారు గాని అది సాగలేదు. పిగట్టుగారి పక్షమవలంబించినవారు అతనిని బలవంతంగా పట్టుకుని ఖైదుచేయ డాన్ని గురించిన్నీ కార్యాలోచనసభలో అతని తరఫున నున్నవారిని సభలోనుంచి తొలగించడాన్ని గురించిన్నీ గర్హిస్తూ ఒక తీర్మానం చేయించగలిగారు గాని అవతలిపక్షంవారు ఆర్కాటు నవాబు పిగట్టు గారి కేదో సందర్భంలో ఇచ్చిన చిన్న చిన్న బహుమతుల సంగతిని ఎత్తుకుని వాటిని స్వీకరించడంలో గవర్నరు ప్రవర్తన యేమీ బాగా లేదని తీర్మానించారు. నిజానికి పిగట్టుగారు నవాబు పట్ల ఏలాంటి పక్షపాతమూ చూపించలేదు సరికదా, అతని దురాశను ప్రతిఘటిం చాడు. అతడు చాలా పెద్దమొత్తాలు లంచమిస్తానన్నా ఇతడు లోబడ లేదు.

పిగట్టుగారి వ్యవహారం విషయంలో కంపెనీ డైరెక్టర్ల కోర్టు వారి తీర్మానాలకు విధివిరామాలు గాని ఆద్యంతాలుగాని లేకుండా పోయినవి. 1777 వ సంవత్సరం మే 7 వ తేదీన డైరెక్టర్లకోర్టువారి

ాధారణసంఘసభలో దీనిని గురించి తీవ్రమైన చర్చ జరిగింది. పిగట్టు
ారి అధికారాన్ని ధిక్కరించిన సభ్యుల చర్యను ఖండిస్తూ అతనిని
వర్నరుపదవిలో పునఃప్రతిష్ఠచేసినట్లు తీర్మానిస్తూ అతని యొక్క
్రవర్తనను గురించి విచారించగలందులకుగాను అతనిని చెన్నపట్నం
వర్నరు పదవి వదలి సీమకు రావలసినదని తీర్మానించారు. చెన్న
ట్నం కార్యాలోచన సభలో పిగట్టుగారిపక్షం అవలంబించిన వారినీ
ఆయనకు వ్యతిరేకంగా నున్నవారిని కూడా సీమకు రమ్మని వుత్తర్వు
ేసే టట్లున్నూ శిఫారసు చేశారు. ఈ తీర్మానాలకు 317 మంది వ్యతి
రేకులుగానూ, 414 మంది అనుకూలంగానూ సమ్మతులిచ్చారు.

పిగట్టుగారి మరణం

అంతట 1777 వ సంవత్సరం మే 21 వ తేదీన పిగట్టుగారి వ్యవ
హారం ఇంగ్లాండు దేశపు పరమోన్నత శాసనసభ యైన పార్లమెంటులో
కామన్సు సభ వారి యెదుట చర్చకు వచ్చింది. అప్పుడు కొందరు
పిగట్టుగారికి అనుకూలమైన తీర్మానాలను ప్రతిపాదించగా ప్రభుత్వ
మంత్రులు వాటిని ప్రతిఘటించారు. అంతట అవి ఓడిపోయినవి ఇట్టి
స్థితిలో డైరెక్టర్ల కోర్టు సాధారణ సంఘసభవారి తీర్మానాలను అమ
లులో పెట్టడానికి డైరెక్టర్ల కోర్టువారు 30-7-1777 వ తేదీన తీర్మానిం
చారు. అయితే ఈ లోపుగానే 11-5-1777 వ తేదీన పిగట్టుగారు
దివంగతులైనారు. అందువల్ల పిగట్టుగారి బాధలన్నీ తీరిపోయినవి.

పిగట్టుగారికి పెళ్లిలేదు. ఆయనకు ఒక ఉంపుడుకత్తె వుండేది.
ఆమెవల్ల అతనికి చాలామంది పిల్లలు కలిగారు. ఆయనకు శాస్త్రీయమైన
వారసులు లేనందువల్ల ఆయన వంశమూ ప్రభుబిరుదమూ కూడా
బేవారసీ అయిపోయి అంతరించినవి.

పిగట్టుగారు చచ్చిపోయిన రెండు సంవత్సరాలకు ఆయనకు జరి
గిన అన్యాయాన్ని గురించిన వివరాలు ఇంగ్లాండులో కంపెనీ అధికారు
లకూ పార్లమెంటువారికీ బాగా తెలిసినవి. చెన్నపట్నంలో ఆయన
కార్యాలోచన సభలోనుండి ఆయనను ప్రతిఘటించి తుదకు ఆయనను
ఖైదుచేసిన సభ్యులలో ఒకడైన స్ట్రాటనుగారు ఇంగ్లాండు పార్లమెంటులో

కామన్సు సభలో సభ్యుడైనాడు. ఆర్కాటు నవాబుగారి పక్షము నవలంబించిన ఇంకా కొందరు దొరలుకూడా అక్కడ చేరారు. పిగట్టు గారి వ్యవహారాన్ని గురించి కామన్సు సభలో చర్చించబడి నప్పుడు వీరందరూ పిగట్టుగారి ప్రత్యర్థుల చర్యలను సమర్థించడానికి తంటాలు పడ్డారు గాని అందులోని నిజమంతా కామన్సు సభవారికి విశదమైంది. అంతట ఈస్ట్రాటనుగారున్నూ, ఇతని తోడివారున్నూ చేసిన అక్రమాన్ని గురించీ నేరాన్ని గురించీ విచారించి శిక్షించడానికి వీరిపైన ఒక క్రిమినలు కేసు దాఖలు చేయడానికి వుత్తర్వు చేయవలసినదని కామన్సుసభవారు ఇంగ్లీషు రాజుగారికి విన్నపం చేశారు. ఆప్రకారం స్ట్రాటను మొదలైన వారిమీద కేసుదాఖలై విచారణ జరుగగా వారినేరం రుజువుఅయింది. అయితే వీరు చేసిన ఘోరాన్యాయానికి తగిన శిక్షమాత్రం వీరికి విధించ బడలేదు. ఒక్కొక్కరికి వెయ్యి నవరసుల జుల్మానా మాత్రం విధించి వదిలివేశారు.

(History of BritishEmpire — Edward Thornton Vol II pp 199 — 213)

---

౯. కాశీమశీదులో శివలింగం

క్రీ॥శ॥ 1823-26 మధ్య కలకత్తాలో తూర్పు ఇండియావర్తక కంపెనీవారి పరిపాలనలో ప్రధాన క్రైస్తవమతాధికారిగా నుండి హిందూదేశమంతా తిరిగి చూసిన బిషప్ హెబరుగారు (Bishop Heber) తమ గ్రంథములో ఒకచిత్రమైన చరిత్రాంశాన్ని వుదాహరించారు:

1659-1707 మధ్య హిందూదేశాన్ని పరిపాలించిన ఔరంగజేబుచక్రవర్తి చాలా హిందూదేవాలయాలను పడగొట్టించి వాటిపైన మశీదులు కట్టించినాడని ప్రతీతి. దేవాలయ స్తంభాలతోటీ రాళ్లతోటీ దూలాలతోటీ నిర్మించబడిన మశీదులు ఇప్పటికీ కాశీలో కనబడుతున్నాయి.

ఒకశివాలయాన్ని పడగొట్టి మశీదుకట్టడంలో ఆదేవాలయంలో నుండిన అంసమైన గొప్పశివలింగాన్ని అలాగే అట్టే వుండనిచ్చి మశీదు కట్టారు. ఈ శివలింగం నలభై అంగుళల ఎత్తు ఏకాండీ శిల. దీని మీద అందమైన చెక్కడపుపని వుండేది. ఇది పూర్వం రెండురెట్లు ఎత్తువుండేదనిన్నీ, క్రమక్రమంగా భూమిలోకి దిగబడిపోతూ వున్న దనిన్నీ, అది భూమిమట్టానికి రాగానే అన్నికులాలూ ఒక్క టైపోతా యనిన్నీ ప్రజలు అనుకుంటూ వుండేవారు.

ఈ శివలింగం మశీదులో చిక్కుపడినా హిందువులు దీనిని అతిపవిత్రంగా ఎంచి, మశీదు అధికారులను మంచిచేసుకొని, లోపలికి వెళ్లి దీన్ని పూజిస్తూవుండేవారు. భక్తులు ఇచ్చేకానుకలలో సగం వంతు తమకు చెల్లేపద్ధతిని మశీదువారు దీనికి వప్పుకున్నారు.

ఈ శివలింగం చుట్టూవున్న చెక్కడపు పని మహమ్మదీయులకు అసహ్యంగా కనబడినా పైన చెప్పిన కారణంవల్ల దానిని ఏమీ చేయకుండా వుంచారు. ఇలాగ ఒక వందసంవత్సరాలు ఈ శివలింగానికి మశీదులోనే అర్చనలు జరిగాయి.

ఇలా వుండగా ఒకమాటు మొహరంపండుగ ఊరేగింపుల సందర్భంలో హిందువులకూ, మహమ్మదీయులకూ తగాదాలు వచ్చి దెబ్బలాటలు జరిగాయి. అది మతకలహంగా పరిణమించింది. ముసల్మానులు కొందరు ఆవేశపరులై హిందువులు అతి పవిత్రంగా పూజించే యీశివలింగాన్ని పగులగొట్టారు. అంతట హిందువులు ఉగ్రులై దీనికి ప్రతిక్రియగా ఒకమశీదును తగులబెట్టారు. దానిమీద తురకలు వీరావేశంతో ఒక ఆవును చంపి, దాని రక్తాన్ని విశ్వేశ్వర ఆలయందగ్గర గంగానదీజలంకన్నా అతిపవిత్రమని ఎంచి యాత్రికులందరూ స్నానపానములుచేసే "ఇననకూప"మనే ఒక పురాతనమైన నూతిలో కలిపారు.

అంతట కత్తి పట్టగల ప్రతి హిందువూ రోషావేశంతో కత్తులూ కఠారులూ పుచ్చుకుని కనబడిన తురకవాడిపైనబడి దౌర్జన్యం

చేయసాగారు. కాశీలో హిందువులే బహుసంఖ్యాకులై నందువల్ల తుర కలను రూపుమాపుతారేమో నన్నంత భయం కలిగింది.

కుంపినీ అధికారులు శిపాయీలను బయటికి తెచ్చి నిలపకపోతే ఇటుసూర్యుడటు పోయేలోపల ఊళ్ళో మశీదులన్నింటినీ హిందువులు నేలమట్టం చేసేవారే. అయితే, హిందువుల దౌర్జన్యాన్ని అణచడానికి శిపాయీ లెంతవరకు తోడ్పడతారో అనేదికూడా అనుమానాస్పద మైన విషయంగా అధికారులకు తోచింది. కారణం ఏమిటంటే, అక్కడి శిపాయీలలో చాలామంది హిందువులు. సగంమంది బ్రాహ్మణులే. నిజంగా వాళ్ళమనసులోని సంగతి చెప్పాలంటే ఒక్కొక్కడికి ఈ మహమ్మదీయుల రక్తాన్ని చూరగొనాలనే వుందని చెప్పాలి.

ఈ తురకలపైకి పోతూవున్న జనంలో ముఖ్యులు బ్రాహ్మణులూ, యోగులూ, గోసాయీలూ, బైరాగులూ, మొదలైన సనాతన ధర్మపరులే. వీళ్ళు తమవంటినిండా విభూతి పూసికొని మొగాలపైన గోపీచందనం అద్దుకొని చావుకు తెగించినందుకు తార్కాణంగా తల వెండ్రుకలు విరబోసికొని జందెములు చేతపట్టుకొని తమతోడి హిందువులతోనూ దేవుళ్ళతోనూ యుద్ధంచెయ్యబూనిన వారిని శాపనార్థాలు పెడుతూ వీరంతా ముందువరసలోనే వున్నారు. అయినప్పటికి శిపాయీలు చలించలేదు. తాము ఎవరి వుప్పు తింటున్నారో ఆ కుంపినీ వారి వుత్తర్వులను శిరసావహించి తమ రక్తబంధువులు ఎదురైనా సరే తుపాకీ పేల్చడానికి ఒట్టుపెట్టుకొని సైన్యపు కొలువులో చేరిన ఈ శిపాయీలు అవసరమైతే బ్రాహ్మడిపైనకూడా తుపాకీని పేల్చ డానికి సంసిద్ధులైనారు.

పైన చెప్పిన శివలింగం వుండే మశీదు ద్వారందగ్గర కావలి కాస్తూవున్న శిపాయీలలో ఒకడు అక్కడ కిందపడివున్న శివలింగాన్ని చూసి ఇలాగఅన్నాడు. "అయ్యో ! మనమెన్నడూ అనుకోనిసంగతిని చూశాము. శివలింగంశిరస్సు నేలపైకి ఒరిగింది. ఇంక కొద్దికాలంలోనే మన మందరమూ ఒకేకులంవాళ్ళ మైపోతాము. అప్పుడు మనమతం

ఏమవుతుంది?" అన్నాడు. "బహుశః కిరస్తానీమతం అవుతుందేమో!" అని రెండవవాడన్నాడు.

కంపెనీవారు ఇలాగ బందోబస్తు చేసినందువల్ల అల్లరి సద్దు అణగింది.

ఈ కల్లోలం అణగినతరవాత మళ్లీ ఆసంగతి తలుచుకునే టప్పటికి కాశీలోని హిందువుల గుండెలు నీరైనవి. వారికి తీవ్రమైన విషాదం కలిగింది. "పవిత్రమైన కాశీక్షేత్రం అపవిత్రమై పోయింది. అతి పవిత్రమైన గంగాజలములో గోవురక్తం కలిసింది. ఈకాశీమాహాత్మ్యం పోయింది. ఇంక ఇక్కడ మోక్షం దొరకదు." అనే ఆలోచనలతో వేలకొద్ది బ్రాహ్మణులు ఉపవాసం చేస్తూ ముఖా[illegible]న విభూతిరేఖలతో పైమీద బట్టలుకూడా లేకుండా దుఃఖసూచకంగా గంగానదీ తీరాన్నివున్న ముఖ్యఘట్టాలకు నడిచి వెళ్ళి అక్కడ చేతులు కట్టుకుని తలలు వంచుకొని కూచుని మళ్లీ ఇళ్ళకు పోకుండా అక్కడనే పడివుండి ఒకమెతుకైనా తినకుండా ప్రాణాలపై ఆశవిడిచి ప్రాయోపవేశం చెయ్యడానికి నిశ్చయించారు.

ఇలాగ రెండుమూడు రోజులు గడిచినవి. ఇది చూసే టప్పటికి చాలామంది మనస్సులు కరిగినవి. వీళ్లను ఓదార్చి సానుభూతి చూపిస్తే వీళ్ళకు కొంత మనశ్శాంతి కలుగుతుం దని కొందరికితోచింది. ఈసంగతినివీరు కాశీలోనిమేజస్ట్రేటులచెవినివేశారు. అంతట కుంపినీవారి ఆంగ్లేయోద్యోగులందరూ గంగానదీతీరానికి వెళ్ళి అక్కడి ఘట్టాలలో ఇలాగ వుపవాసంచేస్తూవున్న బ్రాహ్మణులను చూసి వగచి, తాము నివారించడానికి ఎంతోకష్టపడి ప్రయత్నంచినా లాభంలేక తమవశం తప్పి జరిగినదానికోసం వారందరూ ఇలాగ నిష్కారణంగా బాధపడడము బాగా లేదనిన్నీ జరిగిన అక్రమాలకు కొంత ప్రతిక్రియ జరిగించేవున్నారుకదా అందుకోసం మళ్ళీ ఇలాగ బాధ అనుభవించడం ఎందుకనిన్నీ చెప్పి, వాళ్ళను బుజ్జగించగా, వారందరూ చాలా దుఃఖించి తరువాత కొంత ఊరట చెందారు.

ఇంతటి అకృత్యం జరిగినా గంగ గంగ కాకపోదనిన్నీ కాశీలోని గృహస్థులందరూ పూనుకొని సంప్రోక్షణ మొదలైన ప్రాయశ్చిత్త కర్మలు జరిగిస్తే వైదికధర్మానికి కలిగిన కళంకాన్ని తొలగించవచ్చునన్నీ న్యాయాధికారులు ఓదార్చుగావారుచెప్పిన సలహాబాగానే వున్నదని ఆఖరికివారందరూ నిశ్చయించి, ఉపవాసాలు మాని ఇళ్ళకు వెళ్ళారు.

ఆసమయంలో ఈరాయబారం నడిపిన దొరలలో ఒకరైన 'బర్డు' గారుఆదృశ్యంఇప్పటికీ తనకు కన్నులకుకట్టినట్టు వున్నదని కొన్నిసంవత్సరాల తరవాత18?4లో బిషప్ హెంబరుగారికి ఈసంగతులన్నీ చెప్పాడు.

Bishop Heber's journal - Vol. I pp. 428—32.

---

౧౦. 'వాకిటికావలి' తిమ్మన

[కృష్ణదేవరాయలవారి సన్నిహిత భృత్యులు]

"ప్రాకృత సంస్కృత ఘుర్జుర, మూకీకృత, కుకవితుంగ ముస్తాతతికిన్,
వాకిటి కావలి తిమ్మన, వాకిట కవికోటి మాధవా కిటికోటే!"

అని ఒక చాటుపద్యమున్నూ, దీనిని గురించిన ఒక గాథయున్నూ మన తెలుగుదేశంలో చిరకాలం నుంచి ప్రచారంలో వున్నవి.

శ్రీకృష్ణదేవరాయలవారి అనుగ్రహానికి పాత్రుడైన ఒక భట్టు రాయలవారి ఆస్థానంలోని అష్టదిగ్గజాలనే కవులమీద నీర్ష్య వహించి వారి నెలాగనైనా అవమానించాలని ఒక కుట్ర పన్నాడు. ఒక్కరోజున తాను చెప్పినట్లు చేస్తానని రాయలవారిచేత వాగ్దానం చేయించుకొని, ఆ మరునాడు రాజసభలో అందరూ కూర్చుని వుండగా తాను లేచి కొందరు కవులపేర్లను చదివి "వీరు రాయలవారి సెలవు అయ్యేవరకూ రాజసభలోనికి రాకూడదని రాయలవారి యాజ్ఞయైన" దని ప్రకటించాడు. ఈ విపరీతపు ప్రకటనను విని

అక్కడివా రందరూ ఒకరి మొగము లొకరు చూచుకొని తెల్లబో యారు. రాయలవారున్నూ ఏమి జరుగుతుందో తమాషా చూద్దామని గంభీరంగా ఉన్నారు.

అలాగ సభలోకి రాకూడ దని నిషేధింపబడినవారిలో అల్లసాని పెద్దన మొదలైన హేమా హేమీ లంతా వున్నారు. భట్టు ఇలాగ అన్న తరువాత వీరు రాయలవారి వైపునకు చూశారు గాని వారి ముఖంలో ప్రసన్నభావం కనుపించనందువల్ల చేయునది యేమీ లేక రాయలవారు సభ చాలించిన తరువాత ఖిన్నులై బయటికి వెళ్ళి భట్టు ఏదో కుట్రపన్ని ఇలాగ తమ్ము పరాభవించినాడని ఊహించి, దీనిని గురించి విచారించి తరువాత చేయవలసిన కర్తవ్యాన్ని గురించి ఆలోచించుకోవడానికని వీరు 'వాకిటికావలి' తిమ్మన్న యనే రాయలవారి ఆంతరంగిక భృత్యుని యింటిముందర చేరి అక్కడ కూర్చుని ఏదో ఆలోచిస్తూ వున్నారు. ఆ సమయానికే వీరిని అవమానించిన భట్టు అందలం యెక్కి ఆ దారిని వస్తూ వీరిని చూచి "ఈ తిమ్మన్నవాకిట గుమిగూడిన వీ రొక పందుల సమూహములాగ నున్నారు చూశావా" అని తన సేవకుడైన మాధవుని సంబోధిస్తూ పైన చెప్పిన చాటు పద్యములోని ఉత్తరభాగమును చదివాడు.

ఈ యద్దేవమాట వినేటప్పటికి అక్కడనున్నవారికి పట్టలేనంత రోషం వచ్చింది. ఈ నీచుడికి తగినట్టుగా బుద్ధిచెప్పాలని పెద్దన్నగారా పద్యంయొక్క పూర్వభాగాన్ని పైనచెప్పినలాగ భావగర్భితంగా పూరించి జవాబుచెప్పారు.

విద్వత్కవుల సంస్కృత ప్రాకృతములను అర్థము చేసికొనలేక మిడుకు ఈ భట్టువంటి కుకవులు పందుల కాహారముగా నుండే తుంగ గడ్డలవంటి వా రనిన్నీ, అలాంటివారి కీ కవిబృందము పందులగుంపుగా కనబడడంలో ఆశ్చర్యం లేదనిన్నీ దాని భావం. మేము నీవంటి అల్పులను మ్రింగగల వరాహములము సుమీయని ధ్వని. భట్టు ఇదివిని తల వంచుకొని వెళ్ళిపోయి, మర్నాడు రాయలవారితో జరిగిన సంగతి చెప్పగా "నీవు జరిగించిన అపచారానికి తగిన పరాభవం జరిగిం"దని

అతనిని మందలించి రాయలవారు పెద్దనాదికవులను మళ్ళీ రాయలవారు సభకు రావించి గారవించారట.

ఈ గాథను పెద్దనకవి జీవితచరిత్రలో వుదాహరిస్తూ శ్రీ గురజాడ శ్రీ రామమూర్తిగారు ఆ పద్యంలో 'వాకిటి కావలి' తిమ్మన యని పేర్కొనబడినయతడు ముక్కు తిమ్మనయని పొరబాటుగా వ్రాశారు. అయితే వారే తెనాలి రామకృష్ణకవి జీవితంలో ఈ తిమ్మన్నను గురించిన ఇంకొక చాటుపద్యాన్ని ఉదాహరించి దాన్ని గాథను వ్రాస్తూ అతడు కృష్ణదేవరాయలవారి వాకిటి కావలిగా నుండిన తిమ్మన్న యనే దండనాయకుడని సరిగానే వ్రాశారు. ఆ రెండవ గాథ యిది: ఒకమాటు కృష్ణరాయలవారు తమ వాకిటి కావలిగా నుండే తిమ్మన్న యనే దండనాథుడి శౌర్యవిశేషానికి సంతోషించి అతని కొక అమూల్యమైన పచ్చడము (సేలువు)ను బహుమతి యిచ్చారట. అతడా పచ్చడము బుజాన వేసుకొని తన యింటికివచ్చి అరుగుమీద కూర్చునివుండగా అల్లసాని పెద్దన, ముక్కు తిమ్మన, భట్టుమూర్తి, తెనాలి రామలింగకవి ఆదారినిపోతూ తిమ్మన్న గారిని చూసి ఆయనను అభినందిస్తూ నల్గురూ కలిసి ఒక కంద పద్యంలో నాలుగు పాదాలు వరసగా ఇలాగ పూర్తి చేశారట:

"వాకిటి కావలి తిమ్మా (అల్లసాని పెద్దన)
ప్రాకటముగ సుకవివరుల పాలిటి సొమ్మా (ముక్కు తిమ్మన)
నీకీ పద్దెమె కొమ్మా (భట్టుమూర్తి)
నా కా పచ్చడమె చాలు నయముగ నిమ్మా"—
(తెనాలి రామలింగకవి)

అంతట పద్యంచివర భావప్రకటనను చేసిన రామలింగకవికి తిమ్మన్నగారు తన పచ్చడం యిచ్చివేసి తక్కినవారికి ఇతర బహుమానము లిచ్చి పంపించి నాడట.

తిమ్మన్నచరిత్రకు ఆధారాలు

ఈ రెండుగాథలూ సమన్వయం చేసి చూస్తే ఈ పద్యాలలో చెప్పబడిన వాకిటికావలి తిమ్మన్నయనే యతడు సామాన్యుడైన

కాపలావాడివంటి ద్వారపాలకుడు కాడననిన్నీ, రాయలవారిదగ్గర గొప్ప అధికారమూ, పలుకుబడీ కలిగిన వుద్యోగి యనినీ్నీ, విద్యావంతుడు, రసికుడు అనిన్నీ ఊహించడానికి సావకాశం కనపడుతూ వున్నది. ఈ తిమ్మన్ననుగూర్చిన విశేషాలను తెలుపగల చరిత్రాధారాలేమైనా వున్నవేమో చూద్దాము.

తిరుపతి దేవస్థానం విచారణకర్తలైన శ్రీ మహంతు ప్రియాగ దాసువారు తిరుపతిక్షేత్రంలో రాజాధిరాజులూ, శ్రీమంతులూ చెక్కించిన శిలాశాసనాలయొక్క విలువను గ్రహించి వాటిని ప్రకటించడానికి నిశ్చయించి వాటిని గురించి ఒక నివేదికన్నూ తయారుచేయడానికి బ్రహ్మశ్రీ సాధు సుబ్రహ్మణ్యాం బి. ఏ, గారిని నియోగించారు. శాసనసంపుటాలతో పాటు వారి నివేదికనుకూడా ఒక పెద్ద గ్రంథముగా ౧౯౩౦ లో అచ్చువేయించారు. దీనివల్ల పల్లవులు, చోళులు మొదలైన రాజుల కాలంనాటినుంచి విజయనగర సామ్రాజ్యము నేలిన చక్రవర్తులవరకూ గల చరిత్రాంశాలు, విశేషాలు తెలుస్తున్నవి. అందులో తిమ్మన్న చరిత్రకూడా వున్నది.

"అవసరం" తిమ్మయ్య

తిరుపతి దేవస్థానంలోవున్న శాసనాలవల్ల కృష్ణదేవరాయల వారి కొలువులో 'అవసరం తిమ్మయ్య' యనే దండనాయకు డొకడు రాయలవారి 'వాకిటికావలి' అనగా ద్వారపాలకుల పై యధికారియై యున్నట్లున్నూ, అతడు వేయిమంది సైనికుల కధికారి యనిన్నీ, ఒక చిన్న సంస్థానము నేలే సామంతమండ లేశ్వరుడనిన్నీ, అతనిని 'అమరం' తిమ్మరసయ్య, తిమ్మప్ప నాయకుడు అనికూడా పిలిచేవారనిన్నీ, ఆయనకు రాయలవారి దగ్గర చాలా చనవు వున్నట్లున్నూ, చాలామందికి ఆయన రాయలవారి దర్శనం చేయించి అనేక సందర్భాలలో చాలా ఉపకారాలు చేసినట్లున్నూ తెలుస్తున్నది.

తిరుపతిలో వున్న దానశాసనాలలో "అవసరం" నరసయ్య, తిమ్మయ్య, నరసయ్య లనే ముగ్గురు అన్నదమ్ముల పేర్లున్నూ, వారితల్లి బసవమ్మగారి పేరున్నూ కూడా కనబడుతూ వున్నవి. శా. శ. ౧౪౩౪

కు సరియైన అంగీరసనామ సంవత్సరం (క్రీ. శ. ౭-౮-౧౫౧౨) నాటి శాసనంలో ఈ కుటుంబంవారికి తిరువెంగళ నాథుడు ఇలువేల్పు అయినట్లున్నూ, అవసరం నరసయ్య తిమ్మయ్యగార్లు "రాయరబాగిల అవసరద"- అనగా కృష్ణదేవరాయలవారి తలుపుల దగ్గరవుండే ద్వారపాలకులైనట్లున్నూ కన్నడంలో వివరింప బడింది. ఈ అన్నదమ్ములలో తిమ్మయ్యయే మన 'వాకిటికావలి' తిమ్మన యని నిస్సందేహంగా చెప్పవచ్చును.

ద్వారపాలకుడంటే మన 'గేటుకీపరు' వంటి జవాను అనుకో కూడదు. అతడు రాయలవారి సన్నిధిలో నుండే ఒక గొప్ప యుద్యోగి. రాయలవారి దర్శనం నిమిత్తం పోదలచినవారందరూ ఆయన అనుజ్ఞను పొందాలి. అతడు రాయలవారికి మనవిచేసి దర్శన మిప్పిస్తాడు. అందువల్ల ఆయనకు దివాణంలో గొప్ప అధికారమ్ము, పలుకుబడీ వుండేవి.

శా. శ. ౧౪౪౧ ప్రమాదినామ సంవత్సరం అనగా క్రీ. శ. ౧౫౧౯-౨౦ నాటి శాసనంలో పేర్కొనబడిన కృష్ణదేవరాయలవారి ద్వారపాలకుడైన 'తిమ్మభూపతి' యీ వాకిటి కావలి తిమ్మన్నగారే. ఈ శాసనంలో 'భూప' అనేపదము వాడినందువల్ల ఇతడు కొంత రాజ్యభాగమును పరిపాలించే సామంత మండలేశ్వరు డని తేలుచున్నది. ఈ శాసనంలో మధురజిల్లాలో అన్నామల పేర్కొనబడినందువల్ల అతని రాజ్యభాగం ఆ ప్రాంతాలలో వుండివుండాలి.

ఇలాగే చక్రవర్తిగారికి ఇతర విధాలైన సేవలు చేసేవారిలో గొప్ప ప్రభువులు, దండనాయకులు అనేకు లుండినట్లు శాసనాలవల్ల కనబడుతూవుంది. రాయలవారి సన్నిహితభృత్యులలో కొందరు గొప్ప వంశాలలో జన్మించినవారున్ను, కొందరు రాజబంధువులున్ను వుండేవారు. వారిలో కొందరు దుర్గాధ్యక్షులున్ను, సామంత మండలేశ్వరులున్నూ కూడా వున్నారు.

"లార్డు చేంబర్లేన్" వంటి రాజసేవకుడు

మన దేశాన్ని పూర్వం ఏలిన చక్రవర్తుల దగ్గరనుండే రాజసేవకుల లాగనే ఇంగ్లీషురాజుగారి దగ్గరనుండే సన్నిహిత

భృత్యులుకూడా సత్కులసంజాతులైన ప్రభువులుగానే వుంటూ వున్న సంగతి ఇంగ్లీషు రాజ్యాంగ చరిత్రను చదివినవారందరికీ తెలుసును. ఇలాంటి రాజసేవకులలో 'లార్డుచేంబర్లేన్' అనే హోదాగల ఉద్యోగి అధికారమునుబట్టీ, గౌరవమునుబట్టీ, పలుకుబడినిబట్టీ చాలా గొప్పవాడు. ఇతడు ఒక ముఖ్యమైన ప్రభువుగా వుంటాడు. ప్రీవీ కవున్సిల్ అనే రాజుగారి ఆంతరంగిక కార్యాలోచన సభలో సభ్యుడుగా వుంటాడు. రాజుగారి కుటుంబములో తటస్థించే శుభాశుభాల కన్నింటికీ ఇతడు తగిన ఏర్పాట్లు చేస్తాడు. రాజుగారి దర్శనము చేయదలచినవారందరూ ఇతనిని ఆశ్రయించాలి. రాజుగారి దర్శనము చేయతగినవా రని తనకు తోచినవారి కతడు ఆహ్వానాలు పంపి దర్శనం చేయిస్తాడు. అతడు ఎల్లప్పుడూ రాజుగారి ప్రక్కనే నిలిచియుంటాడు. రాజుగారు రాజభవనంలోనుంచి బయటికి వెళ్లునప్పుడు బండిదగ్గరదాకా సాగనంపుతాడు. మళ్ళీ వచ్చినప్పుడు బండి దగ్గరనుంచి లోపలిదాకా మార్గం చూపుతూ తీసుకొనివస్తాడు. రాజదర్శనంకోసం వచ్చినవారిని రాజుగారికి ఎఱుకపరుస్తాడు. రాజుగారి ఆలోచనమందిరము, శయనమందిరము ఈ చేంబర్లేన్‌గారి తనిఖీక్రిందనే వుంటాయి. ఈయనక్రింద వైస్ చేంబర్లేన్ అనే సహాయోద్యోగి యొకడు వుంటాడు. ఇతనిక్రింద మాస్టర్, మార్షల్ ఆఫ్ సెరిమొనీస్ మొదలైన ఇతరరాజసేవకులు పనిచేస్తారు. రాజుగారికి సాలుపొడుగునా సేవచేయడానికి 'Lords and grooms in waiting' అనే హోదాగల ఆరుగురు ప్రభువులను నియమిస్తారు. వారొక్కొక్కరు పదిహేను రోజులుగాని, ౨౧ రోజులుగాని వంతులచొప్పున రాజసేవ చేస్తారు. ఇంకా ఇలాంటి సన్నిహితభృత్యులు, గౌరవహోదాలవారు చాలామంది వున్నారు.

ఇంగ్లీషు రాణీగారి అంతఃపురముకూడా లార్డుచేంబర్లేన్‌గారి అధికారంక్రిందనే వుంటుంది. రాణీగారి సేవకోసం ఇంగ్లాండు దేశంలో చాలా గొప్ప వంశాలలో జన్మించిన ప్రభువుల భార్యలు, వారి కొమార్తెలు, కోడళ్లు, మనుమరాండ్రు 'Ladies of the bed chamber, Women of the bed chamber, Maids of honour' అనే

హోదాలతో నియమింపబడతారు. వీరు పూర్వము మన దేశములో రాణులకు చెలికత్తెలు, పరిచారికలు మొదలైనవారు చేసే సేవలే చేస్తారు. అందువల్ల మన వాకిటికావలి తిమ్మనగారు లార్డుచేంబర్లేన్ వంటి గొప్ప రాజోద్యోగి అనడానికి సందేహం లేదు.

'అమరం' తిమ్మరసయ్య

సేలంజిల్లా అరగలూరు గ్రామ దేవాలయంయొక్క దేవాదాయాన్ని వసూలుచేసి గుడిపనులు జరిగించే స్థానికు లనే గుడిపార్పత్తెగార్లు ముగ్గురికి కొన్ని యిబ్బందులు కలిగి వాటినిగురించి కృష్ణదేవరాయలవారికి స్వయంగా చెప్పుకొందామని వారు రాజధానీనగరమైన విద్యానగరానికి వెళ్ళారు. అక్కడ రాయలవారి ద్వారమువద్ద నుండే ప్రధానోద్యోగియైన 'అమరం' తిమ్మరసయ్యగారు వీరిని రాయలవారి దగ్గరకి తీసికొనివెళ్ళి దర్శనం చేయించి వారి యిబ్బందులను తొలగింపజేయడమేగాక వారి కొక హారము, తలపాగ, గుఱ్ఱము, గొడుగున్నూ బహుమతి చేయించాడట. ఈ సంగతి శా. శ. వర్షములు ౧౪౪౧ కు సరియైన ప్రమాథిసంవత్సరము (క్రీ. శ. ౧౦-౬-౧౫౧౯) నాటి శాసనంలో ఉదాహరింపబడివున్నది.

ఈ 'అమరం' తిమ్మరసయ్యగారు మన వాకిటి కావలితిమ్మన్నగారే యనడానికి సందేహం లేదు. 'అమర' మనగా పాళెపట్టుదొరలకియ్యబడు కొలది సీమ యని శబ్దరత్నాకరకారులు అర్థం చెప్పి కుమార ధూర్జటి విరచితమైన కృష్ణరాజవిజయంలోని ఈ కింది పద్యాన్ని యుదాహరించారు.

సీ. "భటులు వేయిటి కెన్న నిర్వదియునాల్గు
వేలుగా లక్షయిర్వదివేల ప్రజకుఁ
జెల్లు నల్వదిలక్షల్లు జీత మనఁగ
యమర మేలెడు దొరల కీక్రమమె సుమ్మి."

ఈ పద్యంవల్ల 'అమరం' అనేది కొంత జీతము, బత్తెము, సైనిక బలము, జమీను గల ఒక గొప్ప హోదా అని రూఢి అవుతూవుంది.

'అమరం' అనే పదము 'అమరనాయంకర' మనేదాని రూపాంత ము. విజయనగర సామ్రాజ్యంలోని వివిధప్రాంతాలలో గల కోటలకు ధ్యక్షులై దేశాన్ని పరిపాలించే ప్రభువులను అమరనాయకు లనేవారు. రు రాజోద్యోగులై, దండనాయకులై, దేశపరిపాలకులైన నాయ లు. రాజకీయోద్యోగులలో దొరలు, పారుపత్యగార్లు, రాయసం గారు, అవసరంవారు, రాచకరణాలు అనే వివిధ హోదాలవారు కన డుతున్నారు. వీరు చేసే వుద్యోగాలయొక్క వివరాలు స్పష్టంగా తెలియకపోయినా వీరు ప్రభుత్వోద్యోగం చేసే రాజసేవకు లనిన్నీ, రికి జీతబత్తెములు, రాజమర్యాదలు, గ్రామాలు, జమీనులు వుండే నీ తెలుస్తూంది. రాయలవారు యుద్ధానికి తర్లి వెడుతూ వున్నప్పుడు రుకూడా హాజరుగా వుండేవారనిన్నీ తెలుస్తూవుంది. వీరిని గురించి న్ని విశేషాలు రాయవాచకములో వివరింపబడియున్నవి.

విజయనగర సామ్రాజ్యకాలంనాటి దేశచరిత్రను, రాజకీయ ర్థిక సాంఘిక మతపరిస్థితులను గురించి పరిశోధించి, శాసనములను, గానిక చరిత్రలను, కవితలను, విదేశయాత్రికుల సాక్ష్యములను పరి లించి ఆకాలంలో మన కవులు రచించిన ప్రబంధములలోని వర్ణ లయందు, చరిత్రాంశములయందు గల నిజమును బయటికి తీసి Studies in the History of the Third Dynasty of Vijayanagara" నే గొప్ప చరిత్రగ్రంథమును రచించిన డాక్టరు నేలటూరి వెంకట మణయ్యగారీ సంగతుల నన్నింటినీ చక్కగా చర్చించియున్నారు.*

తిమ్మప్పనాయకుడు

గోరంట్లగ్రామంలోని దేవాలయ సేవకులకు గల కొన్ని బాధ ను సూరపరాజు అనే ఆయన తీర్చినాడనిన్నీ, ఆయన వాకిటి ఆదెప్ప ాయనిం వారి కార్యకర్త (ఏజెంటు) అనిన్నీ, ఈ ఆదెప్పనాయనిం వారి తండ్రిపేరు తిమ్మప్పనాయకుడనిన్నీ ౧౯౧౭-వ సంవత్సరపు మదాసు ఎపిగ్రాఫికల్ రిపోర్టు ౫౫౬-వ పేరాలోను, ౧౯౧౭-వ సంవ త్సరం ౧౧-వ సంఖ్య శాసనంలోను ఉదాహరింపబడినది.

* చూ : 4 వ ప్రకరణము, పుటలు ౧౫౧-౧౫౪; ౫-వ ప్రకరణము, పుటలు ౨౬౦-౧౯౪-౧౯౧.

అవసరం తిమ్మయ్య యనీ, అమరం తిమ్మయ్య యనిన్నీ, వాకిటి తిమ్మయ్య యనిన్నీ పైన చెప్పిన శాసనాలలో పేర్కొనబడిన తిమ్మన్న గారే ఈ తిమ్మప్పయని చెప్పడానికి సందేహం లేదు.

ఇతర రాజసేవకులు

కృష్ణదేవరాయలవారి కొలువులోవుండి ఆయనకు సేవచేసే సద్వంశసంజాతులైన ఇతరనాయకు లనేకుల పేర్లు తిరుపతి శాసనాలలో కనబడుతున్నవి.

'ఊడియం' ఎల్లప్పనాయకుడు

ఊడియం ఎల్లప్పనాయకు డనే రాజోద్యోగి కృష్ణదేవరాయల వారికీ, ఆయన తరువాత రాజ్యంచేసిన అచ్యుత దేవరాయల వారికి సన్నిహితభృత్యుడుగా వుండేవాడు. ఊడియ మనే పదము ఊడిగ మనే మాటకు రూపాంతరము. ఇతడు 'కల్ తేరు', అనగా రాతిరథం దగ్గర సత్రం నిర్మించినట్లున్నూ, తిరుపతిలో గోవింద రాజస్వామి వారికి దానం చేసినట్లున్నూ క్రీ. శ. ౧౫౨౭ నాటి ఒకశాసనంవల్ల కనబడుతూ వుంది.

'అడపం' బయ్యప్పనాయకుడు

అడప మంటే వక్కలు, ఆకులు మొదలైన తాంబూలపు ద్రవ్యము లుంచే సంచి. దీనిని సంబెళమనికూడా అంటారు. ఆకాలంలో సామాన్యులు కూడా ఎక్కడికి వెళ్ళినా ఒక అడపను పట్టుకొని వెళ్ళే వారు. కృష్ణదేవరాయలవారు రచించిన ఆముక్తమాల్యద ౭-వ ఆశ్వాసంలో ౭-వ పద్యంలో దీని వర్ణన కనబడుతూ వుంది. ఇది శ్రీమంతు లనుభవించే భోగాలలో ఒకటి. అందువల్ల రాజాధిరాజులైన విజయనగర చక్రవర్తులకు తాంబూలద్రవ్యముల యుద్యోగి యొక డుండడంలో ఆశ్చర్యమే మున్నది? కాశ్యపగోత్రుడైన తిమ్మప్పనాయకుడి కుమారుడైన ఈ బయ్యప్ప కృష్ణదేవరాయలవారి కాలంలోను, అచ్యుత దేవరాయలవారి కాలంలోనూ కూడా ఈయుద్యోగం చేసినట్లు అతడు తిరుపతి వెంకటేశ్వరస్వామికి ౫౫, 3౨౦ నార్పణములు సమర్పించి క్రీ శ. ౬-౯-౧౫3౮సం॥ లో చెక్కించిన శాసనంవల్ల తెలుస్తూవుంది.

కింకా కొన్ని గ్రామాల ఆదాయంవల్ల వచ్చే సొమ్మునుకూడా దేవుడికి సమర్పించాడు. అందువల్ల ఇతడొక శ్రీమంతుడై యుంటాడన డానికి సందేహం లేదు.

'కట్టిక' తిమ్మన

జిల్లేళ్ల బసవనాయకరు కొమారుడైన తిమ్మనాయకరు అనే యతడు కృష్ణదేవరాయలవారి 'కట్టిక' అనగా వెండిబెత్తమును పట్టు కునివుండే వేత్రధరుడు. ఇదియొక రాజలాంఛనము. అతడొక దళవాయి అనిన్నీ, ఈయనకు 'దాడినేని' అనే బిరుదుకూడా వుండేదనిన్నీ అతడు తిరుపతి వెంకటేశ్వరస్వామి వారికి నిత్యనైవేద్యము నిమిత్తము ౧౨౦౦ స్వర్ణములు సమర్పించి నప్పుడు క్రీ. శ. ౧౫౧౩వ సంవత్సరములో చెక్కించిన శాసనములో వ్రాయబడి వున్నది. ఈశాసనమే తెలుగులోకూడా క్లుప్తంగా వ్రాయబడివుంది. అందులో ఈకట్టిక తిమ్మన్న అనుసంధానం రామానుజయ్యగారి శిష్యుడనిన్నీ, అతని పేరు కట్టిక దాడినేని దళవాయి తిమ్మయ్య యనిన్నీ వుదాహరింపబడి వున్నది. శత్రువుల మీదికి దాడివెడలి జయించినందు వల్లనే 'దాడినేని' అనే బిరుదు ఇతనికి వచ్చివుంటుంది.

'విద్వత్సభారాయరంజక' శ్రీరంగరాజు

కృష్ణదేవరాయలవారి పూర్వుల కాలం నుంచీ విజయనగరరాజ భవనంలో ఒక నాటకశాల వుండేది. కృష్ణదేవరాయలవారి కాలంలో ఒక నాట్యశాల, ఒక నృత్యశాలకూడా వుండేవి. రాయలవారు తమ ఆస్థానంలో సంగీత సాహిత్యవిద్వాంసులను పోషిస్తూ సదా విద్యా గోష్ఠిలో కాలక్షేపం చేస్తూ 'విద్వత్ సభారాయ'లనే బిరుదు వహించారు. నృత్యముచేసి సంగీతము పాడి ఆయనను రంజించే ఆటపాటకుల మేళ మొకటి యుండేది. ఈ మేళానికి నాయకుడు తిరుమల నాథుని కుమారుడైన శ్రీరంగరాజు. అతనికి 'విద్వత్ సభారాయరంజక' అనే బిరుదు వుండేది. రాయల వారాయనకు గొప్పజాగీరు లిచ్చారు. అందులో ఎర్రంపూడి అనే గ్రామాన్ని ఈ శ్రీరంగరాజు క్రీ. శ. ౧౫౧౮ లో శ్రీవెంకటేశ్వరుల వారికి సమర్పించాడు.

ఈ శ్రీరంగరాజు కొమార్తెయైన రంజకం కుప్పాయి అనే కుప్పసాని క్రీ. శ. ౧౫౧౨ లో చేసిన దానం ఒకటి కనబడుతూవుంది. ఈ కుప్పాయికి తిరుమలమ్మ, ముద్దుకుప్పాయి అనే ఇద్దరు కుమార్తెలుండేవారు. తిరుమలమ్మ స్వామివారికి శా. శ. ౧౪౩౯ ఈశ్వర సం (క్రీ. శ. ౧౫౧౭)లో 3000 నార్పణములు సమర్పించినట్లు వ్రాయబడిన శాసనం తెలుగు ప్రతిలో ఆవిడ శ్రీరంగరాజు మనుమరాలనని న్నీ, కుప్పమ్మకుమార్తెననిన్నీ వ్రాయించింది.

కుప్పాయి రెండవ కొమార్తె ముద్దుకుప్పాయి మొదట విజయనగర చక్రవర్తియైన అచ్యుత దేవరాయల అంతఃపురపరిచారికగా వుంటూవుండి ఆయన ఆజ్ఞప్రకారము తిరుపతి వెంకటేశ్వరస్వామివారి సేవ చేయడానికి వచ్చినట్లున్నూ, గోవిందరాజస్వామివారి ఆలయం నుంచి ప్రతిరోజూ ఆవిడకు తినడానికి ప్రసాదం యిస్తూవున్నట్లున్నూ శా. శ. ౧౪౫౩ ఖర సంవత్సరం (క్రీ. శ. ౬-౬-౧౫౩౧) శాసనంలో వివరింపబడివున్నది. ఈ శాసనంలో శ్రీరంగరాజు కొమార్తెయున్నూ ముద్దుకుప్పాయితల్లిన్నీ అయిన కుప్పసానికికూడా "విద్వత్సభారాయరంజకం" అనే బిరుదు వుండినట్లు చెప్పబడివున్నది.

ఇలాగ విజయనగర చక్రవర్తుల సేవను చేసే స్త్రీ పురుషులలో గొప్ప వంశాలవారూ, శ్రీమంతులూ అనేకు లుండేవా రని తిరుపతి దేవస్థానములో నున్న శాసనాలవల్ల తెలుస్తూవున్నది."¶

తిమ్మ శబ్ద విచారము

మన తెలుగు దేశంలో తిమ్మ, తిమ్మడు, తిమ్మన్న, తిమ్మప్ప, తిమ్మకవి, తిమ్మనృపతి, తిమ్మమంత్రి, తిమ్మయ్య, తిమ్మరాజు, తిమ్మాజీ, తిమ్మశౌరి, తిమ్మశెట్టి, తిమ్మక్క, తిమ్మాయమ్మ, తిమ్మమ్మ, తిమ్మాంబ, తిమ్మాజమ్మ అనే స్త్రీ పురుషుల పేర్లేగాక, తిమ్మాపురం, తిమ్మసముద్రము మొదలైన స్థలవాచకములున్నూ, తిమ్మని బ్రహ్మని చేయడము రమ్మన్నారు తిమ్మన్న బంతికి, తిండికి

¶(Tirupati Devasthanam Epigraphical Report by Sadhu Subrahmanyam pp. 199, 207.)

తిమ్మరాజు పనికి పోతరాజు, మొదలైన జాతీయాలున్నూ చిరకాలం నుంచి వాడుకలో నున్నవి. ఆంధ్ర సామ్రాజ్యానికి కన్నడదేశమధ్య నున్న విద్యానగరం రాజధానియై నప్పటినుంచీ ఈ తిమ్మ శబ్దానికి కన్నడ ప్రత్యయాలు చేర్చిన పదాలుకూడా వాడుక లోనికి వచ్చినవి. తిమ్మరాజునే కన్నడములో తిమ్మరసు అని వ్యవహరించారు. రాజు అనే శబ్దంలో నుండి 'అరసు' అనే కన్నడరూపం పుట్టింది. తిమ్మ శబ్దము వైకృత దేశ్య మిశ్రమమైన తిరుమల శబ్దములోనుంచి పుట్టిన దేశీయమైన తెనుగు పదము. దీని వ్యుత్పత్తిని గురించి శబ్దరత్నాకరములో కొన్ని వివరాలున్నవి.

తిరుమల + డు = తిమ్మడు అయింది (చూ : శబ్దరత్నాకరం). ఇలాగే తిరుమల+అప్పడు = తిమ్మప్పడు అయింది. ఈ తిమ్మప్పడు అనేది సింహాద్రిఅప్పడులాంటి పదమే. కాకమాని మూర్తికవి తన రాజవాహన విజయములో "కొండమీాది తిమ్మప్పనివంటి కావ్యపతి యుబ్బుట యుబ్బుర" మని వ్రాసిన పద్యం శబ్దరత్నాకరములో ఉదాహరింపబడి వున్నది. తిరుమల అనేపదము వేంకటాచల మనేదానికి పర్యాయపదంగా చిరకాలంనుంచి వాడుకలోవుంది. అళియరామరాయల మేనల్లుడున్నూ, కొండవీడు పరిపాలకుడున్నూ అయిన సిద్ధిరాజు తిమ్మభూపాలుడు తన పరమయోగివిలాసములో ౨-వ ఆశ్వాసంలో,

"క. ధరగల తిరుపతు లోకకడ,
వరుసకొని ముకుందమూర్తి వర్గము నత డ
చ్చెరువుగ నుతించె నెడనెడ
దిరుమలదేవరను దిరిగి తిరిగి పొగడుచుఁ."

అని వ్రాసినాడు. తిరుపతి యనేది విష్ణుక్షేత్రానికి పర్యాయపదము.

సీ. "వినుము తల్లి నూట యెనిమిది తిరుపతు
లందు నెన్న వేంకటాచలంబు,

రంగధామమున్ను గరంబు సన్నుతి గాంచు
గ్రహములందు శశియు రవియుబోలె."

అని ర-వ ఆశ్వాసంలో వ్రాసినాడు. (చూ : శబ్దరత్నాకరము.)

తెలుగులో తిరుపతి తిరుమల లనే పదాలు పర్యాయపదాలుగా చిరకాలంనుంచి వాడుకలో నున్నవి. తెలుగు దేశానికీ, అరవ దేశానికీ తిరుపతికొండ సరిహద్దని అంటారు. తిరుపతిలోని ప్రజలందరికీ తెలుగే మాతృభాషగా వుండి తిరుమలలోనుంచి తిమ్మశబ్దం పుట్టడంతోపాటు తిరుపతి కొండమీది కోతులకు తిమ్మ డనే పేరు రూఢమైంది. ఈ తిరుపతి వెంకటేశ్వరుడు తెలుగువారికి ఇలువేల్పుగా వుంటున్నాడు. అయితే ఇటీవల ద్రావిడాభిమానుల యుద్యమ మొకటి బయలుదేరి తిరుపతి వేంకటేశ్వరుని పేరులోని వేంకటశబ్దము వేంగడ మనే అరవ శబ్దంలో నుంచి పుట్టినదనీ, దానితోపాటు తిరుమల తిరుపతులు కూడా అరవవారి స్వార్జితపు సొత్తులనీ ఒక ప్రచారము జరుగుతూ వున్నది.

"జనని సంస్కృతంబు సకలభాషలకును, దేశభాషలందు తెలుగు లెస్స"

మన దక్షిణభారతదేశములో పూర్వంనుంచీ ఏరాజవంశాలు ఏలుతూవస్తూవున్నా, వారు పల్లవులైనా, చోళులైనా, చాళుక్యులైనా, లేక కాకతీయులైనా, విజయనగరచక్రవర్తులైనా ఇక్కడి తెలుగువారినీ, అరవవారినీ, కన్నడులనూ కూడగట్టుకుని దేశ ప్రజల నాగరికతను, మతధర్మాలను కాపాడుతూ ప్రజానురంజకంగా పరిపాలించారేగాని వేరువేరు భాషలు మాట్లాడేవారిని చీలదీసి 'పాకిస్తానాల'ను ఏర్పరచలేదు. అందువల్లనే ఆసేతుహిమాచలపర్యంతముగల పుణ్యక్షేత్రాలను, పుణ్యానదులను దేశప్రజలందరూ ఇప్పటికీ సమానభక్తితోనే పూజిస్తూవుండడం తటస్థించింది. ఏ క్షేత్రమాహాత్మ్యం చదివినా, ఏ పురాణం చదివినా ఆస్థలజలపవిత్రతను గురించీ, ప్రాశస్త్యాన్ని గురించీ వర్ణించడం కనబడుతుందేగాని ఇది అరవలది, అది తెలుగువారిది, ఇది కన్నడులది, అది మహారాష్ట్రులది, అనే భేదాన్ని

పొరపాటునైనా చెప్పవు. కావేటిరంగని పదాలుగాని, పాండురంగ విఠలుని కీర్తనలుగాని, తుకారాము అభంగములుగాని, కబీరుదాసు కీర్తనలుగాని, తులసీదాసుతో హరాలుగాని, గీతగోవిందముగాని, తరంగములుగాని, తత్వాలుగాని ఎక్కడనైనా ఎవరైనా పాడుతూవుంటే అది ఏభాష అనే విచక్షణ లేకుండా దేశప్రజలందరూ — స్త్రీలూ, పురుషులూ భక్తిపారవశ్యంతో తన్మయు లవుతారు. ఏక్షేత్రానికి పోయినా ఆప్రాంతపు భాషతో నిమిత్తం లేకుండా అక్కడి ప్రజలతో పాటు దేవుణ్ణి సేవించగల్గుతున్నారు.

అరవలైన పల్లవులూ, చోళులూ తెలుగుదేశాన్ని ఏలినప్పుడుగాని, చాళుక్యులు తెలుగుకర్ణాటకాలను ఏలినప్పుడుగాని, కర్ణాటక రాజ్యమధ్యలో తెలుగుపరిభుత్వము స్థాపించిన విజయనగరచక్రవర్తులు ద్రావిడ కర్ణాటకాలను పరిపాలించినప్పుడుగాని, ఒకజాతిని ఒక భాషను అధికముగా జేసి తక్కినవారిని అణగద్రొక్కలేదు. అన్నిభాషలనూ ఆదరించారు. "జనని సంస్కృతంబు సకలభాషలకును, దేశభాషలందు దెనుగు లెస్స" యనే భావము ఒక్క తెలుగువారిలోనేకాదు అరవలలోనూ కన్నడులలోనూకూడా వ్యాపించి యున్నది. ఆయాదేశాలలో ఇప్పటికీ ప్రజల నోట వినబడే తెలుగుపదాలు, పద్యాలు, కీర్తనలు, కథలు, గాథలూ ఇందుకు ప్రబలమైన నిదర్శనాలుగా ఉన్నాయి. కృష్ణదేవరాయలంతటివాడు "దేశభాషలందు తెలుగులెస్స" యని యుద్ఘోషించాడు. అంతమాత్రంచేత జాత్యహంకారముగాని, జాతివైరముకాని ప్రబలలేదు.

ద్రావిడ ఉద్యమము

అరవదేశంలో ఇటీవల కొందరు ప్రబుద్ధులు బయలుదేరి ఒక ద్రావిడాభిమానమును ప్రచారంచేస్తూ తమదేశములోనుంచీ, భాషలోనుంచీ, సంగీత సాహిత్యములలోనుంచీ సంస్కృతాన్ని పారదోలడానికి ప్రయత్నిస్తున్నారు! అరవంలో పాడకుండా తెనుగులో పాడినాడనే కారణంతో త్యాగరాజుయొక్క దివ్యవాణిని తమ సంగీతసభలలో

నుంచి వెలిపెట్టడానికి ప్రయత్నిస్తున్నారు !! దేశములోని తెలుగు భాగాలు కూడా తమవే నంటున్నారు. ఇంక ఉమ్మడిప్రదేశాలన్నీ తమ వనడంలో ఆశ్చర్య మేమున్నది! ఈసందర్భంలో దేశచరిత్రను కూడా తమ కింపుగా ఉండేటట్లు మార్చి వ్రాయడానికి ప్రయత్నిస్తున్నారు. కేవలము ద్రావిడ దురభిమానావేశము గలవారుమాత్రమే ఇలాంటి పిచ్చిపనులు చేస్తే చింతలేదు. డాక్టర్ ఎస్. కృష్ణస్వామి అయ్యంగారివంటి ప్రాజ్ఞులైన చరిత్రకారులుకూడా తమ రచనలలో అరవఅభిమానం చూపిస్తూ సత్యాన్ని మరుగుపరచడము, చరిత్రాంశాలకు అపార్థంకల్పించడం చాలా దుఃఖకరమైన సంగతి. తిరుపతి చరిత్రలో వారు తెలుగు భాషకు, తెలుగువారికి చేసిన అన్యాయము మరీ ఎక్కువగా నున్నది. వేంకట శబ్దముతోపాటు తిరుమలను, తిరుపతిని అరవవారి స్వంత హక్కుగల సొత్తుగా నిరూపించాలని కృష్ణస్వామయ్యంగారు చాలా తంటాలుపడ్డారు. తిరుపతి దేవస్థానపు శాసనాలను పరిశోధించి నివేదికను తయారుచేసిన సాధుసుబ్రహ్మణ్యంగారి నివేదికను, ఈ తిరుపతి చరిత్రను పోల్చి చూస్తే కృష్ణస్వామయ్యంగారి పక్షపాతపు వ్రాతలు కొంతవరకూ తెలుసుకోవచ్చును.

మన తెలుగు చరిత్రకారులు, పరిశోధకులు, విశ్వకళాపరిషత్తు వారు, తెలుగుప్రజలూ చరిత్రరచనలలో మనకు జరుగుతూవున్న ఈ అన్యాయాన్ని గురించి ఎందుకు ఆలోచించరో తెలియడం లేదు. బ్రతికిచెడిన జాతి ఈ యాంధ్రజాతి అనియైనా స్మరించుకుంటే కృతార్థుల మవుతాము.

౧౧ కందనూరు నవాబు రాజరికం

[ఇది కల్పితకథ కాదు; నిజంగా జరిగినసంగతి. ౧౮౩౯ వ సంవత్సరం వరకూ కర్నూలుజిల్లాలో నాలుగు తాలూకాలు కర్నూలు నవాబురాజ్యంలో చేరివుండేవి. శ్రీశైలమ్ము, అహోబిలము, నివృత్తిసంగమము మొదలైన పుణ్యక్షేత్రాలకు పోయే యాత్రికుల దగ్గిర ఆ నవాబుగారు 'హాశ్శీలు' (పన్ను) వసూలు చేసేవాడు. శ్రీశైల దేవస్థానము చాలా దుస్థితిలో వుండేది. ఇలా వుండగా ఈ నవాబుగారు ఇంగ్లీషు కంపెనీ ప్రభుత్వాన్ని తిరగదోడడానికి కుట్రచేసిన సంగతి బయటపడింది. అంతట కుంఫినీవారు ఆయన రాజ్యాన్ని లాక్కున్నారు. శ్రీశైలాన్ని కొన్నాళ్లు కుంఫినీవారే పరిపాలించి తరువాత ౧౮౪౧లో శ్రీ పుష్పగిరి శంకరాచార్యులవారివశంచేశారు.]

కందనూరు, కందనోలు, కందెనవోలు అనేవి కర్నూలుకు పాత పేర్లు. కందెనవోలు అనేదే అసలుపేరు. క్రీస్తుశకం ౧౭౭౫ వ సం॥లో అధ్యాత్మరామాయణం వ్రాసిన పెద్దనసోమయాజి కందనోలు అని ప్రయోగించాడు. కొందరు కవులు కందవోలు అనికూడా వాడారు. విజయనగరసామ్రాజ్యంనాటి కైఫీయతులలో కందనోలు, కందనూలు అనేరెండుపేర్లూ కనపడుతున్నాయి. అయ్యలరాజు నారాయణకవి తన హంసవింశతిలో ఊళ్లపేర్ల జాబితా నివ్వడంలో 'కందనూరు' అని ప్రయోగించాడు. ౧౮౩౦-౩౧లో కాశీయాత్రచరిత్రను వ్రాసిన ఏనుగుల వీరాస్వామయ్యగారుకూడా కందనూరు అనే ప్రయోగించారు.

ఇప్పటి కర్నూలుజిల్లాలో రామళ్ళకోట, నందికొట్కూరు, నంద్యాల, శిరివెళ్ళ, కంభము, మార్కాపురము, కోయిలకుంట్ల, పత్తికొండ అనే ఎనిమిది తాలూకా లున్నాయి. రామళ్ళకోటకు కర్నూలే ముఖ్యపట్టణం, శిరివెళ్ళకు ఆళ్ళగడ్డ, కంభానికి గిద్దలూరు, తక్కిన తాలూకాలకు ఆతాలూకాపేర్లుగల గ్రామాలూ ముఖ్యపట్నాలు. ఈ జిల్లా విస్తీర్ణం ౭౫౦౮ చదరపుమైళ్ళు. జనాభా షుమారు పదిలక్షలు. రివిన్యూ ఆదాయం 23½ లక్షల రూపాయలు.

పూర్వ చరిత్ర

కర్నూలు మండలం హంపీ-విజయనగర చక్రవర్తుల పరిపాలన క్రిందికి వచ్చినప్పటినుంచీ ఈజిల్లా చరిత్రయొక్క వివరాలు తెలుస్తు

న్నాయి కాని అంతకు పూర్వపు చరిత్రవివరాలు తెలియడం లేదు. అయితే ఈదేశాన్ని పూర్వము చాళుక్యులూ, చోళులూ, ఓరుగంటి కాకతీయగణపతిరాజులూ ఏలినట్లు నిదర్శనాలున్నాయి. ౧౫౬౫లో తాళికోట అనే రాక్షసతగ్గి యుద్ధంలో విజయనగర ప్రభువయిన అళియరామరాజు ఓడిపోవడంతో గెల్చినపక్షంలో చేరిన తురకరాజైన గోలకొండ సుల్తాను కుతుబుశాహీ ఈ రాజ్యం మీదికి దండెత్తి వచ్చాడు. తరువాత ఇతర మహమ్మదీయ రాజులుకూడా దేశం కొల్ల పెట్టారు.

తాళికోట యుద్ధంయొక్క ఫలితంగా కర్నూలుమండలంలో తూర్పు భాగాలు గోలకొండసుల్తానుగారి వాటాకూ పడమటి భాగాలు బిజాపూరుసుల్తానుగారి వాటాకూ వచ్చినవి. ఆసుల్తానులు తమ తమ వాటాలను స్వాధీనపర్చుకోవడానికి సైన్యాలు పంపి యుద్ధాలు చేయడంతో కొంతకాలం గడచింది. పడమటి భాగాలు సులభంగానే లొంగినట్లు కనబడినా అక్కడ బిజాపూరుసుల్తానుగారి ప్రభుత్వం నిమిత్తమాత్రంగానే వుండేది. తూర్పుభాగంలో కంభం, కొండవీడు మొదలైన ప్రాంతాలపాళెగార్లు గోలకొండసుల్తానుగారికి సులభంగా లొంగక చాలాకాలం యుద్ధంచేశారు. శిరివెళ్ల, చెన్నూరు, నంద్యాల, ముసలిమడుగు మొదలైన ప్రాంతాలు కూడా గోలకొండసుల్తానుకు లోబడినవి.

క్రీస్తుశకం పదహారవశతాబ్దంలో బిజాపురం సుల్తాను సామంతుడైన అబ్దుల్‌వాహబుఖాను కర్నూలుమీదికి దండయాత్ర చేసి అప్పట్లో ఆప్రాంతాలను పరిపాలిస్తూ వుండిన విజయనగర రాజబంధువున్నూ అళియరామరాయుల మనమడున్నూ అయిన గోపాలరాజును వెళ్ళగొట్టి కర్నూలులో తనప్రభుత్వం స్థాపించాడు. ఇతడు మహమ్మదీయమతాన్ని వ్యాపింపజెయ్యాలనే వుద్దేశ్యంతో అనేక దేవాలయాలను పడగొట్టి మశీదులను కట్టించాడు. అతని తరువాత అతనితమ్ముడైన మహమ్మదు నవాబు అయి ౧౬౮౬ వరకూ రాజ్యం చేశాడు. అతని కాలంలోనే అనగా ౧౬౭౭ లో ఛత్రపతి శివాజీ

బిజాపూరురాజ్యభాగాలను కొన్నింటిని ఆక్రమించుకుని కొన్నిటిని దోచుకోవడంలో కర్నూలును కూడా దోచినాడు. తరువాత కొద్ది కాలంలోనే మొగలాయి చక్రవర్తియైన షాజిహాను సైన్యాలు దక్షిణాపథంమీదికి దండెత్తి వచ్చి బిజాపూరు రాజ్యభాగాలను కొన్నింటిని ఆక్రమించుకున్నవి. క్రమక్రమంగా దక్షిణాపథంలోని రాజ్యాల నన్నింటినీ కూడా జయించి మొగలుసామ్రాజ్యంలో చేర్చినవి.

కందనూరి నవాబులు

౧౬౮౭లో మొగలు చక్రవర్తియైన ఔరంగజేబు పాదుషా గోలకొండను, కృష్ణానదికి దక్షిణాన వున్న రాజ్యాలను జయించాడు. అప్పుడు ఆయన సేనాపతులలో ఒకడైన గయాజుద్దీను కర్నూలును పట్టుకున్నాడు. తరువాత ఈమండలాన్ని మొగలుచక్రవర్తి తన సేనాధిపతియైన దావూదుఖాను బహద్దరుకు జాగీరుగా యిచ్చాడు. అతని తరువాత ౧౭౩౩లో జాగీరుదారుడైన హిమాయతుఖాను 'నవాబు' అనిపించుకున్నాడు. ఇతని కాలంలో ౧౭౪౧లో మరాటీదండు వచ్చి దేశాన్ని కొల్లపెట్టింది. దీనినిగురించిన పాటలు ఇప్పటికీ పాడుతూ వుంటారు.

కర్నాటకనవాబుల వారసత్వం తగాదాలలో హిమాయతుఖాను ఒకమాటు ఇంగ్లీషువారి పక్షాన్ని యింకొకమాటు ఫ్రెంచివారి పక్షాన్ని చేరినాడు. అప్పట్లో సలబతుజంగునూ, ఫ్రెంచిసేనానియైన బుస్సీదొరయునూ, కలిసి ౧౭౫౧ మార్చినెలలో కర్నూలును ముట్టడించారు. ౧౭౫౨లో హిమాయతుఖాను తమ్ముడైన మునవరుఖాను కర్నూలు నవాబు అయినాడు. అతని కాలములో మైసూరుసుల్తాను హైదరాలీ (౧౭౫౫) కర్నూలుమీదికి దాడివచ్చి రెండులక్షలు కప్పంగా పుచ్చుకున్నాడు. మునవరుఖాను ౧౭౯౨లో చనిపోగా అతని మూడవకొమారుడైన అలూఫ్‌ఖాను నవాబు అయినాడు.

తరువాత ౧౭౯౯ లో హైదరాలీ కొమారుడైన టిప్పుసుల్తాను యుద్ధంలో ఓడిపోయి చనిపోగా బళ్ళారి కడపజిల్లాలతోపాటు ఈజిల్లా కూడా ఇంగ్లీషువారికిసహాయుడైన హైదరాబాదునిజాముపాలికివచ్చింది.

తరువాత నిజాము ఇంగ్లీషువారికి సైనిక ఖర్చులకింద యివ్వవలసి వచ్చిన సొమ్ముక్రింద రాయలసీమలోని బళ్ళారికడపజిల్లాలనూ, కర్నూలు జిల్లాలోని కంభము, మార్కాపురము, కోయిలకుంట్ల, పత్తికొండ, అనే నాలుగు తాలూకాలనూ, ౧౮౦౦వ సంవత్సరంలో నిజాము ఇంగ్లీషు వారికి సమర్పించాడు. ఇవే దత్తమండలాలని ప్రఖ్యాతి చెందినాయి. కర్నూలుజిల్లాలో చేరిన మిగతా నాలుగు తాలూకాలు అనగా రామళ్ళకోట, నందికొటుకూరు, నంద్యాల, శిరివెళ్ళ, తాలూకాలు కర్నూలు నవాబురాజ్యంలోనే యున్నాయి. ఈసందర్భంలో కర్నూలు నవాబు సాలుకు ఒకలక్షరూపాయిలు కప్పం చెల్లించే పద్ధతిమీద అతని రాజ్యం అతనికే వుండనిచ్చారు.

పైన చెప్పినట్లు నిజాముగారివల్ల ఇంగ్లీషువారికివచ్చిన దత్త మండలాలనే బళ్ళారి కడప కర్నూలు జిల్లాల భాగాలను పరిపాలించడానికి తామస్ మన్రోగారిని నియమించారు. ఆ జిల్లాలలో పాళెగాళ్లు కొందరు దేశంలో అల్లరి సాగించగా క్యాంబెల్ అనే సేనాధిపతి వారిని అణచివేశాడు. అయితే మళ్ళీ కొద్దిరోజులలోనే దివాకరనాయకుడనే యతడు పుల్లల చెరువుగ్రామాన్ని తగలబెట్టి మార్కాపురం కచ్చేరిలో నున్న ఖజానాను దోచుకున్నాడు. అప్పుడు అక్కడ సబుకలెక్టరుగానున్న గ్రీముదొరగారున్నూ, తాశిల్దారుగానున్న నరహరి రావుగారున్నూ, అతనిని పట్టుకోడానికి చాలా ప్రయత్నాలు చేశారు గాని లాభం లేకపోయింది.

1803 లో చెన్నపట్నానికి మింటోగారు గవర్నరుగా నుండగా ఇంగ్లీషువారికి మహారాష్ట్రులతో యుద్ధంవచ్చింది. అప్పుడు కర్నూలు నవాబు అలూఫ్‌ఖాను తనతమ్ముడికి కొంత సైన్యమిచ్చి ఇంగ్లీషువారికి సహాయంగా పంపించాడు. అలూఫ్‌ఖానుగారికి ఆరుగురు కొమాళ్ళు. అందులో కడసారి కొమారుడైన గులాంరసూలుఖానుమీద ఆయనకు చాలాప్రేమ. అందువల్ల తనస్థానే అతణ్ని నవాబుగా అంగీకరించవలసినదని మింటోగారిని ప్రార్థించి ఆప్రకారముఉత్తర్వులుపొందినాడు. అంతట గులాం రసూలుఖాను కర్నూలు నవాబు అయినాడు. అయితే మళ్ళీ

ఏ కారణంవల్లనో అతనికి బదులుగా కొంతకాలం మునవరుఖానున్నూ, తరువాత ముజఫర్ ఖానున్నూ నవాబులుగా నున్నారు. ఇంతలో అలూఫ్‌ఖాను ౧౮౧౫ లో చనిపోగా ఇంగ్లీషు ప్రభుత్వంవారు ముజఫర్ ఖానును తొలగించి మళ్ళీ మునవరుఖానునే నవాబుగా చేశారు.

గులాం రసూలుఖాను పరిపాలన

మునవరుఖాను నవాబుగా వుండగా ౧౮౧౬ లో పిండారీ దండు కర్నూలుజిల్లామీదికి వచ్చిపడి ప్రజలను దోచి హింసించింది. మునవరుఖాను తరువాత ౧౮౨౩లో గులాంరసూలుఖాను కర్నూలు నవాబు అయినాడు. ఇతడు ౧౮౩౯-వ సంవత్సరం వరకూ ఆ రాజ్యాన్ని ఏలినాడు. ఇతని కాలంలో పరిపాలన చాలా నిరంకుశంగా వుండేది. ఈయనరాజ్యంలో వున్న అహోబలం, శ్రీశైలం, మొదలైన పుణ్యక్షేత్రాలకు యాత్రవచ్చే హిందువులవల్ల చాలా ఎక్కువ హాశ్శీలు వసూలు చేస్తూవుండేవాడు గాని ఆ దేవస్థానాల పరిపాలన సరిగా జరిగించేవాడు కాడు.

గులాం రసూలుఖానుగారికి పూర్వం కర్నూలును పరిపాలించిన నవాబులలో కొందరు చాలా శాంతముగాను న్యాయంగాను దేశాన్ని పరిపాలించారు. దేశం సుభిక్షంగానుండేది. వారు మతపక్షపాతంచూపించకపోవడమేగాక హిందువుల దేవాలయాలకుకూడా ఇనాములిచ్చి పోషించారు. కర్నూలు నవాబులు నిజాముగారి కివ్వవలసిన పేష్కషు గాకుండా వారు నిజాముగారికీ ఇంగ్లీషు కంపెనీ వారికీ చాలా సొమ్మును సైన్యమునుఇచ్చి యుద్ధాలలో సహాయంచేయవలసి వచ్చేది. ఒక వంక హైదరాలీ సైన్యాలూ, ఇంకొకవంక శివాజీ సైన్యాలూ, వచ్చిపడి దేశాన్ని కొల్లగొట్టి నవాబును బాధిస్తూ వున్నందువల్ల నవాబుకు అమితమైన ధనవ్యయం కలిగి చాలా సొమ్ము కావలసి వచ్చేది. అందువల్ల వారు ప్రజలను పీడించి అనేక విధాలుగా సొమ్ము రాబట్టేవారు. పన్నుల వసూలులో క్రమపద్ధతిపోయి గ్రామాధికారులే పన్నులు నిర్ణయించి వసూలుచేసే పద్ధతి ప్రారంభమైనది.

గులాం రసూలుఖానుగారి కాలంలో గ్రామాలను గుత్తకిచ్చే

ఆచారం వచ్చింది. శిస్తువసూలుకు గ్రామాధికారులే నవాబుగారికి జవాబుదారులైనందువల్ల వారు నిరంకుశులై అక్రమాలు జరిగించడం మొదలుపెట్టారు. పంటలు పండినా పండకపోయినా పన్నులు పూర్తిగా వసూలుచేసేవారు. పంటలు బాగాపండినప్పుడు నవాబుగారి సైన్యాలు వచ్చిపడి ఆ ధాన్యాన్ని బలవంతంగా యెత్తుకుని పోయేవి. ఈ బాధలు పడలేక నంద్యాల ప్రాంతపు జనులు రెండు మూడు సంవత్సరాలు వ్యవసాయము చెయ్యడమే మానుకున్నారు.

నవాబుగారి అధికారుల జులుముకు హద్దుపద్దులు లేకుండా పోయినవి. నర్నూరు గ్రామంలో నవాబుగారి గుఱ్ఱం చచ్చిపోతే నవాబుగారి ఉద్యోగులు ఆ గ్రామస్థులవల్ల ఐదువేల రూపాయిలు అపరాధంగా వసూలు చేశారు!

కర్నూలు నవాబైన గులాం రసూలుఖానుకు మొదటినుంచీ కొన్ని కొన్ని పిచ్చికళలు ఉండేవి. అతనికి నిజంగా కొంత చిత్తచాంచల్యము కూడా వుండేదని అనుకునేవారు. అతనికి ఎంత తోస్తే అంతచేసేవాడేగాని ఒకరు చెబితే వినేవాడుకాడు. అతడు తన సైన్యాన్ని సముద్రయాత్రకు పంపించి వారికి జీతబత్తెములకు బదులుగా బట్టలు, గడ్డి, యిచ్చేటట్లు నిశ్చయించాడు. తన పెంపుడు కోడిపుంజుల మెడలలో వజ్రాలను కట్టించాడు. ఒకసారి తానే మహమ్మదు ప్రవక్తనని ప్రకటించాడు. ఈనవాబుకాలంలో తక్కిన వ్యవహారా లెలాగనున్నా పోలీసు రక్షకశాఖమాత్రం చాలా సమర్థతతో పనిచేసేది. అతడు విధించే క్రూరశిక్షలవల్ల అతనిరాజ్యంలో దొంగతనాలు అణగిపోయినవి. చోరీ జరిగిన గ్రామంలో చోరీ ఆస్తిని పట్టి యివ్వలేకపోతే ఆ గ్రామస్థులే ఆసొమ్ము యిచ్చుకోవాలని శాసించాడు. అందువల్ల దొంగతనాలు చాలా అరుదుగా జరిగేవి. కర్నూలునుంచి హైదరాబాదుకు పంపించే ఖజానాకు సైనిక సిబ్బంది గానిఇనుపపెట్టెలు బందోబస్తుగాని లేకుండా గంపలలోనే పంపించేవారు.

ఇంగ్లీషు కుంఫినీవారి రాజ్యాన్ని కూలద్రోయాలని ఇతడు కుట్ర చేస్తూవున్నట్లు అనుమానించి ౧౮౩౯ లో కుంఫినీవారు ఇతని రాజ్యం

లాక్కొని-ఇతణ్ణి తిరుచునాపల్లికి రాజకీయ ఖైదీగా పంపారు. అక్కడ ఇతడు క్రైస్తవమతాభిమానం చూపుతున్నాడని ఒక మహమ్మదీయుడికి కోపం వచ్చి ఇతనిని ౧౮౪౦లో పొడిచి చంపాడు.

కర్నూలు నవాబు రాజ్యాన్ని లాక్కునేటప్పుడు అతడు అది వరకు తన సరదారులకూ, బంధువులకూ ఇచ్చిన జాగీరులు కూడా కుంఫినీవారు తీసుకొని ఆయన కుటుంబంవారికి రెండులక్షల రూపాయలకు పైగా పింఛను ఏర్పాటు చేశారు. అసలు పింఛనుదార్లు చనిపోయిన మీదట ఆ పింఛనులను రద్దుచేశారు.

ఈ రాజ్యాన్ని లాక్కున్నతరువాత దానికి ఒక బ్రిటీషు కమీషనరును ఏజెంటు అనే పేరుతో నియమించి భూమిని రైతువారీ బందోబస్తు చేశారు. ౧౮౫౮ లో తక్కిన నాలుగు తాలూకాలూ కలిపి ఒక కలెక్టరుకిరింద ప్రస్తుతమున్న కర్నూలుజిల్లాను నిర్మించారు. శ్రీశైలాన్ని కొన్నాళ్ళు కుంఫినీవారే పరిపాలించి ౧౮౪౦ లో ఆ దేవస్థానానికి పుష్పగిరి పీఠాధిపతులను ధర్మకర్తలుగా నియమించారు. (Imperial Gazeteer-Provincial Series, Madras Vol. I pp.406-7)

ఏనుగుల వీరాస్వామయ్యగారి వర్ణన

ఏనుగుల వీరాస్వామయ్యగారు ౧౮౩౦-౧౮౩౧ మధ్య కాశీ యాత్ర చెయ్యడంలో ఈ కర్నూలు నవాబురాజ్యంలో చేరిన పుణ్యక్షేత్రాలను దర్శించారు. అక్కడి రాజకీయ సాంఘిక స్థితిగతులను వర్ణించారు. వీరాస్వామయ్యగారు కడపనుండి శ్రీశైలానికి ప్రయాణం చేసే దారిలో దువ్వూరువరకూ కడపజిల్లాలో చేరిన భూమి అనిన్నీ, తరువాత వంగలి అనే వూరు 'కందనూరి నవాబు' దనిన్నీ వ్రాస్తూ రూపసింగు అనే సర్దారుకు కొలువుకుగాను ఈ గ్రామం వగైరా కొన్ని వూళ్లు జాగీరుగా ఇవ్వబడిన వని ఇలా వ్రాశారు. "ఎగువ అహోబళములో ఉత్సవకాలమందు ౪౦౦ వరహాలు హాశ్శీలు వసూలు అవుతున్నవి. వాటి నంతా కందనూరినవాబు పుచ్చుకొని వెనక గుళ్ళసంగతినే విచారింపడు.'' (కాశీయాత్రచరిత్ర, పుట ౧౦)

వీరాస్వామయ్యగారు అహోబళంనుంచి మహానందికి వెళ్ళారు.

తరువాత కందనూరినవాబు రాజ్యంలో చేరిన బండాత్మూకురుమీదుగా వెలపనూరు చేరారు. ఇక్కడ నవాబుతరఫు ఉద్యోగస్థులు కొందరు ఉన్నారు. అటుతరువాత ఆయన ఆత్మకూరు చేరారు. ఇది ఆ నవాబు తాలూకు ఉద్యోగస్థులు వుండే కసుబా బస్తీ. శ్రీశైలయాత్ర చేయ వచ్చిన వారిదగ్గర హాశ్శీలు పుచ్చుకునే నవాబుముసద్దీలు ఆత్మకూరులో వున్నారు. నవాబుపరిపాలనను వీరాస్వామయ్యగారు ఇలాగ వర్ణించారు. 'తాలూకా నాలుగు మేటీలుగా పంచి ఒక్కొక్క మేటీకి ఒక్కొక్క అములుదారుని ఏర్పరిచాడు. ఈ అములుదారులందరిపైన అక్బరునవీసు అనే అధికారిని నియమించాడు. నవుకర్లకు జీతానికి జాగీరు లిచ్చాడు. కుంఫినీవారికి సాలుకు లక్షరూపాయిలు కప్పం కడతాడు. అతని రాజ్యము బళ్ళారిజిల్లా కలెక్టరుఆజ్ఞకు లోబడినది. కలెక్టరుతరఫున ఒక వకీలు కందనూరులో కాపుర మున్నాడు. నవాబు కాజీకోర్టు పెట్టి న్యాయవిచారణచేస్తాడు. కుంఫినీకోర్టులకు నిమిత్తంలేదు. నవుకర్లకు జీతాలు స్వల్పము - సరిగా ఇవ్వడం లేదని వాడుక'(పుట౧౨)

శ్రీశైలం దేవస్థానము

శ్రీశైలయాత్రికు తీసే హాశ్శీలు కందనూరి నవాబుకు చేరుతున్నదనిన్నీ. ఉత్సవాని కయ్యే ఖర్చుగాక హాశ్శీలుకూడా పుచ్చుకుంటారనిన్నీ చెప్పి వాటి వివరాలను వీరాస్వామయ్యగారు ఇలాగు వ్రాశారు.

'సిద్ధాపురంలో చెంచువాండ్లకుగాను నవాబు మనుష్యులు మనిషి ఒకటికి 3 డబ్బులు హాశ్శీలు పుచ్చుకొంటున్నారు. పరమవారి (యాత్రికుల) వద్ద నవాబు సరకారు ఆజ్ఞ ప్రకారం మనిషి ౧-కి 3 డబ్బులు హాశ్శీలు పుచ్చుకున్నా కిరాతకుల నాయకుడు ధర్మాత్ముడుగానే వున్నాడు. కందనూరినవాబు వగైరాలు పల్లకీలమీదనే శ్రీశైలమునకు వెళ్ళియున్నారు.'

'శ్రీశైలంగుడి హాశ్శీలుమూలముగా సంవత్సరంఒకటికి ౧౮౦౦౦ కందనూరినవాబుకు వచ్చినా, గుడి యేగతిని పొందేదిన్నీ విచారింపడు. ఎవరైనా మరమ్మతు చేసినట్లయితే సెలవంత హాశ్శీలు తీసుకొను

చున్నాడు. రాజాచందులాలా యీ నిర్బంధముచేత కొంత మరమ్మత్తు చేసి విడిచినాడు. మైసూరునుంచి వచ్చేవాళ్ళకు హాశ్శీలు లేదు; గుడిలో ఏపక్క చూచినా అడివి పెరిగివున్నది. వ్యాఘ్రభూయిష్ఠము. అడివికొట్టి చక్కచేసే దిక్కులేదు. స్వామికిన్నీ, దేవికిన్నీ ఎవరైనా ఆభరణాలూ, వస్త్రాలు సమర్పిస్తే వాటి మదింపంత రూకలు హాశ్శీలు పుచ్చుకోవడమే గాకుండ కొన్ని దినాలు పోనిచ్చి ఆవస్తువులనే ఆ కందనూరునవాబు అపహరిస్తున్నాడు' (పుటలు ౧౫-౧౬).

వీరాస్వామయ్యగారు నివృత్తిసంగమానికి వెళ్ళారు. ఇది కొండ క్రింద నున్నది. కృష్ణ ఉత్తరవాహినిగా ప్రవహిస్తూవున్నది. ఆయూ రున్నూ కందనూరు నవాబుదే. కృష్ణకు యీవలిపక్కవరకూ కంద నూరివారి రాజ్యం; ఆవలిపక్క హైదరాబాదువారి రాజ్యము. అందు వల్ల కృష్ణ దాటడానికి మనిషి కింత అని కందనూరివారు ఇవతలపక్కా, హైదరాబాదువారు అవతలపక్కా హాశ్శీలు పుచ్చుకుంటున్నారు. (ఇంకావివరాలకు వీరాస్వామయ్యగారి కాశీయాత్ర చరిత్రచూడండి.)

దక్షిణదేశ రాజకీయాలు

మొగలాయిచక్రవర్తుల క్రింద దక్షిణదేశానికి పరిపాలకుడుగా నుండిన హైదరాబాదు సుభాదారుడే ఇంగ్లీషుప్రభుత్వమువారికి నమ్మిన స్నేహితుడైన ఘనత వహించిన నిజాముప్రభువు అయినాడు. మొగలు సామ్రాజ్యం అస్తమించిన తరువాత ఇంగ్లీషుపరిపాలనలో దక్షిణ హిందూదేశంలో వున్న మహమ్మదీయరాజ్యాలపైన నిజాముగారి అధి కారము పోయినా చాలాకాలంవరకూ ఆయనకు మంచి పలుకుబడి వుంటూవుండేది.

౧౮౨౯ మొదలు హైదరాబాదురాజ్యానికి నిజాముప్రభువైన నాజర్ ఉద్దౌలా అనేఆయన ఇంగ్లీషువారిపట్ల స్నేహభావంతోనే వుండే వాడు. ఆయన మంత్రి రాజ్యతంత్రనిపుణుడైన రాజా చందులాలా అనే బ్రాహ్మణుడు. ఇంగ్లీషుకుంఫినీవారికి మిత్రుడుగా వుండేవాడు. అయితే నిజాంప్రభువుగారి సోదరుడికి మాత్రం ఇంగ్లీషువా రంటే అసహ్యం. ఆయన కుంఫినీవారికి వ్యతిరేకంగా కుట్రలు చేస్తూవున్నట్లు ఇంగ్లీషు

వారికి తెలిసినందువల్ల ఆయనను హైదరాబాదులోనుంచి దూరప్రదేశానికి ప్రవాసం పంపించారు.

ఈదేశపు మహమ్మదీయులలో స్వమతాభిమానం చాలా ఎక్కువ. పరమతసహిష్ణుత చాలా తక్కువ. తమకు యిష్టంలేని రాజ్యాంగవ్యవస్థపట్ల తమవారిలో విరోధభావం వ్యాపింపచెయ్యడానికి అవకాశంకోసం చూస్తూవుండడము మొదటినుంచీ వుంటూనేయున్నది. దేశీయులలో ఒకరితో ఒకరు రహస్యంగా ఉత్తరప్రత్యుత్తరాలు జరుపుకోవడానికి ఈదేశంలోచాలా అవకాశాలు వుంటూవున్నందువల్ల రహస్యాలోచనలకూ, కుట్రలకూ చాలా వీలుగా వుంటూవుండేది. రహస్యపు ఉత్తరప్రత్యుత్తరాలమార్గంగానూ, బజారు పుకారుల మూలంగానూ అనేక వార్తలు ఈ దేశంలో ఆనోటా ఆనోటాపడి చాలా త్వరగా వ్యాపిస్తూవుండేవి.

తురకల రక్షరేకులు, తాయత్తులు

ప్రపంచ మంతటా మహమ్మదీయులకు తావేదులన్నా, రక్షరేకులన్నా చాలా ప్రీతి ఈ తాయత్తులలో కాగితాలపైనా, రక్షరేకులపైనా భగవంతుడి పేరో, లేకపోతే ఖురానులోనుంచి ఒక వాక్యమో వ్రాసి వుంటుంది. అయితే అందులోని అక్షరాలూ, మాటలూ, వాక్యాలూ పైకి కనబడేఅర్థాన్నేకాక వేరే ఇంకొక అంతరార్థాన్నికూడా స్ఫురింపచేస్తూ వుండేటట్లు వ్రాయడానికి వీలున్నందువల్ల హిందువులపైననూ, వారిలాగనే కాఫరులైన ఫరంగీలపైననూ ద్వేషాన్ని పురికొల్పే 'జిహాద్' అనే మతయుద్ధాన్ని ప్రకటించడానికి ఉపయోగించేవారు.

'జిహాద్' అనే మతయుద్ధం

౧౮౩౮ లో ఇంగ్లీషువారు ఆఫ్ఘనిస్థానంమీాదికి దండయాత్ర చెయ్యడానికి సైన్యాలు పంపినప్పుడు ఇలాంటి అర్థాలు స్ఫురించే తాయత్తులూ, రక్షరేకులూ దేశంలో చాలాచోట్ల కనబడ్డాయి. ఆ సమయములో హిందూదేశ మంతటావున్న మహమ్మదీయ ప్రజలలో రహస్యమైన ఉద్రేకం కలిగినట్లు కనబడింది. అయోధ్యరాష్ట్రంలో

నుంచి అరబ్బీదూతలు బయలుదేరి దేశంలో నలుమూలలా తిరుగుబాటు చేయడానికి ప్రచారం చేశారు. ఆసమయంలో భగవంతుడి సహాయం ఇంగ్లీషువారికి వుండబట్టిగాని లేకపోతే హిందూ దేశంలో వారి రాజ్యం భగ్నం అయ్యేదే. ఆఖరికి జాతివాళ్ళు చాలామంది ఆహుతి అయ్యేవారే. ఈ కుట్రాలోచనలు జరిగినట్లు చాలా దాఖలాలున్నాయి.

ఇలాంటి అరబ్బీదూతలు కొంతమంది చెన్నపట్నందగ్గరనే పట్టుబడ్డారు. ఆసమయంలో వారిదగ్గర దొరికిన రక్షరేకులలో పైకి కేవలమూ మహమ్మదీయ మతానికి సంబంధించిన ఖురానులోని సామాన్యపదాలుగా కనబడే మాటల్లే చిత్రంగా కూర్చబడి, వాటిని కొంచెం జాగ్రత్తగా పరిశీలిస్తే కాఫరులపైన జిహాద్ అనే మతయుద్ధానికి తురకలను పురికొలిపే అర్థం స్ఫురిస్తుంది. ఈమాటలను తురకంలోలాగనే కుడి నుంచి యెడమకు చదవాలి. ముఖ్యంగా ఈకింది పట్టికలోని గళ్లలో నాలుగైదు పంక్తులను అలాగ చదివి చూడండి:—

6	5	4	3	2	1
...లగించు.	పీడను	మా ప్రజలకూ	మాకూ	కరుణామయుడా	ఓ దేవా (1)
...నంచెయ్యడు	మహేశ్వరినీ	గట్టి కోటగోడల మధ్య ఉన్న వారిని తప్ప	రక్షిస్తాడు.	సద్ధర్మ్ములను	భగవంతుడు (2)
...క్షించు.	మనుష్యులను	నీ సేవకులైన	పంపి	నీ ప్రవక్తను	ఓభగవంతుడా 3.
...య్యి.	తరిమి	దుష్పరిపాలకుల్ని	ఈ క్రూర నిరంకుశ	ఈ మహానగరాల నుండి	ఓ ప్రవక్తా (4)
...చెయ్యి.	వారిని	ఓభగవంతుడా	యుద్ధం చెయ్యండి.	నాస్తికుల పైన	కాఫరుల పైన (5)

కర్నూలు నవాబుకుట్ర

ఆఫ్ఘనిస్థానములో ఇంగ్లీషుసైన్యాలకు జయం కలుగుతుందో అపజయమే కలుగుతుందో అనే సందిగ్ధావస్థలోనున్న సమయంలో, అనగా ౧౮౩౮-వ సంవత్సరం వేసంగిలో ఒకబీదతురకస్త్రీ హైదరా

బాదు నగరంలో ఒక సత్రంలో కలరాతగిలి చావడానికి సిద్ధంగా వుండి, ఆ సత్రంలోనే బసచేసిన ఒక పెద్దమనిషిని దగ్గిరకి పిలిచి తా నొక రహస్యం చెప్పకోదలచినా ననిన్నీ, తన కోరిక చెల్లించవలసిం దనిన్నీ బ్రతిమాలింది. పాపం, ముసలమ్మ అవసానసమయంలో అడుగుతూవుందికదా అని అతడు సరేనన్నాడు. అంతట ఆమె తన మెడలోనుంచి ఒక రక్షరేకును తీసి అతనిచేతిలో పెట్టి తాను చచ్చి పోగానే ఆ రక్షరేకును తీసుకువెళ్లి మూశీనదిలో పారవెయ్యవలసిందని ప్రార్థించింది. పాపం, ఆపెద్దమనిషి మొదట ఆవిడకోరికను చెల్లిద్దామనే అనుకున్నాడుగాని ఈవింతకోరికను గురించీ, ఆవిడ చూపిన ఆదుర్దాను గురించీ అతనికి మనస్సులో కొంచెం అనుమానం తగిలి ఇందులో ఏదో విశేషం వున్నదని తలచి ఆరక్షరేకును హైదరాబాదులో అధికారుల కిచ్చాడు. దానిని వారు పరిశీలించగా అది నిజాంప్రభువుగారి సోదరుడు కర్నూలు నవాబుగారికి వ్రాసిన రహస్యపు వుత్తరం అని తేలింది.

జనానాలో ఆయుధాగారం

దీనిని గురించి దర్యాప్తులు చేయగా ఇంగ్లీషు వారిపట్ల ఒక పెద్ద కుట్ర జరుగుతూవున్నట్లు బయలుపడింది. ఇంతేకాదు; కర్నూలుకోటలో కొంత ఆయుధసామగ్రిన్నీ, మందుగుండుసామానున్నూ చేర్చివున్న ట్లున్నూ తెలిసింది. అంతట వెంటనే ఒక ఇంగ్లీషు సైనికదళాన్ని కర్నూలుకు పంపి కోటను సోదాచేస్తామని నవాబును అడిగారు. సరే చేసు కోండి అని అతడు ధైర్యంగా జవాబుచెప్పి తన సైనికులతోటీ, పరివారంతోటీ కోటవెలపల మైదానంలోకి వెళ్లాడు. కర్నూలు నవాబుగారి కోటను తనిఖీ చెయ్యడానికి కమిషనర్లు వెళ్లినప్పుడు గులాం రసూలుఖానుగారు వారిని చాలా మర్యాద చేశారు. దానిని గురించి వారే ఇలాగ వ్రాశారు. 'కర్నూలు పట్నంనుంచి కోటద్వారముదాకా వీథులకు రెండుప్రక్కలా సైనికులు బారులు తీర్చి మాకు జోహారుచేసి గౌరవంచూపారు. మేము దివానుఖానాను సమీపించగానే నవాబుగారు కొంచెముదూరము మా కెదురుగా వచ్చి, మాచేతులు పట్టుకుని ఉచితాసన మిచ్చి గౌరవించాడు. అటు తరువాత

ఖరితా ఇవ్వగా నవాబు చాలా వినయంతోనూ గౌరవంతోనూ స్వీకరించాడు.'

కోటను సోదాచూడాలని కమిషనర్లు ఆయనతో చెప్పగా ఆయన మారు మాటాడక, కోటను వారికి స్వాధీనంచేసి తాను తన పరివారజనమూ హంద్రినది యొడ్డున నున్న జోహరాపురమునకు పోయి అక్కడ వేచియున్నాడు. ఈ అవమానం సహించలేక అతని మామగారైన నాందిరీఖానుగారు తిరుగుబాటుచేశారు డట.

అంతట ఆ కోటను సోదా చెయ్యడానికి నియమింపబడిన కమీషనర్లు కోటను, నవాబుగారి అంతఃపురాన్ని జాగ్రత్తగా సోదా చేశారుగాని ఏమీ దొరకలేదు. కోటలో మందుగుండు సామాను యేమీ కనపడలేదు. నవాబుగారు దోషి యనడానికి తగిన నిదర్శనాలేమీ కనబడలేదు.

నవాబుగారి జనానాకు అంటివున్న వుద్యానవనం పెద్దగోడల మధ్య గదులుగదులుగా కేటాయింపు చేయబడి వున్నది. ఏమైనా వుంటే అక్కడే దొరుకుతుందని అనుకున్నారుగాని అక్కడకూడా ఎంత వెదకినా అనుమానం కలిగేది ఏమీ కనబడలేదు. అయితే ఇదివరకు వచ్చిన ఆచోకీ సులభంగా తీసిపారవేయడానికి వీలైనదికాదు. గనక ఈ జనానావుద్యానవనాన్ని మళ్లీ ఇంకొకమాటు ఇంకా జాగ్రత్తగా పరిశోధించడానికి నిశ్చయించారు. ఆ ప్రకారం నలుమూలలా శోధిస్తూ వుంటే అందరికీ ఆశ్చర్యం కలిగేటట్టుగా ఈ జనానా వుద్యానవనంలో ఒక రహస్యపు ఆయుధాగారం బయటపడింది. ఈ వుద్యానవనంయొక్క ఆవరణపు గోడలన్నీ మధ్య ఖాళీలతో రెండు వరసలుగా కట్టి, పైన సామాన్యమైన కోటగోడలలాగ కనబడుతూ లోపల బోలుగా కట్టినవే. వాటిలోపలి ఖాళీలలోనూ నేలసొరంగాలలోనూ, ఆరు యేడు వందల ఫిరంగులూ, ఫిరంగిబళ్లూ, ఫిరంగిగుళ్లూ, తోటాలూ, తుపాకులూ, మందుగుండుసామాన్లూ, ఫిరంగులు పోతపోయడానికి కావలసిన కొలుములూ భద్రపరచి వున్నాయి. ఇందులో చాలాఫిరంగులు కొత్తగా తయారు చేసినవి. కొలుములుకూడా అప్పటికి కొద్దికాలం క్రిందటనే వుపయోగించినటు కనబడ్డాయి.

కర్నూలునవాబు పదచ్యుతి

ఆఫ్ఘనిస్థానం యుద్ధంలో ఇంగ్లీషువాళ్లు ఓడిపోతారని అనుకుని దేశంలోవున్న మహమ్మదీయు లందరూ ఏకమై తిరుగుబాటు చేయడానికి కుట్రచేసినట్లూ, దానికి కర్నూలు ఒక కేంద్రస్థాన మైనట్లూ తేలింది. "మన కళ్ళ యెదుటనే ఇలాంటి గొప్పకుట్ర సాగుతూ వుండడమూ, దానికి కావలసిన సొమ్ము చేకూరడమూ ఎంత ఆశ్చర్యము!" అని దీనినిగురించి ఇంగ్లాండుకు వ్రాసిన ఆయన అన్నాడు.

కర్నూలు నవాబు గులాం రసూలుఖానును పదభ్రష్టుణ్ని చేసి తిరుచినాపల్లికి రాజకీయఖైదీగా పంపారు. అక్కడ అతడు క్రైస్తవ మతంలో ఆసక్తి చూపుతూ క్రైస్తవదేవాలయానికి వెళ్ళగా ఒక తురకఫకీరు ఆయనను ౧౮౪౦-వ సంవత్సరం జూలై ౧౨-వ తేదీన కత్తితో పొడిచి చంపాడు. (South Indian Sketches. A short account of some missionary stations of Church Mission Society By S. Tucker; James Nisbet & Co; 1842 pp 17—23)

---

౧౨. మంగలి కొండోజీ

క॥ "ఎంగిలిముచ్చుగులాములు
సంగతిగాఁ గులము చెఱుపఁ జనుదెంచి రయో
యింగిత మెరిగినఘనుఁ డీ
మంగలికొండోజి మేలు మంత్రులకన్నన్."

అని కంసాలి రుద్రియ యని ప్రసిద్ధిజెందిన కందుకూరి రుద్రకవి చెప్పిన చాటుపద్య మొకటి చిరకాలంనుంచి ప్రచారంలో వున్నది.

ఈ రుద్రకవి విద్యానగరసామ్రాజ్యాన్ని పరిపాలించిన శ్రీకృష్ణదేవరాయల కాలంనాటివాడనిన్నీ, ఇతడు రాయలవారి దర్శనంకోసం చాలాకాలం వేచియుండి మంత్రులనూ, రాజోద్యోగులనూ ఎన్నాళ్లు

ఆశ్రయించినా వారు దర్శన మివ్వించ లేదనిన్నీ, ఇలా వుండగా రాయలవారికి క్షౌరంచేసే మంగలి కొండోజీ ఈ కవి ఇలాగ మంత్రుల యిళ్లదగ్గిరా, వుద్యోగుల యిళ్లదగ్గిరా పడికాపులుకాస్తూ పడివుండడం చూసి దయదలచి ఈ సంగతి రాయలవారితో మనవి చేశాడనిన్నీ, అంతట రాయలవారు కవికి దర్శన మిచ్చారనిన్నీ అప్పుడు రుద్రకవి యీ పద్యం చెప్పా డనిన్నీ ప్రతీతి.

రాజగురువైన తాతాచార్యులవారు రుద్రకవిని ఊరు, పేరు, కుల గోత్రాలు అడిగితే కవి చమత్కారంగా పద్యంలోనే జవాబు చెప్పాడట. తరువాత రాజసభలో అనేక దుస్సమస్య లియ్యగా అవన్నీ చక్కగా పూరించాడట. అంతట రాయలవా రాయనను తగినవిధంగా సత్కరించి తమ ఆస్థానంలో అష్టదిగ్గజా లనే కవులలో ఒక్కనిగా చేశారట. రుద్రకవి రాజగురువైన తాతాచార్యుల వారితోనూ, అష్టదిగ్గజాలలో * చేరిన అల్లసాని పెద్దన, ముక్కు తిమ్మన, పుత్తేటి రామభద్రయ్య, పింగళి సూరన, కవిరాట్టు, తెనాలి రామలింగకవి, భట్టుమూర్తి మొదలయిన కవులతోనూ వాగ్వాదాలు చేసేవాడనిన్నీ ప్రతీతి.

ఈ రుద్రకవికి 1550-1580 మధ్య గోలకొండ నేలుతూ కవులను ఆదరించి "మల్కిభరాం" అని పేరుపొందిన మలిక్ ఇబ్రహీంకుతుబ్ పాదుషాగారు రెంటచింతల (చింతలపాలెం) అనే గ్రామాన్నియిచ్చి సత్కరించారు. ఆ గ్రామాన్ని రుద్రకవి వంశీకులు అనుభవిస్తున్నారు.

రుద్రకవి రచించిన నిరంకుశోపాఖ్యానం అనే ప్రబంధంలో

"చేరి కన్నడభూమి చెఱవట్టు పాశ్చాత్య
నృపతిపై నొక్కింత కృప తలిర్చు"

అను సీసపద్యపాద మొకటి విద్యానగరవినాశనమును

---

* కృష్ణదేవరాయలవారు తమ ఆస్థానంలోని అష్టదిగ్గజములనే కవులకు తిప్పలూరును అగ్రహారంగా యిచ్చినట్లు 2 వ సం. స్థానిక చరిత్ర 357 వ పుట (క్రీ. శ. 1528) లో నుదాహరింపబడి యున్నదని డాక్టరు నేలటూరి వెంకట రమణయ్యగారు తమ విజయనగర 3 వ రాజవంశచరిత్రలో వ్రాసినారు చూ. పుట. 421.

సూచిస్తూవున్నందువల్ల 1565 లో జరిగిన తాలికోటయుద్ధ వ 'రాక్షస తగ్గి' యుద్ధములో అళియరామరాయలు దివంగతు విద్యానగరాన్ని మహమ్మదీయులు కొల్లగొని నాశనం చే తరువాతనే ఈ ప్రబంధము రచింపబడియుండినట్లు కనబడుత వున్నది. ఈ రెండు కారణాలవల్లనూ రుద్రకవి కృష్ణదేవరాయ కాలములో వున్నాడో లేడో అనే సంశయం కలిగి కృ దేవరాయలకాలంలో ఒక రుద్రకవి వున్నట్లయితే అత డీ నిరంకు పాఖ్యాన గ్రంథకర్త తాతయై యుండవలెననిన్నీ, లేదా ఇత డ టికి బాలుడుగా నైనా ఉండవలెననిన్నీ బ్రహ్మశ్రీ వేటూరి ప్ర కర శాస్త్రిలవారు తమ చాటుపద్యమణిమంజరి రెండవభాగంల వ్రాసియున్నారు.

మంగలి కొండోజీని గురించి రుద్రకవి చెప్పిన చాటుపద్య వల్లకూడా ఈకవి కృష్ణదేవరాయల తరువాతి కాలంనాటి వాడే స్పష్టంగా ఋజువు అవుతున్నది.

చరిత్రాంశాలు

మంగలి కొండోజీ కథలో యెంత సత్యమున్నదో తెలియ గాని కొండోజీ మాత్రం కల్పితపురుషుడు కాడు. కొండోజీ య మంగలి యొకడు 1542 మొదలు 1569 వరకూ రాజ్యం చేసిన సదా రాయలవారి కాలంలో విశేషమైన రాజసమ్మానం పొందినట్లు శ నాలవల్ల కనబడుతున్నది.

కృష్ణదేవరాయలవారు 1509 మొదలు 1529 వరకూ రాజ్య చేసి స్వర్గస్థులు కాగా ఆయన తరువాత 1542 వరకూ అచ్యు దేవరాయలవారున్నూ, 1569 వరకూ సదాశివరాయలవారున విద్యానగర సామ్రాజ్యాన్ని పరిపాలించారు. సదాశివరాయల కాలంలో పేరునకే ఆయన చక్రవర్తి గాని సాక్షాత్తుగా పరిపాలి ప్రభువు కృష్ణదేవరాయలవారి అల్లుడైన ఆరవీటి రామరాజుగా ఆయన అళియరామరాయలని చరిత్రలో ప్రసిద్ధి చెందియున్నా

ఈరామరాయలవారు మహమ్మదీయులతో చాలా యుద్ధాలు జయించిన మహావీరుడు. సంగీతసాహిత్యాలను, చిత్రకళలనుపోషిం రసజ్ఞుడు. ఆయన చాలమంది సంస్కృతాంధ్రవిద్వాంసులను ను ఆదరించి బహుగ్రంథరచనను చేయించి భోజుడని ప్రఖ్యాతి నట్లు సదాశివరాయలవారి శాసనాలలోనే వుదాహరింపబడి ్నది. తరువాత వసుచరిత్రను రామరాయలవారి తమ్ముడైన ులరాయల కంకిత మిచ్చిన భట్టుమూర్తి రామరాయలవారి ఆస్థాన నుండి సమ్మానింపబడి "రామరాజభూషణు" డనే బిరుదును ెనాడు.

రామరాయలవారి కాలంలో రాజగురువుపేరు తాతాచార్యులే. న పంచమతభంజన మనే గ్రంథాన్ని వ్రాసి "పంచమతభంజనం" ాచార్యులవా రనే బిరుదును వహించాడు. కృష్ణదేవరాయల కాలంనాటి కవులు, గాయకులు, విద్వాంసులు, సామంతులు, ారులు అనేకులు రామరాయలవారి కాలంనాటికి కూడా బ్రతికి రాజసభలో వున్నట్లు తెలుస్తున్నది.

రామరాయల చేతులలో ఓడిపోయిన మహమ్మదీయరాజు మూ ఏకమై 1565 లో విద్యానగరంమీదికి దండెత్తి రాగా కోట యనే 'రాక్షస తగ్గి' యుద్ధం జరిగింది. అందులో రామ ులవారు స్వర్గస్థులైనారు. అంతట ఆయన తమ్ముడుడైన తిరుమల ులవారు ధనకనకవస్తువాహనాలను తీసుకుని సదాశివరాయల తో విద్యానగరం వదలిపెట్టి పెనుగొండను రాజధానిగా ొని రాజ్యపరిపాలన మారంభించారు విద్యానగరాన్ని మహమ్మ లు నాశనం చేశారు 1569 లో సదాశివరాయలవారు చనిపోగా టి తిరుమలరాయలవారే చక్రవర్తియై 1572 వరకూ పరిపాలిం వారి తరువాత ఆయన కొమాళ్లలో శ్రీరంగరాయలవారు వరకున్నూ వేంకటపతి దేవరాయ మహారాయలవారు 1614 న్నూ, చంద్రగిరి రాజధానిగా చేసుకుని విద్యానగర సామ్రా పరిపాలించారు. వేంకటపతి దేవరాయలవారి తరువాత కుటుం

బంలోనే కొన్ని తగాద్దాలు వచ్చినవి. తరువాత ముప్పయి నలభై సంవత్సరాలలో ఈ రాజ్యభాగం మహమ్మదీయులకు వశమై ఆరవీటి రాజవంశ పరిపాలన అంతరించింది.

భట్టుమూర్తి రామరాజభూషణు డనే బిరుదును పొందిన తరువాత రచించిన "వసుచరిత్ర" మనే ఆంధ్రప్రబంధాన్ని రామరాయల తరువాత రాజ్యం చేసిన తిరుమల రాయలవారికి అంకితం యిచ్చాడు. 'నరసభూపాలీయ'మనే అలంకార గ్రంథాన్ని రాయలవారి మేనల్లుడైన పోచిరాజు నరసరాజుగారికి కృతియిచ్చాడు.

తెనాలి రామలింగకవి కృష్ణదేవరాయల ఆస్థానంలో వుండి కవిత్వం చెప్పినట్లుగాని, గ్రంథాలు రచించి నట్లుగాని నిదర్శనాలు కనబడడం లేదు. రాయలవారిని గురించి, తాతా చార్యులవారిని గురించి, సమకాలికులైన కవులను గురించీ ఆతడు చెప్పినట్లు ప్రచారంలోవున్న చాటుపద్యాలు కృష్ణదేవరాయల తరువాత రాజ్యంచేసిన రాయలవార్లకుకూడా అన్వయిస్తున్నవి. కృష్ణదేవ రాయలకాలం తరువాతనే అతడు గొప్ప గ్రంథాలను రచించి రాజ సమ్మానం పొందినట్లున్నూ, వేంకటపతిదేవరాయ మహారాయల కాలం వరకూ జీవించియున్నట్లున్నూ, రాయలవారి మెప్పుకోసం వైష్ణవుడై తన పేరుకూడా రామకృష్ణకవి యనిమార్చుకున్నట్లున్నూ, కనబడుతున్నది.

కృష్ణదేవరాయలవారి తరువాత రాజ్యంచేసిన రాయలవార్లందరూకూడా సంగీతసాహిత్యాలను, లలితకళలను పోషించి విద్యావ్యాసంగము చేస్తూ రసజ్ఞులై సంస్కృతాంధ్రకవులను ఆదరించి ఆంధ్ర భోజు లనిపించుకున్న వారే. ఈరాయలవార్ల రాజగురువులపేర్లు కూడా తాతాచార్యులవార్లే. అనంతాచార్యుడు వ్రాసిన ప్రపన్నామృతంలో ఈ గురువుల వంశావళి కనబడుతున్నది. ఈ తాతాచార్యులవార్లకు అయ్యావయ్యంగా రనీ, ఎట్టూరు తాతాచార్యులు గారనీ, పంచమత భంజనం తాతాచార్య లనినీ, కోటికన్యాదానం తాతాచార్య లనినీ,

కుమార తాతాచార్యు లనీ, లక్ష్మీకుమార తాతాచార్యు లనీ, ఉప నామాలు కనబడుతున్నవి.

రాయల వార్లందరూ తెలుగువల్లభులై తెలుగుభాష నభిమానించినందువల్ల వారి మంత్రిలు, సామంతులు, సరదారులూ కూడా తెలుగుకవుల నాదరిస్తూ తాముకూడా తెలుగులో కవిత్వం చెపుతూ భాషాసేవచేసేవారు. విజయనగర సామ్రాజ్యంలో చేరిన సామంతరాజులైన తంజావూరు ఆంధ్రనాయక రాజుల ఆస్థానంలో గొప్ప తెలుగు కవులు, గాయకులు అనేకు లుండేవారు. ఆ రాజులు, వారి ఆశ్రితులైన పురుషులు, స్త్రీలుకూడా కవిత్వం చెప్పేవారు. దానిని గురించి వ్రాయాలంటే ఒక గ్రంథము నిండుతుంది.

కృష్ణదేవరాయల ఆస్థానంలో అష్టదిగ్గజాలలో ఒకడని చెప్పబడే పింగళి సూరన చిన్న సంస్థానమైన గండికోటకు పరిపాలకుడైన నంద్యాల కృష్ణరాజునకు తన కళాపూర్ణోదయాన్ని అంకిత మిచ్చాడు. ఈ కృష్ణరాజు తరువాత రాజైన తిమ్మయ 1544 లో వేయించిన శిలాశాసనం వల్ల అతడు తెలుగుకవుల నాదరించినట్లు కనబడుతున్నది.

విద్యానగరం చక్రవర్తులందరూ మహావీరులే యైనా, అందరూ ఆంధ్రభోజు లనిపించుకున్నా, అందరూ ప్రజానురంజకం గానేపరిపాలించినా, వా రందరిలోనూ ఆంధ్రుల అనురాగానికి ఎక్కువగా పాత్రులైనవారు శ్రీకృష్ణదేవరాయలవారే. ఆయన స్వర్గస్థుడై ఇప్పటికి కొన్ని వందల సంవత్సరాలైనా వాఙ్మయంలోనూ, తెలుగువారి నోళ్లలోనూ యశఃకాయంతో చిరంజీవియై యున్నాడు. రాయలవా రనగానే కృష్ణదేవరాయలవారే అందరికీ జ్ఞాపకం వస్తారు. ఏ రాయలవారికాలంలో జరిగిన గొప్ప సంగతిని చెప్పవలసి వచ్చినా, అది కృష్ణదేవరాయల కాలంలోనే జరిగిందని చెప్పడం పరిపాటి అయిపోయింది. అందుకు తగినట్లు కృష్ణదేవరాయల తరువాత రాజ్యంచేసిన రాయలవార్లకూ, ఆయనకూ చాలా సాదృశ్యా లుండడంకూడా తటస్థించింది. అందువల్లనే తరువాతికవులనుకూడా కృష్ణరాయలవారి అష్టదిగ్గజాలలో

చేర్చి అనేకకథలు చెప్పుకుంటున్నారు. మన రుద్రకవి కథకూడా ఇలాంటిదే.

'మంగలి కొండోజీ' పొందిన రాజసన్మానం

రుద్రకవి పేర్కొన్న మంగలికొండోజీ 1542 మొదలు 1565 వరకూ సదాశివరాయలవారి కాలంలో విద్యానగరాన్ని పరిపాలించిన అళియరామరాయలవారి సన్నిహితభృత్యుడు. ఇతడు తనకు బహు పసందుగా ముఖక్షౌరం చేస్తాడని రామరాయలవారు సదాశివరాయల వారికి చెప్పగా సదాశివరాయలవారుకూడా కొండోజీని ఆదరించి అతనిమీద అనుగ్రహం కలిగి అతణ్ని బహూకరించారు. ఈ కొండోజీ పేరు "బాడవిపట్టణ కాపురస్థుడైన మంగలి తిమ్మోజు కొండోజు * గారు" అనిన్నీ, "కొండోజా" అనిన్నీ సదాశివరాయలవారి దానశాసనాలలో కనబడుతున్నది. 1545 నాటికే రామరాయలవారికి కొండోజీ పైన అనుగ్రహం కలిగి మంగళ్ళు మామూలుగా చెల్లించవలసిన వృత్తి పన్నును, సుంకములును ఇతరపన్నులున్నూ అత డిచ్చుకో నక్కరలేకుండా ఒక తాకీదు జారీచేశారు. రాజ్య పరిపాలకుడి చర్యను చూసి మైసూరు రాజప్రతినిధి రాజ్యంలో చేరిన శివమొగ్గజిల్లాలో సదాశివరాయలవారి యుద్యోగి (ఏజంటు) ఈ కొండోజాకు చన్నగిరి మంగలి పన్నును ఇనాముగా నిచ్చాడు.

కొండోజు రామరాయలవారికి సేవచేస్తూవుండి రాయలవారిని ఆశ్రయించినందువల్ల మంగలికులస్థు లెవ్వరూ పన్ను లిచ్చుకో నక్కరలేకుండా సదాశివరాయలవారు 1554 లో శాసించారు. ఆ మరుసటి సంవత్సరం వెట్టిచాకిరీ, బిరద, నిర్ణీతపు శిస్తులున్నూ, ఇతరపన్నులున్నూ కూడా విజయనగర సామ్రాజ్యపు సరిహద్దులోపల తానుగాని, తన

* 'ఓజు' అనేది ఒజ్జ శబ్దానికి రూపాంతరము. దీనిని సాధారణంగా కంసాలులూ మంగళ్ళూ ఉపయోగిస్తారు. ఉత్తర హిందుస్థానంలో ఓఝా అనే రూపంవున్నది. అన్నిటికీ ఉపాధ్యాయుడనే అర్థం' అని శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు నాకు చెప్పారు.

కుటుంబము వారుగాని చెల్లించనక్కరలేకుండా కొండోజీ ఒక ఫర్మానా పొందాడు.

సదాశివరాయలవారి ఆజ్ఞప్రకారం రామరాయలవారు ఈ అదృష్టశాలికి యింకొక దానశాసనంకూడా వ్రాయించి యిచ్చారు. గాని అందులోని సంగతులు సరిగ్గా తెలియడం లేదు. ఆ కాలంలోనే గూడూరులోవున్న సదాశివరాయలవారి యుద్యోగి ఈ కొండోజీకి ఆచంద్రతారార్కంగా అనుభవించగలందులకు ఒక దానశాసనం వ్రాయించి యిచ్చి దానికి ఆటంకం కలిగించేవారికి బ్రహ్మహత్యాపాతకం కలుగుతుందని అందులో వ్రాయించాడు.

హిరేకెరూరులో ఒక కవిలెవల్ల రామరాయలవారు 'తిమ్మోజా, హొమ్మోజా, బారోజా' లనే ముగ్గురు మంగళ్ళపైన పన్నులు తీసివేసినట్లు కనబడుతూ వున్నది. బాదామిలోనున్న ఒకశాసనంవల్ల 'తిమ్మోజా, కొండోజా, భద్ర' లనే ముగ్గురు మంగళ్ళకు పన్నులు తీసివేసినట్లున్నూ కనబడుతున్నది.

సదాశివరాయలవారికిన్నీ, రామరాయల వారికిన్నీ కొండోజా యందున్నూ, పైని చెప్పిన ముగ్గురుమంగళ్ల యందున్నూ కలిగిన అనుగ్రహంవల్ల మంగలికులంవారి కందరికీ చాలా వుపకారాలు జరిగినవి. రామరాయల వారికి కొండోజాయందు కలిగిన అభిమానంవల్ల తుముకూరుజిల్లాలో నున్న మంగలి కులస్థు లందరికీకూడా పన్నులు లేకుండా తీసివేసినట్లు 1545 లోని ఒక శాసనంవల్ల తెలుస్తూవుంది. తరువాత విజయనగరరాజ్యం సరిహద్దులోపల గల మంగళ్ళందరూ కూడా పన్ను లిచ్చుకో నక్కరలేదని వుత్తర్వు చేశారు. పైని చెప్పిన కారణంవల్లనే సదాశివరాయలవారు ఉలబిగ్రామంలోని మంగళ్లకు వృత్తిపన్నును ఇనాముగా వదలివేసినట్లు చెప్పబడినది.

దరిమిలాను సామ్రాజ్యంలో నున్న మంగళ్ళందరికీకూడా అనేక సౌకర్యాలు కలిగించారు. మంగళ్లు ఇచ్చుకోవలసిన పన్నులు, నిర్ణీతపు శిస్తులు, వారు చెయ్యవలసిన వెట్టి చాకిరీ, బిరద, సుంకములు, కావలి

పన్నులు యావత్తు సదాశివరాయలవారున్నూ రామరాయలవారున్నూ తీసివేసినట్లుకూడా, చిట్లాలదుర్గము జిల్లాలో 1546 లోని ఒక శాసనంవల్ల కనబడుతున్నది.

సదాశివరాయలవారు స్వయంగా ఊటుకూరులోని మంగళ్ళపైని పన్నులు తీసివేశారు. రామరాయలవారున్నూ కర్ణాటక రాజ్యంలోని కొన్ని మండలాలలోనూ, కడపజిల్లాలోని కొన్ని సీమలలోనూ మంగళ్ళపైని పన్నులు తొలిగించారు.

రాయలవారిని చూసి వారి మంత్రులూ, సామంతులూ, కూడా అనేక గ్రామాలలో మంగళ్ళపైనిగల పన్నులను తీసివేశారు.

(The Aravidu Dynastry — Heras pp. 48—49);

౧౩ "నూజివీటి వ్యవహారం"

1771లో నూజివీటి జమీందారుడైన నరసింహ అప్పారావుగారు చాలా ఖర్చు మనిషి. చెన్నపట్నం ఇంగ్లీషు కంపెనీ ప్రభుత్వానికి చెల్లించవలసిన కప్పం (పేష్కసు) సరిగా చెల్లించలేకపోయేవాడు. అందువల్ల చిక్కులలో పడ్డాడు.

జమీందారీని వశపర్చుకోవడానికి కంపినీ సర్కారువారు 1773లో ఒక సైనికదళం పంపారు. అప్పుడు ఆయన అత్యధికమైన వడ్డీరేటుతో బందరులో నున్న కంపెనీదొరల దగ్గరనే కొంతసొమ్ము బదులు చేసి బకాయి చెల్లించాడు

1775లో బందరులో కంపెనీవారి పరిపాలకసంఘానికి అధ్యక్షుడుగా నుండిన వైటుహిల్లుకు, హాడ్జెసుకు, ఇంకా బందరులో కంపెనీ ఉద్యోగం చేస్తూవున్న మరికొందరు దొరలకు నరసింహ అప్పారావుగారు బాకీ వున్నాడని వాళ్ళు 1775లో తగాదా ప్రారంభించారు. మూడు సంవత్సరాలు గడిచినవిగాని వ్యవహారం తెగలేదు. అంతట అప్పారావుగారు చెన్నపట్నానికి ప్రయాణం కట్టారు.

అప్పుడు చెన్నపట్నంలో సర్ తామస్ రంబోల్డు అనే ఆయన గవర్నరు. ఆయన కార్యాలోచన సంఘంలో వైటుహిల్లుగారు వృద్ధ సచివుడు. (సీనియరు సభ్యుడు) అప్పారావుగారిమాట ఎవరూ వినిపించుకో లేదు. ఆయన నూజివీడుకు తిరిగివచ్చాడు. కంపెనీవారి న్యాయంలో విశ్వాసం గోల్పోయి తిరుగుబాటు చేసే సూచనలు కనబరిచాడు.

కంపినీఅధికారులు మేజర్ కాసామేజరును నూజివీడు పంపి జమీందారును బందరుకు రప్పించి ఖైదుచేశారు. ఆయనను నిర్బంధంలో వుంచిన కారాగారాధికారి హాడ్జెసు. పైనచెప్పిన దొర లందరికీ అప్పారావుగా రివ్వవలసినట్లు చెప్పేబాకీ మొత్తానికి అప్పారావుగారి చేత హాడ్జెసు ఒక పత్రిం వ్రాయించుకున్నాడు!

ఈ వైటుహిల్లుసంగతి చెప్పాలంటే చాలాగాథ వుంది. ఈవైటుహిల్లూ ఇతనికి ముందుపని చేసిన ఫ్లాయిర్ (Floyer) కార్యకర్త దొరలు స్వలాభాపేక్షతో చాలా అక్రిమాలు జరిగించి ప్రిజలను పీడించారనిన్నీ అప్పుడు చెన్నపట్నంలో కొన్నాళ్ళు గవర్నరుగా పని చేసిన రంబోల్డుగారు వీరికి మద్దతుచేశారనిన్నీ వీరందరూ కలిసి కంపినీ వారిసొమ్ము హరించారనిన్నీ 1775లో కోరింగదగ్గర ఇంజరంలో కంపెనీ వారి ఏజంటుగా వుండిన శాడ్లియర్ గారు ఫిర్యాదుచేశాడు. కొన్నాళ్ళ దాకా ఏమీ జరగలేదు. ఈలోపుగా వైటుహిల్లు, రంబోల్డుదొరల లంచగొండితనము దుష్ప్రివర్తనము మితిమీరినందువల్ల గవర్నరు జనరలు వీరిని 1781లో పనిలోనుండి సస్పెండుచేశాడు.

అప్పుడు చెన్నపట్టణంలో పరిపాలక సంఘానికి శాడ్లియరు తాత్కాలికంగా ముఖ్యాధికారి అయినాడు. అప్పారావుగారు తనకు జరిగిన అన్యాయాన్ని గురించి యిచ్చుకున్న అర్జీని శాడ్లియరు పార్లమెంటుకు పంపించాడు. అప్పుడు కంపినీడైరక్టరకోర్టువారు దీనినిగురించి జాగ్రిత్తగా విచారణజరిగించవలసిన దని వుత్తర్వుచేశారు.

చెన్నపట్టణానికి మెకార్ట్నీ ప్రిభువు గవర్నరైనాడు. ఇతేడు వద్ధర్ముడు. నూజవీడుజమీందారుడి విషయములో హాడ్జెసు జరిపిన

వ్యవహారం విషయంలో ఆయనకు చాలా అనుమానం కలిగింది. గాని ఈలోపుగా తన అర్జీలు కంపినీవారు చిత్తగించి న్యాయం చేస్తారనే ఆశపోయి నరసింహ అప్పారావుగారికి మనసు విరిగిపోయింది. అందువల్ల 1783 లో కొంతసైన్యం సమకూర్చుకొని కోటలో కూర్చుని తిరుగుబాటుచేశాడు. అంతట కంపినీవారు ఆయనపైకి సైన్యాన్ని పంపారు. ఆయన నిజాము సరిహద్దుదాటి పారిపోయి సైన్యాలు కూర్చుకుని నూజవీడుమీదికి దండయాత్రలు చేయడం ప్రారంభించాడు.

ఆయనను పట్టుకోవడానికి కంపినీవారు నిజాంప్రభుత్వముతో వుత్తరప్రత్యుత్తరాలు జరుపుతూవుండగా అప్పారావుగారు తన తిరుగుబాటును క్షమిస్తే బకాయి చెల్లిస్తానని కంపినీఅధికారితో రాజీచేసుకొని మొదటికిస్తీ చెల్లించగా జమీందారీని ఆయన వశంచేశారు. రెండవకిస్తీ చెల్లించలేకపోయి మళ్ళీ తిరుగుబాటుచేసి మారువేషంతో పారిపోయాడు. కంపినీవారు కోటబురుజులను భూమిమట్టం చేశారు. ఈ నరసింహ అప్పారావుగారికి జమీందారీ హక్కు తీసివేశామనిన్నీ ఆయన కుమారుడు వెంకటనరసింహ అప్పారావుగార్ని జమీందారుగా స్థిరపరిచామనిన్నీ కంపినీవారు 1784 లో ప్రకటించారు.

నరసింహ అప్పారావుగారు భద్రాచలం అడవులలో తిష్ఠవేసుకొని సైన్యంతో వచ్చిపడి గ్రామాలు కొల్లబెడుతూ ఇళ్ళు తగలపెడుతూ ఖజానా దోచుకుంటూ అడ్డువచ్చినవారిని నరికి దౌర్జన్యాలు చేయడం ప్రారంభించాడు. కంపెనీ అధికారులు ఈపోరు పడలేక చివరికి విసికివేసరి ఏమీచేయలేక నరసింహ అప్పారావుగారు కొమారుని దగ్గర నూజివీడులోనే వుండడానికి రాజీగా అంగీకరించారు. కొమారుడు సమర్థుడు కానందువల్ల తండ్రి పలుకుబడి హెచ్చుగా వుండేది. ఆఖరికి నరసింహ అప్పారావుగారిని బందరుకు రప్పించి అక్కడ ఖైదు చేశారు. ఆయనతోవచ్చిన పరివారము నూజివీడుకు పోయి చిన్న జమీందారుగారికి లొంగక, దౌర్జన్యాలు చేస్తూ చిన్నరాణీగారి కొమారుడికి మద్దతు చేయడం ప్రారంభించారు.

బందరులో కొన్నాళ్లు అధికారిగా వుండిన ఫ్లాయరు లంచము

తీసుకొన్న విషయాన్నిగురించి విచారణచేస్తూ చెన్నపట్నం కాన్సాలోచన సంఘమువారు వృద్ధజమీందారుగారిని సాక్ష్యము యివ్వడానికి 1789 లో చెన్నపట్నానికి పిలిపించారు. ఆయన అక్కడ కొద్ది రోజులలోనే మరణించాడు.

అప్పారావుగారి బాకీవ్యవహారం యింకొకమాటు తలయెత్తి వూరుకుంది.

తూర్పు ఇండియా కంపెనీవారి డైరెక్టర్ల సభలో ముఖ్యుడున్నూ, పార్లమెంటువారు హిందూదేశవ్యవహారాలను తనిఖీచేయడానికి ఏర్పరచిన బోర్డులో సభ్యుడున్నూ, అయిన రైట్ ఆనరబుల్ జాన్ సల్లివన్ అనే ఆయనకున్నూ కొంతకాలం మచిలీబందరులో కంపెనీ అధికారిగావుండి తరువాత కొద్దిరోజులు చెన్నపట్నం గవర్నరుగాకూడా పనిచేసిన వైట్ హిల్ అనే ఆయనకున్నూ ఇంకా మచిలీ బంధరులో పనిచేసిన మరి కొందరు దొరలకున్నూ తనకున్నూ కలిసి అప్పటి నూజివీటి జమీందారుడైన నరసింహ అప్పారావుగారు కొన్ని లక్షలరూపాయలు బాకీ వున్నారనిన్నీ, ఆ బాకీని తాను రాబట్టుకోవడానికి ట్రాన్సుఫరు పొందివున్నట్లున్నూ, తనకు స్వయంగా కూడా ఒక పత్రంపైన ఆ జమీందారు బాకీఉన్నట్లున్నూ భనాయిస్తూ హాడ్జెస్ తగాదా చేశాడు.

అప్పారావుగారు తనకు పత్రం వ్రాసినట్లు చెప్పే తేదీన అప్పారావుగారు నిర్బంధంలో వున్నందువల్లను కారాగారాధికారి హాడ్జెస్ గారే గనుకను, ఈ హాడ్జెస్ తనను బలవంతం చేసి ఒక పత్రం వ్రాయించుకొన్నాడని యింకొక జమీందారుగారు 1785 లో ఫిర్యాదు చేసిన సందర్భమున్నూ చూస్తే ఈ హాడ్జెస్ ఎంతటివాడో ఈ బాకీ ఎంతవరకూ నమ్మతగినదో తెలుస్తుంది.

ఈ హాడ్జెసు 1794 లో చనిపోయాడు. 1801 సంవత్సరం దాకా అతని భార్యా అతనికి రావలసిన అప్పుమాట తలపెట్టనేలేదు. అప్పుడు ఆ బాకీ తనకు యిప్పించవలసినదని కంపెనీ డైరక్టర్ల కోర్టువారికి అర్జీ యిచ్చుకుంది. ఈ అర్జీని కంపెనీ డైరెక్టర్లు నమ్మక త్రోసివేశారు.

కంపెనీవారు భూస్వామిత్వపు హక్కులను నిర్ణయించి శాశ్వత ఫైసలా (పర్మనెంటు సెటిల్మెంటు) చేసే సందర్భంలో నూజివీడు జమీందారీని గురించి నరసింహప్పారావుగారి పెద్దభార్యాకుమారునికీ చిన్న భార్యాకుమాళ్ళకూ గల తగాదాలు పరిష్కరించడం కోసం వెంకటనరసింహారావుగారికి నిడదవోలు పరగణాలు, రామచంద్ర అప్పారావుగారికి వుయ్యూరు పరగణాలు, యిచ్చి పేష్కషు బకాయి వదులుకొని సన్నదులిచ్చి జమీందారీని 1803లో వారికి వశపరిచారు. పై సందర్భంలో హాడ్జెసుగారి బాకీని చెల్లించవలసినట్లు కంపినీ అధికార్లు నిర్ణయించలేదు. వారికి చెప్పనూలేదు.

ఇలాగ నూజివీడు జమీందార్లకు కొత్తపట్టా యిచ్చిన తరువాత మళ్లీ ముప్పై సంవత్సరాలు జరిగిపోయినవి. అప్పుడు అందరికీ ఆశ్చర్యం కలిగేటట్లుగా హాడ్జెసుగారి ఋణశేషం తగాదా మళ్ళీ బ్రాచుపాముం లాగ తలయెత్తింది. సంగతి యేమిటా అని ఆలోచిస్తే అప్పట్లో సీమలో పలుకుబడిగల దొరలు కొందరు యేకమై ఈ బాకీని రాబట్టి పంచుకొని అక్రమలాభం పొందాలనే దురుద్దేశ్యంతో దీనిని బయటికి తీసినట్లు తేలింది.

ఈబాకీ అనేది సర్వాబద్ధమనిన్నీ చెల్లదనిన్నీ ఇవ్వనక్కరలే దనిన్నీ కంపినీవారు గట్టిగా వాదించారు గాని, బాకీని రాబట్టడానికి నడుముగట్టిన దొరలు చాలాబలవంతులైనందువల్ల ఈ వ్యవహారం ఇంగ్లాండు పార్లమెంటులోకి యెక్కింది. ఇది ప్రభువులసభలో చర్చకు వచ్చింది.

సంగతిసందర్భాలు చూసేవారికి ఈబాకీ అనేది అబద్ధమనిన్నీ అక్రమమైనదనిన్నీ తోచినా బలవంతులైన తెల్లదొరల పలుకుబడి వల్లను, మొహమాటంవల్లను ఈబాకీ యిచ్చుకోవలసినదే నని ప్రభువుల సభవారు 1832 లో తీర్మానించారు. *

---

* Manual of the Kistna District pp. 110—112; 298—301; The History of the British Empire in India – Edward Thornton (1842) Vol. II pp. 243—246.

కథలు - గాథలు

సవరణలు

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
12	18	4000 పౌన్లు ఎలిజా రస్సెల్‌ను	ఎలిజారస్సెల్‌ను
15	11	Smollet ౧౭౫౮	Smollett ౧౭౫౯
16	14-15	వెంకటకుమారమహీపతి	వెంకట మహీపతి
16	17	రావు సూర్యారావుగారు	రావు వెంకట సూర్యా రావుగారు
57	21	తెి్ల	తెల్ల
62	21	క్రైస్తవులనమ్మె	క్రైస్తవులు నమ్మె
64	19	దలపెట్టిన	తలపెట్టిన
65	6	ఇ త	ఇంత
65	21	కావాలని	అవాలని
72	3	కీ రాలేదు	కీడు రాలేదు
74	29	Newes	Newnes
76	17	౧,౪,౪౧,౧౨౩	౧,౪,౧౪౧,౧౨౩
80	24	గాయకులునూ	గాయకులనూ
84	25	తాపితాలను	తాపితాలలోను
88	27	హిందుస్థానీలో	హిందుస్థానీలో వ్రాసిన
90	27	ఇరుగు పొరుగుకీ	ఇరుగుపొరుగు
91	1	ఇప్పటి	ఇప్పటికీ
95	8	నుపయోగించి	ఉపయోగించి
106	6	పిగట్టుగారిని	పిగట్టుగారికి
108	14	British Empire	British Empire in India
114	1	మందలించి రాయలవారు	మందలించి
148	10	Dynastry	Dynasty

కథలు - గాథలు

(మొదటి భాగము)

భారతదేశ చరిత్రకూ
భారతీయ ప్రజాజీవనానికీ సంబంధించిన
కథలు - గాథలు

దిగవల్లి వేంకట శివరావు
బెజవాడ

కథలు - గాథలు

విషయసూచిక

ఈ కథలు - గాథలు.

ఆంధ్రపత్రికా పాఠకులకు 'కథలు-గాథలు' అనే శీ[illegible]
మైనదే. అప్పుడప్పుడు భారతిలోను గడచిన ఒక[illegible]టిన్న[illegible]
లనుంచి ఆంధ్రపత్రిక ఆదివారము సంచికలలోను నే[illegible]
న్న చరిత్రాత్మకమైన కథలలోను గాథలలోను కొ[illegible]
న్న మార్పులతో ఇప్పు డీరూపంగా ప్రకటిస్తున్నాను.

ఈ కథలలోను గాథలలోను చిత్రవిచిత్రములైన
తలు-విశేషాలు కనపడుతూవున్నా ఇవి కల్పనా కథలు7
రాణాలుగాని కావు. నిజంగా జరిగిన సంగతులు, చరి[illegible]
త్రాధారముగాని, గ్రంథప్రమాణముగాని లేని అం[illegible]
మైనా లేదు.

ఇది నిజమా? కేవలము కల్పనమేనా? అని అనుమ[illegible]
త విచిత్ర విచిత్రములైన చరిత్రాంశాలున్నవి. ప్ర[illegible]
ంటి [illegible] [illegible] ప్రవేశ[illegible]
త విపరీత చిత్తవృత్తులు గల స్త్రీపురుషులున్నారు. నిజ[illegible]
గతుల ముందర ఒక్కొక్కప్పుడు కల్పనాకథలు, నవలల[illegible]
తాలుకూడా తీసికట్టుగా నుంటవి.

కొన్ని చరిత్రగ్రంథాలలోను జీవిత చరిత్రలలోను
లు, తామ్రశాసనాలు, అనుభవాలు (Reminisc[illegible]
ల [illegible] [illegible] స్మృతులలో[illegible]
ర గ్రంథాలలోను [illegible] కనబడిన [illegible]
లు-గాథలు. పెద్ద పెద్ద గ్రంథాలలో [illegible]
స్తకాలబూజు దులిపి చదివినప్పుడు [illegible]

భారతదేశ చరిత్రకున్నూ, భారతీయ ప్రజాజీవనాని[illegible]
[illegible]త్మకములైన కథలను, గాథలను, చరిత్రాంశాల[illegible]
[illegible]

“జగద్గురు తత్వబోధకస్వామి”

స్వాములవారిలాగ నటించిన రాబర్ట్ డీ నోబిలీ అనే క్రైస్తవఫాదరీ



(సమకాలికుడైన క్రైస్తవ మత బోధకుడు
(క్రీ. శ. 1609 లో గీసిన బొమ్మ.)

చూడు : పుట 61.